ఈనాడు

హైదరాబాద్ 26-10-2024 శనివారం సిటీ సంపుటి 51. సంచిక 76

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+16 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


CENTUARY DEAL - WALI DIWALI
Centuary® MATTRESSES
INDIA KA SLEEP SPECIALIST
INDIA'S QOOLEST
Q-GEL™ MATTRESS
Q-Gel® Copper Crystal Memory Foam with CuSense Technology®
Centrik Pro Responsive® Contour Foam
Ergo-form® Transition Foam
Viscose Fabric Cover with EuroTop Finish
Conditions Apply*
Centuary MATTRESSES
ASSURED FREE GIFTS WORTH UP TO ₹15,000*
MATTRESS PROTECTOR
WEDGE PILLOW
COMFORTER
BODY PILLOW
BEDSHEET, PILLOW & MANY MORE...
CENTUARY SLEEP SPECIALIST STORES: CHANDANAGAR: SRI ANU FURNITURE PRIVATE LIMITED–8978033033 | LB NAGAR: ANAGHA FURNITURE: 9959813033| NAMPALLY: BATCHA'S SLEEP ZONE–8919755166| VANASTHLIPURAM: COLOR TRENZ: 9030425399 | KUKATPALLY:DEVAGURU FURNITURE: 9394795213| CHIKKADPALLY: INDUS FASHIONS–9866700761| KOTHAPET: INDUS EAST–9866077362|HITECH: INDUS HITECH-7093321061 | KONDAPUR: INDUS RETAIL–8179110840 |SRI ANU FURNITURE-7993343033 | SOWMYA FURNITURES–9848038795 | NARAYANAGUDA: GEETA ENTERPRISES–8801179234| CHINTAL-R S MODERN FURNITURES–9849379465 | SRI NAGAR COLONY: MANOMAY: 8143893669 | AMEERPET:SRI AAVISHKAR: 9948214520|JAYADURGA FURNISHING-9246359346 | S.D ROAD: INDUS FABRICS–7093321060| NALLAGANDLA: INDUS NALLAGANDLA–7285994994 | MIYAPUR-SRI ANU FURNITURE-9348423033 | BALAJI FURNITURE-9866916940 | KPHB: SRI VISHAL FURNITURE: 8106901569 | TURKKAYAMJAL: K.B FURNITURE WORLD: 9848375496 | BODUPPAL-SAI DIVYA ENTERPRISES 9985000270 | ATTAPUR-SRI ANU FURNITURE–8008209017 |GEETA ENTERPRISES–8801179234 | AS RAO NAGAR-SRI ANU FURNITURE–9014086141 | NACHARAM: SRI ANU FURNITURE–9014553033 | UPPAL: SRI ANU FURNITURE-9502284137 | MADIPALLY-SRI ANU FURNITURE 9392743033 | NAGARAM-SRI ANU FURNITURE–8978033033 | SAINIKPURI: GEETA ENTERPRISES–9866540400; CENTUARY COMFORT STORES: QUDBULLAPUR: NEW MS FURNITURE ENTERPRISES–7013435576 | ENLIVEN FURNITURE–9642437788 | MANIKONDA: RR HAPPY HOMES–9100600362 | MAIRA FURNISHING–8374413469 | HASMATHPEA: SAINATH ENTERPRISES-9849307008| CHANDANAGAR: CELEBRATIONS(BHEL): 984856497 |MIYAPUR:PARTH: 8179780303|MS FURNITURE&DOORS–9391046378 | S FURNITURE VILLAGE-9959689044 | DILSUKHNAGAR: HEAVEN–9989646643 |K.K. DECORS INTERIOR & FURNITURES: 7386371111 | NALLAKUNTA: HEERA: 9848486466 | HABSIGUDA: RISHABH-9849050636 | TOLICHOWKI: S.V.HOME DECORS: 9848050582 | FUSION DECOR'S: 9985957401 | MEHDIPATNAM: THE EXCELLENT: 9676546199 | MALKAJGIRI: ROSHINI: 9246107771 | AS RAO NAGAR: VEDA BOMBAY DYEINGSHOW ROOM–9440072324 | UPPAL–INDUS–9494603603 | SUNCITY: SAI FURNITURE–9966996818 | ATTAPUR:FURNITURE TRENDS: 9394325114 | MARREDPALLY: POONAM ENTERPRISE–9949423263 | PRAGATHINAGAR: M.R.FURNITURE'S–9985331787 | NARSINGI: ISHAANAA INTERIORS-9026566666 | KATTEDAN: SRI VENKATESHWARA FURNITURE–7093992282 | MALLAMPET: AISHWARYA B-HUB INTERIOR STUDIO: 9985603577| SUCHITRA: SHOBHA DECORS 9000339938 | BACHUPALLY: CHITRA DECORS–7337511766 | LIBARTY: KLASSIK DEKORS–7013359757 | KHARMANGHAT: VINAYAKA FURNITURES–9849876231 | SRI GURU DATTA FOAMS–9676493707 | BN REDDY NAGAR-SAI SHUBHAM FURNITURES: 9966747423 | NEW SRI SAI ENTERPRISES-9391016483 | NAGOLE: NAKSHATRA FURNITURE:9293146264 | TURKKAYAMJAL: KEERTHANA FURNITURE–9963333435 | ASIFNAGAR: DHARANI FURNITURE–9246559720 | NOVA FOAMS AND MATTRESSES–9346660381 | LB NAGAR: JAGINI FOAMS & FURNITURE: 9246736533 | MAX FURNITURE-8099029416 | CHAMPAPET-AAKASH FURNITURE–9515718643 | BADANGPET: SRI LAKSHMI NARASIMHA ENTERPRISES–9908140627 | ABIDS: ANKIT STUDIO THE FURNISHING WORLD: 9885019825| AMEERPET: HUNDHA HOME FURNISHING: 9491618313 | KOMPALLY: LAXMI DÉCOR–9550245465 | CENTUARY DISTRIBUTOR FOR HYDERABAD: PANCHAJANYA FOAMS-9848598848.
FOR TRADE & BULK ENQUIRY: +91 79893 49268 | 96522 01239



ఈనాడు



హైదరాబాద్ 26-10-2024 శనివారం సిటీ సంపుటి 51. సంచిక 76

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+16 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

బరువు తగ్గాలా... కండలు పెంచండి!

- కొవ్వు పెరుగుదలతో ఊబకాయం ముప్పు
- స్త్రీలతో పోలిస్తే పురుషుల్లో కండర మోతాదు ఎక్కువ, కొవ్వు తక్కువ
- ఒకే వయసు, బరువున్నా... భార్యాభర్తలిద్దరికీ ఒకే ఆహార ప్రణాళిక పనిచేయదు
- జీవక్రియ రేటు ప్రాతిపదికన తిండి నియమావళి అవసరం
- కెనడాకు చెందిన 'యూనివర్సిటీ ఆఫ్ వాటర్లూ' అధ్యయనంలో వెల్లడి
- ప్రొటీన్తో కూడిన ఆహారం మేలు చేస్తుందంటున్న ప్రముఖ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ ఎస్తర్



రోజూ గంటసేపు నడవడం నా జీవన శైలిలో భాగం. అయినా, ఇటీవల వైద్య పరీక్షల్లో కొవ్వు శాతం మోతాదుకు మించి వచ్చింది. ఎందుకిలా జరుగుతోంది ?

నేనూ, మా వారు న్యూట్రిషనిస్టు చెప్పిన ప్రకారమే ఒకేరకమైన భోజనం తీసుకుంటున్నాం. కానీ, ఆయనతో పోలిస్తే నా బరువు చాలా నెమ్మదిగా తగ్గుతోంది. పరిష్కారం ఏమిటి ?

అరె... వారానికి మూణ్నాలుగు రోజులు చికెన్ను సుష్టుగా లాగించే మా స్నేహితుడు బక్కపలచగా ఉంటాడు. దాని జోలికెళ్లకుండా ఇడ్లీ, దోశెలు, బ్రెడ్ మాత్రమే తింటున్న నేనేమో బరువు పెరుగుతున్నా.. దీనికి కారణమేంటి ?

ఈనాడు – హైదరాబాద్

...ఇలాంటి ప్రశ్నలను క్యాంటీన్లలో, వ్యాయామశాలలో, ఉదయం నడకలో తరచూ వింటుంటాం. ఒక్కోసారి మనలో మనమే జవాబులు వెతుక్కుంటుంటాం. కెనడాకు చెందిన శాస్త్రవేత్తలు నిర్వహించిన అధ్యయనం వీటికి సమాధానాలు చెబుతోంది. మన శరీరంలోని కండరాలకు, కొవ్వుకు, తీసుకుంటున్న ఆహారానికి, చేస్తున్న శారీరక కసరత్తులకు సంబంధం ఉందని వెల్లడించింది. కండల మోతాదు పెరిగితే బరువు తగ్గడాన్ని, కొవ్వు పెరిగితే ఊబకాయం బారిన పడటాన్ని గుర్తించింది. మొత్తానికి 'తిండి కలిగితే కండ కలదోయ్... కండ కలవాడే మనిషోయ్' అన్న మహాకవి గురజాడ మాటలు అక్షర సత్యాలని స్పష్టంచేసింది. కెనడా శాస్త్రవేత్తల పరిశోధన వివరాలను 'యూనివర్సిటీ ఆఫ్ వాటర్లూ' తాజాగా బహిర్గతం చేసింది. బరువు తగ్గుదలపై... శాస్త్రవేత్తలు స్త్రీ, పురుషులపై వేర్వేరుగా అధ్యయనం చేశారు. ఒకే వయసు, ఒకే బరువున్న... స్త్రీ, పురుషులిద్దరికీ ఒకే రకమైన ఆహార ప్రణాళికను అమలుచేస్తే సత్ఫలితాలను ఇవ్వదని కనుగొన్నారు. ఎలాంటి వ్యాయామాలు చేయని సాధారణ స్త్రీ, పురుషులను పరిగణనలోకి తీసుకుంటే.. సహజంగానే ఆడవారి శరీరంలో కొవ్వు మోతాదు అధికంగా.. మగవారి శరీరంలో కండరాల మోతాదు ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా జీవక్రియ(మెటబాలిజం) రేటుల్లోనూ వారిలో వ్యత్యాసం కనిపిస్తుంది. అందుకే బరువు తగ్గించడానికి కచ్చితంగా ఆడ, మగ వారికి వేర్వేరు ఆహార నియమావళి రూపొందించాలని సూచిస్తున్నారు హెచ్సీజీ హాస్పిటల్స్(బెంగళూరు)కు చెందిన సీనియర్ క్లినికల్ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ ఎస్తర్ సాతియారాజ్.


డాక్టర్ ఎస్తర్ సాతియారాజ్

- పూర్తి వివరాలు 8లో



మూసీ పునరుజ్జీవంపై రగడ ఎందుకు?

గుజరాత్లో పటేల్ విగ్రహంలా.. బాపూఘాట్లో గాంధీ విగ్రహం

- దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ వివక్ష
- ప్రభుత్వాలను పడగొట్టడం తప్ప ప్రధాని మోదీ ఏం చేశారు?
- ప్రజాస్వామ్యంపై కేసీఆర్కు గౌరవం లేదు
- సీఎం రేవంత్రెడ్డి మండిపాటు

ఈనాడు, హైదరాబాద్: 'ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసేలా.. అంతర్జాతీయస్థాయిలో గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూఘాట్ను అభివృద్ధి చేస్తాం. గుజరాత్లో పటేల్ విగ్రహంలా.. ఇక్కడ గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం. మూసీ పునరుజ్జీవాన్ని, బాపూఘాట్ అభివృద్ధిని భాజపా, భారాసలు వ్యతిరేకిస్తున్నాయి. భారాస నిరసించిన మర్నాడే కిషన్రెడ్డి, సంజయ్లు మా ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడతారు. గుజరాత్లో సబర్మతి రివర్ ఫ్రంట్ నిర్మించారు కదా.. మేం మూసీ పునరుజ్జీవం చేస్తామంటే భాజపా నేతలు అడ్డుకుంటున్నారెందుకు? ఎందుకంటే.. మేం గుజరాత్కు పోటీ ఇవ్వబోతున్నాం' అని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్లో శుక్రవారం ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ...మిగతా 8లో

త్వరలో క్రీడా వర్సిటీ బిల్లు

8లో

- నవంబరులోగా కొత్త విధానం: సీఎం



మంత్రులు, ప్రతిపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్

- అబద్ధమైతే నాతోపాటు లై డిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా?
- సీఎం రేవంత్కు కేటీఆర్ సవాల్

ఈనాడు, హైదరాబాద్: సీఎం రేవంత్రెడ్డి తన మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలతో పాటు.. ప్రతిపక్ష నేతల ఫోన్లనూ ట్యాపింగ్ చేయిస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ...మిగతా 8లో


మహాధర్నాలో మాట్లాడుతున్న కిషన్రెడ్డి. చిత్రంలో బండి సంజయ్, ఈటల రాజేందర్ తదితరులు

రేవంత్రెడ్డి సవాల్ను స్వీకరించేందుకు సిద్ధం

- మహాధర్నాలో కేంద్ర మంత్రి కిషన్రెడ్డి
- సోనియా అల్లుడి కాంట్రాక్టుల కోసమే మూసీ ప్రక్షాళన: సంజయ్

8లో

ఈనాడు

పోషకాహారం... గగన కుసుమం!

ఒంటికి సత్తువనిచ్చేది ఆహారమే. మెదడు చురుగ్గా ఉండాలన్నా, పనీపాటల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నా- తినే తిండిలో పోషక పదార్థాలన్నీ ఉండాల్సిందే. చిరుధాన్యాలు, పప్పుదినుసులు, కాయగూరలు, ఆకుకూరలు, పాలూ పెరుగు, పండ్లు, ఎండు ఫలాలు, గింజలు, గుడ్లు, మాంసం... అన్నీ తగినంతగా తీసుకుంటూ ఉంటేనే ఆరోగ్యం బాగుంటుంది. వ్యక్తికీ దేశానికీ అదే మహాభాగ్యమవుతుంది. కానీ, అలాంటి సమతులాహారం కోసం సరిపడా సొమ్ము వెచ్చించగలిగిన స్థోమత ఇండియాలో ఎందరికి ఉంది? ఐరాస ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) పరిశీలన ప్రకారం- 74.1శాతం భారతీయులు పోషకాహారాన్ని పొందలేని నిస్సహాయ పరిస్థితుల్లో బతుకులీడుస్తున్నారు. ఎఫ్ఏవో 'ఆహార భద్రత, పోషణ-2023' నివేదిక ఆ మేరకు కఠోర వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. ఆహార ద్రవ్యోల్బణం, అరకొర ఆదాయాల అడకత్తెరలో చిక్కుకున్న కుటుంబాల దైన్యం- బాలభారతాన్ని శక్తిహీనం చేస్తోందనే మరో చేదునిజం తాజా అధ్యయనంలో బయటపడింది. దేశవ్యాప్తంగా ఆరు నుంచి 23 నెలల వయసులోని చిన్నారుల్లో 77శాతం వైవిధ్యభరితమైన పోషకాహారానికి నోచుకోవట్లేదంటున్న ఆ పరిశోధన తీవ్రంగా కలవరపరుస్తోంది!

ప్రజానీకంపై పంజా విసురుతున్న వ్యాధుల్లో 54శాతానికి పైగా పోషకాహార లోపం వల్లే తలెత్తుతున్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నిపుణులు పేర్కొంటున్నారు. సమతులాహారానికి దూరమైన చిన్నారులు ఎదుగుదల సమస్యలను ఎదుర్కొంటారు. మెదడు చురుకుదనం తగ్గిపోయి చదువుల్లో వెనకబడతారు. రోగనిరోధక శక్తిని కోల్పోయి తరచూ ఇన్ఫెక్షన్ల బారినపడతారు. అర్ధాంతర మరణాల ముప్పూ ఎక్కువే. దేశీయంగా 6-23 నెలల పసివారిలో మూడొంతుల మంది అదే ప్రమాదంలో ఉన్నారు. ఈ మేరకు ఎయిమ్స్ ఆధ్వర్యంలోని జాతీయ వైద్య జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన పత్రమొకటి హెచ్చరించింది. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లతో పాటు మొత్తం ఎనిమిది రాష్ట్రాల్లోనైతే ఎనభై శాతానికి పైగా చిన్నారులకు నిర్దేశిత పాళ్లలో పోషకాహారం కరవవుతోంది. ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో అలాంటి పిల్లల సంఖ్య 70-80శాతం మధ్యలో ఉంది. పదిహేనో ఆర్థిక సంఘం హెచ్చరించినట్లు, పిల్లల్లో పోషకాహారలోపం- దేశ ప్రగతికే ప్రతిబంధకం. సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) అమలవుతున్న చోట ఈ దుస్థితి మేటవేయడమే తీవ్ర విషాదకరం!

హరిత విప్లవం పుణ్యమా అని ఆహారధాన్యాల ఉత్పత్తిలో భారతావని స్వయంసమృద్ధి సాధించింది. 2023-24లో 33.2 కోట్ల టన్నుల తిండిగింజల దిగుబడిని కళ్లజూసింది. 3.89 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా అలరారుతోంది. కానీ, ఏం లాభం? 2024 ప్రపంచ ఆకలి సూచీలో 127 దేశాల సరసన 105వ స్థానంలో నిలిచి పరువుమాసింది. పోషకాహార లేమి, పిల్లల్లో ఎదుగుదల లోపాలు, శిశుమరణాల ఆధారంగా రూపొందించే ఈ సూచీలో ఇండియా ఎందుకు ఏటా చతికిలపడుతోంది? వ్యవసాయ సంక్షోభంతో పల్లెలు కళ తప్పుతున్నాయి. పొట్టచేత పట్టుకుని పట్టణాలకు వలస వస్తున్నవారు చాలీచాలని సంపాదనతో బతుకుబండిని భారంగా నెట్టుకొస్తున్నారు. ఇంటి అద్దె, వైద్య వ్యయం, ఇతరేతర ఖర్చుల నడుమ సామాన్యులకు పోషకాహారం గగన కుసుమమవుతోంది. తలసరి ఆదాయాల పెంపు, ఆహార ద్రవ్యోల్బణ కట్టడి, ఐసీడీఎస్‌లో లోపాల పరిహరణ తదితరాలపై ప్రభుత్వాలు దృష్టి సారించనంత కాలం జనభారతం భవిత గిడసబారిపోతూనే ఉంటుంది!



నేను అన్యాయానికీ అక్రమాలకీ వ్యతిరేకంగా పోరాడే సైనికుణ్ని. పాలకులు, ఉద్యోగులు, జమీందారులు, కులోన్మాదులు, ప్రజలు.. ఎవరు అన్యాయానికి పాల్పడినా ఎదిరిస్తాను. నా చివరి శ్వాసవరకూ వారితో పోరాడే శక్తినిమ్మని ప్రార్థిస్తాను.

– గణేశ్ శంకర్ విద్యార్థి, పాత్రికేయులు, స్వాతంత్ర్య సమరయోధులు

కస్తూరీ తిలకం...

భాగవత కథలోని బాలకృష్ణుడి లీలలు ఎందరో వాగ్గేయకారులకు కవితా వస్తువులయ్యాయి. భక్త జయదేవుడి తరవాత అంతటి ప్రజ్ఞావంతుడిగా పేరొందినవాడు లీలాశుకుడు. మహాకవి, భక్తాగ్రేసరుడైన లీలాశుకుడు ఆంధ్రదేశానికి చెందినవాడని చరిత్ర చెబుతోంది. ఈ ప్రాంతంలో బాగా జనాదరణ పొందిన చింతామణి కథలోని బిల్వమంగళుడే లీలాశుకుడని అంటారు.

మొదట వేశ్యాలోలుడై తిరుగుతున్న బిల్వమంగళుడికి తుచ్ఛమైన శారీరక సుఖాలపై విరక్తి కలిగేలా చింతామణి అనే వేశ్య జ్ఞానబోధ చేసిందట. దాంతో జీవితంపై విరక్తి చెంది తన కళ్లను తానే పొడుచుకుని అంధుడిగా మారిన బిల్వమంగళుడే లీలాశుకుడని కొందరి కథనం. ఆయనే కృష్ణ సాక్షాత్కారం పొంది శ్రీకృష్ణ కర్ణామృతాన్ని గానం చేశాడని వారంటారు. 'సోమగిరి' అనే గురువు నుంచి లీలాశుకుడు 'చింతామణి' మంత్రాన్ని ఉపదేశం పొందాడని, ఆ తరవాతే సన్యసించి కృష్ణకర్ణామృత రచన చేశాడని మరికొందరంటారు. బాలకృష్ణుడి దివ్య మంగళ రూపాన్ని అంతే సుందర సుమధురంగా వర్ణించాడు లీలాశుకుడు. ఆయన నయనాలు మానవాతీతమైన దృష్టి కోణం కలిగి ఉంటాయని ఆ శ్లోకాలు విన్నప్పుడు అనిపిస్తుంది.



అంతర్యామి

'కస్తూరీ తిలకం లలాట ఫలకే' అంటూ బాలగోపాలుడి అలంకరణను మన కన్నులకు కట్టినట్టు వర్ణిస్తాడు లీలాశుకుడు. కృష్ణ కర్ణామృతంలోని శ్లోకాలు గానానికి, నృత్యానికి, చిత్రలేఖనానికి, శిల్పానికి ఉపయోగపడే విధంగా రచించాడు. మూడు ఆశ్వాసాల ఈ భక్తి కావ్యంలో మూడువందల ఇరవై ఎనిమిది శ్లోకాలున్నాయి. మొదటి ఆశ్వాసంలో శ్రీకృష్ణుడి సాక్షాత్కారాన్ని, రెండో దాంట్లో శ్రీకృష్ణుడి లీలా విశేషాలని, మూడో దాంట్లో కృష్ణుడి జీవితంలోని అనేక ఘట్టాలను లీలాశుకుడు పొందుపరిచాడు. దీనిలోని శ్లోకాలను రాగమాలికలుగా సంగీత సభల్లో గానం చేస్తూ ఉంటారు. జన్మతః శైవుడైనా లీలాశుకుడి మనసు మాత్రం యశోద తనయుడైన ఆ శ్యామసుందరుడి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. కృష్ణకర్ణామృతంలోని 'శైవావయం జపపరా' అన్న శ్లోకం ద్వారా ఆ సంగతి తెలుస్తుంది. సరస్వతిని స్తుతిస్తూ లీలాశుకుడు 'మాతర్నాతః' అన్న శ్లోకంలో 'తెలియక కడుపు నింపుకోవడం కోసం నిన్ను రాజస్థానాలకు పంపాను, నన్ను క్షమించు. దానికి ప్రాయశ్చిత్తంగా ఆ గోపకిశోరావతారాన్ని స్తుతిస్తాను' అని ప్రాధేయపడతాడు. మరో శ్లోకంలో 'బాటసారులారా యమునా నది ఒడ్డున ప్రయాణించకండి. నడుం మీద చేతులు పెట్టుకున్న నల్లని దొంగ మీ హృదయాలను కొల్లగొట్టగలడు' అంటాడు. 'కరారవిందేన పదారవిందం ముఖారవిందే వినివేశయంతం' అన్న శ్లోకంలో వటపత్రపు దొప్పలో పడుకున్న బాలముకుందుణ్ని మనసులో స్మరిస్తానంటాడు. కళా ప్రదర్శనకు యోగ్యమైన గేయ ఛందస్సును కృష్ణకర్ణామృతం ద్వారా మనకు అందించాడు లీలాశుకుడు. శివ సౌందర్యంలోనే పరబ్రహ్మను దర్శించి, భక్తి, శృంగార పరమావధిలో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిన వాగ్గేయకారుడు ఆయన. గాన, నాట్య, శిల్ప, చిత్ర కళాకారులకు శ్రీకృష్ణ కర్ణామృతం అమూల్య సంపద.

– గంటి ఉషాబాల

సమ్మిళిత ప్రగతికి సమర్థ వ్యవస్థలు

దేశాల సిరిసంపదలు, ఆదాయ అంతరాలకు ఆయా సమాజాల్లో నెలకొన్న వ్యవస్థలు, సంస్థలే మూలకారణం. దీన్ని వివరించిన ఆర్థికవేత్తలను ఈ ఏడాది నోబెల్ పురస్కారం వరించింది. ఒక దేశ సౌభాగ్యంలో సామాజిక వ్యవస్థల ప్రాధాన్యాన్ని డేరన్ అసిమొగ్లూ, సైమన్ జాన్సన్, జేమ్స్ ఏ రాబిన్సన్‌ల అధ్యయనం విశదీకరిస్తుంది.

చట్టం ముందు సమానత్వం, నిబంధనల అమలు, వ్యక్తిగత ఆస్తి హక్కుల పరిరక్షణ, విస్తృత ఆర్థిక భాగస్వామ్యం, పనికి తగిన వేతనాలు వంటి సమ్మిళిత వ్యవస్థలను అనుమతించిన దేశాలు దీర్ఘకాలిక సౌభాగ్యానికి బాటలు పరిచాయి. అధికారం కోసం ప్రజలకు స్వల్పకాలిక ప్రయోజనాలనే అందిస్తూ, సంపదలో వారికి వాటా లేకుండా చేస్తూ, ఒక వర్గం ప్రయోజనాల కోసం పెద్దల నియంత్రణలో దోపిడీ వ్యవస్థలు సాగే దేశాలు ఆర్థికంగా తిరోగమించాయి. ఈ విషయాలను నోబెల్ గ్రహీతలు తమ అధ్యయనంలో విశ్లేషించారు. ప్రజాస్వామ్యాన్ని దీర్ఘకాలిక ఆర్థికవృద్ధికి ముఖ్యమైన సమ్మిళిత వ్యవస్థగా అభివర్ణించారు. ప్రజాస్వామ్యం ఉన్న దేశాల్లో సైతం సంపద ఒక వర్గం దగ్గరే పోగుపడుతోంది. ఉపాధి కల్పన, నాణ్యమైన వస్తూత్పత్తి, సేవలను ప్రజలకు అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. దానికి కారణం ఆయా దేశాలు అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక వ్యవస్థలేనని నోబెల్ శాస్త్రవేత్తలు వివరించారు. ప్రస్తుత సవాళ్లయిన వాతావరణ మార్పులు, వలసలు, ప్రాంతీయ అస్థిరత్వం, అశాంతి ప్రమాదాలను ప్రజాస్వామ్యమే సమర్థంగా ఎదుర్కొంటుంది. తమకు అన్యాయం జరిగిందని ప్రజలు భావించే సందర్భాల్లో ప్రజాస్వామ్య దేశాలు ఓడిపోయినట్లే భావించాలనీ, అవి మళ్లీ సుపరిపాలన కోసం ప్రయత్నించాలనీ 'నోబెల్' ఆర్థికవేత్తలు స్పష్టం చేశారు.

ఐరోపా వలసవాదం

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో విభిన్న, వైవిధ్యభరిత వ్యవస్థలు ఉత్పన్నమవ్వడానికి ఐరోపా వలసవాదమే కేంద్ర బిందువని నోబెల్ విజేతలు స్పష్టం చేశారు. ప్రపంచంలో అధిక భాగం ఒకప్పుడు ఐరోపా వలస ప్రాంతంగా ఉండేది. 16వ శతాబ్దం నుంచి వలసవాదులు ప్రవేశపెట్టిన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలే ప్రస్తుతం దేశాల మధ్య సంపదపరంగా నెలకొన్న అంతరాలకు కారణం. తక్కువ స్థానిక జనాభా ఉన్న ప్రాంతాలు వలసవాదులను అధికంగా ఇముడ్చుకోగలిగాయి. ఇక్కడ వలసవాదులు సమ్మిళిత పరిపాలనా వ్యవస్థలను ప్రవేశపెట్టారు. అవి అంతగా ప్రజాస్వామ్యయుతం కాకపోయినా, సంపద వృద్ధికి దారితీశాయి. ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా ఇందుకు ఉదాహరణగా నిలుస్తాయి. జనాభా అధికంగా ఉండి, రోగాలు విస్తరించిన, స్థిర నివాసానికి అనువుకాని ప్రాంతాల్లో ఐరోపా వలసదారులు అక్కడి వ్యవస్థల్లో ఎక్కువగా జోక్యం చేసుకోలేదు. అక్కడి జనాభా వలసదారుల ఆర్థిక వృద్ధికి అవసరమైన శ్రామిక శక్తిని అందించింది. ఇది స్థానిక పెత్తందార్లకు లాభం కలిగించడమే కాకుండా మిగులు వలసవాదులకు చేరింది. అటువంటి ప్రాంతాలు అభివృద్ధిలో వెనకబడ్డాయి. అందువల్ల ఐరోపా వలసవాదం వంటి చారిత్రక పరిణామాలు దేశాల ఆర్థికగతిని కొంతమేర నిర్దేశించాయని పురస్కార గ్రహీతలు అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక విప్లవం ఫలితంగా ఆధునిక వ్యవస్థలు ఆవిర్భవించడంతో ఐరోపా ఆర్థిక పురోగమనంలో ముందంజ వేసింది. ఒకప్పుడు ఐరోపాకంటే సిరిసంపదలతో తులతూగిన దేశాలు వెనకబడిపోయాయి. దీన్ని 'అదృష్ట తిరోగమనం'గా నిర్వచించారు. 18వ శతాబ్దంలో భారత పారిశ్రామిక ఉత్పత్తి ఇతర వలస ప్రాంతాలకన్నా అధికంగా ఉండేది. బ్రిటిష్ పాలకులు మన ఉత్పత్తి వ్యవస్థలను సమూలంగా ధ్వంసం చేశారు. ఇక్కడి ముడిసరకుతో ఇంగ్లాండ్‌లో వస్తూత్పత్తి చేసి, మనల్నే మార్కెట్‌గా ఉపయోగించుకున్నారు. స్వయంసమృద్ధితో విలసిల్లే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారు.

మన దేశం పరిస్థితి...

ప్రజాస్వామ్య దేశాలు తమ వాగ్దానాలను నిలబెట్టుకోవాలంటే వ్యవస్థలను ఉన్నత స్థాయిలో నిలబెట్టాలని నోబెల్ విజేతల్లో ఒకరైన అసెమొగ్లూ పేర్కొన్నారు. ఈ సందేశం మన దేశానికి సరిగ్గా సరిపోతుంది. ఆర్థిక సంస్కరణలు వృద్ధిపరంగా మన దేశానికి గణనీయమైన విజయాలనే అందించాయి. ప్రస్తుతం ప్రపంచంలో అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2030కల్లా మూడో స్థానానికి చేరుతుం





దన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రపంచంలోని పేదల్లో 25 శాతం ఇండియాలోనే ఉన్నారని ఐరాస నివేదికలు చాటుతున్నాయి. జనాభాలోని ఒక శాతం చేతిలోనే 40శాతం దేశ సంపద పోగుపడింది. ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగిపోతున్నాయి. విద్యావంతుల్లో అత్యధికులు నిరుద్యోగంతో అల్లాడుతున్నారని నివేదికలు స్పష్టంచేస్తున్నాయి. విద్య, వైద్యం, తాగునీరు, పౌష్టికాహారం సామాన్య ప్రజలకు సుదూర స్వప్నాలవుతున్నాయి. గిట్టుబాటు ధరలు లభించక అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. జీడీపీలో ఎగబాకుతున్నా తలసరి ఆదాయంలో కింది స్థానమే దక్కుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన పాలనా యంత్రాంగం రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా పనిచేయడం లేదు. సరైన చర్చ జరగకుండానే చట్టాలు ఆమోదం పొందుతున్నాయనే విమర్శలున్నాయి. న్యాయవ్యవస్థ కొండంత కేసుల భారంతో కునారిల్లుతోంది. సామాన్యులకు సత్వర న్యాయం లభించడం లేదు. రాజ్యాంగం, చట్టాల పట్ల నేతల్లో గౌరవమూ అంతంత మాత్రమే. చట్ట ఉల్లంఘనలు సర్వసాధారణంగా మారాయి. భూవివాదాలు అధికం. పౌర సేవల నిర్వహణలో విఫలమవుతున్న లోపభూయిష్టమైన పట్టణ వ్యవస్థలు నగర జీవితాన్ని నరకప్రాయం చేస్తున్నాయి. ఈ క్రమంలో దేశాభివృద్ధికి సమ్మిళిత వ్యవస్థలే కీలకం. రాజకీయ స్వేచ్ఛ, వ్యక్తిగత ఆస్తి హక్కులు, సంపద పంపిణీ, నాణ్యమైన విద్య, వైద్యం, చట్టబద్ధ పాలన, అవినీతి లేని సుపరిపాలన వ్యవస్థలు దేశ ఆర్థిక పురోగతితో పాటు మానవాభివృద్ధికి బాటలు పరుస్తాయి. ప్రజలను దోపిడీ చేయడానికి సృష్టించిన వ్యవస్థలు అభివృద్ధికి అవరోధంగా మారతాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సమ్మిళిత సుస్థిరాభివృద్ధి విధానాలను అనుసరించాలి. ఆ మేరకు వ్యవస్థలను రూపొందించి, సమర్థంగా నిర్వహించినప్పుడే అభివృద్ధి చెందిన దేశంగా భారత్ విలసిల్లుతుంది.



పుల్లూరు సుధాకర్

పట్టణాభివృద్ధి వ్యవహారాల నిపుణులు



రేపు గెలవొచ్చేమో...

స్కూల్లో నేర్చుకున్న కొన్ని పాఠాలు ఎన్నేళ్లయినా అలాగే గుర్తుండిపోతాయి. అలాంటివాటిలో ఒకటి చాలామంది ఉదహరించే ఈ ఇంగ్లిష్ పోయెం- ద ఉడ్స్ ఆర్ లవ్లీ డార్క్ అండ్ డీప్ బట్ ఐ హేవ్ ప్రామిసెస్ టు కీప్, అండ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్...

ఓ మంచుకురిసే రాత్రివేళ దట్టమైన అడవి అందాలు కట్టిపడేస్తున్నా వాటిని ఆస్వాదిస్తూ అక్కడ ఆగిపోలేను... నెరవేర్చాల్సిన హామీలు ఇంకా ఉన్నాయి... విశ్రాంతి తీసుకోవడానికి ముందు చాలా దూరం ప్రయాణించాల్సి ఉందన్నది ఆ కవితకు అర్థం. చదివిన వారికీ వెన్నుతట్టి కర్తవ్యాన్ని గుర్తుచేసే ఆ కవి పేరు రాబర్ట్ లీ ఫ్రాస్ట్. ఆయన కవిత్వమే కాదు, జీవితమూ మనకెన్నో పాఠాలు నేర్పుతుంది. ప్రకృతి కవిగా పేరొందిన ఫ్రాస్ట్ బాల్యం అంతా కష్టాలమయమే. చిన్నప్పుడే తండ్రి క్షయతో చనిపోవడంతో పేపర్లు వేయడం దగ్గర్నుంచి రకరకాల పనులు చేస్తూ చదువుకున్నాడు. కొంతకాలానికే తల్లి కూడా క్యాన్సర్‌కి బలైపోయింది. ఉన్న ఒక్క చెల్లెలూ మానసిక వ్యాధితో మరణించింది. తనూ యూనివర్సిటీలో చేరినా అనారోగ్యంతో చదువు ఆపేశాడు. పెళ్లి చేసుకుని తాతయ్య కొనిచ్చిన పొలంలో పనులు చేసుకుంటూనే కవిత్వం రాసేవాడు. ఎన్నేళ్లయినా వ్యవసాయం కలిసిరాలేదు. దాంతో నగరానికి మారి ఇంగ్లిష్ టీచరుగా పనిచేశాడు. అక్కడినుంచి ఇంగ్లండ్‌కి మకాం మార్చాడు. కొందరు రచయితలు పరిచయమయ్యారు. తన కవితా పుస్తకాలు ప్రచురించాడు. మొదటి ప్రపంచయుద్ధం సమయంలో తిరిగి అమెరికా చేరాడు. భార్యాభర్తలిద్దరూ తరచూ కుంగుబాటుకు లోనయ్యేవారు. దానికి తోడు ఆరుగురు పిల్లలు, వాళ్ల అనారోగ్యాలు, ఆర్థిక ఇబ్బందులు. ఇవేవీ ఫ్రాస్ట్‌ను నిరాశ పరచలేదు. అతడి ఆసక్తిని నీరుకార్చలేదు. గుర్తింపు గురించి ఆలోచించకుండా రాస్తూనే ఉన్నాడు ఫ్రాస్ట్. ఫలితంగా... నలభై తొమ్మిదో ఏట మొదటి పులిట్జర్‌తో మొదలెట్టి కవిత్వానికి నాలుగు పులిట్జర్ బహుమతులందుకున్న ఏకైక కవిగా, దేశానికి గర్వకారణంగా నిలిచాడు. యూనివర్సిటీకే వెళ్లకుండా నలభై గౌరవ పట్టాలు పొందాడు.

మరి మనమో... ఒక్క పరీక్ష తప్పితే తల్లడిల్లిపోతాం. ఉద్యోగం రావడంలేదని ఉసూరుమంటాం. బాధ్యతలు మీద పడితే మోయలేమని బాధపడతాం. ఒక్క విజయం సాధిస్తే ప్రపంచమంతా పొగడాలని ఆశపడతాం. తమ పని తాము చేసుకుపోకుండా ఎప్పుడూ సమాజం నుంచి ఏదో ఆశించేవారికి చెంపపెట్టు లాంటివి ఫ్రాస్ట్ జీవిత కథా కవితానూ!


జీవితం సుఖదుఃఖాల సంగమం. గెలుపోటముల చదరంగం. ఇవాళ ఓడినవారు రేపు గెలవొచ్చు. గతానుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. భవిష్యత్తు గురించి కలలు కనాలి. అవి నెరవేర్చుకోవడానికి వర్తమానంలో జీవించాలి. అంతేకానీ క్షణికావేశాలూ భావోద్వేగాలకు బానిసలమైతే... చెప్పుకోవడానికి ఏమీ మిగలదు. నచ్చిన రంగాన్నెంచుకుని ఓపిగ్గా మన వంతు కృషి మనం చేస్తూ పోతే, ఏమో... విజయం అదే వెతుక్కుంటూ వస్తుందేమో..!

– ఏలేటి ప్రభాకర్‌రెడ్డి



ఉద్యోగాలకు దూరం...

కుటుంబం గడవాలంటే ఏదో ఒక పని చేయాలి. దేశీయంగా అత్యధిక శాతం స్వయం ఉపాధి వైపే మొగ్గు చూపుతున్నారు. ఆయా సంవత్సరాల్లో ఇండియాలో పదిహేనేళ్ల వయసు పైబడిన జనాభాలో స్వయం ఉపాధి, రెగ్యులర్, తాత్కాలిక కొలువుల్లో ఉన్నవారు... (శాతాల్లో)



(ఆధారం: ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024)


ట్రూడో భవిష్యత్తు ఏంటి?

దాదాపు దశాబ్ద కాలం కెనడా ప్రధానమంత్రిగా ఉన్న జస్టిన్ ట్రూడో రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. 28వ తేదీలోగా రాజీనామా చేయాల్సిందేనని సొంత పార్టీ ఎంపీలే డిమాండ్ చేయడం ట్రూడోకు శరాఘాతంగా మారింది. మరోవైపు, అధికార లిబరల్ పార్టీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు ఖలిస్థాన్ అనుకూల న్యూ డెమోక్రటిక్ పార్టీ (ఎన్‌డీపీ) ఇప్పటికే ప్రకటించడం గమనార్హం.

కెనడాలో మైనారిటీలో ఉన్న ట్రూడో ప్రభుత్వం 2022 మార్చి నుంచి ఎన్‌డీపీ మద్దతుతోనే నెట్టుకొస్తోంది. కానీ, 2025 జూన్ వరకు అమలులో ఉండాల్సిన సహకార ఒప్పందాన్ని రద్దు చేస్తున్నామని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తాను కూడా ప్రధాని పదవికి పోటీ చేస్తానని ఎన్‌డీపీ అధ్యక్షుడు జగ్మీత్ సింగ్ ప్రకటించారు. ఇటీవలి ప్రజాభిప్రాయ సేకరణల్లో పాలక లిబరల్స్ కన్నా ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీ ముందుండగా, ఎన్‌డీపీ మూడో స్థానంలో ఉంది. ప్రస్తుతం ప్రధాని ట్రూడో మీద కన్సర్వేటివ్ నేత పియర్రెకు ఆధిక్యం కనిపిస్తోంది. ప్రధాని పదవి చేపట్టినప్పుడు 2021లో ట్రూడోకు 63శాతం ప్రజాదరణ ఉండగా, ఈ ఏడాది జూన్‌లో 28శాతానికి పడిపోయింది.

తప్పుకొంటారా?

ఈ ఏడాది ఆగస్టులో కెనడావ్యాప్తంగా రైల్వే సమ్మె మొదలైంది. దాన్ని ట్రూడో ఒక్కరోజులోనే నిర్బంధంగా ముగింపజేసిన తీరు కార్మికులకు ఆగ్రహం కలిగించింది. నిరుద్యోగం, గృహ వసతి కొరత బాగా పెరిగాయి. ఆరోగ్య సేవలు దెబ్బతిన్నాయి. ద్రవ్యోల్బణంవల్ల నిత్యావసరాల ధరలు మిన్నంటాయి. పెట్రోల్ ధరలు భగ్గుమన్నాయి. ఇలాంటి పలు కారణాలతో ట్రూడో పార్టీకి జనాదరణ తగ్గినట్లు తెలుస్తోంది. ఫలితంగా, సెప్టెంబరు ఉపఎన్నికల్లో తమ దీర్ఘకాల అడ్డా మాంట్రియాల్‌లో లిబరల్ పార్టీ ఓడిపోయింది. వినిపెగ్ ఉపఎన్నికలో ఎన్‌డీపీ అతి స్వల్ప మెజారిటీతో నెగ్గింది. దీంతో నాయకత్వ పగ్గాలను వేరేవారికి అప్పగించి ట్రూడో గౌరవంగా తప్పుకోవాలని పాలక లిబరల్ పార్టీలోనే ఒత్తిడి పెరుగుతోంది. తమ పార్టీ దెబ్బతినడానికి ట్రూడో వైఖరే కారణమని స్వపక్ష ఎంపీలే దుమ్మెత్తి పోస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఖలిస్థాన్ కార్డును ప్రయోగించడం ద్వారా ట్రూడో మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారు. 2021 జనగణన ప్రకారం కెనడా జనాభాలో సిక్కులు 2.1శాతం ఉన్నారు. భారత్ తరవాత అత్యధిక సిక్కు జనాభా ఉన్నది కెనడాలోనే. ఈ ఓటు బ్యాంకు కోసం ట్రూడో ఖలిస్థానీ ఉగ్రవాద నాయకుడు హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యపై నానాయాగీ చేయడం మొదలుపెట్టారు. అయితే, పాక్ ప్రేరిత ఉగ్రవాదులను, పైనా ఆగడాలను ఎదుర్కొంటున్న మోదీ సర్కారు ఖలిస్థానీ వేర్పాటువాదులను సహించే ప్రసక్తే ఉండదు. ట్రూడో ఈ వాస్తవాలను గుర్తెరిగి ఉభయ తారకంగా సమస్యను పరిష్కరించుకోవాల్సింది పోయి, పంచనేత్ర కూటమిని కూడా రొంపిలోకి లాగుతున్నారు. ఈ కూటమిలో కెనడాతోపాటు బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికాలు సభ్యులు. అవి నిజ్జర్ హత్య కేసు దర్యాప్తులో భారత్, కెనడాలు సహకరించుకోవాలని సూచించాయే తప్ప, కెనడాకు వంతపాడటం లేదు. పైగా మరో ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నున్‌పై హత్యాయత్నం కేసులో భారత్ సహకారాన్ని అమెరికా స్వీకరిస్తోంది. అమెరికా, కెనడా దేశాల రెండింటి పౌరసత్వం ఉన్న పన్నును హత్య చేయడానికి భారత గూఢచారి సంస్థ 'రా' మాజీ ఏజంటు వికాస్ యాదవ్ కుట్ర పన్నాడని అమెరికా నేరపరిశోధక శాఖ ఎఫ్‌బీఐ ఆరోపించింది. అయితే, అతడు ప్రస్తుతం భారత ప్రభుత్వ ఉద్యోగి కాదని స్పష్టం చేయడం ద్వారా ఘర్షణ వాతావరణాన్ని నివారించింది.



ప్రజాగ్రహం

భారతీయ ఏజెంట్లు హత్య చేశారంటున్న హర్దీప్‌సింగ్ నిజ్జర్ వాస్తవంలో కెనడా పౌరుడు కాదనీ, బోగస్ పత్రాలను చూపి రాజకీయ ఆశ్రయం పొందుతున్న విదేశీ ఉగ్రవాది అని ప్రతిపక్ష పీపుల్స్ పార్టీ అధినేత మక్సీం బెర్నియే ఆరోపించారు. నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ హస్తం ఉందని ఊదరగొట్టడమే తప్ప నిఖార్సైన సాక్ష్యాధారాలు సమర్పించడం లేదేమిటంటూ ట్రూడోను కెనడా సమాచార మాధ్యమాలు, విశ్లేషకులు నిలదీస్తున్నారు. ఖలిస్థానీ ఉగ్రవాదులు కెనడా విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేయడానికి ట్రూడో అలుసు ఇస్తున్నారని విమర్శిస్తున్నారు. మరోవైపు ప్రజాదరణలో ముందున్న విపక్ష కన్సర్వేటివ్ నేత పియర్రె కెనడాలో జీవన వ్యయం పెరిగి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారంటే కారణం- ట్రూడో విధానాలే అని దుమ్మెత్తిపోస్తున్నారు. తాను కనుక ప్రధానమంత్రినైతే భారత్‌తో సంబంధాలను మెరుగు పరచుకొంటానని ఆయన పదేపదే స్పష్టం చేయడం విశేషం. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ఆచితూచి వ్యవహరించడం మేలు.

– ఏఏవీ ప్రసాద్

హాయ్! బుజ్జీ!!

వ్యాపారి అత్యాశ!

ఒక రోజు రాత్రి ఓ దొంగ పరిగెత్తుకుంటూ వచ్చి ఓ దుకాణంలో దూరాడు. 'ఏయ్.. ఎవరు నువ్వు?' అని వ్యాపారి ఆ దొంగను నిలదీశాడు. 'అయ్యా..! నన్ను పోలీసుల బారి నుంచి కాపాడండి. నగలు దొంగతనం చేసి వస్తుండగా వారి కంటపడ్డాను. వారు నన్ను వెంబడిస్తూ ఈ దారిలోనే వస్తున్నారు. పోలీసులకు దొరక్కుండా నన్ను రక్షిస్తే.. దొంగిలించిన నగల్లో సగం మీకే ఇస్తాను. ముందుగా ఈ కొన్ని ఆభరణాలు మీ దగ్గర పెట్టుకోండి' అంటూ కొంత బంగారం వ్యాపారి చేతిలో పెట్టాడు. దీంతో ఆ వ్యాపారి, దొంగను రక్షించేందుకు ఒప్పుకొన్నాడు. అతడికి దుకాణంలో ఓ మూలన దాక్కునేందుకు చోటు చూపించాడు.



కాసేపటికే పోలీసులు వచ్చి వ్యాపారిని దొంగ గురించి అడిగారు. తనకు తెలియదని, ఇటువైపు అలా అనుమానాస్పదంగా ఎవరూ రాలేదని చెప్పాడు. దాంతో పోలీసులు దొంగను వెతుక్కుంటూ ముందుకు వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత దొంగను తన వాటా ఇవ్వమని వ్యాపారి అడిగాడు. వెంటనే దొంగ తన సంచిలోంచి కత్తి బయటకు తీసి, 'అరిస్తే చంపేస్తా' అన్నాడు. ఇందాక తాను ఇచ్చిన నగలతో పాటు, గల్లాపెట్టెలో డబ్బంతా తనకు ఇవ్వమన్నాడు. ప్రాణాల మీద తీపితో దొంగ చెప్పినట్లే చేశాడు వ్యాపారి. దొంగ మెరుపువేగంతో అక్కడి నుంచి పారిపోయాడు. అత్యాశతో దొంగకు ఆశ్రయం కల్పించడం వల్ల తన డబ్బు పోయిందని బోరున విలపించాడు వ్యాపారి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. దొంగకు సాయం చేసినందుకు తానే తిరిగి చిక్కుల్లో పడాల్సి వస్తుందని కిక్కురుమనకుండా ఉండిపోయాడు. ఇంకెప్పుడూ అత్యాశతో చెడ్డవారికి సాయం చేయకూడదని వ్యాపారి ఓ నిర్ణయానికి వచ్చాడు. ★



జవాబు: REHABILITATION


Reliance
పండుగ కొనుగోలు
పూర్తి చేసుకోవటానికి,
స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
SMART BAZAAR
దీపావళి రెడీ సేల్
దీపావళి ఎల్ఈడి లైట్ రేంజ్ / దీపాలు మరియు డెకరేషన్ / గన్ శ్రేణి
స్మార్ట్ ప్రైస్ ₹49 మొదలుకుని
డబల్ బెడ్‌షీట్ కోఆర్డినేటెడ్ పిల్లో కవర్ తో సహా
BUY 1 GET 2 FREE ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని
ఆత్మీయులకు ప్రత్యేక కానుక!
₹50 నుండి ₹6999 రేంజ్ లో దీపావళి బహుమతులు ఎంచుకోండి
డ్రైఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్ అసార్టెడ్ 225 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY 1 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹449 మొదలుకుని
లాల్ అసార్టెడ్ స్వీట్ (4 లేన్) / కాజు కత్లి 200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 1 GET ANY 1 FREE ఎమ్ఆర్‌పి ₹325 మొదలుకుని
బికజి / లాల్ / కరాచి / స్నాక్స్ (మైసూర్ పాక్ / గులాబ్ జామున్ / రసగుల్లా / సోన్ పాప్డి / లడ్డూ) 200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 1 GET ANY 1 FREE ఎమ్ఆర్‌పి ₹135 మొదలుకుని
క్యాడ్బరి సెలబ్రేషన్ శ్రేణి 144.1 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY 2 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹145 మొదలుకుని
స్నికర్స్ / ఫనీస్ట్ ఫాంటాస్టిక్ చాకొలేట్ గిఫ్ట్ ప్యాక్ 136 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 1 GET ANY 1 FREE ఎమ్ఆర్‌పి ₹299 మొదలుకుని
రుచికరమైన వంటకం చేసుకోండి
లూస్ సోనా మసూరి రా బియ్యం ప్రీమియమ్ / లూజ్ రా పీనట్స్ 1 kg
స్మార్ట్ ప్రైస్ ₹55/₹125
గుడ్ లైఫ్ ఆల్మండ్ వేల్యూ ప్యాక్ / రెగ్యులర్ వేల్యూ ప్యాక్ ప్లెయిన్ క్యాష్యూ 500 g
స్మార్ట్ ప్రైస్ ₹339/₹439
ప్యారీస్ వైట్ టేబుల్ షుగర్ ఫ్రీ ఫ్లో 5 kg
స్మార్ట్ ప్రైస్ ₹205
₹41.00 /kg
విజయా ఘీ 1 L
స్మార్ట్ ప్రైస్ ₹555
GHEE
ఇమామి హెల్దీ అండ్ టేస్టీ / గుడ్ లైఫ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 1 L
స్మార్ట్ ప్రైస్ ₹119/₹125
స్ప్రైట్ / కోకో-కోలా / థమ్సప్ / మాజా 600 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 3 GET ANY 1 FREE ఎమ్ఆర్‌పి ₹42 మొదలుకుని
ఒంట నూనె పై ₹20 తగ్గింపు పొందండి ఎమ్ఆర్‌పి ₹335
చక్కి / ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ విట్ ఆటా 5 kg
స్మార్ట్ ప్రైస్ ₹199
CHAKKI ATTA
cello LARAH
ఓపల్ వేర్ డిన్నర్ సెట్ 18 / 22 పీసెస్
స్మార్ట్ ప్రైస్ ₹999 మొదలుకుని
kamiliant WILDCRAFT
క్యాబిన్ ట్రాలీ తో గిఫ్ట్ బాక్స్
స్మార్ట్ ప్రైస్ ₹1699 మొదలుకుని
బిస్కెట్స్ 275 g మొదలుకుని / లోట్టే చాకో పై 336 g (12 Pcs) (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 2 GET ANY 1 FREE ఎమ్ఆర్‌పి ₹120 మొదలుకుని
అందంగా పండుగ జరుపుకోండి
₹199* లో ఫ్యాషన్ ప్రారంభం
శుభకార్ దర్శన క్యాంఫర్ పూజ ఆయిల్ 900 ml
స్మార్ట్ ప్రైస్ ₹109
CAMPHOR PUJA OIL
ఆండ్రాయిడ్ స్మార్ట్ ఎల్ఈడి టివి (80 cm / 109 cm / 140 cm)
స్మార్ట్ ప్రైస్ ₹6999 మొదలుకుని
₹799 లకే ₹5000 అంతకు మించిన విలువ గల ఫ్యాషన్ కొనుగోలుపై
₹2495 విలువగల ఒపలా డిన్నర్ సెట్ 18 పీసెస్ ₹499 లకే ₹3000-₹4999 విలువ గల ఫ్యాషన్ కొనుగోలుపై
₹1195 విలువ గల ఓడిన్వేర్ క్యాసరోల్ ₹149 లకే ₹1500-₹2999 విలువ గల ఫ్యాషన్ కొనుగోలుపై
10% INSTANT DISCOUNT# SBI card
#Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 Per Trxn; Valid only on one Trxn. per Credit Card; Validity: 23 Oct - 27 Oct 2024. T&C Apply.
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి
వద్ద కూడా లభ్యం
JioMart
fresh Signature
SMART SUPERSTORE
SMART BAZAAR
SMART SUPERSTORE
సైదాబాద్: అరిహంత్ టవర్ సంతోష్‌నగర్, క్రాస్ రోడ్ దగ్గర. తార్నాక: ఇన్నర్ రింగ్ రోడ్ ఆరాధన 70mm థియేటర్ ఎదురుగా. కొంపల్లి: రన్‌వే 9 దగ్గర, కుత్బుల్లాపూర్, కొంపల్లి రోడ్. మాదాపూర్: ఇనార్బిట్ మాల్, ఎల్1. కాచిగూడ: మహేశ్వరి పరమేశ్వరి టవర్స్, కాచిగూడ ఎక్స్ రోడ్. గుడిమల్కాపూర్: కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ పక్కన, గుడిమల్కాపూర్ రోడ్. తిరుమలగిరి: మిలటరీ డెయిరీ ఫామ్ రోడ్ సుభాష్‌నగర్ బస్టాప్. టోలీచౌకి: సలార్‌పురియా సత్వ మాగ్నస్, బ్లాక్ A, టోలిచౌకి రోడ్ షేక్‌పేట ఫ్లైఓవర్ కింద. గచ్చిబౌలి: గచ్చిబౌలి ఫ్లైఓవర్ పక్కన. పాత అల్వాల్: IG విగ్రహం దగ్గర, CYSR గార్డెన్స్. కూకట్‌పల్లి: యశోద గార్డెన్స్, శాంతినగర్. చాంద్రాయణగుట్ట: బార్కాస్ రోడ్ భారత్ పెట్రోల్ పంప్ దగ్గర. శంషాబాద్: బస్టాండ్ కాలనీ, RB నగర్. బండ్లగూడ: HP పెట్రోల్ బంక్ దగ్గర, చేవెళ్ల రోడ్డు. నిజాంపేట్: గోకుల్స్ ప్లాజా, నిజాంపేట్ రోడ్. బాచుపల్లి: కేపీఆర్ ప్యారడైజ్ కాలనీ దగ్గర, మల్లంపేట రోడ్డు. కొత్తపేట: మోహన్ నగర్, ఎస్బీఐ కాలనీ. గడ్డిఅన్నారం: ఏషియన్ శివ గంగా రోడ్డు. బోడుప్పల్: చిల్కానగర్ మెయిన్ రోడ్ SSS గార్డెన్ ఎదురుగా. నాచారం: ESI హాస్పిటల్ ఎదురుగా. ఫిల్మ్ నగర్: రోడ్ నం. 3, ఫిల్మ్ నగర్



పండుగ సంతోషాలు అన్నీ ఇప్పుడు బడ్జెట్‌లో

DMart®
Daily Discounts Daily Savings

DMart ready

ఫుడ్ మరియు గ్రోసరీ

₹41* మాత్రమే లూజు చక్కెర 1 కిలో

₹56* మాత్రమే లూజు సోనా మసూరి కర్నూల్ రైస్ 1 కిలో

₹77* మాత్రమే లూజు బిర్యానీ రైస్ 1 కిలో

₹115* మాత్రమే లూజు పుట్నాలపప్పు 1 కిలో

₹126* మాత్రమే లూజు వేరు శనగ 1 కిలో

₹69* మాత్రమే లూజు శనగపిండి 1 కిలో

₹49* మాత్రమే లూజు అటుకులు 1 కిలో

₹41* మాత్రమే లూజు రవ్వ 1 కిలో

₹39* మాత్రమే లూజు మైదా 1 కిలో

₹117* మాత్రమే లూజు మినుములు 1 కిలో

₹35* మాత్రమే లూజు ఇడ్లీ రవ్వ 1 కిలో

₹105* మాత్రమే లూజు పెసర పప్పు 1 కిలో

₹93* మాత్రమే లూజు శనగ పప్పు 1 కిలో

₹85* మాత్రమే లూజు రైస్ పాపడ్ 1 కిలో

₹69* మాత్రమే లూజు వడియాలు 1 కిలో

₹55* మాత్రమే బెల్లం ప్రీమియం 900 గ్రాములు ఎంఆర్‌పి ₹ 90

₹23* మాత్రమే ప్రీమియా రైస్ ఆట 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 40

₹126* మాత్రమే రెడ్ చిల్లీ పౌడర్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 238

₹30*/72* మాత్రమే ఇలాచి గ్రీన్ ఇకో 10 గ్రాములు / 25 గ్రాములు ఎంఆర్‌పి ₹ 48/₹ 117

₹399* మాత్రమే స్వాద్ పిస్తా 400 గ్రాములు ఎంఆర్‌పి ₹ 625

₹459* మాత్రమే జీడిపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 705

₹359* మాత్రమే బాదం 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 555

₹111* మాత్రమే దేశవాళీ కిస్మిస్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 175

₹229* మాత్రమే మిక్స్‌డ్ డ్రై ఫ్రూట్స్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 366

₹37* మాత్రమే రాక్ సాల్ట్ 1 కిలో ఎంఆర్‌పి ₹ 99

దీపావళి స్పెషల్

₹99*/₹159* మాత్రమే టీ లైట్ క్యాండిల్ 30/50 పీస్‌లు ఎంఆర్‌పి ₹110/₹180

₹149*# నుంచి దీపావళి ఎల్ఇడి డెకో లైట్స్

₹55* మాత్రమే 4 పీస్‌ల క్లే దియా ప్యాక్ ఎంఆర్‌పి ₹ 60

₹59*# నుంచి దీపావళి గన్

కొనండి 1 పొందండి 1 ఉచితంగా ప్రీమియం డ్రైఫ్రూట్ బాక్స్ 4 కంపార్టుమెంట్స్ 400 గ్రాములు ఎంఆర్‌పి ₹ 900*

కొనండి 1 పొందండి 1 ఉచితంగా ప్రీమియం డ్రైఫ్రూట్ బాక్స్ 6 కంపార్టుమెంట్స్ 600 గ్రాములు ఎంఆర్‌పి ₹ 1,300*

గిఫ్ట్ వస్తువులు

కొనండి 1 పొందండి 1 ఉచితంగా బెలవిటా లేడీస్/మెన్స్ పెర్ఫ్యూమ్ గిఫ్ట్ సెట్ 4x20 మి.లీ ఎంఆర్‌పి ₹ 649*

ఎంఆర్‌పిపై కనీసం 50% తగ్గింపు న్యూట్రాజ్ విషెస్ డ్రైఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్ (ఆల్ రేంజ్)

ఎంఆర్‌పిపై కనీసం 35% తగ్గింపు బికాజి గిఫ్ట్ ప్యాక్ (ఆల్ రేంజ్)

ఎంఆర్‌పిపై కనీసం 15% తగ్గింపు హల్దీరామ్స్ గిఫ్ట్ ప్యాక్ (ఆల్ రేంజ్)

ఎంఆర్‌పిపై కనీసం 35% తగ్గింపు క్యాడ్‌బరీ వేడుకలు అన్ని వేరియంట్లు (₹ 50* కంటే ఎక్కువ ప్యాక్‌లపై మాత్రమే)

ఎంఆర్‌పిపై కనీసం 25% తగ్గింపు ఫెర్రేరో రోచర్ గిఫ్ట్ ప్యాక్ (ఆల్ రేంజ్)

₹349* మాత్రమే నట్‌రాజ్ కాలిఫోర్నియా ఆల్మండ్స్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 599

₹69* మాత్రమే మాజా మ్యాంగో డ్రింక్ బాటిల్ 1.75 లీ ఎంఆర్‌పి ₹ 105

₹99* మాత్రమే జిఆర్‌బి గులాబ్ జామున్ తక్షణం మిక్స్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 220

₹49* మాత్రమే ఎంటిఆర్ ప్లెయిన్ వెర్మిసెల్లి 850 గ్రాములు ఎంఆర్‌పి ₹ 87

₹345* మాత్రమే కెల్లాగ్స్ మ్యూస్లీ ఫ్రూట్ అండ్ నట్ 750 గ్రాములు ఎంఆర్‌పి ₹ 499

పండుగ ఫ్యాషన్

₹199*# నుంచి గర్ల్స్ ఫ్యాషన్ ఫ్రాక్

₹199*# నుంచి గర్ల్స్ జీన్స్

₹399*# నుంచి గర్ల్స్ ఫ్రాక్

₹299*# నుంచి బాయ్స్ మరియు గర్ల్స్ కుర్తా

₹199*# నుంచి గర్ల్స్ టాప్

₹199*# నుంచి కిడ్స్ షార్ట్స్

₹79*# నుంచి బాయ్స్ మరియు గర్ల్స్ టీ-షర్ట్

₹199*# నుంచి బాయ్స్ షర్ట్

₹399*# నుంచి బాయ్స్ కార్గో ప్యాంట్‌లు

₹199*# నుంచి లేడీస్ లాంగ్ కుర్తీలు

₹99*# నుంచి లేడీస్ దుపట్టా

₹199*# నుంచి లేడీస్ యాంకిల్ కాటన్ స్ట్రెచ్ లెగ్గింగ్స్

₹599*# నుంచి కుర్తి సెట్

₹99*# నుంచి లేడీస్ టీ-షర్ట్

₹149*# నుంచి లేడీస్ ఫ్యాన్సీ టాప్

₹349*# నుంచి లేడీస్ జీన్స్

₹99*# నుంచి లేడీస్ స్లిప్పర్స్

₹299*# నుంచి లేడీస్ శాండిల్స్

₹299*# నుంచి మెన్స్ ఎత్నిక్ కుర్తా మరియు పైజమా

₹449*# నుంచి మెన్స్ కాటన్ చినోస్

₹499*# నుంచి మెన్స్ జాగర్స్ అండ్ కార్గో

₹299*# నుంచి మెన్స్ క్యాజువల్ షార్ట్స్

₹99*# నుంచి మెన్స్ ఫ్యాన్సీ టీ-షర్ట్

₹199*# నుంచి మెన్స్ ఫార్మల్/క్యాజువల్ షర్ట్

₹349*# నుంచి మెన్స్ ఫార్మల్ ట్రౌజర్

₹349*# నుంచి మెన్స్ ఫ్యాషన్ జీన్స్

₹229*# నుంచి సూటింగ్ అండ్ షర్టింగ్ కాంబో

ఎంఆర్‌పిపై కనీసం 25% తగ్గింపు అన్నీ బ్రాండెడ్ మెన్స్ అండర్‌గార్మెంట్స్

విద్యుత్తు ఉపకరణాలు

₹129*# నుంచి ట్యూబు లైట్ ECOLINK Pigeon Crompton BAJAJ

₹125* మాత్రమే ఎవరెడీ ఎఎ మరియు ఎఎఎ బ్యాటరీలు 10 పీస్‌లు ఎంఆర్‌పి ₹180

₹399*# నుంచి డ్రై ఐరన్ Pigeon BAJAJ USHA Crompton

₹199*# నుంచి ఎక్స్‌టెన్షన్ బోర్డు మరియు పవర్ స్ట్రిప్ GEEP GM Goldmedal

₹45*# నుంచి ఎల్ఇడి 9W BAJAJ Pigeon

₹499*# నుంచి ఎలక్ట్రికల్ కెటిల్ WONDERCHEF Pigeon Prestige

₹1,699*# నుంచి ఎలక్ట్రికల్ మిక్సర్ 3 జార్‌ల సెట్

బెడ్ మరియు బాత్

₹999*# మాత్రమే కార్పెట్ మోడ్రన్ 121 సెం.మీ x 182 సెం.మీ ఎంఆర్‌పి ₹ 1,115

₹249*# మాత్రమే వెల్‌స్పన్ బాత్ టవల్ 100% కాటన్ 70 సెం.మీ x 140 సెం.మీ ఎంఆర్‌పి ₹ 285

₹149*# మాత్రమే సింగిల్ బెడ్‌షీట్ 140 సెం.మీ x 225 సెం.మీ ఎంఆర్‌పి ₹170

₹199*# మాత్రమే కర్టెన్ 112 సెం.మీ x 210 సెం.మీ ఎంఆర్‌పి ₹ 230

₹399* మాత్రమే రెక్రాన్ పిల్లో 2 పీస్‌ల సెట్ 41 సెం.మీ x 61 సెం.మీ ఎంఆర్‌పి ₹ 500

కిచెన్‌వేర్

₹229* మాత్రమే స్టీల్ డిన్నర్ సెట్ 6 పీస్‌లు ఎంఆర్‌పి ₹ 420

₹99* నుంచి సిరామిక్ మగ్ సెట్ 6 పీస్‌లు

₹199*# మాత్రమే మ్యాగ్నస్ స్టీల్ క్యాస్రోల్ 1300 మి.లీ ఎంఆర్‌పి ₹ 756

₹199*# నుంచి క్యాస్రోల్ 2100 మి.లీ

₹99* నుంచి గ్లాస్ సెట్ 6 పీస్‌లు

₹1,199* మాత్రమే పీజియన్ నాన్-స్టిక్ రెడ్ గిఫ్ట్ సెట్ 7 పీస్‌లు ఎంఆర్‌పి ₹ 2,995

₹99* మాత్రమే పప్పు డబ్బాల సెట్ 1400 మి.లీ 3 పీస్‌లు ఎంఆర్‌పి ₹ 160

₹1,699* మాత్రమే పీజియన్ అల్యూమినియం కుక్కర్ 2లీ/3లీ/5లీ కాంబో 3 పీస్‌లు ఎంఆర్‌పి ₹ 3,195

₹399* మాత్రమే ప్లాస్టిక్ పెద్ద డబ్బా 5లీ/7లీ/10లీ/15 లీ సెట్ 4 పీస్‌లు ఎంఆర్‌పి ₹ 550

₹129* మాత్రమే ప్లాస్టిక్ డబ్బాల సెట్ 7 పీస్‌లు ఎంఆర్‌పి ₹ 155

₹1,699* మాత్రమే ప్రెస్టీజ్ ఒమేగా చెర్రీ నాన్-స్టిక్ సెట్ 3 పీస్‌లు ఎంఆర్‌పి ₹ 3,600

₹449* నుంచి మేలమైన్ డిన్నర్ సెట్ 17 పీస్‌లు

నిత్యావసర సరుకులు

₹489* మాత్రమే క్రీమ్‌లైన్ జెర్సీ ఆవు నెయ్యి పౌచ్ 1 లీ ఎంఆర్‌పి ₹ 779

₹665* మాత్రమే గోల్డ్ డ్రాప్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 5 లీ ఎంఆర్‌పి ₹ 830

₹499* మాత్రమే ఆశీర్వాద్ గోధుమ ఎంపి రెడ్ ఆటా 10 కిలో ఎంఆర్‌పి ₹ 603

₹220* మాత్రమే ఇండియా గేట్ సూపర్ బాస్మతి రైస్ 1 కిలో + 500 గ్రాములు ఉచితంగా ఎంఆర్‌పి ₹ 280

₹239* మాత్రమే టాటా గ్రాండ్ ఫిల్టర్ కాఫీ పౌచ్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 330

₹239* మాత్రమే మధుర్ ప్యూర్ అండ్ హైజీన్ షుగర్ 5 కిలో ఎంఆర్‌పి ₹ 315

కొనండి 1 పొందండి 1 ఉచితంగా డెల్మోంటే టమాటా కెచ్‌అప్ పౌచ్ 900 గ్రాములు ఎంఆర్‌పి ₹ 130*

కొనండి 1 పొందండి 1 ఉచితంగా మంగళ్‌దీప్ 4 ఇన్ 1 మోగ్రా పూజ అగర్‌బత్తి 108 U ఎంఆర్‌పి ₹ 76*

కొనండి 1 పొందండి 1 ఉచితంగా పాండ్స్ బ్రైట్ బ్యూటీ క్రీమ్ 50 గ్రాములు ఎంఆర్‌పి ₹ 330*

కొనండి 1 పొందండి 1 ఉచితంగా నివియా బాడీ మిల్క్ నరిషింగ్ లోషన్ 600 మి.లీ ఎంఆర్‌పి ₹ 699*

₹209* మాత్రమే మైసూర్ శాండల్ సోప్ 450 గ్రాములు ఎంఆర్‌పి ₹ 243

₹550*/₹499* మాత్రమే ఏరియల్ మ్యాటిక్ ఫ్రంట్ / టాప్ లోడ్ లిక్విడ్ డిటర్జెంట్ పౌచ్ 4 లీ ఎంఆర్‌పి ₹ 879 / ₹ 789

₹199* మాత్రమే నిమిలీ హెర్బల్ ఫ్లోర్ క్లీనర్ 2 లీ ఎంఆర్‌పి ₹ 420

₹199* మాత్రమే బేగన్ కాక్రోచ్ మస్కిటో మరియు ఫ్లై కిల్లర్ స్ప్రే 625 మి.లీ ఎంఆర్‌పి ₹ 340

₹59* మాత్రమే గాలా స్క్రబ్ ప్యాడ్ 5N ఎంఆర్‌పి ₹ 85

₹99*# నుంచి గ్రాస్ బ్రూమ్

లగేజ్

₹1,699*# మాత్రమే కమిలియంట్ మార్వల్ గిఫ్టింగ్ ట్రాలీ బ్యాగ్ 40 సెం.మీ x 55 సెం.మీ x 21 సెం.మీ ఎంఆర్‌పి ₹ 7,500

₹749*# మాత్రమే సఫారీ నెప్ట్యూన్ గిఫ్టింగ్ ఎయిర్ బ్యాగ్ 56 సెం.మీ x 29 సెం.మీ x 35 సెం.మీ ఎంఆర్‌పి ₹ 1,999

₹699*# మాత్రమే విఐపి టైటాన్ ఎయిర్ బ్యాగ్ 51 సెం.మీ x 25 సెం.మీ x 29.5 సెం.మీ ఎంఆర్‌పి ₹ 2,950

₹1,899*# మాత్రమే అరిస్టోక్రాట్ ఫీస్టా ట్రాలీ బ్యాగ్ 37 సెం.మీ x 55 సెం.మీ x 24 సెం.మీ ఎంఆర్‌పి ₹ 10,000

ఎంఆర్‌పిపై కనీసం 50% తగ్గింపు అమెరికన్ టూరిస్టర్ స్కైబ్యాగ్‌లు/సఫారీ

పాదరక్షలు

ఎంఆర్‌పిపై కనీసం 7% తగ్గింపు

Paragon walkmate Bata VKC RELAXO

కనీసం 6%^ డిస్కౌంట్

రామంతాపూర్: 040-27032906 • ఉప్పల్ భాగ్: 9154846426 • మేడిపల్లి: 7337325489 • ఉప్పల్ రంగారెడ్డి, తెలంగాణ డీమార్ట్: 040-29331007 • బండ్లగూడ: 040-29556703 • సనత్‌నగర్ (మైహోమ్): 040-69014700 • బాలానగర్: 040-23075362 • మూసాపేట: (పివిఎస్ఆర్): 040-29568367/65 • కొంపల్లి: 040-27165371 • అంబర్‌పేట్: 040-27428335 • హైదర్‌గూడ (హిమాయత్‌నగర్): 040-23298560 • కాచీగూడ: 040-29550956 • మదీనాగూడ (మియాపూర్): 040-23047281 • ఆర్‌సి పురం: 0845-5297917 • నల్లగండ్ల: 040-29568265 • బాచుపల్లి: 040-49024270

కూకట్‌పల్లి (ఎన్ఎస్ఎల్): 040-29568182 • షేక్‌పేట్ (టోలి చౌక్): 7207851375 • కావూరి హిల్స్: 040- 43730255 • ఉప్పరపల్లి (అత్తాపూర్): 040-29705890 • బోయినపల్లి: 040-46014924 • ఎస్.డి. రోడ్డు (సికింద్రాబాద్): 040 27718041 • కుషాయిగూడ: 040-49884386 • సాఫిల్‌గూడ: 040-27130123 • వనస్థలిపురం: 040-29882485 • చంపాపేట: 7207268492 • మలక్‌పేట: 040-68234900 • ఎల్.బి నగర్: 040-69019809 • ఖట్కేసర్: 7382054232 • సూర్యాపేట: 8684-293301 • నిజాంపేట: 040-29370013 • నార్సింగి: 8333905810 • మిర్యాలగూడ: 8500259852 • సన్‌సిటీ, గంధంగూడ: 7569890228

భవిష్యత్తులో అలాంటి వ్యాఖ్యలు చేయొద్దు

మంత్రి కొండా సురేఖను ఆదేశించిన న్యాయస్థానం

ఈనాడు, హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలు చేసిన పరువునష్టం కేసులో మంత్రి కొండా సురేఖను సిటీ సివిల్ కోర్టు మందలించింది. భవిష్యత్తులో అలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్‌పై ఆమె చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను తొలగించాలని గూగుల్, యూట్యూబ్, ఎక్స్, మెటా, మీడియా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కథనాలు, వీడియోలేవీ పబ్లిక్ డొమైన్‌లో ఉండొద్దని కోర్టు పేర్కొంది. తదుపరి విచారణను నవంబరు 13కి వాయిదా వేసింది.

◆మంత్రి కొండా సురేఖ కోర్టు ఆదేశాలను పాటించాలని భారాస లీగల్ సెల్ సభ్యులు లలితారెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్ వద్ద ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్‌పై అక్టోబరు 2న మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. మంత్రి స్థాయిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై కేటీఆర్ సురేఖపై పరువునష్టం దావా వేసినట్లు తెలిపారు. సమావేశంలో లీగల్ సెల్ సభ్యులు వేణుగోపాల్, జక్కుల లక్ష్మణ్, ప్రవీణ్, కావ్యశ్రీ, భాస్కర్, కార్తీక్ పాల్గొన్నారు.

మంత్రులు, ప్రతిపక్ష నేతల ఫోన్లూ ట్యాపింగ్

(మొదటి పేజీ తరువాయి)

తన ఆరోపణలు అబద్ధమైతే.. కెమెరాల ముందు బహిరంగంగా తనతో పాటు సీఎం రేవంత్ లైడిటెక్టర్ పరీక్షలకు సిద్ధపడాలని ఆయన సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ ప్రసంగించారు. "తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మా పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలనుకున్నాం. కానీ కాంగ్రెస్ వల్లే విలీనం జరగలేదు. అదృష్టవశాత్తు తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లే అవకాశం మాకు దొరికింది. అధికారం శాశ్వతమని మేం ఏనాడూ అనుకోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా అంచనాలు పెరగడం మా ఓటమికి ఒక కారణం. గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని ఎంపిక అనే కంటే.. మా ప్రభుత్వాన్ని తిరస్కరించారని చెప్పొచ్చు. 100 రోజుల్లోనే అనేక హామీలను నెరవేరుస్తామంటూ చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దేశంలో పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కాంగ్రెస్ పార్టీ. మా ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్ధంగా పార్టీ శాసనసభాపక్ష విలీనం జరిగింది. రాహుల్ గాంధీ దిల్లీలో రాజ్యాంగం ప్రతులు పట్టుకొని తమాషా చేస్తుంటారు. కానీ తెలంగాణలో రాజ్యాంగం ఖూనీ అవుతున్నప్పుడు మాత్రం మౌనం వహిస్తున్నారు. కాంగ్రెస్ బుల్డోజర్ల నుంచి పేద ప్రజలను కాపాడటంపై రాహుల్ దృష్టి పెట్టాలి. రాజకీయాల్లో గెలుపు ఓటముల పట్ల చలించిపోయేతత్వం కేసీఆర్‌ది కాదు. తెలంగాణ భవిష్యత్తు కోసం ఆయన నిరంతరం ఆలోచిస్తున్నారు. కచ్చితంగా ప్రజలు మరోసారి కేసీఆర్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం ఇస్తారని విశ్వసిస్తున్నా" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎక్కువ మంది పిల్లలను కనాలన్న ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. "ప్రస్తుతం ఉన్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. జనాభా నియంత్రణపై దక్షిణ భారతదేశానికి స్పష్టమైన అవగాహన ఉంది. జనాభా తగ్గించుకుని క్రమశిక్షణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ పేరుతో నష్టం చేయడం అన్యాయం'' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఎన్నికపై పిటిషన్ కొట్టివేత

9 నెలల 20 రోజుల్లోనే పరిష్కారం



ఎన్నికల పిటిషన్‌ను గడువులోగా పరిష్కరిస్తే న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరుగుతుంది. అందుకే సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల పిటిషన్‌ను ఆరు నెలల్లోగా పరిష్కరించాలని ఈ కోర్టు ప్రయత్నించింది. ఈ పిటిషన్ జనవరి 6న దాఖలైంది. సాక్ష్యాలు, ఆధారాల పరిశీలన తర్వాత వాదనల నిమిత్తం అక్టోబరు 1కి వాయిదా వేయగా మరో రెండు వాయిదాల్లో న్యాయవాదులు వాదనలు ముగించారు. దాంతో పిటిషన్‌ను 9 నెలల 20 రోజుల్లో పరిష్కరించడానికి సాధ్యమైంది. సత్వర పరిష్కారానికి సహకరించిన ఇరుపక్షాల న్యాయవాదులకు అభినందనలు.

– జస్టిస్ కె.లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఎన్నిక చెల్లదని ప్రకటించాలంటూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు కొట్టివేసింది. కేవలం నాలుగేళ్ల రిటర్నులు సమర్పించలేదన్న ఒక్క కారణంతో ఎన్నిక చెల్లదని ప్రకటించలేమంది. 2023 శాసనసభ ఎన్నికల్లో ఆసిఫాబాద్(ఎస్టీ) నుంచి భారాస అభ్యర్థినిగా కోవ లక్ష్మి, కాంగ్రెస్ అభ్యర్థిగా అజ్మీర శ్యాంనాయక్‌లు పోటీపడ్డారు. నామినేషన్ సమయంలో లక్ష్మి... 2022-23 ఆదాయపు పన్ను రిటర్నులను మాత్రమే సమర్పించారని, అంతకుముందు నాలుగేళ్ల వివరాలను జతచేయనందున ఆమె ఎన్నికను రద్దు చేసి, ఆ స్థానంలో తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలంటూ శ్యాంనాయక్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ... "కోవ లక్ష్మి 2017-18లో రూ.5.40 లక్షల ఆదాయం చూపారు. తర్వాతి నాలుగేళ్ల ఆదాయాన్ని తొక్కిపెట్టారు. జడ్పీ ఛైర్‌పర్సన్‌గా, మాజీ ఎమ్మెల్యేగా పొందిన గౌరవ వేతనం, పింఛను కలిపి రూ.15.60 లక్షలను చూపలేదు'' అని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే తరఫున సీనియర్ న్యాయవాది జె.రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ... ఎన్నికల పిటిషన్‌కు కావాల్సిన ఆధారాలను సమర్పించలేదని, అసలు పిటిషన్ దాఖలుకు సరైన కారణమే చూపలేదన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి... 'ప్రతివాది ఎన్నికల అఫిడవిట్‌లో పాన్ నంబరుతోపాటు ఆదాయంగా చూపిన రూ.11.15 లక్షల వివరాలున్నాయి. ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు పవిత్రమైంది. పిటిషనర్‌కు 60,238 ఓట్లు, ప్రతివాదికి 83,036 ఓట్లు వచ్చాయంటే ఆమెపై ప్రజలు విశ్వాసం ఉంచినట్లుగా తెలుస్తోంది. నాలుగేళ్ల రిటర్నులను సమర్పించలేదన్న కారణంతో ఎన్నికను రద్దు చేయలేం'' అంటూ పిటిషన్‌ను కొట్టేశారు.

రాష్ట్రంలో కొత్తగా 13 పట్టణాభివృద్ధి సంస్థలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 13 పట్టణాభివృద్ధి సంస్థలను (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవోలను విడుదల చేసింది. వీటితోపాటు గతంలో ఉన్న ఆరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిని విస్తరిస్తూ జీవోలు జారీ చేసింది. కొత్తగా ఏర్పాటుచేసిన వాటిలో.. జోగులాంబ గద్వాల, ఆదిలాబాద్, కొత్తగూడెం, కామారెడ్డి, మంచిర్యాల, కాగజ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, నిర్మల్, సంగారెడ్డి, వికారాబాద్, సూర్యాపేట, వనపర్తి పట్టణాలు ఉన్నాయి. విస్తరించిన వాటిలో మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్ (శాతవాహన), సిద్దిపేట, వేములవాడ, స్తంభాద్రి (ఖమ్మం) పట్టణాలను చేర్చారు.


గ్రూప్-1 పేపర్-4కు 67% హాజరు.. ఒకరి డిబార్

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 ప్రధాన పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన పేపర్-4(ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్) పరీక్షకు 67.4 శాతం హాజరు నమోదైనట్లు టీజీపీఎస్సీ వెల్లడించింది. ఈ పరీక్షకు 21,195 మంది హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం సీవీఆర్ కేంద్రంలో ప్రధానపరీక్షకు హాజరైన ఓ అభ్యర్థిని కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారు. కేంద్రంలోకి ప్రవేశించిన తరువాత తొలుత ఓఎంఆర్ పత్రం ఇస్తారు. తరువాత ప్రశ్నపత్రం ఇవ్వక ముందే జవాబుపత్రంలోని చిత్తుపని కోసం కేటాయించిన ఏదో రాస్తుండటంతో ఇన్విజిలేటర్ గుర్తించారు. పరిశీలించగా ఆమె చేతులపై కొన్ని గణాంకాలు ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే అక్కడి భద్రతా సిబ్బంది వచ్చి తనిఖీ చేయగా దుస్తులపైనా కొంత సమాచారం రాసుకున్నట్లు తెలిసింది. దీంతో పోలీసులు పరీక్ష ముగిసే వరకు ఆమెను అక్కడే ఉంచి, తరువాత అదుపులోకి తీసుకున్నారు. మాల్‌ప్రాక్టీస్ చట్టం కింద చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వద్ద లభించిన సమాచారం ప్రశ్నపత్రంతో సంబంధం లేదన్నారు. ఆ అభ్యర్థినిని డిబార్ చేసినట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు.

మానవ ప్రమేయం లేకుండా ముద్రణ, ప్యాకింగ్, సీలింగ్

గ్రూప్-1 ప్రశ్నపత్రాల ప్యాకింగ్, సీల్‌పై టీజీపీఎస్సీ వివరణ ఇచ్చింది. 'వాటిని మానవ ప్రమేయం లేకుండా మిషన్‌తో ప్యాకింగ్ చేస్తున్నాం. ప్రతి పరీక్షకు పలు సెట్ల ప్రశ్నపత్రాలు సిద్ధం చేసి, అందులో ఒక దాన్ని పరీక్ష జరిగే రోజున ఎంపిక చేసి అభ్యర్థులకు పంపిణీ చేస్తాం. పరీక్షకేంద్రం స్థాయిలో సీల్ వేసిన కార్టన్ బాక్సులను టీజీపీఎస్సీ ప్రతినిధులు, జిల్లా కలెక్టరు సమక్షంలో కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తెరుస్తారు. ప్రశ్నపత్రాలు ట్యాంపర్ చేయడానికి వీల్లేని కవర్లలో సీల్‌తో పంపిణీ చేస్తారు' అని టీజీపీఎస్సీ పేర్కొంది.

బరువు తగ్గాలా... కండలు పెంచండి!



ఈనాడు – హైదరాబాద్

భారత్ సహా ప్రపంచ దేశాల్లో యాంత్రిక జీవనశైలి కారణంగా... 30 ఏళ్లలోపే ఊబకాయం, అధిక రక్తపోటు, మధుమేహం, గుండెపోటు, పక్షవాతం, క్యాన్సర్ వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీనికి శారీరక శ్రమ లేకపోవడం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి తదితర కారణాలున్నా... అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కూడా ఒక ప్రధాన కారణంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టంచేసింది. పోషకాహారాన్ని తీసుకోవడమే కాదు... దాన్ని ఎంత మోతాదులో, ఎలా తీసుకుంటున్నామనేది చాలా కీలకమంది. అది కూడా క్రమబద్ధంగా... స్త్రీ, పురుషులు వారి శారీరక స్థితికి తగ్గట్లుగా వేర్వేరుగా ఆహారాన్ని తీసుకోవాలి. ఉదాహరణకు భార్యాభర్తలిరువురూ బరువు తగ్గడానికి న్యూట్రిషనిస్టును సంప్రదిస్తే.. ఇద్దరికీ ఒకేరకమైన డైట్ ప్లాన్ ఇవ్వడం సరికాదని యూనివర్సిటీ ఆఫ్ వాటర్‌లూ అధ్యయనం స్పష్టంచేస్తోంది. మహిళలకు తక్కువ కేలరీలున్న ఆహార ప్రణాళికను రూపొందించాలని సూచిస్తోంది.

● పురుషులతో పోల్చితే... స్వభావరీత్యా స్త్రీల శరీరంలో కొవ్వు మోతాదు ఎక్కువగా ఉంటుంది. పురుషుల్లో కండరాల మోతాదు అధికం. కండరాలు ఎక్కువుంటే.. జీవక్రియ కూడా మెరుగ్గా పనిచేస్తుంది. కొవ్వు మోతాదు అధికంగా ఉంటే జీవక్రియ పనితీరు తక్కువగా ఉంటుంది. ఇలాంటప్పుడు ఎక్కువ కేలరీలను తీసుకుంటే.. అదనపు కేలరీలు కాస్తా.. కొవ్వుగా మారిపోయి ఊబకాయానికి దారితీస్తుంది. ఉదాహరణకు ఒక రోజులో ఆడా, మగా... చెరో 1,500 కేలరీల ఆహారాన్ని తీసుకుంటే... మగవారితో పోల్చితే ఆడవారిలో ఖర్చయ్యే కేలరీలు తక్కువ. అప్పుడు మహిళల్లో మిగిలిన కేలరీలు కొవ్వు నిల్వలుగా పేరుకుపోతాయి.

జీవక్రియ రేటుకు అనుగుణంగా ఆహారంలో మార్పులు

ఎక్కువ మంది శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవాలనుకుంటారు. బరువు ఎక్కువగా ఉన్నవారు తగ్గించుకోవాలనుకుంటారు. ఈ రెండింటికీ చాలా ముఖ్యమైంది... అసలు మన శరీరంలో జీవక్రియ ఎలాగుందనేది తెలుసుకోవడం. దీని తర్వాతే మనం తీసుకునే ఆహారంలో అవసరమైన మార్పులు చేసుకోవచ్చు. ఇందుకోసం బాడీ కంపోజిషన్ ఎనాలసిస్ పరీక్ష చేయించుకోవాలి. దీని ద్వారా శరీరంలో కండరాలు, కొవ్వు, ఎముకలు, నీటి మోతాదులను గుర్తించవచ్చు. ఈసీజీ, ఈఈజీ మాదిరిగా స్వల్ప మోతాదు ఎలక్ట్రో విధానంలో ఈ పరీక్షను నిర్వహిస్తారు. తద్వారా వ్యక్తి జీవక్రియ రేటు ఎంతనేది తెలిసిపోతుంది. కండరాల మోతాదు ఎక్కువుంటే... బేసల్ మెటబాలిక్ రేట్(బీఎంఆర్) అధికంగా ఉంటుంది. కొవ్వు మోతాదు అధికంగా ఉంటే బీఎంఆర్ తక్కువగా ఉంటుంది. ఇలా శరీరంలో కొవ్వు మోతాదును, జీవక్రియ రేటును నిర్ధారించిన తర్వాతే స్త్రీ, పురుషులకు ఆహార సరళిని వేర్వేరుగా సూచించాల్సి ఉంటుంది. పైగా బీఎంఆర్ ఎక్కువగా ఉన్న వారిలో... విశ్రాంతిలో ఉన్నా కేలరీలు ఎక్కువగానే ఖర్చు అవుతుండడం విశేషం. అంటే... స్త్రీలలో కంటే పురుషుల్లో కండరాల మోతాదు అధికంగా ఉండడంతో వారు విశ్రాంతిలో ఉన్నా కూడా కొద్దిమేర కేలరీలు ఖర్చవుతాయి. ఇది మగవారికి అనుకూల అంశం.

● ఒకవైపు పురుషులతో పోల్చితే మహిళల్లో కొవ్వు మోతాదు ఎక్కువ ఉండగా... మరోవైపు స్త్రీలతో మెనోపాజ్‌కు ముందు, తర్వాత కూడా కొవ్వు మోతాదుల్లో వ్యత్యాసం కనిపిస్తుంది. మెనోపాజ్ తర్వాత మహిళల్లో కొవ్వు మోతాదు మరింత పెరుగుతుండడం గమనార్హం. ఇలా జరగకుండా ఉండాలంటే.. కండరాల మోతాదును పెంచుకోవడంపై దృష్టిసారించాలి. ఇక్కడే ఎక్సర్‌సైజ్‌ల పాత్ర కీలకంగా మారుతుంది.

నడక ఒక్కటే సరిపోదు

చాలామంది రోజులో ఒక గంట నడిస్తే సరిపోతుందనుకుంటారు. వాకింగ్ గుండె, ఊపిరితిత్తుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కానీ, జీవక్రియ మెరుగవ్వడానికి, కండరాల వృద్ధికి కొన్ని రకాల బరువులెత్తే వ్యాయామాలు చేయాల్సిందే. కనీసం వారానికి మూడుసార్లైనా స్వల్ప బరువులెత్తుతూ కండరాల వృద్ధికి సంబంధించిన వ్యాయామం చేయాలి. ఇంట్లో అందుబాటులో ఉన్న వాటర్ బాటిల్‌తోనైనా చిన్నపాటి ఎక్సర్‌సైజ్‌లు కొనసాగించాలి.

16 గంటల ఉపవాసం... 8 గంటల ఆహారం



స్త్రీలు ఎక్కువసార్లు తింటే కేలరీలు తక్కువగా ఖర్చయి... మిగిలినదంతా కొవ్వు కిందకు మారిపోతుంది. అందుకే మహిళలు 'ఇంటెర్‌మిటెంట్ ఫాస్టింగ్' లేదా 'టైమ్ రెస్ట్రిక్టెడ్ ఈటింగ్'ను అనుసరించడం మంచిది. ఈ విధానంలో రోజులోని 24 గంటల్లో 16 గంటలు ఉపవాసంగా ఉండి, 8 గంటలు మాత్రం ఆహారాన్ని తీసుకోవాలి. ఆ ఎనిమిది గంటల్లో నాలుగైదుసార్లు తినొచ్చు. అయితే, ఉదయం 10 గంటలకు తినడం ప్రారంభిస్తే సాయంత్రం ఆరింటికి ఆపేయాలి. మళ్లీ మర్నాడు ఉదయం 10 గంటల వరకు ఏమీ తినొద్దు. ఈలోగా మంచినీరు, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, బ్లాక్ టీ, బ్లాక్ కాఫీ వంటివి తాగొచ్చు. ఈ విధానంలో జీర్ణకోశంలో మంచి బ్యాక్టీరియా పెరిగి జీవక్రియ మెరుగవుతుంది. కొవ్వు ఎక్కువగా కరిగి, బరువు తగ్గుతారు.

బ్రేక్‌ఫాస్ట్‌లో ఏమి తింటున్నాం అనేది ముఖ్యం



ఇంటెర్‌మిటెంట్ ఫాస్టింగ్ తర్వాత తినే ఆహారం... అంటే బ్రేక్‌ఫాస్ట్ చాలా ముఖ్యం. అప్పుడు ఏం తీసుకుంటున్నామనేది అత్యంత కీలకమైన అంశం. సాధారణంగా ఉదయం వేళల్లో మన శరీరంలో జీవక్రియలు చురుగ్గా, సాయంత్రం మందకొడిగా పనిచేస్తుంటాయి. అందుకే కండరాలు వృద్ధి చెందాలంటే... ఉదయం పూట ప్రొటీన్ ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తినాలి. ఏం తింటున్నామనే దానిపై దృష్టి నిలపాలి.

● ఉదాహరణకు ఒక గుడ్డును తింటే 75 కేలరీలు, రెండు బ్రెడ్ ముక్కలను తింటే 80 కేలరీలు వస్తాయి. అయితే, గుడ్డు ద్వారా ప్రొటీన్ లభిస్తుంది. అది కండరాల వృద్ధికి పనిచేస్తుంది. అదే బ్రెడ్ ముక్కలను తింటే కార్బోహైడ్రేట్‌గా పనిచేసి... కొవ్వుగా మారుతుంది. అంటే... వేర్వేరు ఆహార పదార్థాల్లో ఒకే మోతాదు కేలరీలున్నా... వాటి పనితీరు మన శరీరంపై వేర్వేరుగా ఉంటుందని గుర్తించాలి.

● ఒక గుడ్డు, ఒక ఇడ్లీ కూడా ఒకేరకమైన కేలరీలను ఇస్తాయి. వాటి పనితీరు మాత్రం వేరుగా ఉంటుంది. ఇడ్లీ తింటే కొవ్వుగా మారుతుంది. దాని బదులు మొలకెత్తిన గింజలు తినొచ్చు.

● మధ్యాహ్న భోజనంలో బ్రౌన్ రైస్, మిల్లెట్లు వంటివి తీసుకుంటే బరువు తగ్గుతాం. ఈ సమయంలో కంచంలో సగం కూరగాయలు, పండ్లు ఉండాలి. పావువంతు కార్బోహైడ్రేట్స్ మాత్రమే ఉండాలి. అంటే అన్నం, చపాతి, ఇడ్లీ, ఉప్మా ఇలాంటివి ఉండాలి.

● రోజూ ఒకపూట 100 గ్రాముల అన్నం కప్పు మాత్రమే తినడం మేలు. మాంసాహారం తీసుకోవాలనుకుంటే గిన్నెలో పావువంతు కంటే తక్కువగా ఉండాలి.

ప్రొటీన్ ఆహారాలు: ఉప్పు కలపని గింజలు, విత్తనాలు, బీన్స్, పప్పు దినుసులు, గుడ్లు, చికెన్, మటన్, చేప, పన్నీరు, మొలకెత్తిన గింజలు(స్ప్రౌట్స్), సోయా ఉత్పత్తులు, బ్లాక్ చెనా, పాలు, పాల ఉత్పత్తుల వంటివి.

మూసీ పునరుజ్జీవంపై రగడ ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

నెహ్రూ నుంచి మన్మోహన్ వరకు కాంగ్రెస్ ప్రధానులంతా దేశంలో అనేక సంస్కరణలు, విప్లవాలు తీసుకొచ్చారు. మోదీ మాత్రం.. పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను పడగొట్టడం, భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం తప్ప ఏమీ చేయలేదు. ఉత్తర, దక్షిణ భారత్ అని విభజన తేవడానికి ప్రయత్నిస్తున్నారు. దక్షిణాదిపై కేంద్రం వివక్ష చూపిస్తోంది. కేంద్రానికి మేం ఒక్క రూపాయి పంపిస్తే.. కేవలం 40 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయి. యూపీ నుంచి పన్నుల ద్వారా కేంద్రానికి రూపాయి వెళ్తే రూ.7, బిహార్‌కు రూ.6 వెనక్కి వస్తున్నాయి. దీనిపై దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంపై ఒత్తిడి పెంచే ఆలోచన ఉంది. అవసరమైతే సీఎంల సదస్సు నిర్వహణకు నేనే చొరవ చూపిస్తా.

పదేళ్లు పాలించిన కేసీఆర్ పదిసార్లు కూడా సచివాలయానికి రాలేదు. అసంతృప్తితోనే ప్రజలు ఆయనను ఓడించారు. ఆయనకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే 10 నిమిషాలు అసెంబ్లీలో కూర్చుని వెళ్లిపోయారు. తానో జమీందారునని, ప్రజలందరూ గులాంలని కేసీఆర్ అనుకుంటారు. మీకు నచ్చకుంటే ఇంట్లోనే కూర్చోండి. మా ప్రభుత్వాన్ని పని చేయనివ్వండి. అడ్డుకోవాలని చూస్తే ప్రజలు ఊరుకోరు. వచ్చే ఎన్నికల్లో భాజపా, భారాసలకు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. నియోజకవర్గాల పునర్విభజన అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించినది. దక్షిణాది భాజపా నేతలు కూడా దీనిపై స్పందించాలి. దక్షిణాదికి అన్యాయం జరిగి సీట్లు తగ్గితే, మన గళాన్ని వినిపించే అవకాశమే ఉండదు. ఇది తీవ్ర అసమానతలకు దారితీస్తుంది. దీనిపై గట్టిగా పోరాడతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

యువ జనాభా తగ్గిపోతోంది

ఎక్కువ మంది పిల్లల్ని కనాలని గతంలో ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నించగా.. 'స్వాతంత్ర్యం వచ్చే నాటికి, ఇప్పటికీ పౌరుల సగటు జీవిత కాలం పెరిగింది. మరోవైపు చాలా మంది కుటుంబ నియంత్రణను పాటిస్తూ ఒక్క సంతానానికే పరిమితమవుతున్నారు. ఇదే కొనసాగితే 20-30 ఏళ్ల తర్వాత ఇప్పుడున్న వారే వృద్ధులుగా ఎక్కువ సంఖ్యలో ఉంటారు. చంద్రబాబునాయుడు కూడా ఇదే విషయంపై మాట్లాడి ఉండవచ్చు. దీనికి రాజకీయాలతో సంబంధం లేదు' అని సీఎం తెలిపారు.



క్రీడా పాలసీ సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, శివసేనారెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఇతర అధికారులు

త్వరలో క్రీడా విశ్వవిద్యాలయం బిల్లు

వచ్చే రెండేళ్లలో జాతీయ క్రీడలు నిర్వహించేలా చర్యలు ● సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు– హైదరాబాద్: 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'కి సంబంధించిన బిల్లును సాధ్యమైనంత త్వరగా రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర క్రీడా విధానానికి సంబంధించిన తుది ముసాయిదాను నవంబరు నెలాఖరులోగా సిద్ధం చేయాలని సీఎం సూచించారు. అది దేశంలోనే అత్యుత్తమ పాలసీగా ఉండాలని, అందుకు విస్తృత అధ్యయనం, నిపుణులు, క్రీడాకారులతో విస్తృతస్థాయిలో సంప్రదింపులు చేయాలన్నారు. తెలంగాణ క్రీడా విధానంపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీలో భాగమైన 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ', 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ', 'స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ'కు సంబంధించి పలు అంశాలను అధికారులు సీఎంకు వివరించగా.. ఆయన కొన్ని మార్పుచేర్పులను సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో అందుబాటులో ఉన్న క్రీడా వనరులను సమర్థంగా వినియోగించుకోవాలి. ఇప్పటికే ఉన్న స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలి. నేను దక్షిణ కొరియాలోని నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించినప్పుడు చాలా ముఖ్యమైన విషయాలను గుర్తించాను. వాటిని కూడా నూతన క్రీడా పాలసీలో పొందుపర్చాలి. రెండు రోజుల కిందట రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు.. దక్షిణ కొరియా క్రీడా వర్సిటీ ప్రతినిధులతో చర్చించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. క్రీడారంగంలో ప్రపంచంలోనే అత్యుత్తమైనదిగా గుర్తింపు పొందిన ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీ అనసరిస్తున్న విధానాలపైనా అధ్యయనం చేయాలి. మరో పది రోజుల్లోనే స్పోర్ట్స్ పాలసీకి సంబంధించిన గవర్నింగ్ బాడీని ఖరారు చేయాలి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్‌ను వెంటనే రూపొందించాలి. వచ్చే రెండేళ్లలో జాతీయ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా 'ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్'ను సంప్రదించాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, క్రీడలశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం ఇచ్చేది లేదు?

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం శనివారం ధాన్యం విధానాన్ని ఖరారు చేయనుంది. సీఎం రేవంత్‌రెడ్డితో పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ డీఎస్ చౌహాన్ శుక్రవారం సాయంత్రం సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. బకాయిలు చెల్లించని డిఫాల్ట్ మిల్లర్లకు ఎప్పటికీ ధాన్యం కేటాయించొద్దని నిర్ణయించినట్లు సమాచారం. బకాయిలు లేని మిల్లర్లకు మాత్రం 10% మించకుండా బ్యాంకు గ్యారంటీ నిబంధన పెట్టనున్నట్లు తెలిసింది. బకాయిలను తీర్చే వారికి కొంత అధికంగా గ్యారంటీ పెట్టనున్నారు. మిల్లింగ్ ఛార్జీలను కొంతమేర పెంచాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం శనివారం మధ్యాహ్నం మరోసారి సమావేశమై ఈ నిర్ణయాలకు ఆమోదం తెలపనుంది. సాయంత్రం జరిగే రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ధాన్యం విధానాన్ని ఖరారు చేయనున్నారు.

29 పనులకు నీటి పారుదలశాఖ ఓ అండ్ ఎం కమిటీ ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో చేపట్టనున్న 29 ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులకు ఓ అండ్ ఎం కమిటీ ఆమోదం తెలిపింది. నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఆమోదించిన వాటిలో మహబూబ్‌నగర్ జిల్లాలో కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం, జలాశయంలో నీటి ప్రవాహాలు, నీటి మట్టం, విడుదల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఉద్దేశించిన సాంకేతిక విధానం ఏర్పాటుకు నిధులు కేటాయించింది. ఓఅండ్ఎం ఇంజినీర్ ఇన్ చీఫ్ నాగేంద్రరావు పలువురు సీఈలు పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

26–10–2024 శనివారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం

నవమి: ఉ. 6-18 తదుపరి దశమి

ఆశ్లేష: మ. 1-19 తదుపరి మఖ

వర్జ్యం: రా. 2-09 నుంచి 3-51 వరకు

అమృత ఘడియలు: ఉ. 11-38 నుంచి 1-19 వరకు

దుర్ముహూర్తం: ఉ. 6-00 నుంచి 7-31 వరకు

రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు

సూర్యోదయం: ఉ. 6.00; **సూర్యాస్తమయం:** సా.5.30

రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధం

● మూసీ పరీవాహక ప్రజలు ఆందోళన చెందొద్దు

● బాధితులకు భాజపా అండగా ఉంటుంది: కిషన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, రాంనగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించి రాజధాని పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉండేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నవారు మూణ్నెల్ల పాటు నది పరీవాహక ప్రాంతాల్లో నివాసం ఉంటే.. ప్రాజెక్టును విరమించుకుంటానంటూ సీఎం రేవంత్ ఇటీవల సవాల్ విసిరిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నది పరీవాహకంలోని పేదల ఇళ్ల కూల్చివేతలకు వ్యతిరేకంగా 'చేయి చేసిన కీడు.. మూసీ బాధితులకు భాజపా తోడు' పేరుతో శుక్రవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో భాజపా మహాధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా పేదలకిచ్చే ఇళ్లకు శంకుస్థాపనలు చేయకపోగా ఏళ్లుగా నివసిస్తున్న వారి నివాసాలనూ కూలుస్తోందని మండిపడ్డారు. పేదప్రజల ఇళ్లు కూల్చితే తెలంగాణ రణరంగంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దారిలోనే సీఎం రేవంత్ కూడా వెళ్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని.. ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని... పేదల ఇళ్లు కూల్చితే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. నదికి ఇరువైపులా రిటైనింగ్‌వాల్ నిర్మించి సుందరీకరణ చేసుకోవాలన్నారు. రేవంత్‌కు రూ.లక్షన్నర కోట్ల కల వచ్చిందని, పేద ప్రజలకు మంచి చేయాలని కాదని వ్యాఖ్యానించారు. బాధితులకు భాజపా అండగా ఉంటుందని.. వారికోసం అవసరమైతే చంచల్‌గూడ లేదా చర్లపల్లి జైళ్లకు వెళ్లేందుకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎం రేవంత్ పోలీసులతో వస్తారా...? లేదా అనేది ఆయన ఇష్టమని బస్తీల్లోకి రావాలని కోరారు. డ్రైనేజీ వ్యవస్థ లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

రేవంత్.. ఎన్ని జైళ్లు కట్టుకుంటావో కట్టుకో: బండి సంజయ్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ "సుమారు 12వేల పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో మూసీ విషంతో నిండిపోయింది. దీనికి 40 నుంచి 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ కారణం. మూసీ ప్రక్షాళన అనేది సోనియాగాంధీ అల్లుడికి సంబంధించిన కాంట్రాక్టుల కోసం మాత్రమే. సబర్మతి ప్రాజెక్టు ఖర్చు రూ.7 వేల కోట్లు, నమామి గంగేకు చేసిన వ్యయం రూ.40 వేల కోట్లు అయితే మూసీకి లక్షన్నర కోట్లా..?. ఇంతకంటే ఖరీదైన ప్రాజెక్టు.. స్కామ్ ప్రపంచంలోనే లేదు. ఆరు గ్యారంటీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రా, మూసీ సుందరీకరణ అంటూ డ్రామాలు చేస్తున్నారు. 15వేల మంది ఇళ్లను కూల్చి లక్ష మంది పేదల బతుకులను బజారుకీడ్చేందుకు కుట్ర చేస్తున్నారు. మాకు కేసులు, లాఠీలు కొత్త కాదు. రేవంత్.. ఎన్ని జైళ్లు కట్టుకుంటావో కట్టుకో. మేం కొట్లాడేందుకు సిద్ధం. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు రోడ్లపై తిరగకుండా చేస్తాం'' అని సంజయ్ అన్నారు.

పేదల కంటి మీద కునుకు లేదు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన పేరుతో హైడ్రా తీసుకొచ్చి పేదల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నారన్నారు. గుడిసెలు వేసుకొని బతుకుతున్న వారికి 40 ఏళ్ల క్రితమే ప్రభుత్వం ఇళ్ల పట్టాలిచ్చిందని.. వాటిని మూసీ బఫర్‌జోన్‌లో కట్టుకున్న ఇళ్లంటూ రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గుత్తేదారులకు మేలు చేసేలా మూసీ సుందరీకరణను ముందుకు తెచ్చిందని.. దమ్ముంటే బుల్డోజర్లు తమపై నుంచి పేదల ఇళ్లపైకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సూర్యనారాయణ, హరీశ్, మాజీ ఎమ్మెల్యేలు డా.ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, ప్రదీప్, బంగారు శ్రుతి తదితరులు పాల్గొన్నారు.

ఇదీ సంగతి!



దురలవాటు ఏమీలేదు డాక్టర్.. దిల్లీ వెళ్లి నిన్ననే వచ్చాను!!


57 ఏళ్ళ నమ్మకం
147 షోరూమ్స్
20 నగరాలలో
విజయ్ సేల్స్
Shop On www.vijaysales.com
ఇప్పుడు అందుబాటులో
పంజాగుట్ట
దిగువ గ్రౌండ్ ఫ్లోర్, జీవన్ సెంటర్ పాయింట్ (హైదరాబాద్ సెంట్రల్)
ఇప్పుడు అందుబాటులో
ఆర్ సి పురం లో
సినీ మార్ట్ ఎదురుగా
దీపావళి ధమాకా
32 [80 cm]
SANSUI
PRICE ₹17,990
OFFER PRICE ₹6,990
Up to ₹4,500 Instant Discount* HDFC BANK | RBL BANK
Upto ₹22,500/- Instant Discount & Cashback on Credit Card / Debit Card & Paper Finance
HSBC | YES BANK | IDFC FIRST Bank | BOBCARD | DBS | pnb | Bajaj Finserv | IndusInd Bank | HDFC BANK | FEDERAL BANK | kotak | AMERICAN EXPRESS | HDB FINANCIAL SERVICES
Buy & Fly Get A Flight Voucher upto ₹5,000
Paytm Card Machine No Cost EMI
Valid on Brand EMI & Brand Full Swipe transactions above ₹30,000
WE ACCEPT EMI CARDS
THE NEXT GENERATION OF LG AI TV
LG UHD AI
UR7550
α5 Gen 6 AI Processor | HDR 10 | AI Sound | webOS Re:New Program
Exclusive Offers*
Upto 10% CASHBACK Max ₹7500*
1 EMI FREE
FIXED EMI Starting from ₹999*
SANSUI 43 [108 cm] 4K UHD Google TV
PRICE ₹41,990 | OFFER PRICE ₹25,000
UPTO ₹1,500 CASHBACK
EFFECTIVE PRICE (AFTER CASHBACK) ₹23,500
DOWN PAYMENT ₹8,336 | EMI ₹2,083 x 8 months
SANSUI 50 [125 cm] 4K UHD Google TV
PRICE ₹51,990 | OFFER PRICE ₹28,000
UPTO ₹1,500 CASHBACK
EFFECTIVE PRICE (AFTER CASHBACK) ₹26,500
DOWN PAYMENT ₹9,336 | EMI ₹2,333 x 8 months
SANSUI 70 [178 cm] 4K UHD Google TV
PRICE ₹96,990 | OFFER PRICE ₹55,000
UPTO ₹2,000 CASHBACK
EFFECTIVE PRICE (AFTER CASHBACK) ₹53,000
DOWN PAYMENT ₹18,336 | EMI ₹4,583 x 8 months
SAMSUNG
BIG TV FESTIVAL
Light up your festivities with AI powered Samsung TV
Exclusive Festive Offers
Up to 10% cashback*
3 Year warranty*
30 months Long tenure EMI*
1 EMI off*
Crystal 4K UHD 65DU7700
Image simulated for representational purposes only. *T&C apply.
VISE 32 [80 cm] Google TV
PRICE ₹34,000 | OFFER PRICE ₹12,000
UPTO ₹1,000 CASHBACK
EFFECTIVE PRICE (AFTER CASHBACK) ₹11,000
ZERO DOWN PAYMENT | EMI ₹1,500 x 8 months
VISE 55 [139 cm] 4K QLED powered by webOS Hub
PRICE ₹90,000 | OFFER PRICE ₹39,000
UPTO ₹1,500 CASHBACK
EFFECTIVE PRICE (AFTER CASHBACK) ₹37,500
ZERO DOWN PAYMENT | EMI ₹4,875 x 8 months
VISE 65 [164 cm] 4K QLED Google TV
PRICE ₹1,20,000 | OFFER PRICE ₹45,000
UPTO ₹2,000 CASHBACK
EFFECTIVE PRICE (AFTER CASHBACK) ₹43,000
ZERO DOWN PAYMENT | EMI ₹5,625 x 8 months
REDMI 13C 5G 6GB | 128GB
VSP ₹10,999
CASHBACK ₹1,000*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹9,999
GET Noise Cancellation Buds @ ₹199 worth ₹1499
OPPO K12X 5G 6GB | 128GB
VSP ₹12,999
CASHBACK ₹1,500*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹11,499
CMF by NOTHING NOTHING PHONE 1 5G 8GB | 128GB
VSP ₹15,999
CASHBACK ₹2,000*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹13,999
VIVO V40 PRO 5G 8GB | 128GB
VSP ₹34,999
CASHBACK ₹3,500*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹31,499
ONEPLUS 12R 5G 8GB | 128GB
VSP ₹35,999
CASHBACK ₹3,000*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹32,999
PS5
PLAYSTATION 5 DEALS
SAVE ₹3,000/-* ₹51,990/-*
ENDS 03/11
Vertical stand sold separately.
MacBook Air M1
8GB | 256GB
PRICE ₹70,990
Cashback ₹5,000
Old Device Value ₹13,000
Exchange Bonus ₹10,000
Effective Price ₹42,990*
iPad 10th Gen
PRICE ₹32,900
Cashback ₹2,500
Effective Price ₹30,400*
Effective Price including with all offers*
iPhone 16
PRICE ₹79,900
Cashback ₹5,000
Old Device Value ₹20,000
Exchange Bonus ₹8,000
Effective Price ₹46,900*
iPhone Exchange value calculated based on iPhone 13 in Good Condition*
WIDE RANGE OF IT & MOBILE ACCESSORIES
UPTO 65% OFF*
3 in 1 COMBO OFFER
Buy Any Laptop & GET
MOUSE + PENDRIVE + TWS
@ ₹1499/- ONLY
ASUS
ROG, STRIX, ZENBOOK TUF GAMING, ZEPHYRUS DUO
• Cash Back Upto ₹4,000/-*
• Upto 18 Months EMI Options
• Asus Wireless Silent Mouse MW103 @ ₹999*
• Asus CW101 Keyboard+Mouse @ ₹999*
• Asus KW100 Marshmallow Keyboard @ ₹1,599*
Lenovo
LENOVO GAMING, YOGA SERIES, SLIM 5 & FLEX 5, LOQ
• YOGA 9, Yoga Pro, Yoga Slim 7X and Legion: 10% upto ₹10,000/- Cash Back
• Yoga 7/ Slim 7 (Ultra 7) and IP Pro 5: 10% upto ₹8,000/- Cash Back
• Yoga (others), Slim 5, Flex 5 and LOQ: 5% upto ₹5,000/-
• Exchange Bonus upto ₹30,000/-*
DELL Technologies
INSPIRON, INSPIRON GAMING, XPS, ALIENWARE
• Cash Back Upto ₹10,000/-*
• Upto 9 Months No Cost EMI Option*
• 1 Year Additional Dell Warranty @ ₹499/-*
• 1st Year ADP @ ₹99/-*
• Dell Wireless Keyboard and Mouse Combo @ ₹199/-*
hp
PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cash Back Upto ₹8,000/- (Terms & Conditions Apply)
• Exchange Bonus Upto ₹10,000/-
• Extended Warranty on select SKU @ ₹365/-*
• 1st EMI Free
Great Gifting Ideas
Corporate Bookings or Bulk Orders Please Mail us at corporatesales@vijaysales.com
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర | అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
ఎస్ ఆర్ నగర్ | అత్తాపూర్ | బిహెచ్ఇఎల్ | చంపాపేట్ | చందానగర్ | ... | హస్తినాపురం | హయత్‌నగర్ | కర్మన్‌ఘాట్ | కొత్తపేట | కొండాపూర్ | కూకట్‌పల్లి | మల్కాజ్‌గిరి | మదీనాగూడ | మెహిదీపట్నం |
మైలార్‌దేవ్‌పల్లి | నాగారం | నాగోల్ | నల్లకుంట | నాచారం | పంజాగుట్ట | పీర్జాదిగూడ | ఆర్ సి పురం | షా అలి బండ | సుచిత్ర | సన్‌సిటీ | టోలిచౌకి | వనస్థలిపురం | వరంగల్ | హనమకొండ
SCAN FOR STORES
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. No Cibil means new to credit. For corporate bookings or bulk orders, please mail us at corporatesales@vijaysales.com

చాంపియన్

న్యూజిలాండ్‌తో మొదటి టెస్టు.. పేసర్ల దెబ్బకు తొలి ఇన్నింగ్స్‌లో 46కే కుప్పకూలింది టీమ్ఇండియా. స్వదేశంలో అత్యంత దారుణ ప్రదర్శన చేసినా.. ఎప్పుడో ఒకసారి ఇలా జరుగుతుందిలే అని అభిమానులు సర్దిచెప్పుకున్నారు. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల ఎదురుదాడి చూశాక బ్యాటింగ్ గాడిన పడినట్లే అని సంతోషించారు. కానీ కథ మారలేదు.

ఈసారి పతనం స్పిన్ పిచ్‌పై. కివీస్‌తో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 156కే ఆలౌటైంది భారత్. బ్యాటింగ్ మారుతుంది.. బ్యాటర్ల దృక్పథం మారుతుంది.. అని ఆశపడ్డ అభిమానులకు ఆవేదన మిగిలిస్తూ.. రోహిత్ సేన మళ్లీ నిరాశపర్చింది. ఆ 46 పరుగుల ఇన్నింగ్స్ కంటే శుక్రవారం నిర్లక్ష్యంగా ఆడి పెవిలియన్ చేరిన బ్యాటర్ల తీరు ఎక్కువ బాధ కలిగించింది. అదే పిచ్‌పై ప్రత్యర్థి జట్టు స్వేచ్ఛగా పరుగులు రాబట్టి ప్రస్తుతం 301 పరుగుల ఆధిక్యానికి దూసుకెళ్లింది.

సొంతగడ్డపై తిరుగులేని.. 2012 నుంచి సిరీస్ కోల్పోని.. వరుసగా 18 టెస్టు సిరీస్‌ల్లో ఎదురులేని టీమ్ఇండియా ఇప్పుడు ఓటమి ముప్పును ఎదుర్కొంటోంది. భారత్‌లో తొలి టెస్టు సిరీస్ విజయానికి న్యూజిలాండ్ రంగం సిద్ధం చేసుకుంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో భారత్ గెలుపు కష్టమే!

అదే కథ.. తప్పని వ్యథ

- ఓటమి ప్రమాదంలో భారత్
- శాంట్నర్‌కు 7 వికెట్లు
- 156కే టీమ్ ఇండియా ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 198/5



కోహ్లి (1) బౌల్డ్


పంత్ ఔటయ్యాడిలా

పుణె

రెండో టెస్టులో అన్ని విభాగాల్లోనూ విఫలమవుతున్న టీమ్ఇండియాను ఓటమి భయం వెంటాడుతోంది. న్యూజిలాండ్ ఇప్పటికే 301 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగుల కీలక ఆధిక్యం దక్కించుకున్న ఆ జట్టు.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 198/5తో నిలిచింది. కెప్టెన్ లేథమ్ (86; 133 బంతుల్లో 10×4) రాణించాడు. బ్లండెల్ (30 బ్యాటింగ్), ఫిలిప్స్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు పడగొట్టిన వాషింగ్టన్ సుందర్ (రెండో ఇన్నింగ్స్‌లో 4/56) ఫామ్ కొనసాగిస్తూ టెస్టుల్లో తొలిసారి 10 వికెట్ల ఘనతను సొంతం చేసుకున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 16/1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్. . కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన శాంట్నర్ (7/53) దెబ్బకు 156 పరుగులకే కుప్పకూలింది. ఫిలిప్స్ (2/26) కూడా మెరిశాడు. జడేజా (38) టాప్‌స్కోరర్.

ఆధిక్యంతో ఆధిపత్యం: అదే పిచ్.. అవే పరిస్థితులు. అప్పటివరకూ ప్రత్యర్థి స్పిన్నర్లను ఆడలేక భారత బ్యాటర్లు చేతులెత్తేసిన చోటే కివీస్ ఆటగాళ్లు నిలబడ్డారు. డిఫెన్స్‌ను మెరుగ్గా ఆడుతూ.. స్ట్రైక్ రొటేట్ చేస్తూ ఇలాంటి పిచ్‌పై స్పిన్నర్లను ఎలా ఎదుర్కోవాలో కివీస్ బ్యాటర్లు చూపించారు. అశ్విన్ (1/64), జడేజా (0/50) తేలిపోయారు. లేథమ్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును తిరుగులేని స్థితికి చేర్చాడు. స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవడానికి ప్రధాన ఆయుధమైన స్వీప్‌ను లేథమ్‌తో పాటు ఇతర బ్యాటర్లు గొప్పగా వాడారు. సుందర్ మాత్రమే ప్రభావం చూపించగలిగాడు. వేగం, టర్న్‌తో అతను ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. కాన్వే (17)ను అతను త్వరగానే పెవిలియన్ చేర్చినప్పటికీ విల్‌యంగ్ (23)తో కలిసి లేథమ్ పరుగుల వేటలో సాగిపోయాడు. యంగ్‌ను అశ్విన్.. రచిన్ (9), మిచెల్ (18)ను సుందర్ వెనక్కిపంపడంతో భారత్ పోటీలోకి వచ్చేలా కనిపించింది. కానీ లేథమ్ ఆ అవకాశం ఇవ్వలేదు. శతకం దిశగా సాగుతున్న లేథమ్ చివర్లో ఔటైనా.. అప్పటికే చేయాల్సిన నష్టం చేసేశాడు. చేతిలో 5 వికెట్లున్న ఆ జట్టు ఆధిక్యం 300 దాటింది. స్వదేశంలో టెస్టుల్లో భారత్ అత్యధిక ఛేదన 387 (2008లో చెన్నైలో ఇంగ్లాండ్‌పై).


శాంట్నర్ 7/53

"ఫుల్‌టాస్‌కు కోహ్లి ఔటవడం షాక్ కలిగించింది. సాధారణంగా అలాంటి బంతులను అతను వదిలిపెట్టడు. బంతిని నెమ్మదిగా వేశా. పేస్‌లో మార్పు కీలకంగా మారింది. సుదీర్ఘ కాలంగా ప్రత్యర్థి జట్లను భారత్ చిత్తుచేస్తోంది. ఇప్పుడు మా బ్యాటర్లు స్వీప్ షాట్లతో ఆ జట్టు స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు"
– శాంట్నర్

నిలబడలేక: పిచ్ స్పిన్‌కు సహకరిస్తోంది. ఒక బంతి నేరుగా వస్తే.. మరో బంతి తిరుగుతోంది. అస్థిర బౌన్స్ కూడా ఉంది. స్వదేశంలో ఇలాంటి పరిస్థితులు భారత్‌కు కొత్తేం కాదు. అయినా తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా అనూహ్యంగా కుప్పకూలింది. పరిస్థితులపై కనీస అవగాహన లేనట్లు.. ప్రాథమిక అంశాలను మర్చిపోయినట్లు బంతి గమనాన్ని గమనించక అడ్డంగా షాట్లు ఆడి బ్యాటర్లు వికెట్లు పారేసుకున్నారు. తొలిసారి స్పిన్‌ను ఆడుతున్నట్లు బ్యాట్లెత్తేశారు. ఈ మ్యాచ్ ముందు వరకూ 47 ఇన్నింగ్స్‌ల్లో ఒక్కసారి కూడా 3 వికెట్లు కంటే ఎక్కువ పడగొట్టని శాంట్నర్.. ఇప్పుడు ఒకే ప్రదేశంలో పడ్డ బంతి భిన్నంగా ప్రవర్తిస్తుండటంతో స్టంప్స్ లక్ష్యంగా బౌలింగ్ చేసి ఆరుగురు బ్యాటర్లను ఎల్బీ లేదా బౌల్డ్‌గా వెనక్కిపంపాడు. ఉదయం జైస్వాల్ (30; ఓవర్‌నైట్ స్కోరు 6), గిల్ (30; ఓవర్‌నైట్ స్కోరు 10) కలిసి 10 ఓవర్ల పాటు ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. జట్టు స్కోరును 50కి చేర్చారు. ఆ దశలో గిల్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న శాంట్నర్ కథ మలుపు తిప్పాడు. ఆ తర్వాత వికెట్లు టపటపా పడ్డాయి. శాంట్నర్ తర్వాతి ఓవర్లోనే కోహ్లి (1) ఔటైన తీరు గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. దాదాపు ఫుల్‌టాస్ బంతిని అంచనా వేయలేక అడ్డంగా ఆడి బౌల్డయ్యాడు. క్రీజులో ఇద్దరు ఎడమ చేతి వాటం బ్యాటర్లయిన జైస్వాల్, పంత్ (18) ఉండటంతో ఫిలిప్స్‌కు బంతి అందించిన లేథమ్ వ్యూహం పనిచేసింది. ఫిలిప్స్ స్వల్ప వ్యవధిలో ఈ ఇద్దరినీ పెవిలియన్ చేర్చాడు. బంతి బౌన్స్‌ను కనిపెట్టలేక పంత్ కూడా అడ్డంగా ఆడి బౌల్డయ్యాడు. గత ఇన్నింగ్స్‌లో 150 పరుగులతో అదరగొట్టిన సర్ఫరాజ్ (11) అనవసర షాట్‌కు ప్రయత్నించి లడ్డూ లాంటి క్యాచ్‌నిచ్చాడు. జడేజా, సుందర్ (18 నాటౌట్) కొన్ని షాట్లు ఆడటంతో స్కోరు 150 దాటింది. జడేజా ఔటయ్యాక ఆలౌట్‌కు ఎక్కువ సమయం పట్టలేదు.

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 259;

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 30; రోహిత్ (బి) సౌథీ 0; శుభ్‌మన్ ఎల్బీ (బి) శాంట్నర్ 30; కోహ్లి (బి) శాంట్నర్ 1; పంత్ (బి) ఫిలిప్స్ 18; సర్ఫరాజ్ (సి) ఒరోర్క్ (బి) శాంట్నర్ 11; జడేజా ఎల్బీ (బి) శాంట్నర్ 38; అశ్విన్ ఎల్బీ (బి) శాంట్నర్ 4; సుందర్ నాటౌట్ 18; ఆకాశ్‌దీప్ (బి) శాంట్నర్ 6; బుమ్రా ఎల్బీ (బి) శాంట్నర్ 0; **మొత్తం:** (45.3 ఓవర్లలో ఆలౌట్) **156; వికెట్ల పతనం:** 1-1, 2-50, 3-56, 4-70, 5-83, 6-95, 7-103, 8-136, 9-142; **బౌలింగ్:** సౌథీ 6-1-18-1; విలియమ్ ఒరోర్క్ 3-2-5-0; అజాజ్ పటేల్ 11-1-54-0; శాంట్నర్ 19.3-1-53-7; ఫిలిప్స్ 6-0-26-2

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లేథమ్ ఎల్బీ (బి) సుందర్ 86; కాన్వే ఎల్బీ (బి) సుందర్ 17; విల్‌యంగ్ ఎల్బీ (బి) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; డరిల్ మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లండెల్ బ్యాటింగ్ 30; ఫిలిప్స్ బ్యాటింగ్ 9; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం:** (53 ఓవర్లలో 5 వికెట్లకు) **198; వికెట్ల పతనం:** 1-36, 2-78, 3-89, 4-123, 5-183

బౌలింగ్: అశ్విన్ 17-1-64-1; సుందర్ 19-0-56-4; జడేజా 11-1-50-0; బుమ్రా 6-1-25-0

ఎవరినీ ఉపేక్షించొద్దు

ఫోర్త్ అంపైర్

46 ఆలౌట్.. 156 ఆలౌట్. వరుసగా రెండుసార్లు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆడిన భారత్.. తాజాగా న్యూజిలాండ్‌తో సిరీస్‌లో చేసిన స్కోర్లు ఇవి. వరుసగా రెండు టెస్టుల్లో నిలకడగా తక్కువ స్కోర్లకే పరిమితమవడం ఒక ఎత్తైతే.. స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ పేలవ ప్రదర్శన మరో ఎత్తు. న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల్లో మొదటి ఇన్నింగ్స్‌ల్లో కోహ్లి వరుసగా 0, 1తో నిరాశపరచగా.. కెప్టెన్ రోహిత్ వరుసగా 2, 0 నమోదు చేశాడు. భారత క్రికెట్ అభిమానులెవరూ కోరుకోని గణాంకాలివి.

కివీస్‌తో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్ల విన్యాసాలు క్రికెట్ పండితుల్ని సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. మరీ ముఖ్యంగా కోహ్లి ఔటైన విధానం. 536 అంతర్జాతీయ మ్యాచ్‌లు.. 27 వేలకుపైగా పరుగులు.. 80 సెంచరీలు సాధించిన కోహ్లి ఫుల్ టాస్ బంతికి ఔటవుతాడని ఎవరూ ఊహించి ఉండరు. ఆరుగురు ఫీల్డర్లతో ఆఫ్ సైడ్‌కు కివీస్ కెప్టెన్ టామ్ లేథమ్ గోడ కట్టేయగా.. శాంట్నర్ సంధించిన ఫుల్ టాస్ బంతిని ఆన్ సైడ్‌కు ఆడేందుకు ప్రయత్నించిన కోహ్లి కెరీర్‌లోనే అత్యంత దారుణంగా క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ప్రపంచ క్రికెట్‌ను శాసించిన కోహ్లి ఔటైన విధానం బాధించని అభిమాని ఉండడు. అంతకంటే ముందే రోహిత్.. సౌథీ బంతిని అర్థం చేసుకోలేక బౌల్డయ్యాడు. పోనీ, పిచ్‌పై భయంకరమైన స్వింగ్, స్పిన్ ఉందా? అంటే అదీ లేదు. భారత ఇన్నింగ్స్ తర్వాత.. ఇదే వికెట్‌పై, శాంట్నర్ కంటే ఎంతో మెరుగైన స్పిన్నర్లు అశ్విన్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ త్రయాన్ని సమర్థంగా ఎదుర్కొన్న లేథమ్ సెంచరీ దాకా వచ్చాడు. మరి మన స్టార్లకు ఏమైంది? అంతర్జాతీయ అనుభవం లేదా? పరిస్థితులపై అవగాహన కరవైందా? అసలు ఆలోచనే లోపించిందా? గత నాలుగు టెస్టుల్లో కోహ్లి స్కోర్లు 6, 17, 47, 29, 0, 70, 1 కాగా.. రోహిత్ వరుసగా 6, 5, 23, 8, 2, 52, 0 పరుగులు చేశాడు. టెస్టుల్లో రోజురోజుకూ స్పిన్ బౌలింగ్ కోహ్లికి క్లిష్టంగా మారిపోతుంది. గత మూడేళ్లలో ఉపఖండంలో 26 ఇన్నింగ్స్‌ల్లో 21 సార్లు కోహ్లి స్పిన్నర్ల బౌలింగ్‌లోనే ఔటవడం ఇందుకు తిరుగులేని నిదర్శనం. టెస్టుల్లో కోహ్లి బ్యాటు నుంచి సెంచరీ రాక ఏడాది దాటిపోయింది. 2021 జనవరి నుంచి 30 టెస్టులాడిన కోహ్లి 34.69 సగటుతో 1700 పరుగులు చేశాడు. ఇక రోహిత్ కూడా మూడేళ్లుగా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నాడు. గత 31 టెస్టుల్లో అతను 40.23 సగటుతో 2092 పరుగులు చేశాడు. కోహ్లి, రోహిత్ లాంటి ఆటగాళ్లు ఈ స్థాయి ప్రదర్శన చేయడం ఊహించనిదే. ఇన్నేళ్లుగా జట్టు విజయాలు సాధించింది కాబట్టి వీళ్ల పేలవ ప్రదర్శన మరుగున పడింది. కానీ పుంజుకోవడం మాని ఆట పరంగా వీరు నానాటికీ తీసికట్టుగా మారుతున్నారు.



పుణెలో కోహ్లితో పాటు రిషబ్ పంత్, సర్ఫరాజ్ ఖాన్ ఔటైన విధానం ఆందోళన కలిగించేదే. ఫిలిప్స్ లాంటి స్పిన్నర్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ కావడం పంత్ స్థాయికి ఏమాత్రం తగదు. సర్ఫరాజ్ కూడా చాలా సాధారణ ఆటగాడిలా ఔటయ్యాడు. ఎలాంటి పిచ్‌లైనా ఓపికగా బ్యాటింగ్ చేయడం టెస్టు క్రికెట్లో మొట్టమొదటి సూత్రం. పిచ్‌ను చదవడం.. పరిస్థితులను అర్థం చేసుకోవడం.. ఆ తర్వాత పరుగుల వేగాన్ని పెంచడం ఎప్పట్నుంచో చూస్తున్నాం. సచిన్ తెందుల్కర్, రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి దిగ్గజాలు చూపిన దారి కూడా అదే. వాళ్ల దగ్గర ఎన్ని టన్నులకొద్దీ పరుగులున్నా.. ప్రతి మ్యాచ్‌ను కొత్తగా, ప్రతి ఇన్నింగ్స్‌ను తాజాగా, ప్రతి పిచ్‌ను పరీక్షగా భావించి పాఠాలు నేర్చుకునేవాళ్లు. పరుగుల వరద పారించేవారు. అయితే ఇప్పుడు పిచ్ ఎలా ఉన్నా.. బౌలింగ్ ఏదైనా.. వచ్చామా.. బ్యాట్ ఊపామా అన్నట్లుంది బ్యాటర్ల తీరు. ఫలితమే తొలి టెస్టులో 46కు ఢమాల్. రెండో టెస్టులో 156 ఆలౌట్. వేదిక ఏదైనా.. ప్రత్యర్థి ఎవరైనా.. బుర్ర పెట్టి ఆడకపోతే ఇలాంటి అనుభవాలే ఎదురవుతాయి. మూలాలు మరిచిపోతే టెస్టుల్లో మనుగడ కష్టం. భారత్‌లో దేశవాళీ క్రికెట్ నిర్మాణమో లేదా ఐపీఎల్ పుణ్యమో గాని ప్రతిభావంతులకు కొదువలేదు. యువ ప్రతిభావంతులు దేశవాళీ క్రికెట్లో టన్నులకొద్దీ పరుగులు సాధిస్తున్నారు. అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్, రికీభుయ్, జగదీశన్, ఇంద్రజిత్ లాంటి ఆటగాళ్లు నిలకడగా సత్తాచాటుతున్నారు. గత 17 టెస్టుల్లో 32.50 సగటుతో 975 పరుగులే చేసిన కేఎల్ రాహుల్ నిలకడగా విఫలమవుతున్నాడని అతణ్ని తాజాగా తుదిజట్టు నుంచి తప్పించారు. మరి కోహ్లి, రోహిత్‌ల పరిస్థితి ఏంటి? ఆటగాడు ఎవరైనా తుది జట్టులో ఉండటానికి ఆటే ప్రామాణికం కావాలి. వరుసగా విఫలమైతే ఎవరినీ ఉపేక్షించకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందనే చెప్పొచ్చు. అనుకూల పరిస్థితుల్లోనూ స్టార్ ఆటగాళ్లు పేలవ ప్రదర్శన చేస్తుంటే.. ఇక రాబోయే ఆస్ట్రేలియా పర్యటనలో ఎలా రాణిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కెప్టెన్‌తో సహా ఆటగాళ్లంతా తమ ఆలోచన విధానం, ఆడే తీరు మార్చుకోకపోతే అయిదు టెస్టుల బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో బొక్కబోర్లా పడటం ఖాయం!

> కేఎల్ రాహుల్ నిలకడగా విఫలమవుతున్నాడని అతణ్ని తాజాగా తుదిజట్టు నుంచి తప్పించారు. మరి కోహ్లి, రోహిత్‌ల పరిస్థితి ఏంటి? ఆటగాడు ఎవరైనా తుది జట్టులో ఉండటానికి ఆటే ప్రామాణికం కావాలి. వరుసగా విఫలమైతే ఎవరినీ ఉపేక్షించొద్దు.

387 స్వదేశంలో టెస్టులో భారత్ ఛేదించిన అత్యధిక లక్ష్యం. 2008లో చెన్నైలో ఇంగ్లాండ్‌పై ఈ విజయాన్ని అందుకుంది. అప్పుడు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 316, భారత్ 241 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 311/9 వద్ద డిక్లేర్ చేసింది. ఇప్పుడు న్యూజిలాండ్ ఆధిక్యం 301 పరుగులు. మూడో రోజు ఆ జట్టును వీలైనంత త్వరగా ఆలౌట్ చేయడమే భారత తక్షణ కర్తవ్యం.

7/53 తొలి ఇన్నింగ్స్‌లో శాంట్నర్ గణాంకాలు. తన కెరీర్‌లో ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. అయిదు వికెట్ల ఘనత సాధించడం ఇదే తొలిసారి.

1 ఓ టెస్టు మ్యాచ్ తొలి రెండు ఇన్నింగ్స్‌ల్లో స్పిన్నర్లు ఏడు వికెట్ల చొప్పున పడగొట్టడం ఇదే తొలిసారి. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో సుందర్ ఏడు వికెట్లు సాధించిన సంగతి తెలిసిందే.

1 స్వదేశంలో తొలి ఇన్నింగ్స్‌లో 100కు పైగా ఆధిక్యాన్ని సమర్పించుకుని భారత్ గెలిచిన టెస్టులు. 2001 ఈడెన్ గార్డెన్స్ టెస్టులో ఆస్ట్రేలియాపై గెలిచింది.

1 ఓ క్యాలెండర్ ఏడాదిలో టెస్టుల్లో 1000 పరుగులు చేసిన పిన్న వయస్సు భారత బ్యాటర్‌గా జైస్వాల్ నిలిచాడు. 22 ఏళ్ల అతను దిలీప్ వెంగ్‌సర్కార్ (1979లో 23 ఏళ్లు) రికార్డును తిరగరాశాడు.


నితీశ్ కుమార్

ఆస్ట్రేలియా పర్యటనకు నితీశ్ కుమార్

షమికి దక్కని చోటు

దిల్లీ: బోర్డర్- గావస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లే భారత టెస్టు జట్టులో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డికి చోటు దక్కింది. ఈ అయిదు టెస్టుల సిరీస్ కోసం శుక్రవారం 18 మంది ఆటగాళ్లతో బీసీసీఐ జట్టు ప్రకటించింది. శస్త్రచికిత్స నుంచి కోలుకుంటున్న షమిని జట్టుకు ఎంపిక చేయలేదు. అలాగే గజ్జల్లో గాయంతో కుల్‌దీప్ కూడా దూరమయ్యాడు. న్యూజిలాండ్‌తో సిరీస్ కోసం ఎంపిక చేసిన అక్షర్‌ను తప్పించి.. అతని స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ను ఆసీస్ పర్యటనకు తీసుకున్నారు. మరోవైపు దక్షిణాఫ్రికాతో నాలుగు టీ20ల సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో వైశాక్ విజయ్‌కుమార్, రమణ్‌దీప్ సింగ్‌కు స్థానం లభించింది. ఇటీవల బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన నితీశ్ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. పేస్ ఆల్‌రౌండర్ కోసం భారత జట్టు చూస్తున్న నేపథ్యంలో ఇప్పుడు టెస్టుల నుంచి కూడా తొలిసారి అతనికి పిలుపు వచ్చింది.

ఆస్ట్రేలియా సిరీస్‌కు భారత జట్టు: రోహిత్, బుమ్రా, జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, శుభ్‌మన్, కోహ్లి, కేఎల్ రాహుల్, పంత్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, అశ్విన్, జడేజా, సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్; రిజర్వ్ ఆటగాళ్లు: ముకేశ్ కుమార్ నవ్‌దీప్ సైని, ఖలీల్ అహ్మద్.

దక్షిణాఫ్రికా సిరీస్‌కు భారత జట్టు: సూర్యకుమార్, అభిషేక్ శర్మ, శాంసన్, రింకు, తిలక్, జితేశ్, హార్దిక్, అక్షర్ పటేల్, రమణ్‌దీప్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, వైశాక్ విజయ్‌కుమార్, అవేశ్ ఖాన్, యశ్ దయాల్.

భారత్‌కు భంగపాటు

- సెమీస్‌లో అఫ్గాన్ చేతిలో ఓటమి
- వర్ధమాన జట్ల ఆసియాకప్


రమణ్‌దీప్ (64)

అల్ అమెరత్: వర్ధమాన జట్ల ఆసియాకప్‌లో భారత్-ఎకు భంగపాటు. లీగ్ దశలో హ్యాట్రిక్ విజయాలతో నాకౌట్‌కు దూసుకొచ్చిన తిలక్ వర్మ బృందం సెమీస్ మెట్టుపై తడబడింది. శుక్రవారం అఫ్గానిస్థాన్-ఎ 20 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు సాధించింది. ఓపెనర్ సెదిఖుల్లా అటల్ (83; 52 బంతుల్లో 7×4, 4×6) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ జుబైద్ అక్బరీ (64; 41 బంతుల్లో 5×4, 4×6)తో కలిసి అతడు తొలి వికెట్‌కు 137 పరుగులు జత చేసి ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేశాడు. వీళ్లిద్దరితో పాటు కరీమ్ జనత్ (41; 20 బంతుల్లో 4×4, 2×6) దూకుడుగా ఆడి స్కోరు 200 దాటించాడు. భారత బౌలర్లలో రసిఖ్ సలామ్ (3/25) ఒక్కడే రాణించాడు. ఛేదనలో టీమ్ఇండియా 186/7కే పరిమితమైంది. 48/3తో ఆరంభంలోనే కష్టాల్లో పడిన భారత్.. తర్వాత కోలుకోలేకపోయింది. ఒకవైపు రమణ్‌దీప్ సింగ్ (64; 34 బంతుల్లో 8×4, 2×6) పోరాటం భారత్‌ను గట్టెక్కించలేకపోయింది. అతడితో పాటు ఆయుష్ బదోని (31), నిశాంత్ సింధు (23), నేహల్ వధేరా (20) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. తిలక్‌వర్మ (16), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (19), అభిషేక్‌శర్మ (7) నిరాశపరిచారు.

షకీల్ శతకం

- పాక్‌కు ఆధిక్యం
- ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు


షకీల్ 134

రావల్పిండి: ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో పాకిస్థాన్ పట్టు బిగించింది. సాద్ షకీల్ (134; 223 బంతుల్లో 5×4) సెంచరీ సాధించడంతో కీలకమైన 77 పరుగుల ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 73/3తో శుక్రవారం, రెండోరోజు ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్ 344 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో ఆ జట్టు 99/4తో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో రిజ్వాన్ (25)తో కలిసి షకీల్ ఇన్నింగ్స్ నిలబెట్టాడు. ఆ తర్వాత నొమన్ అలీ (45), సాజిద్ ఖాన్ (48 నాటౌట్) తోడుగా స్కోరు 300 దాటించాడు. ఈ క్రమంలోనే సెంచరీ అందుకున్న షకీల్.. తొమ్మిదో వికెట్ రూపంలో నిష్క్రమించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో రెహాన్ అహ్మద్ (4/66), షోయబ్ బషీర్ (3/129) రాణించారు. బదులుగా రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ ఆట చివరికి 24/3తో కష్టాల్లో పడింది. క్రాలీ (2), డకెట్ (12), పోప్ (1) వెనుదిరిగారు. రూట్ (5), బ్రూక్ (3) క్రీజులో ఉన్నారు. నొమన్ అలీ (2/9), సాజిద్ ఖాన్ (1/14) ప్రత్యర్థిని ఆరంభంలోనే దెబ్బ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 267 పరుగులకు ఆలౌటైంది.

వార్నర్‌పై కెప్టెన్సీ నిషేధం ఎత్తివేత


డేవిడ్ వార్నర్

సిడ్నీ: క్రికెట్ ఆస్ట్రేలియా డేవిడ్ వార్నర్‌పై జీవితకాల కెప్టెన్సీ నిషేధాన్ని ఎత్తేసింది. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వార్నర్‌కు ప్రస్తుతం బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్ జట్టుకు సారథ్యం వహించేందుకు అవకాశం లభించింది. ఈ నెల ఆరంభంలో త్రిసభ్య ప్యానల్ ముందు వార్నర్ హాజరయ్యాడు. విచారణ అనంతరం నిషేధం ఎత్తి వేయడానికి వార్నర్ అర్హుడని ప్యానల్ తేల్చింది. 2018లో బాల్ టాంపరింగ్ కేసులో అప్పటి వైస్ కెప్టెన్ వార్నర్‌పై ఏడాది పాటు వేటు పడింది. అదే సమయంలో సారథ్య బాధ్యతలు చేపట్టకుండా సీఏ అతడిపై నిషేధం విధించింది. 2022లో కెప్టెన్సీ నిషేధంపై వార్నర్ అప్పీల్ చేసుకున్నా ప్యానల్ కొట్టేసింది.

జనవరి 13 నుంచి ఖోఖో ప్రపంచకప్

దిల్లీ: భారత్ వేదికగా జనవరి 13న ఖోఖో ప్రపంచకప్ ప్రారంభం కానుంది. దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరిగే ఈ మెగా ఈవెంట్లో 24 దేశాలు పోటీపడుతున్నాయి. భారత్, బంగ్లాదేశ్, భూటాన్, మలేసియా, ఇరాన్, నేపాల్, ఇండోనేషియా, పాకిస్థాన్, దక్షిణ కొరియా, శ్రీలంక (ఆసియా), ఇంగ్లాండ్, జర్మనీ, నెదర్లాండ్స్, పోలెండ్ (ఐరోపా), కెనడా, అమెరికా (ఉత్తర అమెరికా), ఘనా, కెన్యా, దక్షిణాఫ్రికా, ఉగాండా (ఆఫ్రికా), బ్రెజిల్, పెరూ (దక్షిణ అమెరికా), ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ (ఓసియానియా) ఈ టోర్నీ బరిలో ఉన్నాయి. పురుషులు, మహిళల విభాగంలో పోటీలు జరగనున్నాయి. "ఖోఖో స్థానిక క్రీడ స్థాయి నుంచి ఖండాంతరాలకు చేరిందనడానికి ఈ ప్రపంచకప్పే ఉదాహరణ. ఈ క్రీడ వ్యాప్తిలో భారత్‌దే ప్రధానపాత్ర'' అని భారత ఖోఖో సమాఖ్య అధ్యక్షుడు సుధాంశు మిత్తల్ చెప్పాడు.

న్యూజిలాండ్‌తో భారత్ డ్రా

సుల్తాన్ జొహోర్ కప్

జొహోర్ బహ్రూ (మలేసియా): సుల్తాన్ జొహోర్ కప్ హాకీ టోర్నమెంట్లో న్యూజిలాండ్‌తో పోరును భారత్ 3-3 గోల్స్‌తో డ్రా చేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆట ఆరంభం నుంచి భారత్ జోరు కొనసాగించింది. 6వ నిమిషంలో గుర్‌జ్యోత్ సింగ్ చేసిన గోల్‌తో ఖాతా తెరిచింది. అయితే జాంటీ ఎల్మెస్ (17వ) బంతిని గోల్‌పోస్టులోకి పంపడంతో న్యూజిలాండ్ స్కోరు సమం చేసింది. అదే నిమిషంలో రోహిత్ సఫలం కావడంతో భారత్ మరోసారి పైచేయి సాధించింది. అయితే కివీస్ జోరు పెంచింది. జాంటీ 32, 45 నిమిషాల్లో గోల్స్ సాధించి హ్యాట్రిక్ కొట్టడంతో కివీస్ 3-2తో నిలిచింది. దాదాపు ఆఖరి వరకు ఆ జట్టు ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడంతో భారత్‌కు పరాజయం తప్పదనిపించింది. కానీ చివరి నిమిషంలో తాలెమ్ (60వ) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో స్కోర్లు సమమై భారత్ ఓటమి తప్పించుకుంది.

పుణెరి పంజా


ఈనాడు, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ పుణెరి పల్టాన్ తిరిగి పుంజుకుంది. గత మ్యాచ్‌లో ఓటమి పాలైన ఈ జట్టు మళ్లీ విజయాల బాట పట్టింది. శుక్రవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పుణెరి 36-22 తేడాతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. పంకజ్ (6), కెప్టెన్ అస్లాం (5), మోహిత్ (6), గౌరవ్ (4), అమన్ (4) సమష్టిగా రాణించి జట్టును గెలిపించారు. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో పట్నా పైరెట్స్ 42-40తో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది.

ప్రొ కబడ్డీలో ఈనాడు
యు ముంబా × బెంగాల్ వారియర్స్ (రాత్రి 8 నుంచి)
తెలుగు టైటాన్స్ × దబంగ్ దిల్లీ (రాత్రి 9 నుంచి)


పుణెరి, బెంగళూరు మ్యాచ్‌లో

చనిపోతే ఒక్క క్షణం.. ఆశయం కోసం పనిచేస్తే శాశ్వతం

- రాజమహేంద్రవరం జైల్లో అదే అనుకున్నా
- కారాగారంలో నా చుట్టూ సందేహాస్పద ఘటనలు
- ధైర్యంగా ఎదుర్కోవటంతో నా జోలికి ఎవరూ రాలేకపోయారు
- 'అన్‌స్టాపబుల్' షోలో చంద్రబాబు



'చనిపోతే ఒకే ఒక్క క్షణం.. ఆశయం కోసం పనిచేస్తే అదే శాశ్వతం. చావు గురించి ఆలోచిస్తే ఏమీ చేయలేం. చెప్పినా సరే ముందుకెళ్లి ఎదుర్కొందామని అనుకున్నా'.. రాజమహేంద్రవరం జైల్లో ఉన్నప్పుడు తన మనసులో మెదిలిన భావాలివే అని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కారాగారంలో నిరంతరం అనేక సందేహాస్పద ఘటనలు జరిగాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవటంతో తన జోలికి ఎవరూ రాలేకపోయారని వెల్లడించారు. సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'ఆహా' ఓటీటీలో ప్రసారమయ్యే 'అన్‌స్టాపబుల్' షోలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ ఎపిసోడ్ శుక్రవారం రాత్రి ప్రసారమైంది. ఈ సందర్భంగా తన అరెస్టు, జైల్లో గడిపిన రోజులు, పవన్ కల్యాణ్‌తో పొత్తు తదితర అంశాలపై చంద్రబాబు ఆసక్తికర సమాధానాలిచ్చారు.

లక్ష్మణ రేఖ దాటను..

నా అరెస్టు పూనులను ఇప్పటికీ జీర్ణించుకోలేపోతున్నా. నేనెప్పుడూ తప్పు చేయలేదు. తప్పుకుండా ప్రజలు మద్దతిస్తారనే విశ్వాసంతో ఉన్నా. ఆ నమ్మకమే మళ్లీ నన్ను గెలిపించింది. నన్ను ప్రజల ముందు ఇలా నిలబెట్టింది. అరెస్టు చేస్తారని, ప్రాణం పోతుందోనని భయపడితే అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చలేం. నా జీవితంలో ఎన్నడూ రాజకీయ కక్షతో వ్యవహరించలేదు. ఏపీలో తొలిసారిగా కక్షపూరిత రాజకీయాలు వచ్చాయి. వ్యక్తిగత ద్వేషాలకు తెరలేపారు. అయినా సరే.. లక్ష్మణ రేఖ దాటను. తప్పుచేసిన వారిని వదిలిపెట్టను.

అరెస్టు వేయకున్నా పొత్తు ఉండేదేమో!

'పవన్‌కల్యాణ్ జైల్లో నన్ను కలిసి 'మీరు ధైర్యంగా ఉన్నారా' అని అడిగారు. నా జీవితంలో ఎప్పుడూ అధైర్యంగా ఉండనని, దేనికీ భయపడనని చెప్పాను. రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులు చూస్తున్నానని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వకుండా ప్రయత్నిస్తానని నాతో ఆయన అన్నారు. 'అలాంటప్పుడు అందరం కలిసి పోటీ చేద్దామని.. దానిపై ఆలోచించాలని నేను ప్రతిపాదించా. పవన్ కల్యాణ్ వెంటనే దానికి అంగీకరించారు' అని చంద్రబాబు చెప్పారు. 'మిమ్మల్ని అరెస్టు చేయకపోయి ఉంటే మీ మధ్య ఈ పొత్తు ఏర్పడేదా' అని బాలకృష్ణ ప్రశ్నించగా.. 'అరెస్టు చేయకపోయినా పొత్తు ఉండేదేమో' అని చంద్రబాబు సమాధానమిచ్చారు.

యువగళం.. లోకేశ్ జీవితంలో టర్నింగ్ పాయింట్

లోకేశ్ రాజకీయ జీవితంలో యువగళం పాదయాత్ర టర్నింగ్ పాయింట్. పాదయాత్ర చేయాలన్నది లోకేశ్ నిర్ణయమే. అయితే విద్వేషాలతో నిండిపోయిన ప్రభుత్వం ఉన్నప్పుడు పాదయాత్ర అంత సజావుగా జరగదేమోనని అనుమానించాను. లోకేశ్ మాత్రం పాదయాత్ర చేసి తీరాలని పట్టుబట్టాడు. తానేంటో నిరూపించుకున్నాడు.

అమరావతి, హైదరాబాద్ దేశంలో అగ్రశ్రేణి నగరాలుగా ఉండాలి

అమరావతి కల ఎప్పటికి సాకారమవుతుందన్న ప్రశ్నకు.. 'అమరావతిని ప్రపంచంలోని ఐదు అద్భుత నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. సైబరాబాద్ నిర్మాణంలో చేయలేనివి అమరావతిలో చేస్తున్నాం. హైదరాబాద్, అమరావతి దేశంలోనే నం.1, 2లుగా ఉండాలన్నది నా ఆకాంక్ష' అని తెలిపారు.

పప్పు బ్రహ్మాండంగా వేస్తా.. ఆమ్లెట్ వేస్తా

షోలో భాగంగా బాలయ్య మీకు వంట వచ్చా అని చంద్రబాబును అడగ్గా 'పప్పు బ్రహ్మాండంగా చేస్తాను, ఆమ్లెట్ ఈజీగా వేస్తాను. అవి తప్ప ఇంకేమీ రావని' చంద్రబాబు తెలిపారు.

- ఈనాడు, అమరావతి

మనవడు దేవాంశ్ ప్రశ్నలకు తాత జవాబులు



మనవడు దేవాంశ్ తెరపై కనిపించి చంద్రబాబును కొన్ని ప్రశ్నలడిగారు. దానికాయన ముసిముసి నవ్వులతో సమాధానం చెప్పారు. 'మీరు ఎప్పుడూ రాజకీయాల్లో మునిగి తేలుతుంటారు కదా, తీరిక సమయాల్లో ఏం చేస్తుంటారు?' అన్న ప్రశ్నకు.. 'నువ్వు టైం ఇస్తే నీతో ఆడుకుంటా. రిలాక్సవుతా. కానీ ఇప్పుడు నువ్వు టైం ఇవ్వట్లేదు కదా? నువ్వు ఎప్పుడూ లెక్కలతో బిజీ. అది జోక్ కొడితే సైన్స్ చదువుతూ రిలాక్సవుతావ్' అని ఆయన బదులిచ్చారు.

✦ 'ఎప్పుడూ ముందే ఉంటుంది. కానీ కనిపించదు. అదేంటి?' అని దేవాంశ్ పొడుపు కథ అడిగితే.. 'భవిష్యత్తు' అని చంద్రబాబు బదులిచ్చారు.

✦ 'మీరు చేసిన మోస్ట్ అల్లరి పనేంటి' అని దేవాంశ్ ప్రశ్నించగా... చంద్రబాబు బాలయ్యను ఉద్దేశించి.. 'కాలేజీ రోజుల్లో నీ చిలిపి చేష్టల గురించి తెలిసి ఈ ప్రశ్న నన్ను అడుగుతున్నట్లున్నావ్' అంటూ చమత్కరించారు. దానికి బాలయ్య స్పందిస్తూ.. 'మీరు తెలివి తక్కువవాడినని, తెలియక అడుగుతున్నాడో గానీ పొలిటీషియన్ అవుతాడేమోనని నా డౌట్' అని వ్యాఖ్యానించారు.

వైటీపీఎస్‌కు రైలు పరుగులు

- ట్రయల్‌రన్ విజయవంతం



వైటీపీఎస్ రైల్వేలైనుపై ట్రయల్‌రన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

దామరచర్ల, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలోని విష్ణుపురం నుంచి యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటు(వైటీపీఎస్)కు నిర్మించిన నూతన రైల్వేలైనుపై శుక్రవారం రైలింజన్ పరుగులు తీసింది. టీజెన్‌కో, రైల్వే అధికారుల సమక్షంలో ట్రయల్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. 8 కిలోమీటర్ల దూరం కలిగిన రెండు వరుసల లైను పనులు ఇటీవల పూర్తి కాగా.. బొగ్గు రవాణాకు మార్గం సుగమం అయింది. టీజెన్‌కో డైరెక్టర్ అజయ్, సీఈ సమ్మయ్య తదితరులు రైల్వేలైనుపై ట్రయల్‌రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. వైటీపీఎస్ వరకు ఇటీవల నిర్మించిన రైల్వేలైనును సికింద్రాబాద్-గుంటూరు, మోటుమర్రి-జగ్గయ్యపేట మార్గాలకు అనుసంధానం చేశారు. దామరచర్ల సమీపంలో ఫ్లైఓవర్ నిర్మించడంతో పాటు రెండు సబ్‌లైన్ల నిర్మాణం జరుగుతోంది. నిత్యం సుమారు 50 వేల మెట్రిక్‌టన్నుల బొగ్గు అవసరం కాగా పది ర్యాకులు రాకపోకలు జరగనుండటంతో విష్ణుపురం త్వరలో జంక్షన్‌గా మారనుంది.

కేసీ వేణుగోపాల్‌తో భట్టి భేటీ



కేంద్ర ఆర్థికశాఖ బ్యాంకింగ్ విభాగం కార్యదర్శి మద్దిరాల నాగరాజుతో మల్లు భట్టివిక్రమార్క, రామకృష్ణారావు ✦ కేసీ వేణుగోపాల్‌తో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కుటుంబసభ్యులు

ఈనాడు, దిల్లీ: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు వేర్వేరు పనుల నిమిత్తం శుక్రవారం దిల్లీ చేరుకున్నారు. ప్రస్తుతం ఝార్ఖండ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న భట్టివిక్రమార్క ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ తాజా స్థితిగతులపై నివేదిక అందించారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో చేపట్టనున్న కులగణన అంశం గురించి ఆయనకు వివరించారు. అందులో ప్రజలను అడిగే వివరాలతో కూడిన నమూనా పత్రాన్ని వేణుగోపాల్‌కు అందజేశారు. అనంతరం కేంద్ర ఆర్థికశాఖ బ్యాంకింగ్ విభాగం కార్యదర్శి మద్దిరాల నాగరాజుతో సమావేశమై రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి చర్చించారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కుటుంబసభ్యులతో కలిసి కేసీ వేణుగోపాల్‌ను కలిశారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, పీసీసీ కమిటీల నియామకంపై చర్చించారు.

రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పాలి

మలేసియా వ్యవసాయ శాఖ మంత్రితో తుమ్మల



మలేసియాలో భారత రాయబారి బీఎన్‌రెడ్డితో మంత్రి తుమ్మల సమావేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని, ఆహార శుద్ధి పరిశ్రమలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేసియా వ్యవసాయ మంత్రి మహ్మద్‌బిన్ సాబుని కోరారు. మలేసియా పర్యటనలో భాగంగా కౌలాలంపూర్‌లో శుక్రవారం మంత్రి తుమ్మల మహ్మద్‌బిన్‌తో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తెలంగాణ వ్యవసాయ రంగంలో సాధించిన వృద్ధి, పెట్టుబడులకు అనుకూలతలను వివరించారు. తమ దేశ పారిశ్రామికవేత్తల బృందాన్ని త్వరలోనే తెలంగాణకు పంపుతామని అక్కడి మంత్రి మహ్మద్‌బిన్ చెప్పారు. అనంతరం తుమ్మల ఫెల్డా ఛైర్మన్ అహ్మద్ షబేరీ చీక్‌తో సమావేశమై.. ఆయిల్‌పామ్ రంగంలో పురోగతి, తెలంగాణలో అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. తర్వాత మలేసియాలోని భారత రాయబారి బీఎన్‌రెడ్డితోనూ భేటీ అయ్యారు. తెనాషియా కంపెనీని సందర్శించి, యాంత్రీకరణకు సంబంధించి అక్కడున్న వివిధ రకాల యంత్రాలు, పనిముట్లు, వాటి పనివిధానాన్ని తెలుసుకున్నారు. టానెర్ కంపెనీకి వెళ్లి అక్కడ ఆయిల్‌పామ్‌కు ఎరువుల వినియోగ విధానం తెలుసుకున్నారు. పర్యటన ముగియడంతో శనివారం మంత్రి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

ఎన్ని కేసులు పెట్టినా భయపడం: కేటీఆర్

- పార్టీ ఫిరాయింపులపై బుకాయింపు ఎందుకని ప్రశ్న

ఈనాడు, సిరిసిల్ల, సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: 'ఒరిజినల్ బాంబులకే భయపడలేదు. ఈ తుస్సు బాంబులకు భయపడం' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. దీపావళికి ముందే రాష్ట్రంలో బాంబులు పేలుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సియోల్‌లో వ్యాఖ్యానించిన నేపథ్యంలో శుక్రవారం సిరిసిల్లలో కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. "ఆయన ఇంటిపై జరిగిన ఈడీ దాడుల్లో దొరికిన దాని గురించి గానీ, ముఖ్యమంత్రి బావమరిదికి రూ.1,137 కోట్ల కాంట్రాక్టు గురించి గానీ చెబుతారేమో? ముఖ్యమంత్రి బావమరిది, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల వ్యవహారంతోపాటు కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో రూ.4,500 కోట్ల పంపకాలు అన్నింటినీ బహిర్గతం చేస్తాం. ప్రభుత్వం మాపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేదిలేదు. జీవన్‌రెడ్డి పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయంటే శ్రీధర్‌బాబు జరగలేదని బుకాయిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ కండువాలు ఎందుకు కప్పివచ్చారు? దీనిపై స్పీకర్ ఎందుకు మాట్లాడటం లేదు? హైకోర్టు చెప్పినా సోయిలేకుండా వ్యవహరిస్తున్నారు. పార్టీలు మారిన వారిని రాళ్లతో కొట్టి చంపాలని ప్రస్తుత ముఖ్యమంత్రి గతంలో అన్నారు.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన వారినా? మారిన వారినా? ఎవరిని కొట్టాలి' అని కేటీఆర్ ప్రశ్నించారు.

మీ పిల్లలకు మీరే రోల్ మోడల్



పిల్లలు తమ జీవితంలో తొలిసారిగా ఆరాధించేది, ఆదర్శంగా తీసుకునేది తల్లిదండ్రుల్నే. కాబట్టి మీ పిల్లలకు ఉత్తమ రోల్ మోడల్‌గా నిలవాల్సిన బాధ్యత మీ మీదే ఉంది. వారికి కష్టం విలువ గురించి చెప్పడానికి ముందు మీరు కష్టపడి పనిచేయాలి. ఆరోగ్యకర అలవాట్లను మీరు పాటించినప్పుడే వారికి చెప్పాలి. అప్పుడే మీ మాటకు వారు విలువిస్తారు.

– ఆంథోనీ పొంప్లియానో, ఇన్వెస్టర్

ఆర్‌ఆర్‌ఆర్‌కు భూములు ఇవ్వం

- అవార్డు విచారణ సమావేశాలను బహిష్కరిస్తున్న భువనగిరి, చౌటుప్పల్ మండలాల రైతులు



భువనగిరి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవార్డు విచారణ సమావేశానికి రైతులు గైర్హాజరుకావడంతో ఖాళీగా కుర్చీలు

భువనగిరి, న్యూస్‌టుడే: 'మా భూములు మా తాత ముత్తాతల నుంచి వచ్చినవి. వాటిని నమ్ముకునే బతుకుతున్నాం. అవే మా జీవనాధారం. ప్రభుత్వ అవసరాల కోసం ఇచ్చేదిలేదు. భూమికి భూమైనా ఇవ్వండి లేదా మా మృతదేహాల మీదుగా రోడ్డు వేయండి' అంటూ యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రాంతీయ వలయ రహదారి(ఆర్‌ఆర్‌ఆర్) నిర్వాసిత రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. ఎలైన్‌మెంట్ మార్పు చేయాల్సిందేనని, ఓఆర్‌ఆర్‌కు 40 కి.మీ. దూరంలో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ అవార్డు ఎంక్వైరీ సమావేశాలను బహిష్కరిస్తున్నారు. భువనగిరి, చౌటుప్పల్ మండలాల్లో ప్రారంభమైన అవార్డు విచారణ సమావేశాలకు హాజరు కాకుండా నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల 30 వరకు సమావేశాలు

ఆర్‌ఆర్‌ఆర్‌లో మొదటి విడతగా ఉత్తర భాగంలో సంగారెడ్డి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వరకు 156 కి.మీ. మేర రోడ్డు వేసేందుకు ప్రభుత్వం భూసేకరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 60 కి.మీ. మేర తుర్కపల్లి మండలం నుంచి చౌటుప్పల్ వరకు యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ మీదుగా రోడ్డు వేస్తున్నారు. తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో సాఫీగా భూసేకరణ పూర్తయ్యింది. నష్టపరిహారం అంచనాకు సంబంధించిన అవార్డు విచారణ కూడా పూర్తి చేసి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు పంపించారు. నిర్వాసితుల ఖాతాల్లో డబ్బులు వేయడమే తరువాయి. వలిగొండ మండలంలోని ఐదు గ్రామాల్లోనూ 70 శాతం వరకు అవార్డు విచారణ పూర్తయ్యింది. భువనగిరి మండలంలో 15 కి.మీ. మేర రోడ్డు నిర్మించేందుకు ఆరు గ్రామాల్లో అవార్డు విచారణ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 30 వరకు జరగనున్నాయి. తొలిరోజు గౌసనగర్, ఎర్రంబెల్లి గ్రామాలకు సంబంధించి భువనగిరి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశాలను రైతులు బహిష్కరించారు. తమ భూములకు సంబంధించిన పత్రాలను సమర్పించలేదు.

✦ చౌటుప్పల్ మండలంలో 28 కి.మీ. మేర రోడ్డు నిర్మాణానికి సంబంధించి రెండు రోజులుగా విచారణ సమావేశాలు జరుగుతుండగా ఇక్కడి నిర్వాసిత రైతులు కూడా హాజరుకావడం లేదు. ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 23న తాళ్ల సింగారం, 24న తంగెడుపల్లి, శుక్రవారం చౌటుప్పల్‌లో జరిగిన సమావేశాలను బహిష్కరించారు.

రాకపోతే నష్టపోతారు: పి.అమరేందర్, ఆర్డీవో, భువనగిరి

నిర్వాసిత రైతులు అవార్డు విచారణకు హాజరై తమ భూములకు సంబంధించిన వివరాలు చెప్పాలి. తమ వద్ద ఉన్న రికార్డులతో వాటిని సరిచూసి ఏ మేరకు నష్టపరిహారం వస్తుందో వారికి చెబుతాం. రైతులు సమావేశాలకు వచ్చినా.. రాకపోయినా షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ కొనసాగుతుంది. హాజరు కాకపోతే రైతులు నష్టపోవాల్సి వస్తుంది.

'ఏత్మాసూర్'కు కనుబొమ్మలూ సమర్పిస్తారు



తలనీలాలు, కనుబొమ్మలు సమర్పించేందుకు బారులు తీరిన చిన్నారులు ✦ ఓ యువకుడు కనుబొమ్మలు సమర్పిస్తుండగా.. వాటిని పట్టుకొనేందుకు కొంగు చాచిన మహిళ

సాధారణంగా దేవుడి మొక్కు తీర్చుకునేందుకు తలనీలాలు సమర్పిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు తలనీలాలతో పాటు కనుబొమ్మలూ సమర్పిస్తారు. ఆదివాసీల దేవత అయిన 'ఏత్మాసూర్'కు గిరిజన చిన్నారులు, యువకులు కనుబొమ్మలు, తలనీలాలు సమర్పించే ఆచారం ఏళ్లుగా కొనసాగుతోంది. వీటిని సమర్పించే సమయంలో వెంట్రుకలు కింద పడకుండా ఇంటి ఆడపడుచులు లేదా మేనత్తలు కొంగు చాచి అందులో జాగ్రత్తగా పట్టుకుంటారు. అంతకుముందు ఆడపడుచులు వారి ఇంటి నుంచి నువ్వులు, బెల్లం, కుడుకలు తీసుకొచ్చి పూజలు చేస్తారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం మారుతిగూడ గ్రామానికి చెందిన 100 మంది చిన్నారులు, యువకులు శుక్రవారం కనుబొమ్మలతో పాటు తలనీలాలను సమర్పించి ఏత్మాసూర్ దేవతకు మొక్కు తీర్చుకున్నారు. –న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల టీచర్లకు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు లేదు

ఈనాడు, హైదరాబాద్: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేదని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. వారికి కొత్తగా ఓటు హక్కు కల్పించినట్లు 'ఈనాడు'లో వచ్చిన వార్తపై స్పందించిన ఆయన.. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సెకండరీ స్కూల్ కంటే తక్కువ స్థాయి ఉన్న పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండదన్నారు. ఆ ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఓటు వేసేందుకు అర్హులు కాదన్నారు. మరోవైపు తమకు ఓటు హక్కు కల్పించాలని పీఎస్, యూపీఎస్‌ల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు తాజాగా కేంద్ర ఎన్నికల సంఘానికి, కేంద్ర న్యాయ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి విన్నవించారు.

పీఎస్, యూపీఎస్ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలంటూ హైకోర్టులో పిటిషన్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలు(పీఎస్), ప్రాథమికోన్నత పాఠశాల(యూపీఎస్)ల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. వారికి ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం బండకాడిపల్లికి చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ బి.కృష్ణమూర్తి పిటిషన్ వేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. పీఎస్, యూపీఎస్ ఉపాధ్యాయులకు ఓటు హక్కు లేకుండా ప్రభుత్వం ఉత్తర్వులున్నాయని, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో సమానంగా వీరిని పరిగణనలోకి తీసుకోకపోవడం వివక్షాపూరితమన్నారు. వాదనలను విన్న ధర్మాసనం.. ఓటు హక్కు కల్పనకు సంబంధించిన నిబంధనను సవాలు చేయకపోవడాన్ని ప్రశ్నించగా, సవరించి మెరుగైన అఫిడవిట్ వేస్తామంటూ న్యాయవాది గడువు తీసుకున్నారు.

బంగారంపై పెట్టుబడి పేరుతో మోసం

- రూ.33.63 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు
- భోపాల్‌లో ఇద్దరు నిందితుల అరెస్టు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: బంగారంపై పెట్టుబడి పెడితే రెట్టింపు లాభం ఇస్తామంటూ మోసం చేసిన ఇద్దర్ని కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ సైబర్‌క్రైం స్టేషన్ ఏసీపీ వి.నరసింహారెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. బంగారంపై పెట్టుబడి పెడితే రెట్టింపు సొమ్ము ఇస్తామంటూ గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన అహ్మద్‌ఖాన్ టెలిగ్రాం యాప్‌లో సందేశాలు పంపుతూ ప్రచారం చేశాడు. భోపాల్‌లో నివాసం ఉండే షేక్ అఫ్తాబ్, దివాన్ మురద్‌షాల పేరుతో రెండు బ్యాంక్ ఖాతాలు తెరిచి యాప్‌నకు అనుసంధానం చేశాడు. బాధితులు ఆ ఖాతాలకు పంపిన డబ్బులను అహ్మద్‌ఖాన్ తీసుకునేవాడు. ఆ ప్రచారాన్ని నమ్మిన కరీంనగర్ జ్యోతినగర్‌కు చెందిన పచ్చునూరి నరేందర్ వాయిదా పద్ధతిలో 2023 నవంబరు నుంచి ఈ ఏడాది జులై వరకు రూ.33.63 లక్షలు ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడి పెట్టాడు. మొదట కొంతకాలం రెట్టింపు డబ్బులు ఇచ్చిన నిందితుడు, ఆ తర్వాత ఇవ్వడం ఆపేశాడు. పెట్టుబడి సొమ్మయినా తిరిగివ్వాలంటూ బాధితుడు సందేశాలు పంపినా స్పందన లేకపోవడంతో ఇటీవల కరీంనగర్ సైబర్ క్రైం కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ సైబర్ క్రైం బృందం గుజరాత్‌కు వెళ్లి అక్కడి పోలీసుల సహకారంతో ఈ నెల 23న షేక్ అఫ్తాబ్, దివాన్ మురద్‌షాలను అదుపులోకి తీసుకొని అహ్మదాబాద్ కోర్టులో హాజరుపరిచి, ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొచ్చింది. శుక్రవారం నిందితులను జైలుకు పంపించామని, ప్రధాన నిందితుడు అహ్మద్‌ఖాన్ కోసం ఆరా తీయగా అతను అస్సాం జైలులో ఉన్నట్లు గుర్తించామని ఏసీపీ వివరించారు.

సీడీవో సీఈ డిజైన్లతోనే నిర్మాణాలు

- కాళేశ్వరం కమిషన్‌కు చెప్పిన మాజీ ఈఎన్సీ నల్లా
- 2019 నుంచే బ్యారేజీల్లో సమస్యలున్నాయని వెల్లడి
- ఫీల్డ్ ఇంజినీర్ల సమాచారంతోనే డిజైన్లు: సీడీవో మాజీ సీఈ చంద్రశేఖర్

ఈనాడు, హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలు, వాటికి సంబంధించిన డిజైన్లపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ శుక్రవారం కీలక విచారణ చేపట్టింది. మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, నాటి సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈ.. ప్రస్తుత కాడా సీఈ కేఎస్ఎస్ చంద్రశేఖర్‌లను వేర్వేరుగా ప్రశ్నించింది. సీడీవో సీఈ ఇచ్చిన డిజైన్స్ ప్రకారమే నిర్మాణాలు జరిగాయని మాజీ ఈఎన్సీ చెప్పగా.. క్షేత్రస్థాయి సిబ్బంది ఇచ్చిన సమాచారం ఆధారంగానే డిజైన్లు రూపొందించామని సీఈ పేర్కొన్నారు. వెంకటేశ్వర్లును విచారించడం ఇది మూడో సారి. ఆధారాలు లేకుండా సమాధానాలు ఇస్తున్నారని, ఎవరో చేసిన తప్పులను భుజాలపై వేసుకోవద్దంటూ ఆయనపై ఒక దశలో కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.. సోమవారం మళ్లీ హాజరు కావాలని సూచించింది. చంద్రశేఖర్ విచారణకు హాజరు కావడం ఇది రెండోసారి.

2019 నుంచే బ్యారేజీల్లో సమస్యలు: మాజీ ఈఎన్సీ

బ్యారేజీల డిజైన్స్- డ్రాయింగ్స్ జాప్యంతో నిర్మాణాలు ఆలస్యమయ్యాయా అన్న ప్రశ్నకు.. రాఫ్ట్ తదితరాల వల్ల ఆలస్యం జరిగిందని మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు సమాధానం తెలిపారు. మూడు బ్యారేజీల్లో 2023లో ఎనర్జీ డిసెపేషన్స్ (నీటి విడుదల)కు సంబంధించి అధ్యయనం చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని కమిషన్ ప్రశ్నించగా.. రాఫ్ట్ నిర్మాణ సమయంలో మొదట 2017లో చేశామని, తరువాత 2023లోనూ జరిగిందని తెలిపారు. 2019 నుంచి 2022 మధ్య వరదలతో బ్యారేజీల్లో పలు సమస్యలొచ్చాయని, అందుకే అధ్యయనం జరిగిందని అన్నారు. 2020 ఫిబ్రవరిలో ఈఎన్సీ జనరల్, మే నెలలో ముఖ్య కార్యదర్శి.. డ్యామేజీల విషయమై సమావేశాలు నిర్వహించారని, సీడీవో సీఈ, టీజీఈఆర్‌ఎల్‌ను మోడల్ స్టడీ చేయాలని ఆదేశించారని తెలిపారు. బ్యారేజీల వాస్తవ అంచనాలు, తుది అంచనాలు, కారణాలపై ప్రశ్నించగా.. 2016లో వాస్తవ అంచనాలు.. మేడిగడ్డకు రూ.2591 కోట్లు, అన్నారం రూ.1785 కోట్లు, సుందిళ్ల రూ.1437 కోట్లుగా ఉన్నాయని, సవరించిన తరువాత బ్యారేజీల తుది అంచనాలు వరుసగా రూ.4613 కోట్లు, రూ.2700 కోట్లు, రూ.2200 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. సీడీవో సీఈ, వ్యాప్కోస్ ఇచ్చిన వాస్తవ డిజైన్లు, డ్రాయింగ్స్ స్ట్రక్చర్స్‌లో మార్పులు, అదనపు నిర్మాణాలు, ఫ్లడ్ బ్యాంకులు, డైవర్షన్ ఛానెళ్ల నిర్మాణం, పన్నులు కలిపి అంచనాలు మారాయని వివరించారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టులో ఎన్ని నిధులు వృథా అయ్యాయని ప్రశ్నించగా.. రూ.14 వేల కోట్లు ఖర్చు చేయగా.. వాటిలో రూ.750 కోట్ల విలువైన పనులు వృథాగా మారాయని మాజీ ఈఎన్సీ తెలిపారు. నిర్మాణ సంస్థలు ఏనాడైనా పనుల గడువు పెంపు కోరాయా అన్న ప్రశ్నకు అవును అని జవాబిచ్చారు. డిజైన్స్- డ్రాయింగ్స్‌లో జాప్యం వల్ల పనులు ఆలస్యమవుతున్నాయని నిర్మాణ సంస్థలు మీ దృష్టికి తీసుకొచ్చాయా అన్న ప్రశ్నకు.. అవునని చెప్పారు.



బోర్ రంధ్రాల పరీక్షల ఆధారంగానే డిజైన్లు: సీఈ

మేడిగడ్డలో సీకెంట్ పైల్స్ నిర్మాణానికి డిజైన్లు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందన్న కమిషన్ ప్రశ్నకు.. సీడీవో పూర్వ సీఈ చంద్రశేఖర్ వివరణ ఇస్తూ.. 'క్షేత్రస్థాయి సిబ్బంది జియో, సాంకేతిక పరీక్షలు చేశారు. 20 నుంచి 25 మీటర్లకు బోర్ రంధ్రాలు వేసి నమూనాలు పంపారు. ఇసుకతో కూడిన మన్ను, గ్రావెల్‌తో పాటు రాతి నమూనాలు గుర్తించాం. కట్ ఆఫ్ డెప్త్‌ను లెక్కించి శాండ్ స్టోన్స్ ఉన్నందున షీట్‌పైల్స్ కష్టమని సిబ్బంది నివేదించారు. రెండో నమూనా ఆర్‌సీసీ డయాఫ్రం వాల్. అయితే, ఎల్ అండ్ టీ, క్షేత్రస్థాయి సిబ్బంది సీకెంట్ పైల్స్‌ను సూచించారు. సీడీవో పరిశీలన చేసి డయాఫ్రం వాల్, సీకెంట్ పైల్స్‌ను సూచించింది' అని జవాబిచ్చారు. దేశంలో సీకెంట్ పైల్స్ వినియోగం లేదు కదా అన్న ప్రశ్నకు.. ఆ సమాచారం తనకు తెలియదని సీఈ పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి సముద్ర తీర ప్రాంతాల్లో వినియోగిస్తుంటారని, భూగర్భ నిర్మాణాల్లో వినియోగించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. మేడిగడ్డలో కనిష్ఠ నీటి నిల్వ ఎంతనేది డీపీఆర్‌లో సూచించారా అన్న ప్రశ్నకు లేదన్నారు. బ్యారేజీ మట్టం, గరిష్ఠ వరదను మాత్రమే పేర్కొన్నారని తెలిపారు. డైవర్షన్ ఛానెల్ అంటే ఏంటో తెలుసా? ఎన్ని రకాలు ఉంటాయి అన్న ప్రశ్నకు.. రెండు రకాలుంటాయని, ఒకటి గేట్ల ద్వారా మళ్లింపు, మరొకటి వరద మళ్లింపు అంటూ.. ఇక్కడ మాత్రం కుడివైపు నుంచి ఒక డైవర్షన్ ఛానెల్ ప్రతిపాదించినట్లు తెలుసని సీఈ పేర్కొన్నారు. మేడిగడ్డ విషయంలో డిజైన్స్, డ్రాయింగ్స్‌ను మరోసారి పరిశీలించాలని సీడీవోను కాళేశ్వరం సీఈ ఎందుకు కోరారన్న ప్రశ్నకు రాఫ్ట్ నిర్మాణం కోసమని తెలిపారు. కాఫర్ డ్యాం డిజైన్స్, డ్రాయింగ్స్ మీరే ఇచ్చారా అన్న ప్రశ్నకు.. క్షేత్రస్థాయి ఇంజినీర్లు చేసుకున్నారని తెలిపారు. మేడిగడ్డ డిజైన్స్- డ్రాయింగ్స్ నీటిపారుదల శాఖ చేసిందా.. క్షేత్రస్థాయి నుంచి పరిశోధన వివరాలు తీసుకున్నారా అన్న ప్రశ్నకు.. సీడీవో డిజైన్స్ చేసిందని, క్షేత్ర స్థాయి నుంచి బోర్ రంధ్రాల డేటా తీసుకున్నామని, ఐఎస్ కోడ్స్ ప్రకారం డిజైన్ చేసినట్లు తెలిపారు. బ్యారేజీల వద్ద షూటింగ్ వెలాసిటీకి సంబంధించి సరిగా డిజైన్ చేయలేదన్న ఆరోపణ సీడీవోపై ఉందన్న ప్రశ్నకు.. అది వాస్తవం కాదన్నారు. డిజైన్స్, డ్రాయింగ్స్ లోపంతోనే మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో పియర్స్ కుంగాయన్న దానిపై మీ సమాధానం ఏంటని కమిషన్ ప్రశ్నించగా.. డిజైన్స్ లోపం లేదని సీఈ సమాధానం ఇచ్చారు.

మీ సాయం
వందల జీవితాల్లో వెలుగు

సుమారు రెండు నెలల కిందట వచ్చిన వరదకు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది బాధితులుగా మిగిలారు. ఇక విజయవాడలో అయితే వరద సృష్టించిన విలయం అంతాఇంతా కాదు. ఇంట్లోని వస్తువులతో సహా అన్నం పెట్టే ఆదరువునూ కోల్పోయిన వారెందరో. ఆ కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్న వారిని గట్టెక్కించేందుకు ఎంతో మంది ముందుకొస్తున్నారు. తలా కొంత సాయం చేసి వారికి బాసటగా నిలుస్తున్నారు.



మిక్కిలినేని అజయ్‌కుమార్
మిక్కిలినేని కమలాదేవి
హైదరాబాద్
విరాళం: రూ.1,01,116

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
బ్రహ్మాండం చంద్రావతి, హైదరాబాద్	20,116
కేతినేని సింగారావు, హైదరాబాద్	20,000
బొల్లేపల్లి కృష్ణప్రసాద్, హైదరాబాద్	20,000
శ్రీ రాఘవేంద్ర పాఠశాల, గాజువాక, విశాఖపట్నం	15,000
కొల్లోజు భాస్కరాచారి, హైదరాబాద్	15,000
ఎం.శ్రీనివాసరావు, హైదరాబాద్	11,000
బొప్పన మధుసూదనరావు, హైదరాబాద్	5,731
అన్నే సుబ్రహ్మణ్య బాబీ, లక్ష్మి, ముదునూరు, కృష్ణా జిల్లా	5,555
వరగాని ఉమాలక్ష్మి, హైదరాబాద్	5,116
ఆకెళ్ల నాగ వెంకట అన్నపూర్ణ, కాకినాడ	5,016
మరువాడ మాణిక్య ప్రభు, విశాఖపట్నం	5,001
కుప్పల పద్మావతి, చిత్తూరు	5,000
మరుటూరి సాంబశివరావు, హైదరాబాద్	5,000
డా.వంగరి రవి, హైదరాబాద్	5,000
తోపల్లి ఆనంద్, హైదరాబాద్	5,000
అప్పరాజు నాగజ్యోతి (కీ.శే. అప్పరాజు రమాదేవి జ్ఞాపకార్థం), బెంగళూరు	5,000
మోచర్ల అనంత పద్మనాభరావు, హైదరాబాద్	5,000
నర్రా జానకిరావు, బెంగళూరు	5,000
చింతపల్లి మాణిక్యాలరావు, హైదరాబాద్	5,000

ఆపదలో భరోసా.. అభాగ్యులకు సాంత్వన!

RAMOJI GROUP

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

దాతలకు ముఖ్య సూచన: విరాళం సొమ్మును బ్యాంకు ఖాతాకు బదిలీ చేయగానే.. 1. దాత పేరు, 2. పూర్తి చిరునామా, 3. పాన్‌కార్డు నంబరు వివరాలను 9154990933 వాట్సప్ నంబరుకు లేదా elieffund@eenadu.in ఈ-మెయిల్ ఐడీకి పంపగలరు.

శ్రీవారి కాలిబాట భక్తులు.. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి: తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం కాలినడక మార్గంలో తిరుమల వచ్చే భక్తుల్లో గుండె సంబంధిత కేసులు అధికంగా నమోదవుతున్నాయని, ఈ నేపథ్యంలో భక్తులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని తితిదే శుక్రవారం ఓ ప్రకటనలో సూచించింది. '60 ఏళ్లు దాటిన వృద్ధులు, మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, ఉబ్బసం, మూర్ఛ, కీళ్ల, గుండె సంబంధిత వ్యాధులున్న భక్తులు తిరుమలకు కాలినడకన రావడం శ్రేయస్కరం కాదు. తిరుమల సముద్రమట్టానికి చాలా ఎత్తులో ఉన్న కారణంగా ఆక్సిజన్ స్థాయి తక్కువగా ఉంటుంది. కాలినడకన రావడం చాలా ఒత్తిడితో కూడుకున్న విషయం కాబట్టి భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న భక్తులు వారి రోజువారి మందులు వెంట తెచ్చుకోవాలి. కాలినడకన వచ్చే భక్తులకు ఏవైనా సమస్యలు ఎదురైతే అలిపిరి కాలిబాట మార్గంలోని 1,500 మెట్టు, గాలిగోపురం, భాష్యకార్ల సన్నిధి వద్ద వైద్యసహాయం పొందవచ్చు. కిడ్నీల సమస్య బాధితులు అత్యవసర పరిస్థితుల్లో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ సౌకర్యం పొందవచ్చు' అని తితిదే పేర్కొంది.

కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుంది: విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్, న్యూస్‌టుడే: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుందని, అందుకే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చావుకైనా సిద్ధం, రెండు మూడేళ్లైనా జైలులో ఉంటానని పెద్ద పోరాట యోధుడిలా ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో చేసిన అక్రమాలు బయటకు వస్తాయన్న వణుకు ఆయనలో కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల పట్ల కేటీఆర్ నీచమైన భాష ప్రయోగిస్తున్నారని, పదేళ్లలో 60 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను చేర్చుకున్న కేసీఆర్‌కు ఏం పేరు పెట్టాలో కేటీఆరే చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో అన్ని పార్టీల నుంచి పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులను పార్టీలో చేర్చుకున్నారని, ఇప్పుడు వారిని పక్కన పెట్టుకొని ఏ ముఖంతో నీతులు చెబుతున్నారని నిలదీశారు. మీరెన్ని కబుర్లు చెప్పినా తెలంగాణ ప్రజలు పట్టించుకోరని, నాలుగు రోజులు ఆగితే రేవంత్‌రెడ్డి అంటే ఏంటో చూస్తారని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.



పనిని ఆటలా ఆస్వాదించాలంటే..

నాకు ఈ పని చేయాల్సిన అవసరం పడిందని మీరనుకుంటే అది భారంగా అనిపిస్తుంది. అందులో ఏమాత్రం ఆసక్తి చూపించరు. కాబట్టి దాన్నుంచి మీరేమీ నేర్చుకోలేరు. అదే ఈ పని చేసే అవకాశం నాకొచ్చిందని మీరు భావిస్తే అది మీకు ఎప్పటికీ విసుగ్గా అనిపించదు. దాన్నొక పనిలా కాకుండా ఆటలాగా ఆస్వాదిస్తారు. అదే సమయంలో విలువైన పాఠాలూ నేర్చుకుంటారు.

– నావల్ రవికాంత్, వ్యాపారవేత్త

ఇళ్లలో నెలకు 300 యూనిట్లు దాటితేనే స్థిరఛార్జీ పెంపు

- రూ.10 నుంచి రూ.50 పెంచాలని ప్రతిపాదించాం
- పొరుగు రాష్ట్రాల కంటే తక్కువేనంటూ ఈఆర్‌సీకి డిస్కంల నివేదిక

ఈనాడు, హైదరాబాద్: కొన్ని కేటగిరీల వినియోగదారులకు కరెంటు ఛార్జీలను పెంచినా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో తక్కువగానే ఉంటాయని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు స్పష్టంచేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2024-25) నెలకు 300 యూనిట్లకు పైగా కరెంటు వాడితే స్థిరఛార్జీని ప్రస్తుతమున్న రూ.10 నుంచి రూ.50కి పెంచాలని ఇటీవల ప్రతిపాదించాయి. హైటెన్షన్(హెచ్‌టీ) వినియోగదారులకు 11కేవీ కనెక్షన్ స్థాయిలోనే... 33కేవీ, 132 కేవీ కనెక్షన్లకు విద్యుత్ ఛార్జీలను పెంచి వసూలు చేస్తామన్నాయి. ఈ ప్రతిపాదనలపై ఈఆర్‌సీ బహిరంగ విచారణ కూడా పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ఇవే కేటగిరీల్లో ఛార్జీలు ఎలా ఉన్నాయనే వివరాలతో డిస్కంలు ఈఆర్‌సీకి తాజాగా నివేదికను అందజేశాయి. నెలకు 300 యూనిట్లకు పైగా వాడుతున్న ఇళ్ల కరెంటు కనెక్షన్‌కు స్థిరఛార్జీని మహారాష్ట్రలో నెలకు రూ.148, కర్ణాటకలో రూ.120, ఉత్తర్‌ప్రదేశ్‌లో రూ.53, గుజరాత్‌లో రూ.45 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపాయి. ఉమ్మడి రాష్ట్రమున్నప్పుడు నిర్ణయించిన రూ.10 స్థిరఛార్జీనే ఏపీ, తెలంగాణలో ఇప్పటికీ కొనసాగుతోంది. లోటెన్షన్(ఎల్‌టీ) వాణిజ్య కేటగిరీ కనెక్షన్లకు తెలంగాణలో నెలకు ప్రస్తుతం రూ.70 వసూలు చేస్తుండగా రూ.150కి పెంచాలని డిస్కంలు ప్రతిపాదించాయి. ఇదే కేటగిరీకి మహారాష్ట్రలో రూ.626, యూపీలో రూ.355, కర్ణాటకలో రూ.255, తమిళనాడులో రూ.107 వసూలు చేస్తున్నట్లు డిస్కంలు నివేదించాయి. నెలకు 300 యూనిట్లు దాటే ఇళ్లకు స్థిరఛార్జీని పెంచితే అదనంగా రూ.328 కోట్ల ఆదాయం వస్తుందని తెలంగాణ డిస్కంలు ఈఆర్‌సీకి వివరించాయి.

పరిశ్రమల కనెక్షన్లకు ఇలా...

పరిశ్రమలకు కరెంటు ఛార్జీల పెంపు ప్రతిపాదనలను ఆమోదిస్తే వాటిపై ఆర్థికభారం పడుతుందని ప్రతిపక్షాలు ఈఆర్‌సీకి ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో హెచ్‌టీ కేటగిరీకి వసూలు చేస్తున్న ఛార్జీల వివరాలను డిస్కంలు ఈఆర్‌సీకి నివేదించాయి.

◆ ప్రస్తుతం మన రాష్ట్రంలో హెచ్‌టీ పరిశ్రమల కనెక్షన్లకు 11కేవీకి యూనిట్‌కు రూ.7.65, 33కేవీకి రూ.7.15, 132కేవీకి రూ.6.65 చొప్పున డిస్కంలు వసూలు చేస్తున్నాయి. ఇకపై ఈ మూడు కేటగిరీలకు 11కేవీ స్థాయిలోనే యూనిట్‌కు రూ.7.65 చొప్పున వసూలు చేస్తామని ప్రతిపాదించాయి. కానీ, ప్రస్తుతం మహారాష్ట్రలో యూనిట్‌కు రూ.8.36, కర్ణాటకలో రూ.7.40, గుజరాత్‌లో రూ.6.90, తమిళనాడులో రూ.6.90 చొప్పున హెచ్‌టీ పరిశ్రమల నుంచి వసూలు చేస్తున్నారు.

◆ హెచ్‌టీ వాణిజ్య కనెక్షన్‌కు తెలంగాణలో యూనిట్‌కు రూ.8.80 వసూలు చేస్తుండగా మహారాష్ట్రలో రూ.13.21, కర్ణాటకలో రూ.9.25, తమిళనాడులో రూ.8.70గా ఉన్నట్లు డిస్కంలు వివరించాయి. ఇదే కేటగిరీలో స్థిరఛార్జీని రూ.475 నుంచి రూ.500కి పెంచాలని ప్రతిపాదించామని, కానీ ఇప్పటికే మహారాష్ట్రలో రూ.664, తమిళనాడులో రూ.590, గుజరాత్‌లో రూ.570 వసూలు చేస్తున్నట్లు డిస్కంలు స్పష్టం చేశాయి. హెచ్‌టీ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్‌సీ ఆమోదిస్తే రూ.700 కోట్ల అదనపు ఆదాయం వస్తుందని అంచనా. ఈఆర్‌సీ ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం ఈ నెల 29తో ముగియనున్న నేపథ్యంలో మరో 2, 3 రోజుల్లో ఛార్జీల పెంపుపై తుది తీర్పు ఇవ్వనుంది.



శేఖర్ ఉన్న గదిపైకి విద్యుత్తు స్తంభంతో వస్తున్న రైతులు



రైతులను నిలువరిస్తున్న పోలీసులు

ఫార్మా కంపెనీ భూసేకరణ ఉద్రిక్తం!

- తిరగబడ్డ రైతులు
- కాంగ్రెస్ నాయకుడిపై దాడి
- కొడంగల్ నియోజకవర్గంలో ఘటన

దుద్యాల, కొడంగల్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లాలో ఓ ఫార్మాసంస్థ కోసం చేపట్టే భూసేకరణ ప్రక్రియ శుక్రవారం ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్ నాయకుడిపై రైతులు దాడికి దిగడంతో ఒక దశలో పోలీసులు లాఠీఛార్జి చేశారు. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని దుద్యాల మండలంలో 1,350 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి ఫార్మాకంపెనీకి ఇవ్వాలని నిర్ణయించింది. ఇక్కడ ప్రభుత్వభూమి 156 ఎకరాలే ఉంది. మిగతాది పట్టాభూముల నుంచి సేకరించాలి. దీన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో లగచర్లలో శుక్రవారం రైతులతో అభిప్రాయసేకరణ చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమానికి హాజరు కావడానికి దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుటి శేఖర్ వస్తుండగా.. ఉదయం 9 గంటల సమయంలో రోటిబండతండాలో రైతులు అడ్డుకున్నారు. 'ఫార్మాసంస్థ ఏర్పాటుకు కారణం నీవే' అంటూ మండిపడ్డారు. ఆయన కారుపై రాళ్లు రువ్వి.. అద్దాలను ధ్వంసం చేశారు. ఆయన్ను బయటకు లాగి దాడికి దిగారు. పోలీసులు అప్రమత్తమై ఆయన్ను అక్కడినుంచి తరలించి తండా పంచాయతీ కార్యాలయ గదిలో ఉంచారు. విషయం తెలుసుకున్న హకీంపేట, లగచర్ల, పులిచెర్లకుంటతండా, పోలేపల్లిలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. కాంగ్రెస్ నాయకుడిని బయటకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫార్మాకంపెనీ ఏర్పాటుచేస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ యువరైతు శరీరంపై పెట్రోల్ పోసుకోగా.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసులపై స్థానికులు తిరగబడ్డారు. రోడ్డుపక్కన పడిఉన్న ఓ విద్యుత్తు స్తంభాన్ని తీసుకొచ్చి కాంగ్రెస్ నాయకుడిని ఉంచిన గది తలుపులను బద్దలుగొట్టడానికి యత్నించారు. దీంతో పోలీసులు లాఠీఛార్జి చేసి ప్రజలను చెదరగొట్టగా.. తోపులాటలో ఇద్దరు గిరిజన మహిళలు స్పృహతప్పి పడిపోయారు. ఓ మహిళా కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఘటనా స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. రైతులను సముదాయించేందుకు ప్రయత్నించగా.. అంగీకరించకుండా ఫార్మాసంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అదనపు బలగాలను రప్పించారు. అనంతరం పోలీసులు పంచాయతీ కార్యాలయ గదిలో ఉన్న కాంగ్రెస్ నాయకుడిని సురక్షితంగా బయటకు పంపించడంతో మధ్యాహ్నం 2 గంటల సమయంలో గొడవ సద్దుమణిగింది. అభిప్రాయసేకరణ కార్యక్రమం జరగలేదు.

ఆన్‌లైన్ వేదికగా మత్తు మందుల విక్రయం

- ముఠా గుట్టురట్టు చేసిన టీజీన్యాబ్
- దేశవ్యాప్తంగా 88 లక్షల ఇంజక్షన్లు అమ్మినట్లు నిర్ధారణ
- ఏడుగురి అరెస్టు



విజయ్‌కుమార్ గుప్తా



నయీముద్దీన్

ఈనాడు, హైదరాబాద్ పంజాగుట్ట, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ వేదికగా అక్రమంగా మత్తు, స్టెరాయిడ్ సూది మందులు(ఇంజక్షన్లు) విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును టీజీన్యాబ్, పంజాగుట్ట పోలీసులు ఛేదించారు. అనుమతి లేకుండా సరఫరా, విక్రయం, వినియోగిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. టీజీన్యాబ్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఆ ప్రకారం.. బిహార్ రాజధాని పట్నాకు చెందిన విజయ్‌కుమార్ గుప్తా(25) ఇంటర్ పూర్తిచేశాడు. అనంతరం కిరాణా వ్యాపారం చేస్తున్నాడు. ఈ ఏడాది జనవరిలో స్థానికంగా మెడికల్ షాపు ప్రారంభించాడు. అక్కడకు వచ్చే వినియోగదారుల్లో కొందరు ఎక్కువ మొత్తంలో మత్తు, స్టెరాయిడ్ ఇంజక్షన్లు కావాలని అడగడాన్ని గమనించాడు. సరస్వతి ఎంటర్‌ప్రైజెస్ పేరిట ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్‌గా మారాడు. హాజీపూర్‌లోని 'మా సుశీల దేవి' హాస్పిటల్‌లో పనిచేస్తున్న కెమిస్ట్‌తో పరిచయం పెంచుకున్నాడు. ఇద్దరూ కలిసి వెబ్‌సైట్ ప్రారంభించి..దాని ద్వారానే మత్తు, స్టెరాయిడ్ ఇంజక్షన్లు విక్రయించడం ఆరంభించారు. ఆసుపత్రిలోని ఓ గదిని అడ్డాగా మార్చుకొని కొరియర్ ద్వారా వాటిని దేశవ్యాప్తంగా సరఫరా చేస్తూ, వచ్చిన సొమ్ములో వాటాలు పంచుకునేవారు.

సొంతంగా తయారీ యూనిట్ నెలకొల్పి మరీ..

పెద్ద సంఖ్యలో ఆర్డర్లు వస్తుండటం, లాభసాటిగా ఉండటంతో ఇద్దరూ కలిసి తయారీ యూనిట్‌నే నెలకొల్పారు. ఈ-కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా విక్రయాలు చేపట్టారు. పంజాగుట్టకు చెందిన వ్యాపారి నయీముద్దీన్ కొంతకాలంగా పట్నాలోని విజయ్‌కుమార్‌గుప్తాను సంప్రదించి కొరియర్ ద్వారా ఇంజక్షన్లు తెప్పించుకుంటున్నాడు. అక్రమ లావాదేవీలపై నిఘా ఉంచిన టీజీన్యాబ్ ఈ ముఠా గుట్టు రట్టు చేసింది. 'రూ.26 ఖరీదు చేసే సూదిమందును నిందితులు రూ.150 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకున్నట్టు, ఇప్పటివరకూ ఈ ముఠా దేశవ్యాప్తంగా 88 లక్షలు సరఫరా చేసినట్టు దర్యాప్తులో గుర్తించాం. హైదరాబాద్‌లోనే 1,000 వరకూ విక్రయించినట్టు నిందితులు అంగీకరించారు. ప్రధాన నిందితుడు విజయ్‌కుమార్ గుప్తా, నగరానికి చెందిన విక్రయదారుడు నయీముద్దీన్, కొనుగోలుదారులు మహేశ్, లవణ్‌కుమార్ యాదవ్, సురేష్ సాయికిరణ్, మనీష్ యాదవ్, నిఖిల్ యాదవ్‌లను అరెస్ట్ చేశాం' అని సందీప్‌శాండిల్య తెలిపారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం నిందితులను పంజాగుట్ట పోలీసులకు అప్పగించామన్నారు. విద్యార్థులు, యువత జీవితాలను నాశనం చేస్తున్న మత్తుపదార్థాలను కట్టడి చేయటంలో పౌరులు భాగస్వాములు కావాలని, మాదకద్రవ్యాల సమాచారాన్ని 87126 71111కు అందజేయాలని కోరారు.

టీజీఎస్పీ పునర్విభజన ఉత్తర్వుల నిలిపివేత

- కానిస్టేబుళ్ల కుటుంబాల ఆందోళన నేపథ్యంలో నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్, నారాయణగూడ, ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రత్యేక పోలీస్ (టీజీఎస్పీ) కానిస్టేబుళ్ల కుటుంబాల నిరసనల నేపథ్యంలో ఆ విభాగం ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బెటాలియన్లలోని కానిస్టేబుళ్ల విధులకు సంబంధించి పునర్విభజన కోసం ఇటీవలే జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేంతవరకు ఆ ఉత్తర్వులను పక్కన పెట్టాలని బెటాయలియన్ల అధికారులను ఆదేశించారు. టీజీఎస్పీలో అనుచిత నిర్ణయాలతో తమ భర్తలు ఇబ్బందులకు గురవుతున్నారంటూ కొద్దిరోజులుగా కానిస్టేబుళ్ల భార్యలు పలు ప్రాంతాల్లో ఆందోళన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆందోళన రాజధానికి చేరింది. శుక్రవారం పలువురు మహిళలు హైదరాబాద్‌లో సచివాలయంతోపాటు కొండాపూర్, యూసుఫ్‌గూడ బెటాలియన్ వద్ద ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర సచివాలయం ముట్టడికి యత్నించారు. కర్ణాటక తరహాలో 'ఏక్ పోలీస్'.. ఏక్ స్టేట్ విధానం అమలు చేయాలని వారు కోరారు. తమ భర్తలు నెలల తరబడి ఇంటికి దూరంగా ఉంటున్నారన్నారు. తరచూ బదిలీలతో పిల్లల చదువులకూ ఇబ్బంది కలుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే టీజీఎస్పీ డైరెక్టర్ జనరల్ సంజయ్‌కుమార్ జైన్ తాజా ఉత్తర్వులను జారీచేశారు. బెటాలియన్ల వారీగా సమీక్షలు నిర్వహించాలని కమాండెంట్లను ఆదేశించారు. ఈ నిర్ణయంపై పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



సచివాలయం వద్ద బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలను అరెస్టు చేస్తున్న పోలీసులు

జగన్ పెట్టిన హింసలకు ఆస్తులపై ఆసక్తే పోయింది

- వైఎస్ అభిమానులకు షర్మిల బహిరంగ లేఖ

ఈనాడు–అమరావతి: జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన హింసల తర్వాత ఆస్తులు కావాలన్న కోర్కె కూడా లేదని, నా బిడ్డలకు ఆస్తులు చెందాలన్నది దివంగత రాజశేఖర్‌రెడ్డి అభిమతం కనుకే తమ తల్లి విజయమ్మ, తాను తపన పడుతున్నామని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు, జగన్ సోదరి షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. స్వార్జితం అని జగన్ చెబుతున్నవన్నీ కుటుంబ ఆస్తులేనని తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి బతికి ఉన్నప్పుడే పంపిణీ చేశారనేది అవాస్తవమని పేర్కొన్నారు. 'ఎన్నికల్లో ఓటమికి నేనే కారణమని బలంగా నమ్మి ఆస్తులు సెటిల్ చేసుకుందామని అంటూనే.. జగన్, భారతీరెడ్డి, అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడకూడదనే కండిషన్ పెట్టారని షర్మిల అన్నారు. జగన్ ఎవరి కొంగు చాటున ఉండి ఆస్తి, అధికారం కోసం ఇదంతా చేస్తున్నారో రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు.



ఆస్తుల పంపిణీపై వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో వివాదం.. తల్లి, చెల్లిపై జగన్ జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో కేసు వేసిన నేపథ్యంలో వైఎస్ఆర్ అభిమానులకు ఆయన సోదరి షర్మిల శుక్రవారం మూడు పేజీల బహిరంగ లేఖను రాశారు. మనవలు, మనవరాళ్లకు సమాన వాటా ఉండాలన్న రాజశేఖరరెడ్డి అభిమతానికి విరుద్ధంగా జగన్ వ్యవహరించారని ఆమె వివరించారు. వాస్తవాలేమిటో వైఎస్ఆర్ అభిమానులకు తెలియజేయాలనే ఉద్దేశంతో లేఖ రాసినట్లుగా షర్మిల పేర్కొన్నారు.

నడి వయసు నిద్రలేమితో మెదడుకు చేటు



దిల్లీ: నడివయసు ఆరంభంలో సరైన నిద్ర లేనివారి మెదళ్లు ఎక్కువగా కుంచించుకుపోతున్నట్లు అమెరికా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ అవయవం త్వరగా వార్ధక్యంలోకి జారిపోతోందడానికి ఇది సంకేతం. 40 ఏళ్ల వయసున్న 589 మందిపై పరిశోధన చేసిన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ మేరకు తేల్చారు. పరీక్షార్థుల నిద్ర తీరుతెన్నులను ప్రశ్నావళి ద్వారా పరిశోధకులు తెలుసుకున్నారు. ఐదేళ్ల తర్వాత మరోసారి ఈ వివరాలను సేకరించారు. అధ్యయనం మొదలైన 15 ఏళ్ల తర్వాత పరీక్షార్థుల మెదళ్లకు స్కానింగ్ నిర్వహించారు. తద్వారా మెదడు వయసును నిర్ధారించారు. నిద్రలేమి ఎక్కువగా ఉన్నవారి మెదడు వయసు.. ఆరోగ్యవంతుల మెదడు వయసుతో పోలిస్తే దాదాపు మూడేళ్లు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. తీవ్ర స్థాయి నిద్రలేమి ఉన్నవారికి భవిష్యత్‌లో ఆలోచన, జ్ఞాపకశక్తి మందగిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. వారికి తీవ్ర మతిమరుపు (డిమెన్షియా) ముప్పు ఎక్కువగా ఉంటుందని వివరించారు. నిద్రలేమి ఒక మోస్తరుగా ఉన్నవారి మెదడు వయసు 1.6 ఏళ్లు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిద్రకు సంబంధించిన సమస్యలకు ఆరంభంలోనే చికిత్స పొందాలని సూచించారు. నిద్రవేళలను కచ్చితంగా పాటించడం, వ్యాయామం చేయడం, నిద్రకు ముందు కెఫీన్, మద్యానికి దూరంగా ఉండటం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని పరిశోధకులు తెలిపారు.

ప్లాస్టిక్‌తో అండ కణాల నాణ్యతపై ప్రభావం



దిల్లీ: ప్లాస్టిక్‌లో కనిపించే థాలేట్ అనే పదార్థం.. అండ కణాల్లోని డీఎన్ఏకు నష్టం కలిగించే అవకాశం ఉందని అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తేల్చారు. ఇది డీఎన్ఏ పోగులను విచ్ఛిన్నం చేస్తుందని, తద్వారా క్రోమోజోముల సంఖ్యను మార్చేస్తుందని వారు తెలిపారు. ఫలితంగా అండ కణాల నాణ్యత దెబ్బతింటుందన్నారు. బెంజైల్ బుటైల్ థాలేట్ (బీబీపీ) అనే ఈ పదార్థం వల్ల ప్లాస్టిక్ ఎటుపడితే అటు వంగేలా తయారవుతుంది. ఆహార పదార్థాలకు వాడే ప్యాకేజింగ్, చిన్నారుల బొమ్మలు తదితరాల్లో ఇది ఉంటుంది. ఈ పదార్థ ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలు ఎలిక పాములను ఎంచుకున్నారు. థాలేట్‌ను జీర్ణం చేసుకునే విషయంలో ఈ జీవికి, మానవులకు మధ్య సారూప్యతలు ఉండటమే ఇందుకు కారణం. ఇటీవల మానవ వీర్యంలోనూ సూక్ష్మప్లాస్టిక్ రేణువులు కనిపించాయి. థాలేట్లు హార్మోన్లపై ప్రభావం చూపుతాయని, మానవ పునరుత్పాక వ్యవస్థకు నష్టం కలిగిస్తాయని గత పరిశోధనల్లో తేలింది. తాజాగా ఏలికపాములపైకి అధిక మోతాదులో థాలేట్లను ప్రయోగించి.. వాటి అండ కణాల్లో వచ్చే అసాధారణ మార్పులను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ రసాయనం వల్ల ఆక్సిడేటివ్ ఒత్తిడి తలెత్తి, డీఎన్ఏ పోగులు విచ్ఛిన్నమైనట్లు గుర్తించారు. దీనివల్ల కణ మరణం, అండ కణాల్లోని క్రోమోజోముల సంఖ్యలో మార్పు రావడం వంటివి తలెత్తినట్లు గుర్తించారు.

స్వల్ప ఆధిక్యంలో ట్రంప్


తాజా సర్వేల్లో వెల్లడి



వాషింగ్టన్: రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రత్యర్థి, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై పై చేయి సాధించారు. నవంబరు 5న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో హారిస్ కంటే ట్రంప్‌నకే స్వల్పంగా గెలుపు అవకాశాలు ఉన్నాయని తాజా సర్వే తేల్చింది. ద వాల్‌స్ట్రీట్ జర్నల్ జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వేలో ట్రంప్ 47 శాతం పాయింట్లు సాధించారు. హారిస్ 45 శాతం పాయింట్లతో స్వల్పంగా వెనుకంజ వేశారు. సీఎన్‌బీసీ ఆల్-అమెరికా ఎకనామిక్ సర్వేలో ట్రంప్ 48 శాతం, హారిస్ 46 శాతం పాయింట్లు పొందారు. అటు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్, హారిస్ మధ్య పోరు పోటాపోటీగా ఉండనున్నట్లు సర్వేలు అంచనా వేస్తున్నాయి.

ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో ఘర్షణలు ఆందోళనకరం

- శాంతి పునరుద్ధరణకు అన్నివిధాలా సాయం చేస్తాం
- ప్రధాని మోదీ ఉద్ఘాటన
- జర్మనీ ఛాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌తో చర్చలు



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జర్మనీ ఛాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌తో ప్రధాని మోదీ

దిల్లీ: ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో కొనసాగుతున్న ఘర్షణలు ఆందోళన కలిగిస్తున్నాయని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.ఆ ప్రాంతాల్లో శాంతి పునఃస్థాపన కోసం కృషి చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని చెప్పారు. భారత్-జర్మనీ ఏడో అంతర్‌ప్రభుత్వ సంప్రదింపుల్లో భాగంగా ఆ దేశ ఛాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌తో మోదీ దిల్లీలో శుక్రవారం భేటీ అయ్యారు. పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించారు. ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారం కనుగొనేందుకు చొరవ చూపాలంటూ మోదీని షోల్జ్ కోరారు. ఈ నేపథ్యంలో- చర్చల అనంతరం మోదీ మాట్లాడుతూ.. "ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో ఘర్షణలు అటు జర్మనీకీ, ఇటు భారత్‌కూ ఆందోళన కలిగిస్తున్నాయి. యుద్ధాలతో సమస్యలు పరిష్కారం కావని దిల్లీ ఎప్పటికప్పుడు ఉద్ఘాటిస్తూనే ఉంది. శాంతి పునరుద్ధరణ కోసం అన్నివిధాలా సాయం చేసేందుకు భారత్ సిద్ధం" అని పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలి సహా పలు బహుపాక్షిక సంస్థల్లో సంస్కరణలు తక్షణావసరమని షోల్జ్, తాను అభిప్రాయపడినట్లు మోదీ తెలిపారు. 20వ శతాబ్దంలో స్థాపించిన అంతర్జాతీయ వేదికలు ప్రస్తుత 21వ శతాబ్దపు సవాళ్లను పరిష్కరించలేవని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్షోభ పరిస్థితులను తట్టుకొని భారత్, జర్మనీ మధ్య వ్యూహాత్మక బంధం గట్టిగా నిలబడగలిగిందని మోదీ అన్నారు. భారత్‌తో మరింత పటిష్ఠ బంధం కోసం జర్మనీ ప్రకటించిన 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహాన్ని మోదీ స్వాగతించారు.

పెట్టుబడులకు సరైన సమయం

భారత్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ జర్మనీ కంపెనీలు, పెట్టుబడిదారులకు మోదీ పిలుపునిచ్చారు. దిల్లీలో శుక్రవారం 18వ 'ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్'లో ఆయన ప్రసంగించారు. "భారత వృద్ధి గాథలో విదేశీ పెట్టుబడిదారులు భాగస్వాములయ్యేందుకు ఇదే సరైన తరుణం. 'మేకిన్ ఇండియా', 'మేక్ ఫర్ వరల్డ్'లలో చేరండి. రోడ్లు, రైల్వే, విమానాశ్రయాలు, ఓడరేవుల వంటి రంగాల్లో భారత్ పెట్టుబడులు పెడుతోంది. ప్రపంచ భవిష్యత్తుకు ఇండో-పసిఫిక్ చాలా కీలకం" అని పేర్కొన్నారు.

అణ్వస్త్ర ప్రయోగ బెదిరింపులు ఆమోదయోగ్యం కాదు

ఘర్షణల సమయంలో అణ్వస్త్రాలను ప్రయోగించడంగానీ, వాటిని ప్రయోగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడటంగానీ ఆమోదయోగ్యం కాదని భారత్, జర్మనీ అభిప్రాయపడ్డాయి. ఉగ్రవాదం, తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా వాటిని నిర్ద్వంద్వంగా ఖండించాల్సిందేనని పేర్కొన్నాయి. ఉగ్రవాద సంస్థలపై అందరూ ఉమ్మడిగా ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చాయి. మోదీ, షోల్జ్ చర్చల అనంతరం ఇరు దేశాలు ఈ మేరకు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని అందులో తీర్మానించుకున్నాయి. 'నేర వ్యవహారాల్లో పరస్పర న్యాయ సహాయ ఒడంబడిక సహా 18 ఒప్పందాలు/పత్రాలపై భారత్, జర్మనీ తాజాగా సంతకాలు చేశాయి.

కెనడా వెళ్లే విద్యార్థులూ.. తస్మాత్ జాగ్రత్త

- భారత దౌత్యవేత్త సంజయ్ వర్మ హెచ్చరిక



దిల్లీ: ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లాలని కలలుగనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని భారత దౌత్యవేత్త సంజయ్ వర్మ హెచ్చరించారు. అక్కడి నాసిరకం విద్యాసంస్థల కారణంగా లక్షల రూపాయలు వెచ్చించినా ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొందన్నారు. ఫలితంగా నిరాశలో కూరుకుపోయిన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని 'పీటీఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. అక్కడికి పిల్లలను పంపించే ముందు తల్లిదండ్రులు ఆలోచించుకోవాలని సూచించారు. సంజయ్ వర్మ 2022 నుంచి కెనడాలో భారత హైకమిషనర్‌గా ఉన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య వివాదం కారణంగా ఇటీవల తిరిగి వచ్చేశారు.

"నాలుగింతలు అధికంగా రుసుములు చెల్లించి చదువుకున్నా ఉద్యోగాలు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర నిరాశతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఒకానొక దశలో వారానికి కనీసం ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను భారత్‌కు పంపించిన సందర్భాలున్నాయి. అక్కడి కళాశాలల గురించి పూర్తిగా తెలుసుకున్నాకే వాటిల్లో తమ పిల్లలను చేర్చే అంశంపై తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవాలి. వారానికి ఓసారి మాత్రమే క్లాసులు జరిగే కాలేజీలు.. అంతగా తెలియని వాటిల్లో విద్యార్థులను చేర్చొద్దు. అసలు ఈ పరిస్థితికి దళారులు కూడా కారణమే"నని సంజయ్ వర్మ తెలిపారు. 'కెనడాలో ఇంజినీరింగ్ విద్య పూర్తి చేస్తే మంచి ఉద్యోగాలు వస్తాయని భావిస్తాం. కానీ, అందుకు భిన్నంగా క్యాబ్ డ్రైవర్‌గానో.. చాయ్ సమోసా విక్రయిస్తూనో జీవించాల్సిన దుస్థితి" అని సంజయ్ వర్మ వెల్లడించారు.

కెనడాలో చదువుతున్న భారత విద్యార్థులు తీవ్రవాద భావజాలాన్ని నూరిపోసేందుకు యత్నించే ఖలిస్థానీలు, ఇతర వేర్పాటువాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సంజయ్ వర్మ తెలిపారు. వీరంతా విద్యార్థులకు డబ్బు, ఆహారం ఎరగా వేసి ప్రభావితం చేస్తారన్నారు.

నరమేధం ఆపితేనే బందీల విడుదల

- ఇజ్రాయెల్‌తో సంధిపై హమాస్

జెరూసలెం: గాజాలో నరమేధాన్ని ఇజ్రాయెల్ ఆపితేనే తాము పోరాటాన్ని విరమిస్తామని హమాస్ తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చించడానికి హమాస్ సీనియర్ అధికారి ఖలీల్ అల్-హయ్యా ఈజిప్టు రాజధాని కైరో చేరుకున్నారు. ఈజిప్టు, అమెరికా అధికారులతో ఆయన కాల్పుల విరమణ.. బందీల విడుదలపై చర్చించారు. ప్రస్తుతం హమాస్ చెరలో 101 మంది బందీలు ఉన్నారు. ఏ ఒప్పందం కుదరాలన్నా.. గాజాలో కొనసాగిస్తున్న నరమేధాన్ని ఇజ్రాయెల్ తక్షణం ఆపాలన్న షరతును హమాస్ పెట్టినట్లు ఈజిప్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

★ అటు గాజాపై, ఇటు లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడుతూనే ఉంది. శుక్రవారం రాత్రి ఖాన్ యూనిస్‌పై ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) నిర్వహించిన దాడిలో 38 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన 15 మంది ఉన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో 13 మంది చిన్నారులు కూడా ఉన్నారు.

★ హసబయ ప్రాంతంలో ఓ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ముగ్గురు పాత్రికేయులు మృతి చెందారు.

★ దక్షిణ లెబనాన్‌లో శుక్రవారం రాత్రి ఐదుగురు ఇజ్రాయెల్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. 19 మందికి గాయాలయ్యాయి. హెజ్‌బొల్లా రాకెట్ల దాడిలో వీరు మృతి చెందినట్లు ఐడీఎఫ్ తెలిపింది.



లెబనాన్‌లోని హసబయలో ధ్వంసమైన పాత్రికేయుల భవనం, కారు

సంపద ప్రదర్శనను విడనాడండి



చాలా మందికి ఉండే చెడు లక్షణమేంటంటే తాము సంపన్నులమన్న విషయాన్ని ఇతరులకు చాటిచెప్పాలని తహతహలాడటం. అందుకోసం విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతూ ఆడంబర జీవనశైలిని కొనసాగిస్తుంటారు. అతి త్వరగా పేదలుగా మారడానికి అది కారణమవుతుందని తెలుసుకోండి. అందుకే సంపాదనను పెట్టుబడుల వైపు మళ్లించండి.

– మోర్గాన్ హౌసెల్, ఫైనాన్షియల్ గ్రోత్ అడ్వైజర్

బలగాల ఉపసంహరణ ప్రారంభం

దెప్సాంగ్, డెమ్‌చోక్ నుంచి వైదొలగుతున్న భారత్-చైనా సేనలు

దిల్లీ: తూర్పు లద్దాఖ్‌లోని ఘర్షణాత్మక దెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల నుంచి భారత్-చైనా తమ సైనిక బలగాలను ఉపసంహరించే ప్రక్రియను ప్రారంభించాయి. ఈ నెల 28, 29 తేదీల్లోపు ఇది పూర్తి కావొచ్చని సైనిక వర్గాలు పేర్కొంటున్నాయి. నాలుగేళ్ల సైనిక ప్రతిష్టంభనకు ముగింపు పలుకుతూ ఇటీవల రెండు దేశాలు వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి గస్తీ, బలగాల ఉపసంహరణకు సంబంధించి ఒప్పందాన్ని కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రష్యాలోని కజన్‌లో భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఐదేళ్ల తర్వాత తొలిసారి ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ భేటీలో పరిణతి, పరస్పర గౌరవాలతో వ్యవహరిస్తూ.. శాంతియుత సుస్థిర సంబంధాలను కొనసాగించుకోవాలని ఇరుదేశాల నేతలు నిర్ణయానికి వచ్చారు. దెప్సాంగ్, డెమ్‌చోక్ నుంచి బలగాల ఉపసంహరణ పూర్తయి, అక్కడ నిర్మించిన తాత్కాలిక నిర్మాణాల కూల్చివేత తర్వాత ఇరు దేశాలు 2020, ఏప్రిల్‌కు ముందు ప్రకారం గస్తీ నిర్వహిస్తాయి.

మరో 27 విమానాలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: దేశంలో బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. శుక్రవారం 27 విమానాలకు బెదిరింపులొచ్చినట్లు సమాచారం. ఇండిగో, విస్తారా, స్పైస్‌జెట్ సంస్థలకు చెందిన 7 చొప్పున విమానాలకు, ఎయిర్ ఇండియాకు చెందిన 6 విమానాలకు బెదిరింపులు అందినట్లు అధికారులు తెలిపారు. కాగా 12 రోజుల్లో 275 పైగా విమానాలకు బెదిరింపులు అందాయి. చాలావరకు బెదిరింపులు సామాజిక మాధ్యమాల ద్వారా అందడంతో వీటి వివరాలను తమకు ఇవ్వాలని 'మెటా', 'ఎక్స్'లను కేంద్రం కోరిన సంగతి తెలిసిందే.



ప్రజావాణి వద్ద ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులు

ఇందిరమ్మ ఇళ్లకు వరుస కట్టిన జనం

సొంతింటిని ఆశిస్తున్న అనేకమంది ప్రజాభవన్ బాట పట్టారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకునేందుకే శుక్రవారం దాదాపు 500 మంది ప్రజావాణిలో వినతులు ఇచ్చారు. ప్రజావాణికి మొత్తం 1010 అర్జీలు రాగా, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌ఛార్జి డా.జి.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్ అర్జీదారుల సమస్యలు విని వినతిపత్రాలు స్వీకరించారు. మరోవైపు గురుకుల ఉపాధ్యాయ అభ్యర్థులు బ్యాక్‌లాగ్ పోస్టులను అర్హులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజావాణి కార్యాలయం ఎదుట బైఠాయించారు. – న్యూస్‌టుడే, సోమాజిగూడ

నేడు మంత్రివర్గ సమావేశం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో జరగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది. ధరణి పోర్టల్ పేరును 'భూమాత'గా మార్చడానికి కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ధరణిలో రైతుల హక్కులపై ఏర్పడే సమస్యల పరిష్కారానికి అప్పిలేట్ అథారిటీని ఏర్పాటుచేయడానికి ఈ చట్టంపై చర్చిస్తారని తెలుస్తోంది. మూసీ పునరుజ్జీవ చర్యలు, హైడ్రా, 317 జీవో, ఉద్యోగుల డీఏలు, ధాన్యం కొనుగోళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ తదితర అంశాలపై చర్చిస్తారని తెలుస్తోంది.

సోదరుడిని పోలీసులకు అప్పజెప్పిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్




మహబూబ్‌నగర్ గ్రామీణ ఠాణాలో శ్రీకాంత్‌గౌడ్

మహబూబ్‌నగర్ నేర విభాగం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రెండు పడక గదుల ఇళ్ల విక్రయం కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న తన సోదరుడు శ్రీకాంత్‌గౌడ్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం స్వయంగా పోలీసులకు అప్పగించారు. మహబూబ్‌నగర్ గ్రామీణ ఠాణా సీఐ గాంధీనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణం క్రిస్టియన్‌పల్లి శివారులోని ఆదర్శనగర్ 523 సర్వే నంబరులో ఉన్న ప్రభుత్వ భూములు, రెండు పడక గదుల ఇళ్లను తప్పుడు పత్రాలు, సంతకాలతో విక్రయించారనే అభియోగాలపై రెండు నెలల క్రితం నలుగురిపై కేసులు నమోదయ్యాయి. అమ్మకాలు జరిపిన వారికి అండగా ఉన్నారనే ఆరోపణలతో శ్రీకాంత్‌గౌడ్‌పైనా కేసు నమోదు చేశారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. శ్రీకాంత్‌గౌడ్ ఇన్నాళ్లు పరారీలో ఉన్నారు. హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం పోలీసులు అక్కడికి వెళ్లారు. ఈలోపే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్వయంగా తన వాహనంలో సోదరుడిని తీసుకొచ్చి గ్రామీణ ఠాణా పోలీసులకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకొని భారాస నాయకులు, కార్యకర్తలు భారీగా పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. శ్రీకాంత్‌గౌడ్‌ను విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రసిద్ధ గుస్సాడీ కళాకారుడు పద్మశ్రీ కనకరాజు ఇకలేరు

అనారోగ్యంతో కన్నుమూత



కనకరాజు

ఈనాడు, ఆసిఫాబాద్: గిరిజనుల సంప్రదాయ గుస్సాడీ నృత్యానికి జీవం పోసి, భావితరాలకు అందిస్తున్న పద్మశ్రీ కనకరాజు(94) కన్నుమూశారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మర్లవాయికి చెందిన కనకరాజు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కుటుంబ సభ్యులు వివిధ ఆసుపత్రుల్లో చూపిస్తున్నారు. వారం రోజుల నుంచి పరిస్థితి విషమంగా మారడంతో శుక్రవారం సాయంత్రం ఇంటి వద్దే చనిపోయారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. గుస్సాడీకి కనకరాజు చేస్తున్న సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2021 నవంబరు 9న ఆయనకు పద్మశ్రీ ప్రకటించి, అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రదానం చేసింది. గిరిజన పోరాటయోధుడు కుమురంభీం వీరమరణం పొందిన తర్వాత... గిరిజనుల స్థితిగతులను తెలుసుకోవడానికి ప్రసిద్ధ ఆంత్రోపాలజిస్టు హేమన్‌డార్ఫ్‌ను అప్పటి నిజాం ప్రభువు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పంపించారు. ఆదివాసీలతో మమేకమై వారి జీవన విధానం, ఒనగూరాల్సిన మౌలిక సౌకర్యాలపై అధ్యయనం చేశారు.

అమోయ్‌కుమార్ వాంగ్మూలం నమోదు

- మూడో రోజు విచారణలో ఆయన్ను కలెక్టరేట్‌కు తీసుకొచ్చిన ఈడీ అధికారులు
- ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నల వర్షం

ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా పూర్వ కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను వరుసగా మూడో రోజూ విచారించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు ఆయన వాంగ్మూలం నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని 42 ఎకరాల భూదాన్ భూములను ప్రైవేటు వ్యక్తులకు అక్రమంగా బదలాయించినట్లు నమోదైన కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ జరుపుతోంది. శుక్రవారం 10 గంటలకు విచారణ ప్రారంభించిన అధికారులు మధ్యలో అమోయ్‌కుమార్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు తీసుకెళ్లారు. కొంతసేపటి తర్వాత తిరిగి ఈడీ కార్యాలయానికి తీసుకొచ్చి సాయంత్రం వరకు విచారణ కొనసాగించారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు క్షేత్రస్థాయి అధికారులు 'అమోయ్‌కుమార్ మౌఖిక ఆదేశాలతోనే తాము భూబదలాయింపు చేసినట్లు' ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ప్రశ్నలు సంధించినట్టు, ఈ వ్యవహారంలో జరిగిన ఆర్థికలావాదేవీల గురించి ప్రశ్నించి ఆయన్నుంచి సమాధానాలు రాబట్టినట్లు సమాచారం. ఆయా వివరాలతో ఈడీ అధికారులు ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. శనివారం కూడా అందుబాటులో ఉండాలని ఈడీ అధికారులు ఆయనకు చెప్పినట్లు సమాచారం.

రూ.వెయ్యి కోట్ల విలువైన భూమిని మరొకరికి అప్పగించారు: తట్టిఅన్నారం గ్రామస్థులు

అమోయ్‌కుమార్‌ను విచారిస్తున్న సమయంలోనే అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారం గ్రామానికి చెందిన మధురానగర్ ప్లాట్‌ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బాధితులు శుక్రవారం ఆయనపై ఈడీకి మరో ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధి 108, 109, 110, 111 సర్వే నంబర్లలోని సుమారు రూ. వెయ్యి కోట్ల విలువైన భూమికి సంబంధించి రెవెన్యూ ఎంట్రీలను అమోయ్‌కుమార్ అక్రమంగా మార్చారంటూ ఫిర్యాదు చేశారు. దశాబ్దాల క్రితమే ఆ భూమిలో 800లకుపైగా ప్లాట్లను పలువురు కొనుగోలు చేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉందని, సదరు భూమిని ఆయన అక్రమంగా ఇతరులకు అప్పగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం వారంతా మీడియాతో మాట్లాడారు. అమోయ్‌కుమార్ నిర్వాకంతో తాము తీవ్రంగా నష్టపోయామన్నారు.







EENADU Vol: 51, Iss: 76 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు


హైదరాబాద్ 26-10-2024 శనివారం సిటీ సంపుటి 51. సంచిక 76
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16+16 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

నాలుగు గంటల్లోపే

శంషాబాద్-విశాఖపట్నం!

సూర్యాపేట మీదుగా సెమీ హైస్పీడ్ కారిడార్ • గంటకు 220 కి.మీ. వేగంతో ప్రయాణం

- ఖరారైన కొత్త రైలు మార్గం ఎలైన్‌మెంట్
- ఈ మార్గంలో మొత్తం 12 స్టేషన్లు
- విశాఖ-సూర్యాపేట-కర్నూలు మధ్య మరో కారిడార్



ఈనాడు - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల మధ్య రైలు ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించే ప్రాజెక్టు ప్రణాళిక కీలకదశకు చేరింది. శంషాబాద్-విశాఖపట్నం (దువ్వాడ) మధ్య సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్ ఖరారైంది. సూర్యాపేట, విజయవాడ మీదుగా ఈ మార్గాన్ని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా విశాఖ నుంచి విజయవాడ, సూర్యాపేటల మీదుగా కర్నూలుకు మరో కారిడార్ నిర్మించనున్నారు. ఇది విశాఖ నుంచి మొదలై.. సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా కర్నూలు చేరుతుంది. వీటి ప్రిలిమినరీ ఇంజినీరింగ్, ట్రాఫిక్ (పెట్) సర్వే తుది దశకు చేరింది. ఈ సర్వే నివేదికను నవంబరులో రైల్వేబోర్డుకు సమర్పించనున్నట్లు సమాచారం.

తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి సెమీ హైస్పీడ్ కారిడార్ ఇదే కానుంది. ఈ మార్గంలో శంషాబాద్, రాజమహేంద్రవరం విమానాశ్రయాలను అనుసంధానించేలా ప్రణాళిక రూపొందించడం మరో విశేషం. విమాన ప్రయాణికులు సెమీ హైస్పీడ్ రైళ్లలో స్వస్థలాలకు వేగంగా చేరుకునేలా రైల్వేశాఖ ప్రణాళిక రూపొందించింది. గంటకు 220 కి.మీ. వేగంతో రైళ్లు ప్రయాణించేలా సెమీ హైస్పీడ్ కారిడార్‌ను డిజైన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే.. హైదరాబాద్ (శంషాబాద్) ఎయిర్‌పోర్టు నుంచి విశాఖపట్నానికి నాలుగు గంటల్లోపే చేరుకోవచ్చు. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య రైలు ప్రయాణానికి 12 గంటల సమయం పడుతోంది. వందేభారత్ 8.30 గంటల్లో చేరుకుంటోంది.

రెట్టింపు వేగం.. తగ్గనున్న సమయం

సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి ప్రస్తుతం రెండు మార్గాల్లో రైళ్లు ప్రయాణిస్తున్నాయి. మొదటిది వరంగల్, ఖమ్మం, విజయవాడ మార్గం; రెండోది నల్గొండ, గుంటూరు, విజయవాడ

...మిగతా 3లో

699 కి.మీ.	663 కి.మీ.	618 కి.మీ.
వరంగల్, ఖమ్మం మార్గంలో విశాఖపట్నానికి దూరం	నల్గొండ, గుంటూరు మార్గంలో విశాఖపట్నానికి దూరం	ప్రతిపాదిత సెమీహైస్పీడ్ కారిడార్‌లో.. సూర్యాపేట మీదుగా దూరం

ఈనాడు స్థిరాస్తి
పేజీలు 5, 6, 7, 9 లలో చూడండి

మూసీకి పూర్వవైభవంతో మారనున్న హైదరాబాద్ రూపురేఖలు
- సియోల్ పర్యటన ముగించుకొని వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు 10లో

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కొత్త పథకం
- త్వరలో ప్రజల్లోకి 'ఇందిరా మహిళా శక్తి'
- ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

India Chooses Pigeon

1 Product Bought Every Second

4 Cr. Happy Users Added Each Year

Pigeon®

కొత్త కస్టమర్లు 4 కోట్ల మంది 'అబ్బ! ఎంత బాగున్నాయో!' అంటే చాలు మా మనసులు మురిసిపోతాయంతే





STOVEKRAFT®

Follow us on:

Scan here to watch our latest film

Hyderabad: Sakti Enterprises: 9666422277 Sales: Shaik Irfan: 9700809707 Suresh: 970037256 Abrar: 7893922984 Sai Vinay: 9885151515 Shanker: 9063072132 Varma 9666422280 Vijay 9666422282 Pragati Associates: 9700809707 Sales: Shaik Irfan: 9700809707 Sameer: 6304761195 Rizwan: 7801023420 Vijay: 6302095945 Ranga Reddy & Medhal: Omsakti Enterprises: 9704030111 Sales: Jogi Reddy 7989461732 Abhilash: 9989582589 For Corporate and Bulk Enquiries: 9949242359

Pigeon Exclusive Stores: Himayat Nagar: 040 49024830 Boduppal: 040 35176177 Shivam Rd: 040 35175775 Chanda Nagar: 040 35175814 Allwyn Colony: 040 49028369 AS Rao Nagar: 040 48914831 Beeramguda: 040 35176262 Neredmet: 040 48904787 Champapet: 040 48905159 Malkajgiri: 040 40124024 Nagole Alkapuri: 040 35181952 HB Colony Moulali: 040 35181953 Kapra: 04049954374 Vanasthalipuram: 040 35179845 Bandlaguda Nagole: 040 42217469 Toli Chowki: 0812 5744462 Sikh Village: 9515257100 KPHB Nexus Mall Rd: 040 3508 0105 New Bowenpally: 040 35270582 Shaikpet OU Colony: 040 35023048 Mallapur: 040 35510256 Kukatpally Main Road: 040 40020474 Yusufguda: 040 49950652 Manikonda Puppalguda: 9704068914 Chintal: 040 48546561 Manikonda: 040 35892429 Salivahana Nagar: 040 35176489 Balaji Nagar: 040 35160907 Chikadpally: 04049880335 Alwal: 04049507932 Moosapet: 040 35106318 Pragathi Nagar: 040 49559390 Habsiguda Street No.8: 040 31598006 Attapur: 040 43901692 Rampally X Road: 6281503967 Kompally: 9515214580 Balapur: 6303978904 Suncity: 040 49892798

For any service related queries, please contact: | 6364914202

ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దు

- మరో నిందితుడు శ్రవణ్‌రావుది కూడా..
- అక్రమ ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం


ప్రభాకర్‌రావు


శ్రవణ్‌రావు

ఈనాడు, హైదరాబాద్ : అక్రమంగా ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడిన వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు, మరో నిందితుడు అరువెల శ్రవణ్‌రావుల పాస్‌పోర్టులు రద్దయ్యాయి. ఈ కేసులో కీలకమైన వీరిరువురూ దర్యాప్తును ఎదుర్కోకుండా అమెరికాలో తలదాచుకుంటున్నారని, వీరి పాస్‌పోర్టులు రద్దు చేయాలని హైదరాబాద్ పోలీసులు గతంలోనే ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం(ఆర్పీఓ)కు నివేదిక పంపారు. ఈ నివేదిక ఆధారంగానే ఆర్పీఓ యంత్రాంగం తాజాగా వీరిద్దరి పాస్‌పోర్టులను రద్దు చేసింది.

వైద్యచికిత్స నిమిత్తం తాను అమెరికాలోని ఇల్లినోయి ప్రాంతంలో ఉన్నట్లు ప్రభాకర్‌రావు, మియామిలో ఉన్నట్లు శ్రవణ్‌రావు గతంలో న్యాయస్థానానికి సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలోనే పాస్‌పోర్టుల రద్దు విషయాన్ని ఆయా ప్రాంతాల పోలీసులకు తెలియజేసే ప్రయత్నాలను హైదరాబాద్ పోలీసులు ముమ్మరం చేశారు. ఇందుకోసం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంఈఏ)కు ఇప్పటికే నివేదిక పంపించారు. అక్కణ్నుంచి అమెరికా పోలీసులకు సమాచారం అందిన పక్షంలో వారిద్దరినీ డిపోర్ట్(బలవంతంగా వెనక్కి పంపడం) చేసే అవకాశముంది. ఇద్దరిపై ఇప్పటికే లుక్‌అవుట్ సర్క్యులర్(ఎల్ఓసీ) జారీ అయినందున వారు విమానాశ్రయంలో దిగిన వెంటనే విమానాశ్రయ అధికారులు హైదరాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వనున్నారు.

రెడ్‌కార్నర్ నోటీసు జారీ ప్రక్రియలోనూ కదలిక

ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలపై మార్చి 10న కేసు నమోదైన వెంటనే వీరిద్దరూ విదేశాలకు వెళ్లిపోయారు. దీంతో వీరిని విచారించే అవకాశం లేకుండాపోయింది. విచారణకు హాజరుకావాలంటూ మెయిల్ ద్వారా నోటీసులు పంపినా వారి నుంచి స్పందన లేదు. వీరిని విచారిస్తే తప్ప కేసు దర్యాప్తు ముందుకు కదిలే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే వీరిని హైదరాబాద్‌కు రప్పించే విషయంలో హైదరాబాద్ పోలీసులు తొలుత అభియోగపత్రం నమోదు చేశారు. అనంతరం రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయించే ప్రయత్నాలు ఆరంభించారు. తెలంగాణ సీఐడీ ద్వారా సీబీఐకి నివేదిక పంపించారు. ఆ నివేదికను ఆమోదించిన సీబీఐ ఇంటర్నేషనల్ పోలీస్(ఇంటర్‌పోల్)కు పంపింది. ఈ క్రమంలో త్వరలోనే వీరిద్దరిపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ అయ్యే అవకాశాలున్నట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి. రెడ్‌కార్నర్ నోటీస్ జారీ అయినా, పాస్‌పోర్టుల రద్దు సమాచారం అమెరికా పోలీసులకు చేరినా వారిద్దరినీ డిపోర్ట్ చేస్తారని వెల్లడించాయి.

మంత్రి పొంగులేటి వ్యాఖ్యలతో..

కొంతకాలంగా ఈ వ్యవహారం స్తబ్దుగా ఉండగా.. 'త్వరలో పొలిటికల్ బాంబులు పేలుతాయని' మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇటీవల ప్రకటించడంతో మరోసారి చర్చనీయాంశమైంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావు, అదనపు డీసీపీలు(సస్పెండెడ్) భుజంగరావు, తిరుపతన్న, డీఎస్పీ (సస్పెండెడ్) ప్రణీత్‌రావులు తమ వాంగ్మూలంలో ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే ట్యాపింగ్‌కు పాల్పడినట్టు పేర్కొన్నారు. ఎవరి ఫోన్‌ను ట్యాప్ చేయాలనే విషయాన్ని శ్రవణ్‌రావు సూచించేవారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరినీ విచారిస్తే ఎవరి ఆదేశాల మేరకు అక్రమ ఫోన్‌ట్యాపింగ్ జరిగింది, దీని వెనక రాజకీయ పెద్దల ప్రమేయం ఏమైనా ఉందా, లేదా అనే ప్రశ్నలకు సమాధానం లభించనుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

29న ఎంఈవోలకు శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల నియమితులైన 624 మండల విద్యాశాఖ అధికారులకు ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఆదివాస్ భవన్, సేవాలాల్ బంజారా భవన్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9.30 గంటలకు వారందరూ శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నర్సింహారెడ్డి డీఈవోలను ఆదేశించారు.



నాలుగు గంటల్లోపే శంషాబాద్-విశాఖపట్నం!

(మొదటి పేజీ తరువాయి)

ఈ మార్గాల్లో రైళ్ల గరిష్ఠ వేగం గంటకు 110-130 కి.మీ. మాత్రమే. ఈ రెండింటితో పోలిస్తే కొత్తగా రానున్న శంషాబాద్-విశాఖపట్నం మార్గం దగ్గరవుతుంది. వేగం దాదాపు రెట్టింపై.. ప్రయాణ సమయం సగానికంటే తగ్గిపోతుంది.

కర్నూలు మార్గం ఇలా..

విశాఖపట్నం-శంషాబాద్ సెమీ హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదిత మార్గంలో మరో కీలకాంశం కూడా ఉంది. విశాఖపట్నం నుంచి కర్నూలు వరకు అనుసంధానం మార్గాన్ని సూర్యాపేట మీదుగా ప్రతిపాదించారు. ఈ మార్గంలో మొత్తం ఎనిమిది రైల్వే స్టేషన్లను ప్రతిపాదించారు.

◆ శంషాబాద్-విశాఖపట్నం సెమీ హైస్పీడ్ కారిడార్‌ని పరిశీలిస్తే.. హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారి మార్గానికి కాస్త అటూఇటూగానే కనిపిస్తోంది. తెలంగాణలో ఇప్పటివరకు రైలు కూత వినిపించని అనేక పట్టణాలు, జిల్లాలు కొత్త కారిడార్‌తో రైల్వే నెట్‌వర్క్‌లో చేరే అవకాశం ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నార్కట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ వంటి పట్టణాలకు నేటికీ రైలు మార్గం లేదు. అదేవిధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, వనపర్తి, నాగర్‌కర్నూల్ పట్టణాలకూ రైల్వే మార్గం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా మొత్తంలో ఎక్కడా రైల్వే లైనే లేదు. ఇలాంటి ప్రాంతాల మీదుగా ఇప్పుడు ఏకంగా గంటకు 220 కి.మీ. వేగంతో రైళ్లు దూసుకెళ్లే సెమీహైస్పీడ్ కారిడార్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.



ఏ స్థాయికి చేరాలన్నది మీ చేతుల్లోనే..

మీరు జీవితంలో ఏ స్థాయికి వెళ్లాలనుకుంటున్నా, అక్కడికి మిమ్మల్ని చేర్చగలిగేది మీరే తప్ప ఇంకెవ్వరూ కాదని గుర్తుంచుకోండి. మీ జీవితానికి మీరే బాధ్యత తీసుకోండి. భవిష్యత్తుపై అనవసర భయాందోళనలు వీడి, జీవితాన్ని మెరుగుపర్చుకోవడానికి మీ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించండి.

– లెస్ బ్రౌన్, మోటివేషనల్ స్పీకర్

ఈజీఎంఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

సీఎస్‌కు వినతి

ఈనాడు, హైదరాబాద్:పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో గత 18 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్న తమను వెంటనే క్రమబద్ధీకరించాలని ఉపాధి కల్పన మార్కెటింగ్ మిషన్ (ఈజీఎంఎం) ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కోరారు. ఈ మేరకు ఈజీఎంఎం ఉద్యోగుల సంఘం శుక్రవారం సచివాలయంలో సీఎస్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. 2006లో రాజీవ్ యువకిరణాలు, రాజీవ్ ఉద్యోగశ్రీ పథకాల నిర్వహణ కోసం తమను జిల్లాస్థాయిలో ఎంపిక కమిటీల ద్వారా నియమించారని, ఇప్పటికే ఒప్పంద ఉద్యోగులుగా అరకొర వేతనాలతో కొనసాగుతున్నామని వాపోయారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

కొత్త టీచర్ల జాయినింగ్‌ను 10వ తేదీగా పరిగణించాలి

ట్రెజరీస్ డైరెక్టర్‌కు టీఎస్‌యూటీఎఫ్ వినతి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో నూతనంగా ఉద్యోగాల్లో చేరిన టీచర్ల జాయినింగ్ తేదీని ఈ నెల 10వ తేదీగా పరిగణించాలని ట్రెజరీస్ డైరెక్టర్ కేఎస్ఆర్ మూర్తిని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి కోరారు. ఈ మేరకు పలు సమస్యలపై శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కొత్త టీచర్లకు నియామకపు తేదీలో ఇచ్చినట్లుగానే సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవచ్చని, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడి కార్యాలయం నుంచి లేఖ వస్తే ఆవిధంగా వేతనాలు కూడా చెల్లించేలా ట్రెజరీలకు ఆదేశాలు ఇస్తామని సంచాలకుడు చెప్పారన్నారు. గతంలో బదిలీ అయి.. ఇటీవల రిలీవ్ అయిన ఉపాధ్యాయుల అక్టోబరు నెల పూర్తి వేతనం కొత్త స్టేషన్‌లో అనుమతించాలని ట్రెజరీ అధికారులకు సూచించినట్లు సంచాలకుడు చెప్పారని రవి తెలిపారు.







పత్తి రైతును.. తొలిచేస్తున్నారు!

- తేమ సాకుతో కొనుగోళ్లకు సీసీఐ నిరాకరణ
- ఇదే అదనుగా వ్యాపారుల విజృంభణ
- క్వింటాకు రూ.6500 దక్కడమూ గగనమే
- వాతావరణం సహకరించక, యంత్రాంగం స్పందించక గోస


ఈనాడు, హైదరాబాద్, వరంగల్: రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో 42.23 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. 25.33 లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. తెగుళ్లు, చీడపీడలు, వర్షాలను ఎదుర్కొని ఎలాగోలా రైతులు పత్తి తీసి... విక్రయించడానికి రెండు నెలల పాటు ఎదురుచూశారు. అదిగోఇదిగో అంటూ సీసీఐ ఐదు రోజుల కిందట రాష్ట్రవ్యాప్తంగా 269 కొనుగోలు కేంద్రాలను తెరిచింది. హమ్మయ్య...!! ఇక సరకు విక్రయించి, అప్పులు తీర్చుకోవచ్చనే ఆశతో పరుగున వెళ్లిన రైతులు హతాశులయ్యారు. సీసీఐ కేంద్రాల్లో సోమవారం 9 మంది, మంగళవారం 12 మంది, బుధవారం 16 మంది, గురువారం 59 మంది, శుక్రవారం 124 మంది మాత్రమే పత్తి విక్రయించగలిగారు. తేమ అధికంగా ఉందంటూ అన్నదాతలను వెనక్కి పంపడమే ఇందుకు కారణం. దీన్ని వ్యాపారులు అవకాశంగా మలచుకున్నారు. అదే తేమ పేరిట అన్నదాతలను ముంచుతున్నారు.

సీసీఐకి తేమే ప్రామాణికం

పత్తి రైతులకు తేమ నిబంధన శాపంగా మారింది. సీజన్ ఆరంభంలోనే కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిబంధన ప్రకారం పత్తిలో 8% నుంచి 12% మధ్య తేమ ఉంటే మద్దతు ధర ఇవ్వాలి. అయితే, ఈసారి వర్షాలు ఇంకా కురుస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా రెండు నెలలుగా వాతావరణం మబ్బుపట్టి ఉంటోంది. దీంతో పత్తిలో తేమ కాస్త అధికంగా ఉంటోంది. ఇవేమీ పట్టించుకోకుండా సీసీఐ కేంద్రాల్లో నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ... తమను వెనక్కి పంపిస్తుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో 16% వరకు తేమ ఉన్నా కొనుగోళ్లు జరిపారు.

వ్యాపారుల పంట పండుతోంది

ఏ నిబంధన కారణంగా కొనుగోలుకు సీసీఐ నిరాకరిస్తోందో... అదే తేమను సాకుగా చూపుతూ వ్యాపారులు మాయాజాలం చేస్తున్నారు. వారి వద్ద ఉన్న యంత్రాలతో పత్తిని పరిశీలిస్తున్నారు. అవి 18% నుంచి 35% వరకు తేమను చూపుతున్నాయి. దీంతో వ్యాపారులు మద్దతు ధర కంటే రూ.1000 అంతకంటే ఎక్కువ తగ్గిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో మార్కెట్లలో కనిష్ఠంగా రూ.6,000, గరిష్ఠంగా రూ.6,800 ధర మాత్రమే పలకడం ఆందోళన కలిగిస్తోంది. సోమవారం క్వింటా రూ.7,100 పలికిన పత్తి... శుక్రవారం వచ్చేసరికి ప్రతి క్వింటాకు రూ.600 వరకు తగ్గడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. దీంతో నిరుటికంటే ఈసారి సరకు నాణ్యంగా ఉందని, అయినా ధర తక్కువగా ఇస్తుండటంతో తమకు పెట్టుబడి ఖర్చులూ మిగలడం లేదని వారు 'ఈనాడు' ఎదుట వాపోయారు.



మద్దతు ధర భారీగా తగ్గిస్తున్నారని వాపోతూ వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

ఎనుమాములలో భగ్గుమన్న రైతులు

న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్: రాష్ట్రంలోనే పెద్దదైన ఎనుమాముల మార్కెట్‌లో వ్యాపారులంతా సిండికేట్ కావడంతో పత్తి రైతుల కష్టం దళారుల పాలవుతోంది. దీంతో ఆగ్రహించిన వందల మంది అన్నదాతలు, తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు క్వింటా పత్తిని రూ.11 వేలకు కొనుగోలు చేయాలని శుక్రవారం మార్కెట్‌లో ఆందోళనకు దిగారు. దాంతో వ్యాపారులు కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. వ్యాపారుల నుంచి వీలైనంత ఎక్కువ ధరకు సరకును కొనిపిస్తామని మార్కెట్ అధికారులతోపాటు పోలీసులు నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. నిత్యం ఉదయం 8.35 గంటలకు మొదలు కావాల్సిన కొనుగోళ్లు మూడున్నర గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమయ్యాయి. ఎనుమాములకు శుక్రవారం ఒక్కరోజే సుమారు 10 వేల బస్తాల పత్తి రావడం గమనార్హం.

ఐదు రోజులుగా ఆరబోత



తరచూ వర్షాలు కురుస్తుండటంతో పత్తి తేమగా ఉంటోంది. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర దక్కడంలేదు. దాంతో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం రంగశాయిపల్లిలో పెద్ది అశోక్ అనే రైతు రెండు ఎకరాల్లో సాగు చేసిన పత్తిని ఐదు రోజులుగా నిత్యం ఇలా ఇంటి ముందు ఆరబెడుతున్నారు.

– న్యూస్‌టుడే, రామడుగు, ఈనాడు, కరీంనగర్

ఆదిలాబాద్‌లో రోడ్డెక్కిన అన్నదాతలు

- తేమను పట్టించుకోకుండా క్వింటా పత్తికి రూ.6,696 ధర నిర్ణయం

ఈటీవీ–ఆదిలాబాద్: పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలను సడలించాలని, గుజరాత్‌లో మాదిరిగా ఇక్కడా ధర ఇప్పించాలని శుక్రవారం ఆదిలాబాద్‌లో రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. పత్తి కొనుగోళ్లను ప్రారంభించేందుకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా రాగా... తేమను పరిగణనలోకి తీసుకోకుండా కొనాలని, లేదంటే ధరనైనా పెంచాలని రైతులు ఆందోళనకు దిగారు. సీసీఐ 8% నుంచి 12% మధ్య తేమ ఉంటేనే మద్దతు ధరతో కొంటుందని ఆయన స్పష్టంచేశారు. అయితే, రాష్ట్రంలోని ఇతర మార్కెట్‌ల్లో ఉండే ధర కంటే ఎక్కువకు ఆదిలాబాద్‌లో కొనేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వ్యాపారులతో సమావేశమైన కలెక్టర్ క్వింటా పత్తికి రూ.7,200 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించారు. అయితే, తేమను పట్టించుకోకుండా కొనాలని రైతులు పట్టుబట్టడంతో సీసీఐ అధికారులు, వ్యాపారులు వెళ్లిపోయారు. దాంతో రైతులు కిసాన్‌చౌక్‌లో రాస్తారోకోకు దిగారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన కొనుగోళ్లు సాయంత్రం 6 దాటినా మొదలవకపోడంతో రైతులు, కలెక్టర్ మార్కెట్‌లోనే ఉండిపోయారు. సాయంత్రం 7 గంటలకు తేమతో సంబంధం లేకుండా క్వింటాలుకు రూ.6,696 చొప్పున కొనుగోలు చేయాలని నిర్ణయించారు. శుక్రవారం వచ్చిన పత్తిని ఇదే ధరతో శనివారం కొంటామని అధికారులు ప్రకటించారు.



పత్తి ధరపై రైతులతో చర్చిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

తేమ 12% మించకుంటేనే మద్దతు ధర: మంత్రి తుమ్మల

ఈనాడు, హైదరాబాద్: పత్తిలో తేమ 8% నుంచి 12% మధ్య ఉంటేనే మద్దతు ధర లభిస్తుందని, రైతులు పూర్తిగా ఆరబెట్టాకే ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలకు తేవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సూచించారు. "రైతుల సౌకర్యార్థం మార్కెటింగ్ శాఖ 8897281111 వాట్సప్ నంబరు ద్వారా పత్తి కొనుగోలుకు సంబంధించిన సేవలను అందిస్తోంది. పత్తి విక్రయం, అర్హత, అమ్మకాల తక్‌పట్టీ వివరాలు, చెల్లింపుల స్థితి, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం, కొనుగోలు తదితర వివరాలన్నీ రైతులు ఇంటి వద్దనే ఉండి వాట్సప్ ద్వారా తెలుసుకోవచ్చు. రైతులకు ఎటువంటి ఫిర్యాదులున్నా ఈ వాట్సప్‌లో చేస్తే మార్కెటింగ్ శాఖ సత్వరమే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటుంది" అని ఒక ప్రకటనలో తెలిపారు.

మల్కాజిగిరి సర్కిల్‌లో 750 ఎకరాలు వక్ఫ్ భూములే!

- వక్ఫ్ బోర్డు సీఈవో కలెక్టర్, రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ
- 100 సర్వే నంబర్లలో ఆస్తుల రిజిస్ట్రేషన్ నిలిపివేత
- వేలాదిమంది నివాసితుల ఆందోళన

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో వందకుపైగా సర్వే నంబర్లలో ఆస్తుల క్రయవిక్రయాలు నిలిపివేస్తూ రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ ఆదేశాలతో వేలాది మంది మల్కాజిగిరి వాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని పలు సర్వే నంబర్లలో 750 ఎకరాలు వక్ఫ్ బోర్డుకు చెందిన స్థలాలుగా నోటిఫై చేసినట్లు మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్ర రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ కమిషనర్ ఆదేశాలతో.. వాటి పరిధిలోని ఆస్తుల రిజిస్ట్రేషన్ ఈనెల ప్రారంభం నుంచి నిలిపివేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో మల్కాజిగిరిలోని పలు భూములను వక్ఫ్ బోర్డుకు సంబంధించినవని..వాటిని నిషేధిత జాబితాలో చేర్చాలని పలు సర్వే నంబర్లను పేర్కొంటూ మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్‌తో పాటు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు నెలక్రితం లేఖ పంపారు.దాని ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దశాబ్దాల క్రితం కొన్న ఆస్తులను వక్ఫ్ బోర్డుకు చెందినవని ఇప్పుడు ప్రకటించడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. మౌలాలి, ఆర్టీసీ కాలనీ, షఫీనగర్, తిరుమలనగర్, భరత్‌నగర్, ఎన్‌బీహెచ్ కాలనీ, తూర్పు కాకతీయనగర్, ఓల్డ్ సఫిల్‌గుడా, న్యూవిద్యానగర్, రామబ్రహ్మనగర్, శ్రీకృష్ణానగర్, సీతారాంనగర్ తదితర కాలనీలు వక్ఫ్ బోర్డు తమదిగా పేర్కొంటున్న 750 ఎకరాల పరిధిలో ఉన్నాయి.

'ఈనాడు' కథనానికి స్పందన..

సోమవారంలోగా విధుల్లో చేరాలి

కొత్త వీఏఎస్‌లకు పశు సంవర్ధక శాఖ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ కొత్తగా ఉద్యోగాలు పొందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్)లందరూ సోమవారంలోగా విధుల్లో చేరాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సూచించారు. నూతనంగా కొలువులు సాధించిన వీఏఎస్‌లలో 84 మంది విధుల్లో చేరలేదంటూ 'ఈనాడు'లో శుక్రవారం 'ఉద్యోగమిచ్చినా.. చేరలేదు..' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పందించిన సబ్యసాచి ఘోష్.. అన్ని జిల్లాల అధికారులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పశువులకు టీకాల కార్యక్రమం జరుగుతోందని, త్వరలో పశుగణన కూడా చేపడుతున్నందున పోస్టింగ్స్ పొందిన వారందరూ విధుల్లో చేరేలా చూడాలని సూచించారు. విధుల్లో చేరిన వారికి వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగాల్లో చేరని వారికి సీనియారిటీ నష్టం గురించి వివరించాలన్నారు. ఘోష్ ఆదేశాల మేరకు జిల్లా పశుసంవర్ధక అధికారులు శుక్రవారం రాత్రి ఉద్యోగాలు పొందిన వారికి ఫోన్ చేసి సోమవారం కచ్చితంగా విధుల్లో చేరాలని సూచించారు.

హైడ్రా ఆర్డినెన్స్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: హైడ్రాకు విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌కు సంబంధించి ప్రభుత్వ వివరణ కోరుతూ శుక్రవారం హైకోర్టు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైడ్రాకు విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఈనెల 3న జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సవాలు చేస్తూ మాజీ కార్పొరేటర్ మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలుచేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆర్డినెన్స్ వల్ల హైడ్రాకు విస్తృతాధికారాలు లభించాయని, జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 374 బి ద్వారా లభించే అధికారాలను ఆర్డినెన్స్‌తో హైడ్రాకు కట్టబెట్టిందన్నారు. కలెక్టర్, ఎమ్మార్వోలకు వాల్టా చట్టం కింద లభించే అధికారాలను హైడ్రాకు బదలాయించిందని వివరించారు. ఇలా జారీ చేసే అధికారం ప్రభుత్వానికి లేదని తెలిపారు. హైడ్రాను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శులకు నోటీసులిస్తూ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

సస్పెన్షన్లు ఎత్తివేయాలి

- సీఎస్‌కు మహిళా ఏఈవోల వినతి

ఈనాడు, హైదరాబాద్: పంటల డిజిటల్ సర్వేలో పాల్గొనలేదని ఉన్నతాధికారులు తమపై విధించిన సస్పెన్షన్లు ఎత్తివేసి.. ఈ నెల వేతనం చెల్లించాలని మహిళా వ్యవసాయ విస్తరణాధికారులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కోరారు. శుక్రవారం ఏఈవోల ఐకాస ఆధ్వర్యంలో సచివాలయానికి వచ్చి సీఎస్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు బీమాలో వివరాలు నమోదు చేయలేదనే సాకుతో 162 మందిని సస్పెండ్ చేశారని, అందులో సగం మంది మహిళలమేనని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన చర్చల్లో తమపై సస్పెన్షన్ ఎత్తివేస్తామని వ్యవసాయశాఖ సంచాలకుడు ఇచ్చిన హామీతో తాము యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రెండు రోజులుగా సర్వేలో పాల్గొంటున్నామని తెలిపారు. అయినా అధికారులు సస్పెన్షన్ ఎత్తివేయకపోగా.. తమ అక్టోబరు నెల వేతనాల బిల్లులను ఆపేశారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఏఈవోల సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు.

ఈనాడు స్థిరాస్తి

సామాన్యులు మొదలు సంపన్నుల వరకు అందరికీ ఇల్లు ఓ కలల సౌధం. తమ నివాసం ప్రత్యేకంగా, సౌకర్యవంతంగా ఉండాలని ప్రతిఒక్కరూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఇంటిల్లిపాదికి అనుబంధాలను పంచేలా కలల లోగిలిని కళాత్మకంగా తీర్చి దిద్దుకోవడంపై ఎక్కువ శాతం నిర్మాణదారులు దృష్టి పెడుతున్నారు. దీంతో విభిన్న రకాల కళలతో రూపొందించిన కళాత్మక చిత్రాలు, కళాఖండాలు ఇళ్లలో దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో ఇంటి డిజైనింగ్‌లో ప్రత్యేక ఏర్పాట్లతో పాటు అద్భుతమైన చిత్రాలు, కళాఖండాలను తమ గృహాల్లో ఏర్పాటు చేయించుకొంటున్నారు. ప్రత్యేకమైన సిపోరెక్స్, మురల్, మోడ్రన్ కళలతో రూపొందించిన కళాత్మక చిత్రాలు, పేపర్, స్టోన్, వుడ్ కార్వింగ్ కళాఖండాలను ఇంటికి తగినట్లు డిజైన్ చేసే కళాకారులకు డిమాండ్ పెరిగింది.

కలల లోగిలికి కళాఖండాలు

న్యూస్‌టుడే, అబ్దుల్లాపూర్‌మెట్

ఇల్లు, కార్యాలయం తాముండే చోటేదైనా.. ఇగడిపే ప్రతి క్షణం ప్రశాంతంగా, అభిరుచిని చాటేలా పరిసరాలు ఉండాలని అందరూ భావిస్తున్నారు. అందుకు తగిన కళాఖండాలను ఎంచుకొని ఖర్చుకు వెనకాడకుండా ప్రత్యేక శ్రద్ధతో తమ ఆవాసాన్ని కనులవిందుగా తీర్చిదిద్దుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలో కళాకారులు ఇందుకు తగినట్లు దేవతామూర్తులు, సంగీత వాయిద్యాలు, పల్లె అందాలు, ప్రకృతి చిత్రాలు ఇలా ఒకటేమిటి తాము చూసిన అద్భుత దృశ్యానికి కళాత్మక రూపమిచ్చి ఇళ్లలో ఆవిష్కరింపజేస్తున్నారు. ఇలా అన్ని వయసుల వారి అభిరుచులు, ఇంటి పరిసరాలకు అనుగుణంగా కళాఖండాలను రూపొందించి ఎందరో కళాకారులు ఉపాధి పొందడమే కాకుండా కలల సౌధం ఆవిష్కరించుకోవాలని అనుకునే వారికి సేవలు అందిస్తున్నారు.



నివాసానికి వన్నె తెచ్చేలా మోడ్రన్ ఆర్ట్ గణేశుడి చిత్రం

ఇళ్లను కళాత్మకంగా తీర్చిదిద్దుకుంటున్న యజమానులు



కళాత్మకతో నట్టింట్లో ఏర్పాటు చేసిన చిత్తరువు

అందం ఆవిష్కృతమయ్యేలా..

ఇళ్లలోని లివింగ్ రూమ్‌లు, కార్యాలయాల్లోని కార్పొరేట్ లాబీలు, ఇండోర్ ప్రాంతాల్లో సిపోరెక్స్ ఆర్ట్‌తో రూపొందించే శిల్ప కళాఖండాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రత్యేక రకమైన తేలికపాటి స్టోన్లు, ఇతర సామగ్రి ఉపయోగించి సిపోరెక్స్ కళారూపాలను తయారు చేస్తారు. మురల్ ఆర్ట్‌తో నేరుగా.. ఎంపిక చేసిన గోడ, పైకప్పు, ఇతర చోట్ల చూడముచ్చటగా ప్రత్యేక కళాఖండాలను ఆవిష్కరిస్తున్నారు. యజమానులు తమ ఆసక్తి, అభిరుచి మేరకు నచ్చినట్లు ప్రత్యేకంగా డిజైన్ చేయించుకుంటున్నారు. దేవతామూర్తులు, ప్రశాంతతకు చిహ్నంగా ఉండే దృశ్యాలను పేపర్ కార్వింగ్ ద్వారా కూడా ప్రత్యేకంగా తయారు చేయించి ఇంటి గోడలపై ఏర్పాటు చేయిస్తున్నారు. వీటితో పాటు మోడ్రన్ ఆర్ట్‌తో తీర్చిదిద్దే కళాత్మక, అద్భుత చిత్రాలపైనా ఆసక్తి చూపిస్తున్నారు.



హాల్‌లోని గోడ మీద అమర్చిన సిపోరెక్స్ స్టోన్ కళాఖండం

కళాహృదయంతో ఆసక్తి చూపుతున్నారు



ఇళ్లు, కార్యాలయాల్లో కళాత్మక చిత్రాలు, శిల్పాలు ఏర్పాటు చేయించుకొనే వారి అభిరుచికి తగినట్లు డిజైన్లు రూపొందిస్తున్నాం. ఇటీవలి కాలంలో ఎక్కువ మంది ఇంట్లో కళాఖండాలు ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. హాల్, లివింగ్, స్టడీ, బాల్కనీ, కామన్ ఏరియాల్లో వైవిధ్యాన్ని చాటేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేయించుకుంటున్నారు. ఇంట్లో కళాత్మక చిత్రాలకు ప్రాధాన్యం ఇచ్చే వారి మూలంగా తమలాంటి కళాకారులకు ప్రోత్సాహం లభిస్తోంది.

\- సీలోజు శ్రవణ్‌చారి, ఔత్సాహిక కళాకారుడు



మురల్ ఆర్ట్‌తో ఆవిష్కృతమైన చిత్రం

ఈనాడు స్థిరాస్తి CLASSIFIEDS

REAL ESTATE

FLAT FOR SALE

BHEL

Nallagandla- New 3BHK Luxurious Flats for Sale. E/W Facing. Ready to move. GHMC Approved, on 100 Ft Rd. Opp Ramky One Galaxia, Navodaya Clny. ✆ 9848960444, 9848944044.

Ameenpur- New 2&3 BHK Luxurious Flats for Sale. Ready to move. HMDA Approved Nr. Saibaba Temple. ✆ 9848944044, 9848960444.

DILSUKHNAGAR

3BHK Super Deluxe Flat for Sale Ready to Move 1558 Sft 75 Lacs only (Including Amenities & Car Parking) Saraswathi Nagar Just 5 Mins from Dilsukhnagar Metro. Ph: 9030986607.

Luxurious 3BHK Flat for Sale. 2200 Sft, Ready to move. Each Floor One Flat near Astalaxmi Temple, Telephone Colony, Road No.2, RK Puram. Ph: 9246733551, 9063829533.

Malakpet near metro & Yashoda hospital New 3BHK delux flats E/F 1500 & W/F 1570 sft sale. Ph: 7780325546, 9849497306.

3BHK Deluxe Flats 1750 Sft One Flat in One Floor, at Prashant Nagar, Nr. Boji Reddy Eng. College, Saidabad. Posission in November. 9000444024, 9603842299. (Loans)

ECIL

Fantastic Festive Offer. Drive Home Maruthi Fronx with Purchase of Dream Home. 3 BHK Flats Kowkur Near Yapral Gated Community. Ph: 9502759933.

Fantastic Festive Offer. Drive Home Maruthi Fronx with Purchase of Dream Home. 3 & 4BHK Flats Gated Community Mallapur. Ph: 9618247247.

GACHIBOWLI

Gachibowli New 2BHK Luxurious Flats for Sale. E/W Facing GHMC Approved, BHEL to Gachibowli 100 Ft Rd. Gulmohar Park Clny. ✆ 9848944044, 9848960444.

Narsingi 5 Mins to ORR 3BHK Luxury Apts E/W/F GHMC Approved 100% Vaastu 1425 Sft, 60 Sq.Yds UDS, Loan Avl. ✆ 9441231450, 9618578269.

Manikonda, Panchavati Colony, Akshaya Apt, Road No-32, Sale 3BHK Flat, 1711sft, North Face, RERA. Ph: 9640529995

Premium LXRY Flats, @ Manchirevula Narsingi, 1 flat per Flr 3000 sft, 3B/R, 3.5 bath, 2 Car Parks, Amenities. Ph: 9391029260

Flat for Sale: 2BHK-1050 Sft UDS 25 Sqyds, S.K. Residency, Puppalaguda, Manikonda. ✆ 9246156394.

HAYATHNAGAR

Very Nr. to Bus Stop & MRO Office, Hayathnagar Nr. Vijayawada Highway. Ready to move. Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd, E&W. Ph: 9849801477, 9247326 642.

GHMC Approved, 2BHK, E/W Face, 1150 Sft, Beside Zee School, Shirdi Nagar, Hayatnagar, Ready to move. Ph: 9100884493, 9100884492.

HITECH CITY

Madhapur Kakatiya Hills Premium Luxury Flats for Sale Semi Gated, East & West Facing. Ready to occupy. ✆ 9030194449/ 8367070777.

Gated Community Auro Realty @ Hitech City Ready to move. 3BHK Flat 1456 Sft, W/F 10th Floor 2 Car Parkings. 9989582361.

Hi-Tech city Prime Location White field Premium new 3 BHK & 4 BHK in Spacious, Modern Homes with Top-Notch Amenities ✆ 7675075533.

JEEDIMETLA

Jeedimetla, TSIIC Clny, Shapur Rd, New 2&3BHK, 1000- 1550 Sft @ 5500 Per Sft. Gym, Party Area, 100% Vasthu. Ph: 9989225665, 8790738313.

KHAIRATABAD

Somajiguda, Eenadu backside, Hilltop Cly, 3B/R Flat, 2800 Sft, West Pent House, Reliance Estate, 6B @ Reasonable Price. Ph: 9848444556.

KOTI

Abids, King Koti Road, Aziz Manzil 502, 5th Floor, 1852 Sft, 2 Car Parking Flat for Sale. Ph: 7000225101, 9329807374.

KUKATPALLY

FLAT FOR SALE
- 2BHK, 936 Sq.ft,
- 43.5 sq.yards UDS,
- Car Parking, North Face
- Flat No: 302,
- Simhadri Tower's At Madhavi Nagar, KPHB
- Two sides 30' Roads

Ph: 90141 35437
Timings: 10Am to 7:00p.m.

L.B.NAGAR

Hastinapuram, Luxurious ★ 3BHK Flats for Sale. 8 Floors Building, Gated Community, Main Road 2nd Bit, Opp: Mekala Mandi. ✆ 9063829533.

3BHK Flats @ Kasturi Nagar, Hasthinapuram, 1750 Sqft, 1 Flat per Floor, All Amenities, Complete Modern Interior Complimentary. 8374567549.

MIYAPUR

Miyapur- 2&3 BHK Luxurious Flats Ready to move. HMDA Approved, Pride Park, Sai Anurag Colony ✆ 9848944044, 9848960444.

NIZAMPET

Pragathi Nagar- New 2BHK & 3BHK Luxurious Flats HMDA Approved, Semi Gated Community, Ready to move. NRI Cly. ✆ 9848944044, 9848960444.

SECUNDERABAD

Tarnaka Brand- New 3BHK Indp. Floor 1800Sft/ 1900 Sft- East Flat Nr. Metro Station with 90Yds UDS. Ph: 8886511101, 9393339594

SHAMSHABAD

3 BHK Flats, 1250 Sft (45 Laks) only, ORR Exit No: 15, Peddagolkonda to Nagaram 100 Feet Road 2 Min. ✆ 6309760959.

UPPAL

2BHK, 1150 Sft, HMDA/ RERA Approved. 100% Vastu, Brick work in progress @ Pillar # 93, KLM Mall lane, Shankar Nagar ✆ 9866999942, 9866308389.

New 2BHK Deluxe Flats 1157 Sft, East Face @ 59 Lakhs only. Ready to occupy at Uppal Chilkanagar, Opp: HP Petrol Pump line. ✆ 9642630888.

Premium 3BHK Flats for Resale. Located in Mallapur, Nr. Nacharam & Habsiguda. Brand New Flats in a Gated Community Club House Modern Amenities. 8555816048.

KOMPALLY

Luxury Living & Business Residential Sizes 1950- 2850 Sft Commercial Sizes 4000- 18775 Sq.ft @ Jains Friends Square & Sriram Garden by Jains, Suchitra. ✆ 9705211000/ 9705311000.

New 3BHK Flat For Sale At Kompally 1480 Sq.Ft East Facing UDS 54 Sq.Yds, Main Road Dulapally. Ph: 9246330299

FLATS FOR SALE KOMPALLY to Dulpally Main Road
HMDA Approved
3 BHK Flats (1480, 1540 & 1605 S.ft).
Occupation Certificate.
READY TO OCCUPY
at STC Vidhya Vihar Project, Dulpally
8008 333905
9900 634567

TARNAKA

Tarnaka 3BHK Flat 1500 SFt & Yapral Duplex Villa 183 Yds, Gated & 4.5 Acrs Land Sale Zedcherla to 20 Km. ✆ 9246585767.

GENERAL

Shanti Nagar, Masab Tank New luxurious 3BHK 1900 Sft Flat for sale in prime location with premium amenities, 100% Vaastu, Spacious car parking & Ample water. Ph: 9949245768

Kothapet Brand New 3BHK Flats for sale at 2nd, 3rd & 5th Floor. RERA Approved, Vastu & Bank loan approval. Contact: 6309135564

875 sq ft posh pent house 1 bedroom studio apartment excellent view 5th floor on Vidyanagar- Adikmet main road, lift, one car parking for immediate sale. Ph: 9395360048.

1760 sq ft posh 3 BHK Flat on 3rd floor on Vidyanagar- Adikmet main road, lift, one car parking for immediate sale. Ph: 9395360048

1246 Sft Builtup Area, Two BHK under Construction, Possession by March 2025, Vijay RV's Sai Vanamali Gated Community, 150 Mtrs from Miyapur X Rds on Main Road. Call: 9154157500 for Details.

APARTMENT FOR SALE
Centrally Located at BASHEERBAGH HYDERABAD
- Brand new designer building with top class construction.
- Located on 3 side road, well ventilated 3 BHK flats.
- Full generator backup.
- Each flat has separate Servants quarter.
- Building has private swimming pool and gym.

Terrace view: BIRLA TEMPLE and SECRETARIAT
Please call 7032927154

Lotus Homes
522 Luxury Apartments at Bandlaguda, near Nagaram, Hyd



- 2 Km before Outer Ring Road
- 15 Minutes from Kushaiguda
- Close to Bits Pilani / Infosys

with Clubhouse & Amenities
Price ₹ 4,750* per sft
2 BHK price ₹ 34.29* Lacs
3 BHK price ₹ 50.82* Lacs
*Amenities, Parking, GST & Registration extra.
Modi Builders www.modibuilders.com
7677 120 120
9154 324 517
sales@modibuilders.com

HOUSE FOR SALE

DILSUKHNAGAR

సైదాబాద్, హైదరాబాద్‌లో 86. చ.గ. ఇల్లు అమ్మకానికి కలదు. ఆసక్తి గల వారు కాల్ చేయండి. Ph: 9701518057

ECIL

1BHK 106 S.Yrds west facing corner row type house in gated community. HMDA GHMC. drinking water. railvihar cherlapally. No Broker. whatsapp: +91 8123774336.

Ready to Occupy Luxury Duplex 2,040 Sft Villas. Club House Swimming Pool Cherlapally, Near Railway Station. Contact Ph: 9866669768.

GACHIBOWLI

Villa for sale Narsingi Manchirevula 259 sqyd 3800 sft w/F 5 bed rooms. Contact: 9966619036

HAYATHNAGAR

HOUSE FOR SALE
HAYATHNAGAR
316 Yds, N/F G+2+Shed,
1 BHK's-15 & 100 Mtrs From Vijayawada Highway & 1.50L Rents. Good Rental House for sale. Clear title.
Price: 3.50 Cr.
Ph:9912354000

KUKATPALLY

100 Sq.Yds. 4 Floors Building for Sale. Nr. BJP Office, Ramalayam. Good Rental Value. No Loan facility. Only cash parties ✆ 9849356645.

KPHB EWS New House G+5 Each Floor 2 BHK with Lift provision ready to occupy. Opp Park. Cont: ✆ 93469 30857.

Kukatpally, Near Traffic Police Station: G+4 Building Sale in 130 yards, Rental Coming 1 Lack 8,000/- per Month. Can use as Hostel. ✆ 90528 28633.

L.B.NAGAR

300 Sq.Yards (G+2) house in Defence colony, Karmanghat. Very close to Sagar road & inner ring road. Ph: 9392432074

MALKAJGIRI

Yapral 2BHK Indp. House N/F 143 Sq.Yds. 1000 Sq.ft. Kapra Duplex Villa 100 Sq.Yds, E/F, 1750 Sq.Ft. for Sale. Ph: 9160622266.

Moulali HB colony Krishna nagar road 5s/ Duplex house/ WF/ 178 sq.yds/ 2500sft/ bore & manjira avalable. Ph: 9866713487

MIYAPUR

144 S.Yds, G+2, Duplex House, 2 Single Bedroom Portions & Servant Room. Opp: Miyapur Metro Pillar: 661, IDPL Colony, Hydernagar. 9490684337, 9849558334.

G+2+ Pent House 150 Sqrd East Sri Vaninagar Miyapur @ 2.10 Cr. under Construction & upcoming 152 Sq.Yds. East Face @ 1.70 Cr. Ph: 9346343258.

NIZAMPET

2BHK, W/F, 120 sq.yds Independent House, Prime Location, 2yrs Old, 1/2km To Water Tank And Main road Nizampet. Ph: 9392523894

PATANCHERU

G+1 New Indp House @ Patancheru, Beside ORR Exit No.3, Bombay H/Way. 120 Sqrds, Loan. Phone: 9985116641.

UPPAL

Uppal Sai baba Cly 200 Sq.yds, 3000 Sft Built up G+1 (36x50) fully Furnished 4 BHK 5 Bath rooms 24 hrs water. Price 2.7 Cr (nego) ✆ 9959153318

HMDA Uppal Nr. Bus Depo, DMart B/S, Floor wise 24 Flats, Plots 200, 300, 80, 60 Sqy, G+1 House Chengicherla & 140 Sqy G+1+Pent. 9985191111.

GENERAL

పెద్ద అంబర్‌పేట హైవే దగ్గరలో మైత్రి గ్రూప్ వారి కమ్యూనిటీలో MIVAN టెక్నాలజీ కన్ స్ట్రక్షన్, 4 BHK ప్రీమియం లగ్జరీ డూప్లెక్స్ 516 విల్లాస్ ఫర్ సేల్, 4.5 ఎకరాలు లగ్జరీ పార్క్, లక్ష SFT లగ్జరీ ప్రీమియం క్లబ్ హౌస్. HMDA & RERA అప్రూవ్డ్. Ph: 96666 85222.

మహేశ్వరం ఎలక్ట్రానిక్ సెజ్ పక్కనే HMDA & RERA అప్రూవ్డ్, మైత్రి గ్రూప్ వారి కమ్యూనిటీలో 2BHK & డూప్లెక్స్ విల్లాస్ ఫర్ సేల్, రెడీ టు మూవ్. Ph: 96666 85222.

LAND FOR SALE

GHATKESAR

B.B.నగర్: @ టోల్‌గేట్ ప్రక్కన వరంగల్ రోడ్, హైవే ఫేసింగ్‌లో ఉన్న 7 ఎకరాస్ కమర్షియల్ ల్యాండ్ (గూడూరు విలేజ్) అమ్మబడును. సంప్రదించండి. Ph: 9246242316.

MAHESHWARAM

Rs. 7600 గజం (రేటు తగ్గించబడును) 100 అడుగుల మెయిన్ రోడ్‌కి 3వ ప్లాటు. 240 గజాల ప్లాటు అమ్మబడును @ మహేశ్వరం. DTCP అప్రూవల్. ఫోన్: 9966521191.

MEDCHAL

LAND FOR SALE
3 Acres Land adjoining to Project Saket Bhu Satva, Kandlakoya(V), Medchal
4500 sq.yards Land for sale
Suitable for Plotting / Villas & Apartments.
Contact 9701549945

SHAMSHABAD

ఎయిర్‌పోర్ట్ దగ్గర శంషాబాద్ మండలము, రంగారెడ్డి జిల్లా, నర్కుడ గ్రామం, బెంగుళూరు హైవేలో 1 ఎకరం భూమి అమ్మబడును. 8977515389.

SRISAILAM HIGHWAY

"Commercial" Land for Sale Srisailam Highway Facing (2.5 Acer & 0.5 Acer) at Kandukoor Opp:. Pharma Road. ✆ 8498938959.

1 Acre Land for Sale Adjacent to Signature Estate Villas, Kavuri Villas & Dicovery City in Srinagar Village, Maheshwaram Mandal, Entered into JDA with a Reputed Builder for Premium Villas for a total extent of 15 Acres. Ph: 9848019933.

GENERAL

Registered Land of 20 Cents- 980 Sq.Yds 70 Ft W/F Main Rd. Commercial & Res. for Sale @ Ahobhilam, Allagadda. A Fast Growing Pilgrimage Centre for Nava Narasimha. Good Invest & Best suitable for a Guest House/ Lodge/ Hotel. No Brokers ✆ 9100381270, 8320547267.

భూమి అమ్మకం
నల్గొండ, కట్టంగూర్ - అమ్మటివాగు దగ్గర
5 ఎకరాల భూమి అమ్మకానికి కలదు.
సిటీకి 100 కి.మీ.
హైవే నుంచి 2 కి.మీ.
భూమి పక్కనే ఉదయ సముద్రం కాలువ
ఎకరానికి 60 లక్షలు (బేరానికి అవకాశం)
సంప్రదించండి
9849259895

PLOT FOR SALE

ADIBATLA

Sagar H/W Yacharam Pharmacity DTCP Plots Mega Gated Venture Lowest Price ORR- RRR TCS Foxcon Bdl. Ph: 86861 44566.

Aadibatla, Kongarakalan closed to ORR service road HMDA open Villa plots Nr. TCS, Foxconn loans avil. Ph: 8978035687

GACHIBOWLI

Prime Property
2000 Yards for Sale
at Gopanpally beside Financial District & Gachibowli
LRS final approved
79813 92465
82973 24569

GHATKESAR

Pinewoods: Open Plots @ Aushapur near Ghatkesar! Last 8 Plots Left! Gated community with Excellent Amenities & Club house. Rates @Rs. 13,000/- Sqyd. HMDA Approved. Call: 7677120120.

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే బిబి నగర్ టౌన్, AIMS అతి సమీపంలో, HMDA & RERA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు. గే॥ క॥ ఆల్ డె॥ స్పాట్ రిజి॥. లోన్, ఫ్రీ సైట్ విజిట్. Ph: 9989032598, 9666203107.

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే బిబి నగర్ టౌన్, AIMS అతి సమీపంలో, HMDA & RERA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు కలవు. గే॥ క॥ ఆల్ డె॥ స్పాట్ రిజి॥. బ్యాంక్ లోన్, ఫ్రీ సైట్ విజిట్. Ph: 9989032598.

HAYATHNAGAR

HMDA RERA @ Vijaywada H/W Choutuppal Main road facing plots & Sagar H/W Yacharam @ 11999/- Loan Avbl. Ph: 9440719372

ORR Ramoji Film City Opp: HMDA/ RERA Final Apprd. Layout Open Villa Plots with All Modern Develpd. Ready to Construction. ✆ 9505576555.

రామోజీ ఫిలిం సిటీ దగ్గర L.B నగర్ METRO కి 27 km దూరంలో 80AC ఫామ్‌ల్యాండ్ శ్రీగంధం మొక్కలతో కాటేజ్ కట్టి ఇవ్వబడును. స్పాట్ reg. Ph: 9959415416

గజము 2500/- విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ స్విమ్మింగ్‌పూల్, కాటేజ్, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలు 1210 గ. Ph: 9390261598.

దీపావళి ఆఫర్ గజానికి 1000/- డిస్కౌంట్ కలదు. విజయవాడ హైవే ఫేసింగ్ చౌటుప్పల్‌లో 700 Acr DTCP/ RERA గేటెడ్ కమ్యూనిటీ టౌన్‌షిప్‌లో విల్లా ప్లాట్లు కలవు. ✆ 7396326632.

KUKATPALLY

PLOT FOR SALE
VIVEKANANDA NAGAR COLONY, KUKATPALLY
Adjacent 1 Acre Vinayak park
150 Sq. YARD'S, 30x45 FEET
EAST & WEST Facing Roads
Ph: 90141 35437
TIMINGS: 10am to 7pm only

MEDCHAL

395 Sq.Yds W/F Plot for Sale in Gated Community, Thumkunta, Shamirpet. Nr. Bits Pilani & Karimnagar H/W, inside the ORR. 9959859751.

MOINABAD

APPA Junction @ Moinabad 20 Minutes Drive from Gachibowli Farm Lands 418, 565, 1000, 1210 Sq.Yds with 6 yrs Old Mango Trees. 9000053259.

PATANCHERU

Krishyas Vista villa plots, @ 99 Lacks. HMDA & RERA approved, with all facilities @ Chitkul, Patancheru (M). Ph: 7209454545

SAGAR ROAD

IBP JB Serine 456 Sqyd HMDA E/S 60'' 2 Sides Rd Commercial Plot & 300 Sqyd Villa Plot E/F for Sale. ✆ 9052661990.

HMDA Approved Gated Plots @ Ibrahimpatnam. Bank Loans Avail. LP No. 000133/LO/Plg/HMDA/2022, RERA No. PO2400006867. ✆ 9542220567, 9347774141.

స్పెషల్ ఆఫర్: రూ. 8999/- మాత్రమే. సాగర్ హైవే ఆనుకొని చింతపల్లిటౌన్ ఇండ్ల మధ్యలో DTCP అప్రూవుడ్ లే-అవుట్ & 30 ఎక॥ ఫామ్ ల్యాండ్- మల్లేపల్లి టౌన్‌కి 3 K.M. దూరంలో చ.గ. 4599/- మాత్రమే. శ్రీ సింధుప్రియ డెవలపర్స్. Ph: 9963141319

దీపావళి స్పెషల్ డిస్కౌంట్: ఆఫర్ కాదు ఇది అవకాశం. హై రిటర్న్స్ ఫామ్ ల్యాండ్ ప్లాట్స్. సాగర్ హైవేపై RRRకి అతి దగ్గరలో అమ్మకం. Free రిసార్ట్ సౌకర్యం. ✆ 90323 84199.

SANGAREDDY

Diwali Offer: Greenville's Lorven County, Highway facing @ Mumbai highway DTCP & RERA Gated Project. @ Sadashivpet. 6304702495.

COMMERCIAL PLOTS FOR SALE
MUMBAI HIGHWAY FACING NEAR SANGAREDDY
- DTCP Approved with RERA
- well Developed Area
- 2 mins from RRR.

Total Area: 4250 sq.yds
@ 59,999/- Per Sq.yd
Suitable for Colleges, Schools, Malls, Appartments & Hospitals
Ph: 7075011823

SHADNAGAR

Kothur, Golden Habitat, HMDA Approved Villa Plots in Kothur Nr. to Microsoft & Other Development Ltd Period Offer. Call: 9704145679.

దీపావళి ఆఫర్: షాద్‌నగర్ దగ్గర DTCP & RERA వెంచర్లో 150- చ॥గ॥ ప్లాట్ కొన్నవారికి 30 గ్రాముల బంగారం-ఫ్రీ, స్పాట్-రిజి, డైరెక్ట్-కం. Ph: 9949695027 నో-ఏజెంట్స్.

SHAMSHABAD

Timmapur, Kothur Plots- North East Corner 200 To 500 Sq.yd Highway- Walkable Distance. Ph: 9397820459

Sawera Townships HMDA Approved Plots @ Rs. 15,000/- per Sq.Yd. Nr. Thimmapur, Nr to Bangalore Highway, SEZ & Industrial Area 7Kms from MNCs. Ph: 8008277721.

SRISAILAM HIGHWAY

Open Plots for Sale in Srisailam Highway DTCP and RERA Approved Residential Plots Avbl. ✆ 9642211179/ 9553732228.

Buy 200 Sq.Yds Villa Plot @ Kadthal- Srisailam H/W & get 8 Lakhs worth Gold/ Car Free. Raja- 9966744544.

Srisailam highway @ kadthal near future city & RRR DTCP & RERA Approved layout plots 9900/- per yd. Ph: 9440722814

ముచ్చర్ల ఫ్యూచర్ 4th సిటీకి నడక దూరంలో DTCP, RERA, Loan అనుమతులతో సందర్శకులకు సంభ్రమాశ్చర్యాలు కొలిపే సౌకర్యాలతో సరికొత్త గేటెడ్ కమ్యూనిటీలో ఓపెన్ ప్లాట్లు కొరకై. Call: 9504556789.

కందుకూరు టౌన్ (స్కిల్ యూనివర్సిటీ) హైవే ప్రక్కన బిల్డింగ్స్ మధ్య HMDA వెంచర్లో ప్రీమియం ప్లాట్స్ & దగ్గర్లో 65 ఎక॥ హై సెక్యూరిటీ ఫాంల్యాండ్ ప్రాజెక్ట్‌లో 1, 1/2, 1/4 ఎకరా & 5 Guntas బిట్స్ రిసార్ట్ సౌకర్యంతో గజం 8,000/- తుక్కుగూడ ORR నుండి 20 Min. ✆ 9885552209.

శ్రీశైలం హైవే - ముచ్చెర్ల 4th City హైవే ఫేసింగ్ HMDA/ RERA అప్రూవ్డ్ విల్లా ఓపెన్ ప్లాట్లు & ఫామ్ ప్లాట్లు కలవు. బ్యాంక్ లోన్ సౌకర్యం. ✆ 9505576555.

YADAGIRIGUTTA

HMDA- RERA Open Plots near Bhongiri Port, ITI College, Gurukula School, Vivera & Deepti Hotels Yadadri, Low Price, Bank Loan. 8008299988.

యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంకు లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రిసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, పార్క్ అన్ని వసతులతో. Ph: 8106340199

SHANKARPALLI

Shankerpally- Kardanur Growth Corridor near Outer Ring Road HMDA Approved N/E Corner 333 Sq.Yds. Plot Sale. ✆ 8074842408.

KOMPALLY

438 Sq.Yds. W/S Facing with Bore and G+1 Permission Plot for Sale @ Presidency Avenue, Suchitra. 85,000/- P. Sq.Yd. ✆ 9000080345.

GENERAL

2250/- per Sqyd @ Near Balanagar, Bangalore Highway, DTCP Norms, with Fruit Plants, Red Soil Gated Community. Ph: 9652860980.

North East 500, 345 (SE) Sqy HMDA near Amazon, Skill University Future 4th City. 200 Ft Road, Airport Exit 14. Ph: 8801000880.

జన చైతన్య హౌసింగ్ పాత వెంచర్ నందు ప్లాట్లు కొనబడును. సంప్రదించండి. ఫోన్: 9849934308

VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బందరురోడ్డు, బెంజి సర్కిల్‌కి 5 కి.మీ., నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP & APCRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- సంప్ర: ✆ 93985 76997.

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్, టోల్‌గేట్, విక్యాత్ ఇన్ఫ్రా ప్లాట్ నం. 261, 353 Sq. yds., HMDA Layout, 15000/- per యార్డ్ అమ్మబడును ✆ 8688526099

డైరెక్ట్ కంపెనీ సేల్ యాదగిరిగుట్ట వంగపల్లి జంక్షన్ ప్రక్కన వరంగల్ హైవే ఫేసింగ్‌కు DTCP అప్రూవల్ వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు కలవు. కంపెనీ ఫిక్స్‌డ్ రేట్ గజం 10,000/- రూ॥ సంప్ర: 96666 07146.

హైదరాబాద్‌లో ఒక ప్రముఖమైన రియల్ ఎస్టేట్ కంపెనీవారు అభివృద్ధిచేసిన లేఔట్లలో గవర్నమెంట్ వారిచే ఆమోదించబడిన ఇళ్ల స్థలములు కలవు. Ph: 7989008634

COMMERCIAL SPACE FOR SALE

Commercial property special offer Invest 21 Lacks, Rent 21,000/- Pm, forever with registration. Ph: 7997999517, 7997999518

Kokapet Grade-A Commercial Office Space for Sale. Rs. 85 Lakhs. High Rental Value. Contact: 7330730038.

940 Sft Office Space With Car Park In Annapurna Block, Aditya Enclave For Sale. Contact: 9885127892

LEASE/ RENT

Lease/ Rent: Commercial Building at Habsiguda Main Road Each Floor 4444 Sq.Ft. Call: 9848055047.

WANTED

School Lands: iris florets group of schools is looking for 1-5 acres built 2 suite lands on long lease in & around Hyd-Bad/ Sec-Bad. Ph: 8019724610, 9347497766.

గుంటూరు, కాజా, మంగళగిరి, నంబూరు, కొప్పురావూరు, వెనిగండ్ల, కంతేరు, ఆగతారపాడు, పెద్దకాకాని, గోరంట్ల, రాజధాని ప్రాంతాల్లో ప్లాట్లు అమ్మాలన్నా కొనాలన్నా సంప్ర: 9381457579.

PROPERTY FOR SALE

Kapil Properties Invest 48 Lakhs Earn Monthly Returns 48000/- up to 25 Months After that 27000/- ROI for 20 years Kapil Business Park (WTC) Krishna: 6300883718.

Gachibowli Hostel Buildings: 100Y @ 3.50cr, 170Y @ 8cr, Rent:5L, 200Y @ 8.2cr, Rent:6L, 400Y @ 14cr, R:9L & 600Y @ 25cr, R:12L. Ph: 9100587259

Hitech City: Rental Property: 300Y G+5 @15Cr, R: 7L, 200/170Y G+5 @8Cr, R: 6L, 400Y G+5 @14Cr, R: 9L & Open Plot: 300 yds @2.5L. Ph: 9100587259

BUILT TO SUIT
In Prime Location at Greater Hyderabad Municipal Corporation Region
SANATHNAGAR HYDERABAD-500018
Free Hold ,Title Clear
Plot 3259 Sq Yard ;
Floor Plate:18084 Sq Ft Approx.
Construction Potential 90473 to 108460 Sq Ft Approx. Depending upon Floor Rise.
OUTRIGHT SALE
Land Use:work Centre Use zone and affected by proposed 60 Ft wide road As per Master Plan
IDEAL FOR CORPORATE OFFICE BUILDING, IT, ITeS, DATA Centres, GCC, Co-working, Studios, Hotels, School , College, Polytechnic College, Retail Shopping Centre, Universities and Specialized Education Institutions, Research and Developement Centre, Warehouses and Storage Godown, Hospital, Dispensary, Exhibition Centre etc.
Contact
For English - 9821020345
For Telugu-9989930921

FARM HOUSES

Farm House 1394 Sq.yards, East facing, G+1, Fully furnished, Ready to live, Surrounded by farm houses and villas, 4360 sft built up area with Mango, Guava, Coconut & Banana trees, Prime Location is for sale at Gangaram Village, Maheshwaram Mandal. ✆ 7330989555.

LAND REQUIRED

ఏ హైవేకి అయినా ఉన్న రైతు భూమి 2 Cr లో ఒక ఎకరం మాత్రమే కావలెను. Ph: 9398916875.

INDUSTRIAL SHED

Sale/ Rent: Commercial Shed, A30/4/IDA Kukatpally, Near Bright Concept High School, Gandhinagar, 1468 Sq.Yards Hyderabad 37. Ph: 9949656747

TO LET

Malakpet main Road Opp: D-Mart Lane Ground & 1st Floor each Floor 2400 Sft Commercial Space & 2 & 3BHK New Flats with Fully Furnished for Rent. Cont ✆ 9985929502.

Rent 8000sft Ground Flr 3000 sft+ 3000sft 1st Flr 2000 sft Opp: D-Mart Sec-Bad Opp St Anns School Suit: For Air Bnb Cubicles Doctors Nurses Teachers Ladies Hostel Surrounded By Apollo Yashoda Keyes High School St Marys & St Patrics: 9849019944

1st Floor, 2BHK Portion, Bore & Municipal Water, 950 Sq.Ft. Venkata Sai Colony, Opp. Venkateswara Swamy Temple, Jillelaguda. 50 Meters from Jillelaguda- Meerpet Road. Contact: 7569057178, 9490956857.

Meerpet Sri Sairam Nagar Colony, 1BHK Ground Floor Indp. House with Cupboards for Rent. Contact ✆ 9985193663.

Prashanthnagar Uppal Duplex Lift inverter Two parking 3200 Sq.ft LFC Ph: 9440896527 Office/ Commercial/ Family.

COMMERCIAL

Small Pent house Office Available For Rent In Jubilee Hills Road No.-10. Rent-25k. Contact - Khaja. 95730 99016

Balanagar Main Road Commercial Space Lease, Ground+3 Floors, 2 Lifts. Suitable for Banks, (Already Built with Strong Room & Locker Room) MNCs, Super Markets, Shopping Malls. Each Floor 4500 S.Ft. ✆ 93955 59999, 99666 21349.

BOOK YOUR CLASSIFIED
Ad ₹1450/- (5 Lines B/w)
3 Ads Package ₹ 3695/-
7 Ads Package ₹ 8580/-
STHIRASTHI ₹ 1580/- (5 Lines B/w)
★ GST 5% Extra
Ph: 040- 23440304, 23318181, Extn: 6422
Through Online
www.eenaduclassifieds.com

ఇంటి కొనుగోలుకు దీపావళి ధమాకా

ఈనాడు, హైదరాబాద్

తగ్గింపు ధరలకు విక్రయిస్తున్న కొందరు బిల్డర్లు

మార్కెట్లో కొనుగోలు చేసేటప్పుడు ఆఫర్లు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తుంటారు. తగ్గింపు ధరల ధమాకా ప్రకటించగానే ఎగబడుతుంటారు. మళ్లీ పెరగకముందే సొంతం చేసుకోవాలని ఆరాటపడుతుంటారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్‌లో ఇలాంటి ధమాకా నడుస్తోంది. కొంతకాలంగా ఇళ్ల ధరలు స్థిరంగా ఉన్నాయి.



మార్కెట్లో నెలకొన్న స్తబ్దత కారణంగా కొందరు బిల్డర్లు తగ్గింపు ధరలకు అందిస్తున్నారు. దీర్ఘకాలం కోసం పెట్టుబడి పెట్టేవారికి సైతం ఇది సరైన సమయం అంటున్నారు.

స్టాక్ మార్కెట్ అయినా, రియల్ ఎస్టేట్ అయినా ధరలు తగ్గినప్పుడు పెట్టుబడి పెట్టడం తెలివైన పనిగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తుంటారు. అయితే స్థిరాస్తి రంగంలో ధరలు పెరుగుతున్నప్పుడు ఉన్నంత కొనుగోళ్ల జోష్.. నిలకడగా ఉన్నప్పుడు కన్పించదు. ఇన్వెస్టర్లు తగ్గడమే ఇందుక్కారణం అంటాయి పరిశ్రమ వర్గాలు. ఇన్వెస్టర్లు ఈరోజు కొని 2, 3 నెలల్లోనే విక్రయించి రాబడి పొందాలనే ఆలోచనలో ఉంటారు. సొంతింటి కోసం ఎదురుచూస్తున్న వారికి రాత్రికి రాత్రే ధరలు పెంచే పరిస్థితులు ఇబ్బందికరం. స్థిరంగా ఉన్నప్పుడు, చెప్పాలంటే తగ్గింపు ధరలకు వస్తున్నప్పుడు కొనుగోలు చేయడం మేలు అని స్థిరాస్తి రంగ నిపుణులు సూచిస్తున్నారు. పండగ వేళ ధమాకా జారవిడుచుకోవద్దని సూచిస్తున్నారు.

ఎంపిక ఎలా..

నివాసం ఉండేందుకు కొనుగోలు చేయాలనుకుంటున్నారా లేక పెట్టుబడి, అద్దె ఆదాయం కోసం చూస్తున్నారా అనే దాన్నిబట్టి ఇంటి ఎంపికకు ప్రాధాన్యం ఇవ్వాలి.



నివాసం ఉండేందుకైతే..

- బడ్జెట్ ఎంత అనేది ముందుగా నిర్ణయించుకోవాలి. ఆ స్థాయిలో వ్యక్తిగత ఇళ్లు, ఫ్లాట్లు, విల్లాలు ఎక్కడ ఉన్నాయో జల్లెడ పట్టాలి.
- నివాసం ఉండేందుకు కాబట్టి పని ప్రదేశానికి చేరువలో ఉండే ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. కనీసం పిల్లల విద్యాసంస్థలకు దగ్గరలో ఉండేలా అయినా జాగ్రత్తపడాలి.
- ప్రస్తుతం మార్కెట్లో 3 పడక గదుల నివాసానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. బడ్జెట్ సహకరించపోతే రెండు పడక గదులతో రాజీ పడాల్సి ఉంటుంది. గేటెడ్ కమ్యూనిటీలలో 2.5 పడక గదుల ఫ్లాట్లు ఉంటున్నాయి.
- చేతిలో సొమ్ము ఉంటే సిద్ధంగా ఉన్న నివాసాలను ఎంపిక చేసుకోవచ్చు. ప్రాజెక్ట్ పురోగతి ఆధారంగా డబ్బు సర్దుబాటు అవుతుంది అనుకునేవారు నిర్మాణంలో ఉన్న ఇళ్లను కొనుగోలు చేయవచ్చు.
- నిర్మాణంలో ఉన్న, కొత్తగా మొదలెట్టిన వాటిలో కొంటుంటే బిల్డర్ గత చరిత్ర చూడటం విస్మరించవద్దు. గతంలో చేపట్టిన ప్రాజెక్టులు, గడువులోపు పూర్తిచేశారా? నాణ్యంగా నిర్మించారా అనే విషయాలు గమనించాలి.
- అద్దె ఇంటి ఇబ్బందులు పడలేం.. వెంటనే సొంతింటికి మారాలనుకుంటే, రుణం పొందేందుకు ఇబ్బంది లేకపోతే సిద్ధంగా ఉన్న ఇళ్లను కొనుగోలు చేయవచ్చు.

అద్దె కోసమైతే..

- ఇప్పటికే ఒక ఇల్లు ఉంది. నెలవారీ స్థిరమైన ఆదాయం కోసం ఇంటిని కొనుగోలు చేసేవారికి ప్రాంతం ఎంపిక అత్యంత కీలకం.
- పని ప్రదేశాలకు, ఐటీ కార్యాలయాలకు చేరువలో ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసుకోవచ్చు. ఇక్కడ ఎక్కువ అద్దెలు వస్తాయి.
- అద్దెకు ఇచ్చేందుకు రెండు పడక గదుల ఇళ్లు అనుకూలంగా ఉంటాయి. వీటిని అద్దెకివ్వడం సులువు. బంజారాహిల్స్‌లాంటి ప్రాంతాల్లో ఒక పడక గదికి కూడా మంచి అద్దె వస్తుంది.
- ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఇళ్ల ధరలు అధికంగా ఉంటాయి కాబట్టి.. ముస్ముందు అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలి. కనీసం సౌకర్యాలు లేకపోతే అద్దెకు ఎవరూ రారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. వీరికి సిద్ధంగా ఉన్న ఇంటి ఎంపిక మేలు.
- సహజంగానే సౌకర్యాలన్నీ ఉన్నచోట కొనుగోలు చేయాలంటే బడ్జెట్ సైతం కాస్త ఎక్కువ అవుతుంది.

పెట్టుబడి దృష్ట్యా..

- పెట్టుబడి కోణంలో చూసేవారు ఎక్కువగా నిర్మాణంలో ఉన్న ఇళ్లను కొనుగోలు చేస్తుంటారు. ప్రారంభంలో బుక్ చేసి.. ఫ్లాట్, విల్లా సిద్ధం కాగానే విక్రయిస్తుంటారు. చివరి వరకు ఆగితే ఆశించిన రాబడి రాదని భావించేవాళ్లు మధ్యలోనే అమ్మేస్తుంటారు.
- డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు చేస్తే తిరిగి విక్రయించడం సులువు అవుతుంది.

ఈనాడు స్థిరాస్తి

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బిల్డర్లు, రియల్ వ్యాపారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. ప్రశాంతంగా వ్యాపారం చేసుకోవచ్చని చెప్పారు. గతంలో పొందిన నిర్మాణ అనుమతులు, ఎన్వోసీలు రద్దు చేయబోమని స్పష్టం చేశారు. స్థిరాస్తి రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు తెలంగాణ గ్రోత్ ఇంజిన్ అన్నారు. రాష్ట్రానికి 60శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తుందని, నగరంలో మౌలిక వసతులను మరింత మెరుగుపర్చేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర బడ్జెట్‌లో ఈసారి రూ.10వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. **-న్యూస్‌టుడే, మాదాపూర్**

రియల్ ఎస్టేట్.. నిర్మాణరంగం

తెలంగాణ గ్రోత్ ఇంజిన్

- గతంలో పొందిన నిర్మాణ అనుమతులు, ఎన్వోసీలు రద్దు చేయం
- హైదరాబాద్‌ను అంతర్జాతీయస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం
- నరెడ్కో స్థిరాస్తి ప్రదర్శనలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరెడ్కో) ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన స్థిరాస్తి ప్రదర్శనను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలోని స్థిరాస్తి, నిర్మాణరంగ అసోసియేషన్ సభ్యులతో ఇటీవల సమావేశమై వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ రంగానికి సంబంధించి రాష్ట్రంలో ఉన్న గుర్తింపు సంఘాలు కలిసి పది మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి నెల కమిటీ సభ్యులతో సమావేశమై సమస్యలపై చర్చించి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, కాంగ్రెస్ హయాంలోనే ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగిందని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు సైతం తమ ప్రభుత్వ పాలనలోనే చేపడుతున్నట్లు వివరించారు. ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్‌ను అనుసంధానం చేస్తూ రేడియల్ రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

నగర సెంటిమెంట్‌కు భంగం కలిగించం..

మెట్రో రైల్‌ను విస్తరించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు మంత్రి తెలిపారు. నగరానికి తాగునీటి సరఫరాను మరింత పెంచే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలో హైదరాబాద్ ముందంజలో ఉందన్నారు. హైదరాబాద్ సెంటిమెంట్‌కు భంగం కలిగించే ప్రసక్తి లేదన్నారు. తానూ ఇక్కడే పుట్టి పెరిగానని, శ్రీనగర్‌కాలనీ, పంజాగుట్ట ప్రాంతాల్లో ఒకప్పుడు తమ వ్యవసాయ పొలాలు ఉండేవన్నారు. నగరంతో విడదీయరాని అనుబంధం ఉందని వెల్లడించారు. గత ప్రభుత్వంలా కాకుండా తమది ప్రోయాక్టివ్, ఇంటరాక్టివ్, డెమోక్రటిక్ ప్రభుత్వమని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని గ్లోబల్ సిటీగా మార్చేందుకు అంకిత భావంతో పనిచేస్తామన్నారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.



జ్యోతి వెలిగించి ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో నరెడ్కో ప్రతినిధులు

ఆర్థికాభివృద్ధిలో కీలకం..

నరెడ్కో జాతీయ అధ్యక్షులు జి.హరిబాబు మాట్లాడుతూ.. తక్కువ స్థాయిలో ఆదాయాలుండే వర్గాల కోసం అందుబాటులో ధరల్లో నిర్మించే గృహాల(అఫోర్డబుల్ హౌసింగ్)కు సంబంధించి రిజిస్ట్రేషన్ ఛార్జీలను 2.5-3 శాతానికి తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా 61శాతం పట్టణ జనాభాకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. తెలంగాణలో రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.16వేల కోట్లు, జీఎస్టీ ద్వారా మరో రూ.25వేల కోట్లు నిర్మాణరంగం నుంచే వస్తున్నట్లు చెప్పారు. బిల్డర్లు అద్దాల గదిలో బతుకుతున్నారు.. ఎవరు రాయి వేసినా అది పగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. హైదరాబాద్‌కు ఉన్న పాజిటివ్‌నెస్‌ను పాడుచేయొద్దు.. సెంటిమెంట్‌ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో స్థిరమైన వృద్ధి..

నరెడ్కో తెలంగాణ అధ్యక్షులు విజయసాయి మేక మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థిరాస్తి రంగంలో స్థిరమైన వృద్ధి కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తుండటంతో ఇది సాధ్యమైందన్నారు. మూసీ నదికి పునరుజ్జీవం అద్భుతమైన కార్యక్రమం.., అది పూర్తయితే పర్యాటకంగా మరింత వృద్ధి సాధించే అవకాశం ఉంటుందన్నారు. ముచ్చర్లలో ఫోర్త్‌సిటీ అభివృద్ధి, మెట్రోవిస్తరణ, ఆర్ఆర్ఆర్‌తో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. నరెడ్కో 29 ఏళ్లుగా పనిచేస్తోంది.. రియల్ఎస్టేట్ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తోందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ నరెడ్కో ముందంజలో ఉందని కరోనా విపత్తు సమయంలో 11 రక్తదాన శిబిరాలు నిర్వహించడంతోపాటు రూ.22 లక్షలు అక్షయపాత్రకు విరాళంగా ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

నరెడ్కో ఉపాధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ బిల్డర్లు ఎంతో శక్తిసామర్థ్యాలున్న వారని, నగరంలో 50, 60 అంతస్తుల భవనాలు నిర్మించే నైపుణ్యం, శక్తి ఉందని చెప్పారు. అనంతరం నర్కెడో మ్యాగజైన్‌ను మంత్రి ఆవిష్కరించారు. నరెడ్కో తరఫున గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్‌కు రూ.10 లక్షల చెక్కును ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లికి మంత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నరెడ్కో ఉపాధ్యక్షులు కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మంచి స్పందన..

హైటెక్స్‌లో నరెడ్కో తెలంగాణ ఏర్పాటు చేసిన 14వ ప్రాపర్టీషోకు మొదటి రోజు మంచి స్పందన లభించింది. నగరంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. నగరానికి చెందిన పేరొందిన స్థిరాస్తి, నిర్మాణ సంస్థలు ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేశాయి. తాము నిర్మిస్తున్న అపార్టుమెంట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు, ఓపెన్ ప్లాట్లు, ఫామ్ ల్యాండ్స్‌కు సంబంధించిన వివరాలను సందర్శకులకు తెలియజేస్తున్నారు. కొనుగోలుదారులు తమకు అనుకూలమైన ప్రాంతం, ధరలపై ఆరా తీశారు. ఈనెల 27 వరకు రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 వరకు ప్రదర్శన కొనసాగనుంది. ప్రవేశం ఉచితం.



స్టాల్స్ వద్ద సందర్శకులు



తొమ్మిది నెలల్లో

రిజిస్ట్రేషన్లు పెరిగాయ్

సెప్టెంబరులో మాత్రం బాగా తక్కువ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ రియాల్టీలో జనవరి నుంచి సెప్టెంబరు వరకు 9 నెలల్లో 59,386 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో 52,591తో పోలిస్తే 13 శాతం పెరుగుదల నమోదైందని నైట్ ఫ్రాంక్ ఇండియా వెల్లడించింది. రూ.కోటి అంతకంటే విలువైన ఇళ్ల లావాదేవీల్లో 79 శాతం వృద్ధి కనిపించిందని తెలిపింది. నెలవారీ గణాంకాలు మాత్రం నిరాశపరిచేలా ఉన్నాయి. ఈ ఏడాదిలోనే అత్యల్ప రిజిస్ట్రేషన్లు సెప్టెంబరు మాసంలో జరిగాయి. 4903 యూనిట్లకు పడిపోయాయి.

నగర రియాల్టీరంగంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా నెలవారీ రిజిస్ట్రేషన్లలో తీవ్ర హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. జనవరిలో 5444 యూనిట్లు కాగా... అత్యధికంగా జులైలో 8781 ఇళ్లు రిజిస్టర్ అయ్యాయి. ప్రభుత్వం భూముల ధరలు సవరిస్తుందనే ప్రచారం నేపథ్యంలో ఎక్కువ మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఆ తర్వాత ఆగస్టులో సాధారణంగా జరిగాయి. సెప్టెంబరు నెలకు వచ్చేసరికి జులైతో పోలిస్తే దాదాపుగా సగానికి పడిపోయాయి. హైడ్రా అలజడినే ఇందుకు కారణం అని నిర్మాణ సంఘాలు అంటున్నాయి.

జనవరి నుంచి సెప్టెంబరు వరకు ఇలా

సంవత్సరం	రిజిస్ట్రేషన్లు
2022	51,412
2023	52,591
2024	59,386

రూ.50 లక్షల లోపు నివాసాల్లో తగ్గుదల

ఇళ్ల విలువ పరంగా చూస్తే రూ.50 లక్షల ధరల లోపు ఉన్న స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు జనవరి నుంచి సెప్టెంబరు వరకు 2023లో 36,685 జరిగితే... ఈసారి 35,538 మాత్రమే జరిగాయి. మూడు శాతం తగ్గుదల కన్పించింది.

- రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య ఉన్న నివాసాలు గత సంవత్సరం 11,139 రిజిస్ట్రేషన్లు నమోదుకాగా ఈసారి 15,298కి పెరిగాయి. 37 శాతం వృద్ధి నమోదైంది.
- రూ.కోటి అంతకంటే ఎక్కువ ఖరీదైన నివాసాల రిజిస్ట్రేషన్లు 4762 నుంచి 8550 అంటే 79 శాతం పెరుగుదల కన్పించింది.
- 1000-2000 చదరపు అడుగుల విస్తీర్ణం కల్గిన ఇళ్ల వాటా 71 నుంచి 68 శాతానికి తగ్గింది.
- 2000-3000 చ.అ. విభాగంలో 9 నుంచి 10 శాతానికి, అంతకు మించి విస్తీర్ణం కలిగిన నివాసాల కేటగిరిలో 2 నుంచి 3 శాతానికి పెరిగింది.

ప్రాంతాల వారీగా చూస్తే..

స్థిరాస్తి వ్యాపారం ప్రధానంగా మేడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో విస్తరించింది. ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్లలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అత్యధికంగా 42 శాతం వాటా నమోదైంది. రంగారెడ్డి జిల్లా 39 శాతం, హైదరాబాద్ జిల్లా 19 శాతం వాటా కలిగి ఉన్నాయి.

వసుంధర

vasundhara@eenadu.in

అతడి దుబారా నచ్చడంలేదు!



ఇద్దరం కార్పొరేట్ ఉద్యోగులం. మంచి జీతాలు. కానీ తనకు ఖర్చు ఎక్కువ. రోజూ ఏదో ఒకటి ఆన్‌లైన్లో, ఆఫ్‌లైన్లో కొంటాడు. బ్రాండెడ్ దుస్తులూ, చెప్పులూ, ఇతర వస్తువులు... ఇప్పటికే డజన్ల కొద్దీ ఉన్నా, కొత్తవి కొని తెస్తాడు. పొదుపు సంగతి గుర్తుచేస్తే, 'కొంత దాస్తున్నాం కదా! సంపాదించేది దేనికి' అంటూ దాటవేస్తాడు. తనకు డబ్బు విలువని తెలియపరిచేదెలా?

– కె.స్రవంతి, హైదరాబాద్

భార్యాభర్తల ఖర్చుపెట్టే అలవాట్లలో కొద్దిగా తేడాలు ఉండటం సహజం. అయితే పూర్తిగా భిన్న ధృవాలైనప్పుడు మాత్రం ఇది సమస్యగా మారుతుంది. డబ్బు, వాటితో కొనే వస్తువులు హోదానీ, గౌరవాన్నీ పెంచుతాయని భావిస్తారు కొందరు. 'ఎన్నో ఇబ్బందులు పడి ఇక్కడివరకూ వచ్చాం. ఇకనైనా జాగ్రత్తగా ఉందాం' అనుకుంటారు మరికొందరు. స్థితిమంతుల కుటుంబ నేపథ్యం ఉన్నా, ఆర్థిక క్రమశిక్షణను తల్లిదండ్రుల నుంచి అలవర్చుకున్నవారూ ఉంటారు. వస్తువుల్లో ఆనందం చూసేవారికి పొదుపుమాట చెబితే చిరాకు, కోపం వస్తాయి. ఇద్దరూ సంపాదిస్తున్నారు, ఒకరి ఇష్టాలను మరొకరు గౌరవించాలి. దీనిగురించి చిర్రుబుర్రులాడే బదులు.. చర్చించుకుని ఏకాభిప్రాయానికి రావాలి. ఉమ్మడి ఆదాయంలో జీవనశైలి ఖర్చులకు కొంత మొత్తం కేటాయించండి. అది మరీ తక్కువ కాకుండా ఆదాయంలో దాదాపు 10 శాతానికి అటూ ఇటుగా చూసుకోండి.

లేదంటే, వ్యక్తిగత ఖర్చులపై ఒక నిర్దిష్టమైన మొత్తాన్ని పెట్టుకుని దాన్ని మించకుండా చూసుకుంటే, దుబారా సమస్య తలెత్తదు. మొత్తం నెలవారీ ఖర్చుల్నీ, కచ్చితంగా పొదుపు, మదుపు చేయాల్సిన మొత్తాల్నీ ఒకచోట రాసిపెట్టుకోండి. జీతాల నుంచి ఆ మొత్తాన్ని ముందు పక్కకు పెట్టండి. ఆపైన మిగిలిన మొత్తంతో మీకు నచ్చినవి కొనుక్కునే, లేదంటే దాచిపెట్టే స్వేచ్ఛ తీసుకోండి.

– డి.శోభారాణి, సైకాలజిస్ట్

కొందామా... దీపావళి కానుక!

మనకెన్ని పండగలైనా ఉండనివ్వండి. దీపావళి మాత్రం ప్రత్యేకం కదూ! ప్రతి ఇల్లూ దీపాల వెలుగులో కళకళలాడిపోతుంది. ఇక చిన్నా పెద్దా అంతా కలిసి చేసే సందడే వేరు. మరి పండగవేళకి సిద్ధమవ్వాలిగా... షాపింగ్ చేశారా? అసలు ఆనందం మొదలయ్యేది అక్కణ్నుంచే మరి!



ప్రతి పండగకీ స్నేహితులు, బంధువులతో మిఠాయిలు పంచుకోవడం మామూలే! కానీ దీపావళికి మాత్రం నోరు తీపి చేసుకోవడమే కాదు... బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం రివాజుగా వస్తోంది. అందుకే పండగకి ముందు నుంచే 'ఎవరికి ఏమిద్దాం' అని సతమతమవుతాం కానీ... ఈ హడావుడి మన మనసుని తేలికపరుస్తుంది. అదెలా అంటే షాపింగ్‌లో ఉన్న మహత్తే ఇది. మనసు పడే ఒత్తిడి, బాధ అంతటినీ తుడిచేయగలదు... ఎన్నో అధ్యయనాలూ చెబుతున్న మాటిది.

బాధ, ఒత్తిడి ఎప్పుడు కలుగుతాయి? మన చేతిలో ఏదీలేదు, అనుకున్నట్లుగా జరగట్లేదు అనుకున్నప్పుడే కదా!

షాపింగ్ అంటే కలర్, మోడల్, ఖరీదు... ఒకటా రెండా ఎన్నెన్ని చూసుకోవాలి? అన్నింటినీ దాటి చివరగా ఒకటి ఎంచుకుంటాం చూడండి. అప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పతరమా? ఈ షాపులో దొరుకుతుందేమో... అక్కడ మన కళ్లను కట్టిపడేసేది కనిపిస్తుందేమో అన్న ఎదురుచూపు, ఆతృత... సంతోషాన్నిచ్చే హార్మోన్లను విడుదల చేస్తాయి. పైగా ఆ క్లాత్, ఈ మెటల్ అంటూ వెతికే క్రమంలో వేరే ఆలోచనలే దరిచేరవు.

ఇక 'మీరెక్కణ్నుంచి వచ్చారు, మీకా బంధువులకా? పాప వయసెంత' అంటూ కొత్తవాళ్లతో మాటలు కలిపేస్తామా... ఈ సరికొత్త పరిచయాలూ మరింత ఉత్సాహాన్ని నింపేస్తాయి. ఆన్‌లైనైనా ఆఫ్‌లైనైనా... డిస్కౌంట్ కోసం పక్కాగా చూస్తాం. ఎంత తగ్గితే అంత ఆదా చేశామన్న ఉత్సాహం. ఇదీ థెరపీనే!



మనకోసం ఏమైనా కొనుక్కుంటే... కొత్త సరదా ఓవైపు. అది చూశాక ఇతరులు ఎలాంటి ప్రశంసలు ఇస్తారోనన్న ఉత్సాహం... వాటి గురించి వివరిస్తోంటే మాటల్లో ఒకింత గర్వం... ఇవన్నీ మనసును ఉత్తేజితం చేస్తాయి. ఇక స్నేహితులు, బంధువులకు కొంటోంటే... వాళ్లకేమిష్టం అని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాం. దానిలో వారిపట్ల మన ప్రేమ, కృతజ్ఞతను జోడిస్తాం. ఎలా ఇవ్వాలి? ఇచ్చాక వాళ్ల స్పందన ఎలా ఉంటుంది అన్న ఆలోచనలు ఉద్వేగానికి గురిచేస్తాయి. ఇక అందుకున్నవారి కళ్లల్లో కనిపించే ఆనందం.. వారితో బంధానికి మనమిస్తున్న విలువకు గుర్తింపే! అది ఆత్మసంతృప్తినీ కలిగిస్తుంది. ఇంటి కోసం కొన్నా... అది చిన్నదే అయినా ఆ మార్పు కొత్త ఆశలకు దారితీస్తుంది. దీపావళి అంటేనే చెడును దూరం చేస్తూ మంచికీ, ఆనందానికీ పలికే ఆహ్వానం. అందుకే వాటిని స్వాగతిస్తూ సరదాగా షాపింగ్ చేసేయండి.

ఇంతకీ ఏం ఇస్తున్నారు

ఫ్యాషన్ అంటే ఇష్టపడేవారికి దుస్తులు, స్టేట్‌మెంట్ నగలు ఇవ్వొచ్చు. మొక్కలంటే ఇష్టపడేవారికి వాజ్‌లే కాదు... ప్లాంట్ యాక్సెసరీలూ ఉత్తమ ఎంపికే! ఇవైతే హోమ్ డెకార్‌గానూ పనికొస్తాయి. దీపావళి వేళ కదా... సరికొత్త దియాలను ఇవ్వండి. సస్టెయినబిలిటీని ప్రోత్సహిస్తూ మెటల్, రాక్ దియాలు, దియా బౌల్స్, కుందన్, రంగోలీ దియా, స్టిక్కర్లనీ ఇవ్వొచ్చు. ఓవైపు సంప్రదాయానికి విలువిస్తూనే మరోవైపు పర్యావరణానికీ ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతుంది. పండగంటేనే మిఠాయిలు... అవి లేకుండా ఎలా? సరికొత్త రుచులతో గిఫ్ట్‌ప్యాక్‌లు ఇవ్వొచ్చు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చేవారికి షుగర్ ఫ్రీ, నట్స్‌తో, మిల్లెట్స్‌తో చేసిన రుచులు ఉండనే ఉన్నాయి. ఏమేం ఉండాలన్నవి మనమే ఎంచుకునే వీలు కల్పిస్తున్నాయి కొన్ని సంస్థలు.



ఈ ఏడాదికి చివరి పెద్ద పండగ దీపావళి. అందరినీ ఒక్కటిగా చేర్చే వేడుక కూడా. దీన్ని మరింత సంబరంగా జరుపుకోవడానికి మీలోని షాపింగ్ ఆర్టిస్ట్‌ని బయటకు తెండి. పొదుపుగా... ఇష్టంగా అన్నింటినీ ఇంటికి తెచ్చేయండి!

ఇంట్లో కామ్‌డౌన్ కార్నర్ ఉందా?

ఆరేళ్ల కూతురికి కోపం వచ్చిందంటే చాలు. బొమ్మలన్నింటినీ దూరంగా విసిరేసి నానా గొడవ చేస్తుంది. ఆ సందర్భాన్ని సమన్వయం చేయాలంటే ఐశ్వర్యవల్ల కాదు. అలాగే తీవ్ర ఒత్తిడి, ఆందోళనకు గురైనప్పుడు తన మనసును ప్రశాంతంగా ఎలా మార్చుకోవాలో ఐశ్వర్యకూ తెలియదు. ఇటువంటి పరిస్థితుల్లోనే 'కామ్‌డౌన్ కార్నర్' మనసుకు ఔషధంలా పనిచేస్తుంది. ఇంట్లోనే ఏర్పాటు చేసుకోగలిగే ఈ కార్నర్ క్షణాల్లో ప్రశాంతతను అందిస్తుంది.





చిన్నారులకు...

పిల్లల గదిలో ఓ మూలను 'కామ్‌డౌన్ కార్నర్'కు కేటాయించాలి. అక్కడ చిన్నారులకు సౌకర్యంగా ఉండేలా ఓ చిన్న ఊయల లేదా బీన్‌బ్యాగు, మెత్తటి సీటింగ్‌తో చిన్న టేబుల్ వంటివి సర్దాలి. బయటి నుంచి వెలుతురు, గాలి వచ్చే ప్రాంతమైతే మరీ మంచిది. గోడకు మబ్బులు, ఎగిరే పక్షులు వంటివి ఉండేలా వాల్‌స్టిక్కర్ అంటించాలి. సమీపంలో కథల పుస్తకాలు, పజిల్స్, కలర్ పెన్సిళ్లు వంటివి సర్దిన అలమర ఏర్పాటు చేయాలి. పిల్లలకు ఆ కార్నర్ ప్రత్యేకతను వివరించాలి. బోర్ కొడితే అక్కడ కూర్చుని తనకు నచ్చిన పని చేయొచ్చని చెప్పాలి. దీంతో వాళ్లకు ఆ చోటు ప్రత్యేకత తెలుస్తుంది. ఏదైనా సందర్భంలో పిల్లలు ఒత్తిడికి గురైనప్పుడు లేదా దేన్నికైనా పేచీ పెడుతున్నప్పుడు ఆ కార్నర్‌కు తీసుకెళ్లి కూర్చోబెట్టాలి. నెమ్మదిగా సెటిల్ అవడమే కాకుండా వాళ్లకు నచ్చిన పని చేయడం మొదలుపెడతారు. దాంతో తిరిగి ప్రశాంతంగా మారతారు.

పెద్దవాళ్లకూ...

మనకంటూ ఇంట్లో ప్రత్యేకంగా స్పేస్ ఉంటే ఆ ఆనందమే వేరుగా ఉంటుంది. దీనికోసం నలుగురూ కూర్చునే చోట కాకుండా ఇంట్లో మనకు నచ్చే చోటును కామ్‌డౌన్ కార్నర్‌గా మార్చుకోగలగాలి. అలా ఎంపిక చేసిన చోట చిన్న ఊయల లేదా మెత్తని నేల పరుపు, కలర్‌ఫుల్‌గా కనిపించే దిండ్లు సర్దాలి. పక్కనే రెండు మూడు ఇండోర్ మొక్కలు, నచ్చిన రచనలున్న టెంపరరీ బుక్ స్టాండు వంటివి ఉంచాలి. బయటి నుంచి గాలి వచ్చేలా కిటికీ పక్కగా అయితే మరింత ఆహ్లాదంగా ఉంటుంది. మనసులో ఆందోళనగా ఉన్నప్పుడు లేదా ఒత్తిడి అనిపించినప్పుడు వేడివేడిగా కప్పు కాఫీతో అక్కడికెళ్లి కాసేపు ప్రశాంతంగా కూర్చోవాలి. కాఫీ తాగుతూ, నచ్చిన పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని అందులో మనం ఇష్టపడే పేజీలను మరొకసారి చదివితే చాలు. మనసంతా సంతోషంగా, ఉత్సాహంగా మారుతుంది.

జననాంగ సమస్యలకు...



సుప్త భద్రాసనం మొదలుపెట్టడానికి ముందు యోగా మ్యాట్‌పైన వెల్లకిలా(శవాసనంలో) పడుకుని.. దీర్ఘ శ్వాస తీసుకోండి. భుజాలను, వెన్నెముకను నిటారుగా, ఒత్తిడిలేకుండా విశ్రాంతిగా ఉండండి. ఇప్పుడు నెమ్మదిగా మోకాళ్లను వంచి పాదాల్ని ఒకదానికొకటి దగ్గరగా చేర్చండి. ఆపై సున్నితంగా మడమల్ని పెల్విక్ ప్రాంతానికి దగ్గరగా తీసుకురండి. ఆసన సమయంలో చేతుల్ని తుంటి పక్కన ఉంచి... అరచేతుల్ని ఆకాశంవైపు చూసే విధంగా చాచి ఉంచండి. ఆపైన ఉదర కండరాలను కుదించండి. 15-20 సెకన్లు ఆసనంలో ప్రశాంతత పొందండి. ఆసనం చేసేటప్పుడు, విడుదల చేసేటప్పుడు నెమ్మదిగా చేయాలి. లేదంటే బెణకడం, పట్టేయడం జరుగుతుంటాయి. ఉండగలిగినంతసేపు ఉండి, ఆసనాన్ని నెమ్మదిగా విడుదల చేయాలి. ఆపై కాసేపు శవాసనంలో ఉండండి. ఈ ఆసనం అండాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. నిద్రలేమిని పరిష్కరిస్తుంది, కండరాలకు విశ్రాంతినిస్తుంది. నాడీవ్యవస్థపై ఒత్తిడి తగ్గిస్తుంది, పునరుత్పత్తి వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

హెర్నియా ఉన్నవాళ్లు, మోకాళ్లు, తుంటిభాగంలో గాయాలున్నవాళ్లు డాక్టర్ సలహాతో చేయాలి.

మసాలా వంటకాలు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండండి. మంచినీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. చియా సీడ్స్, పుచ్చకాయ, తాజా ఫలాలు, ఆకు కూరలు తీసుకోవాలి.

– శిరీష, యోగ గురు

బంగారం వెండి



25న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	80,710	80,400	78,035	77,988
ఆర్నమెంట్	73,750	73,650	72,950	72,850
వెండి (కిలో)	100,159	99,020	99,100	100,100
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం(24క్యా)	80,800	81,000	80,800	81,600
ఆర్నమెంట్	74,820	75,010	74,330	75,100
వెండి (కిలో)	98,000	98,500	98,000	99,900
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	79,290	79,080	------	------
ఆర్నమెంట్	72,950	72,850	7,295	7,285 గ్రా
వెండి (కిలో)	105,000	109,000	107.00	110.00 గ్రా

చలిలోనూ వ్యాయామాలు!

అత్యంత సంతోషంగా ఉండే దేశాల జాబితాలో ఫిన్‌ల్యాండ్‌ది ఎప్పుడూ అగ్రస్థానమే. ఇందుకు చాలా కారణాలనే పరిగణనలోనికి తీసుకుని ఉండొచ్చు. కానీ, యూరప్ ఖండంలో అత్యంత దృఢంగా, ఆరోగ్యంగా ఉండేది మాత్రం ఫిన్నీ ప్రజలేనట. ఓ ఫిన్నిష్ ఫిట్‌నెస్ సర్వే ప్రకారం 70 శాతం మంది ఫిన్నిష్ మహిళలు రోజూ వర్కవుట్స్ చేస్తారట. హైకింగ్, స్కీయింగ్, స్నోషూయింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్... వంటివన్నీ వారి రోజువారీ జీవనశైలిలో ఓ భాగం కావడం విశేషం.



ఇలా ఎవరికి వాళ్లు చేసే కసరత్తులే కాదు... బృందాలుగానూ యోగా, పిలాటీస్, జుంబా, నార్డిక్ వాకింగ్ చేయడంతో తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని చెబుతున్నారు. అసలే, మంచు ఎక్కువగా కురిసే ఈ దేశంలో శీతకాలంలో ఏం చేస్తారనే కదా మీ సందేహం. అప్పుడూ వీరు వర్కవుట్లు మానరట. కాకపోతే క్రాస్ కంట్రీ స్కీయింగ్, ఐస్ స్కేటింగ్, స్నోబోర్డింగ్ వంటి క్రీడలతో గడిపేస్తారు. ఇవి సరదానివ్వడంతోపాటు శరీరాన్నీ సౌకర్యంగా మారుస్తాయని చెబుతారు.. మరి ఇంత చేశాక కాస్తంత విశ్రాంతి అయినా ఉండాలి కదా! అందుకే, ఈ లేడీస్ రిలాక్సేషన్, బాడీ డీటాక్సిఫికేషన్ కోసం సానా బాత్‌లకు వెళ్లి ఆవిరి స్నానాలు చేస్తారట.

జడలో... ముత్యాల పిన్నులు!







ముత్యాల ముచ్చట చెప్పాలే కానీ... వీటి గురించి చారిత్రక కథలెన్నో. కృష్ణుడు వేసుకునే హారాల నుంచి క్లియోపాత్రా వినెగర్‌లో కరిగించిన ముత్యం వరకూ వర్ణనలూ మరెన్నో. అందుకే... తరాలు మారినా ముత్యాల నగలంటే మగువలకు మక్కువపోలేదు. అలాగని వాటికే పరిమితం చేస్తే ఎలా అనుకున్నారో ఏమో డిజైనర్లు ముత్యాల యాక్సెసరీలనూ మార్కెట్లోకి తెచ్చారు. వాటికే ఎప్పటికప్పుడు కొత్త హంగులద్ది యువతరాన్ని ఆకట్టుకుంటున్నారు. అలాంటివే ఈ హెయిర్ పిన్నులు కూడా. సంప్రదాయ జడలకే కాదు... ఆధునిక కేశాలంకరణకూ ప్రత్యేక ఆకర్షణ తెచ్చేలా సింగిల్ పెరల్‌తో సిద్ధం చేస్తున్నారు. వీటిని ఎంచుకుని సింగిల్‌గా ఒకటే పెద్ద ముత్యపు పిన్‌ని పెట్టుకోవచ్చు. లేదా ఆరోహణ, అవరోహణ పద్ధతుల్లో అంతకు మించీ వాడుకోవచ్చు. పండగైనా, పెళ్లైనా... ఇవి మీకు కొత్తదనాన్ని తెచ్చిపెడతాయి. మరి ఆ డిజైన్లను మీరూ చూస్తారా?

రికార్డులు అల్లేస్తున్నారు!

కళకు సాధన తోడైతే.. గుర్తింపు దానంతట అదే వస్తుంది. అలా క్రాఫ్ట్ వర్క్‌లపై ఆసక్తి పెంచుకున్న విశాఖకు చెందిన సూరిభట్ల మాధవికీ ఈ గుర్తింపు దక్కింది. 'మహిళా మనోవికాస్' సంస్థ ద్వారా ఊలు ఉత్పత్తులు తయారు చేస్తూ 6 సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించుకున్నారు. తాజాగా ప్రపంచంలోనే అతిపెద్ద క్రోషే స్క్వేర్స్ ప్రదర్శనతో ఈ ఘనత సాధించారు.



మాధవికి చిన్నతనం నుంచి క్రాఫ్ట్ వర్క్‌పై ఆసక్తి. దాంతో ప్రయోగాత్మకంగా కొత్త డిజైన్లు ఎన్నో రూపొందించారు. తొలుత ఆమె 'మధు క్రాఫ్ట్ అండ్ క్రియేషన్స్' పేరుతో పేపర్, ఫ్యాబ్రిక్, జ్యూయెలరీ, పాట్ పెయింటింగ్‌లపై మహిళలకు శిక్షణ ఇచ్చేవారు. కొవిడ్ సమయంలో ఊలు వస్త్రాలు, ఇతర ఉత్పత్తుల తయారీపై మహిళలకు ఆన్‌లైన్లో తరగతులు నిర్వహించారు. ఇప్పటివరకు 2 వేల మందికిపైగా శిక్షణ అందించారు. వారితో కలిసి 'మహిళా మనోవికాస్' పేరిట ఆన్‌లైన్‌లో ఉత్పత్తుల తయారీ ప్రారంభించారు. ఇలా ఈ ఏడాది... 417మంది మహిళలు ఆరు నెలల కాలంలో 58,112 క్రోషే స్క్వేర్స్(మహిళలు ధరించే స్వెటర్లు) తయారుచేసి గిన్నిస్ రికార్డు సాధించారు. గతనెల సెప్టెంబరు 22న గిన్నిస్ వరల్డ్ రికార్డు లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ చేతుల మీదుగా విశాఖలో అవార్డు అందుకున్నారు. 2022లోనూ 200మంది సభ్యులతో నిర్దేశించిన సమయంలో నాలుగువేల ఉత్పత్తుల్ని తయారు చేశారు. 2023లో 250మంది ఆరునెలల్లో 5వేలకుపైగా ఊలుదారం క్రోషే పాంచోలు రూపొందించి గిన్నిస్ రికార్డులు సృష్టించారు.



మాధవి

ఉచితంగా ఇస్తూ..

క్రోషే ఉత్పత్తుల తయారీలో... ఇతర సంస్థలతో కలిసి మూడుసార్లు, తాను స్థాపించిన 'మహిళా మనోవికాస్' ద్వారా మూడుసార్లు గిన్నిస్ రికార్డులకెక్కారు మాధవి. అమెరికాలోని సర్టిఫైడ్ క్రోషే ఇన్‌స్ట్రక్టర్ సర్టిఫికెట్ సాధించిన మొదటి భారతీయురాలిగానూ గుర్తింపు పొందారామె. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా ఊలు వస్త్రాల తయారీ శిక్షణా తరగతులు నిర్వహించే అవకాశం దక్కించుకున్నారు. ఈ బృందం తయారుచేసిన ఉత్పత్తులను పేదలకు, వసతి గృహాల్లో ఉండే విద్యార్థినులకు, గిరిజన ప్రాంత ప్రజలకు, అనాథ ఆశ్రమ చిన్నారులకు, ఆసుపత్రుల్లో ఉండే రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. 52ఏళ్ల వయసులో తనకు వచ్చిన కళను ఇతరులకు అందిస్తూ, అవార్డులు సాధిస్తున్న మాధవి స్ఫూర్తిదాయకమే కదా!

– సీహెచ్.రాజు, పి.ఆనంద్, విశాఖపట్నం

ఆత్మ సంతృప్తి కలుగుతోంది...

ఏలూరుకు చెందిన సరివి ఉషా శారదకు పెళ్లై, ఇద్దరు అమ్మాయిలు. గృహిణిగా స్థిరపడ్డా... భర్త అశోక్ కుమార్‌కు వ్యాపారంలోనూ సాయంగా ఉంటారు. అయితే, సమాజానికి తనవంతు సాయం చేయాలని తపించే ఈమెకు విశాఖపట్నానికి చెందిన సూరిభట్ల మాధవి పరిచయం అయ్యారు. ఆమె 'మహిళా మనో వికాస్' అనే స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్నారని తెలుసుకుని అందులో సభ్యురాలిగా చేరారు శారద.



'సొంతలాభం కొంత మానుకుని పొరుగువారికి సాయపడవోయ్' అన్న సూక్తి నన్ను ఎంతగానో చైతన్య పరిచింది. 'మహిళా మనో వికాస్' ద్వారా సమాజానికి సేవ చేయడం సంతృప్తినిస్తోంది. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం మరింత ఆనందంగా ఉంది. నా భర్త ప్రోత్సాహం ఎప్పటికీ మరవలేను' అంటారు శారద.

– జె.సుబ్బారావు, ఏలూరు

ఈనాడు స్థిరాస్తి

చర్లపల్లి రైల్వే టెర్మినల్ మహానగరం సిగలో మరో మణిహారం కానుంది. దీంతో నగరానికి తూర్పు ఈశాన్యంలో ఉన్న కాప్రా, ఉప్పల్, కీసర, ఘట్‌కేసర్, బోడుప్పల్ ప్రాంతాల రూపురేఖలు మారిపోనున్నాయి. సమశీతల వాతావరణం, నివాస యోగ్యం, కాలుష్య రహిత ప్రాంతం కావడంతో కాప్రా, ఉప్పల్, వరంగల్ జాతీయ రహదారి నడవా ఇప్పటికే ప్రగతి పట్టాలెక్కింది. చర్లపల్లిలో రూ. 430 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో రైల్వే టెర్మినల్ పూర్తి కావచ్చింది. విమానాశ్రయాన్ని తలపించేలా సకల హంగులతో అందుబాటులోనికి వస్తున్న ఈ టెర్మినల్ కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేయనున్నారు. టెర్మినల్ రాకతో చర్లపల్లి, పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు తీయనుంది.

రైల్వే టెర్మినల్‌తో.. చర్లపల్లికి కొత్త రూపు

న్యూస్‌టుడే, కాప్రా

ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక నగరంలోని నాంపల్లి, కాచికూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లపై ప్రయాణికుల ఒత్తిడి గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడి నుంచే నగరం నలుమూలలకు ప్రయాణికులు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అదనంగా కొత్తగా మరో 25 జతల రైళ్లు ఇక్కడి నుంచి పరుగుల తీయనున్నాయి. లక్షల్లో ప్రయాణికులు రాకపోకలు సాగించనున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజారవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టింది.



- పరిసర భూముల ధరలకు రెక్కలు
- జోరుగా స్థిరాస్తి వ్యాపారం

ఎంఎంటీఎస్...

- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో ఎంఎంటీఎస్ రైళ్ల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు.



ఫ్లాట్ల రేట్లు ఇలా...

చదరపు అడుగు	: రూ. 3,400 నుంచి రూ. 4,000 వరకు
లగ్జరీ ఫ్లాట్లు చ.అ.	: రూ. 4,500 నుంచి రూ. 5,000 వరకు
గిరాకీ అధికం	: సింగిల్, డబుల్ బెడ్‌రూంలు.

- టెర్మినల్‌కు రెండున్నర కిలోమీటర్ల దూరంలో హెచ్‌బీకాలనీ ఎంఎంటీఎస్ స్టేషన్ సిద్ధమైంది. త్వరలో అందుబాటులోకి రానుంది.
- ఇక్కడి నుంచి త్వరలో యాదాద్రికి ఎంఎంటీఎస్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. ఇది వినియోగంలోకి వస్తే చర్లపల్లి నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు ఎంఎంటీఎస్ ద్వారా త్వరగా చేరుకునే సౌకర్యం కలుగుతుంది.

గ్రేటర్ పరిధి కావడంతో

- నగర శివార్లలో రైల్వే టెర్మినల్ వస్తుండటంతో అందరి చూపు కాప్రా వైపు పడింది. కాప్రా, శివార్లలోని భూముల ధరలు పెరుగుతున్నాయి.
- పారిశ్రామికవాడలు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలతో ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందింది. చర్లపల్లి, కుషాయిగూడ, మల్లాపూర్, నాచారం ప్రాంతాలు పారిశ్రామికవాడలతో విస్తరించాయి. ఇవన్నీ గ్రేటర్ హైదరాబాద్ పరిధి కావడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి.
- ఇప్పటికే వందల సంఖ్యలో కాలనీలున్నాయి. దీంతో స్థలాలు దొరకడం కష్టమైపోయింది. నివాసయోగ్యమైన ప్రాంతం కావడం, స్థలాలు అత్యంత ఖరీదు కావడంతో బహుళ అంతస్తుల్లో ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు జనం మక్కువ చూపుతున్నారు.
- షాపింగ్ మాల్స్, కళాశాలలు, ప్రజారవాణా వ్యవస్థలు, కూత వేటు దూరంలోని చర్లపల్లి టెర్మినల్‌కు పక్కనే మౌలాలీ, హెచ్‌బీకాలనీ రైల్వే స్టేషన్లు ప్రజలకు వసతిగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఏపీతో పాటు, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల ప్రజలు నివసిస్తున్నారు. దేశంతో పాటు విదేశాల్లో ఉన్నవారికీ ఈ ప్రాంతాలు సుపరిచితం కావడంతో ఇక్కడ రియల్ మార్కెట్‌కు మంచి గిరాకీ ఏర్పడింది.



ఎక్కడెక్కడ ఎలాగంటే...

- చర్లపల్లి, నాగారం, రాంపల్లి, బండ్లగూడ, బోడుప్పల్, దమ్మాయిగూడ ప్రాంతాల్లో అపార్టుమెంట్ల నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి.
- పోచారం, మేడిపల్లి, ఘట్‌కేసర్ ప్రాంతాల్లోనూ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇక్కడ అద్దెలకు గిరాకీ ఎక్కువగా ఉంది.
- కీసర, నాగారం, బండ్లగూడ, కుందన్‌పల్లి, కరీంగూడ, రాంపల్లి ప్రాంతాల్లో విల్లాల నిర్మాణం ఊపందుకుంది.

స్థలాల ధరలు...



- ప్రధాన రహదారులకు సమీపంలో గజం రూ.30,000 నుంచి రూ.50,000 వరకు..
- ప్రధాన రహదారులకు దూరంగా ఉన్న కాలనీలు, బస్తీల్లో గజం రూ.15,000-30,000 మధ్య ఉన్నాయి.
- ప్రధాన రహదారుల పక్కనైతే రూ. 40,000 నుంచి రూ. 80,000 వరకు.
- శివారు గ్రామాల్లోని రహదారుల వెంట రూ. 25,000 నుంచి రూ. 40,000 వరకు..

అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు..

తూర్పు ముఖంగా...: చర్లపల్లి, రాంపల్లి, కరీంగూడ, పోచారం ఐటీ కారిడార్, ఘట్‌కేసర్, అన్నోజిగూడ

దక్షిణం దిశగా... : చెంగిచెర్ల, ఉప్పల్, బోడుప్పల్, పర్వతాపూర్, మేడిపల్లి, ప్రతాప్ సింగారం, కొర్రెముల, ఏదులాబాద్, అవుశాపూర్, అంకుశాపూర్

పశ్చిమ ముఖంగా.. : ఈసీఐఎల్, ఎల్లారెడ్డిగూడ, వంపుగూడ, సైనిక్‌పురి, యాప్రాల్, బాలాజీనగర్, దమ్మాయిగూడ.

ఉత్తరం దిశలో... : నాగారం, కీసర, బోగారం, చీర్యాల, గోధుమకుంట, శామీర్‌పేట్, బొమ్మలరామారం.

గుజరాత్ టు ట్రూప్‌బజార్



న్యూస్‌టుడే, అబిడ్స్



బాత్రూం పరికరాలకు ప్రసిద్ధి

జీవితంలో ఒక్కసారైనా అందమైన ఇల్లు కట్టుకోవాలని ప్రతి ఒక్కరు కలకంటుంటారు. దాన్ని సాకారం చేసుకునేందుకు శ్రమిస్తారు. అందులో భాగమే 'డ్రీమ్ హౌస్ - డ్రీమ్ ప్యాలెస్'. నిర్మించనున్న ఇంట్లో ప్రత్యేకత ఉట్టిపడేలా బాత్రూంలు కూడా ఉండాలని భావిస్తుంటారు. పడక గదులకు ఏమాత్రం తీసిపోని విధంగా అత్యాధునిక హంగులతో వాటిలో వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుండటం విశేషం. ఆధునిక బాత్రూంల ఏర్పాటుకు క్రేజ్ పెరిగింది. ఖర్చులకు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు.

రూ.40 వేల నుంచి రూ.25 లక్షల వరకు..

కొనుగోలుదారుల ఆసక్తి, అభిరుచి దృష్టిలో ఉంచుకొని రియల్ సంస్థలు, బిల్డర్లు నిర్మిస్తున్న బహుళ అంతస్తులు, విల్లాలు, ఇండిపెండెంట్ ఇళ్లలో బాత్రూంల నిర్మాణంలో అత్యంత జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆధునికత ఉట్టిపడేలా తీర్చిదిద్దడంపై దృష్టి కేంద్రీకరించడం విశేషం. పేరొందిన సంస్థలతో పాటు స్థానిక సంస్థలు సైతం సిరామిక్ పరికరాలకు పెద్దపీట వేస్తున్నాయి. వసతుల కల్పనకు రూ.40 వేల నుంచి రూ.25 లక్షల వరకు విలువ చేసే సెట్టింగులు మార్కెట్లో ఉన్నాయి. నగరంలోని అబిడ్స్- కోఠి మధ్యలో ఉన్న ట్రూప్‌బజార్ మార్కెట్ వాటికి ప్రసిద్ధి. ఇప్పుడు ఈ మార్కెట్ కేంద్రంగానే నగరం నలువైపులా బాత్రూంలో సెట్టింగ్‌ల విక్రయాల షోరూంలు, తయారీ సంస్థలు కొలువుదీరాయి. శ్రీనగర్‌కాలనీ, అత్తాపూర్, శంషాబాద్‌లోనూ వెలిశాయి. గుజరాత్ నుంచి సామగ్రి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. బల్క్ విక్రయాలకూ ఆర్డర్లు తీసుకొని ప్రత్యేకించి అభిరుచులకు అనుగుణంగా తయారు చేయించి వారం, 10 రోజుల్లో కొనుగోలుదారులకు అందజేస్తుండటం విశేషం. నాణ్యతా ప్రమాణాల విషయంలోనూ కొనుగోలుదారులకు భరోసా కల్పిస్తూ వారంటీ ఇస్తున్నారు.



వందల రకాల ఆకృతులు



ముఖ్యంగా బాత్రూంలో అవసరమైన కన్సీల్ ట్యాంక్ వెస్ట్రన్ కమోడ్, వాల్ మౌంటెడ్ పెన్సిల్ ట్యాంక్, షవర్, బాత్ టబ్బు, వాష్ బేసిన్, కామన్ కమోడ్, స్టీమ్ బాత్, సైడ్ యుటెన్సిల్స్.. ఒక్కటేమిటి వందల రకాల ఆకృతులు, పరిమాణాల్లో అన్ని వర్గాల వారి బడ్జెట్‌కు అనుగుణంగా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. బాత్‌టబ్ విషయంలో రూ. 30 వేల నుంచి రూ. లక్షల్లో విలువచేసే ఆధునిక టబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇంటి నిర్మాణం విషయంలో తీసుకునే జాగ్రత్తలపై యజమానులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తేనే అన్నీ అనుకున్నట్లు అమరుతాయని వ్యాపారులు చెబుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకే కాకుండా పాత ఇళ్ల మరమ్మతుల్లోనూ ఈ అత్యాధునిక బాత్రూంల నిర్మాణం చేపడితే ప్రయోజనమా లేక నష్టమా అనేది బేరీజు వేసుకోవాలని సూచిస్తున్నారు.

మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల పరిశీలకులుగా

13 మంది తెలంగాణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

ఈనాడు, దిల్లీ: మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో వచ్చే నెల 13, 20వ తేదీల్లో జరగనున్న ఎన్నికల పరిశీలన కోసం తెలంగాణకు చెందిన 12 మంది ఐఏఎస్, ఒక ఐపీఎస్ అధికారి నియమితులయ్యారు. ఇందులో ఇద్దరు ఐఏఎస్, ఒక ఐపీఎస్ అధికారి ఝార్ఖండ్‌కు, మిగతా వారందరూ మహారాష్ట్రకు వెళ్లనున్నారు. మహారాష్ట్రకు స్మితాసభర్వాల్, శ్రీదేవసేన, బాలమాయాదేవి, హరిత, కొర్రా లక్ష్మి, శివలింగయ్య, హైమావతి, తరుణ్‌జోషి, చందనదీప్తి, నారాయణ్‌నాయక్‌లు వెళ్లనుండగా.. ఝార్ఖండ్‌కు ఇలంబర్తి, భవేష్‌మిశ్ర, నవీన్‌కుమార్(ఐపీఎస్) వెళ్లనున్నారు.

నేటి నుంచి తెలంగాణలో తెదేపా సభ్యత్వ నమోదు

- వర్చువల్‌గా ప్రారంభించనున్న పార్టీ అధినేత చంద్రబాబు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఏపీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర నాయకులు రెండు రోజుల క్రితం సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి పెద్దఎత్తున సభ్యత్వ నమోదు చేపట్టాలని నిర్ణయించారు. తర్వాత పార్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ప్రారంభించే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నాయకులందరూ హాజరుకావాలని పార్టీ కోరింది.

రూ.1500 కోట్ల రుణానికి బాండ్ల వేలం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూ.1500 కోట్ల రుణాల సేకరణకు బాండ్లను వేలానికి పెట్టినట్లు రిజర్వ్‌బ్యాంకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 10 రాష్ట్రాల తరపున రూ.25,050 కోట్ల సేకరణకు ఈ నెల 29న బాండ్లను వేలం వేయనున్నట్లు వివరించింది. అత్యధికంగా తమిళనాడు రూ.6 వేల కోట్లు, రాజస్థాన్ రూ.5 వేల కోట్లను సేకరించనున్నాయి.



సీఎండీ ముషారఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాయిబాబు, సంఘాల నేతలు

విద్యుత్తు ఉద్యోగుల మహా ధర్నా వాయిదా

ఈనాడు, హైదరాబాద్: డిస్కం యాజమాన్యంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో శనివారం తలపెట్టిన మహాధర్నాను వాయిదా వేసినట్లు తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.సాయిబాబు తెలిపారు. దక్షిణ తెలంగాణ డిస్కం ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న మహాధర్నా నిర్వహించాలని గతంలో నోటీసు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సంస్థ సీఎండీ ముషారఫ్ తమను చర్చలకు ఆహ్వానించి పెండింగ్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన వివరించారు. సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలతను వ్యక్తపరచిన నేపథ్యంలో మహాధర్నాను వాయిదా వేస్తున్నట్లుగా సాయిబాబు తెలిపారు.

ఖమ్మం జిల్లాలో కొత్త ఐటీఐ

- ఐదు ట్రేడ్లు, 200 సీట్లతో ఏర్పాటు
- కొత్తగా ఐవోటీ స్మార్ట్ అగ్రికల్చర్ కోర్సు
- 21 పోస్టులు మంజూరుచేస్తూ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త ఐటీఐలకు వేగంగా అనుమతులు లభిస్తున్నాయి. ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) భాగస్వామ్యంతో కొత్త ఐటీఐకి ఆమోదం లభించింది. తాజాగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏటా 200 మందికి ఐదు ట్రేడ్లలో నైపుణ్య శిక్షణ ఇచ్చేలా ఐటీఐ ఏర్పాటుకు అనుమతిస్తూ కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీని నిర్మాణం కోసం రాష్ట్ర సర్కారు రూ.11.37 కోట్లు ఖర్చుచేయనుంది. భవన నిర్మాణం, తరగతి గదులు, యంత్ర సామగ్రి, వర్క్‌షాప్‌లు, పుస్తకాలు, ఇతరాల కోసం రూ.10.31 కోట్లు, శిక్షణ నిధి, ఇతర ఖర్చుల కోసం మిగిలిన సొమ్మును కేటాయించనుంది. కొత్త ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఐవోటీ స్మార్ట్ అగ్రికల్చర్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులు ఉన్నాయి. ఈ ఐటీఐలో శాశ్వత ప్రాతిపదికన ఒక ప్రిన్సిపల్ సహా వివిధ స్థాయుల శిక్షణ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఇలా 21 పోస్టులు, పొరుగు సేవల కింద మరో ఐదు పోస్టులు మంజూరయ్యాయి.



నేర్చుకొనే అవకాశాలను వదులుకోవద్దు

కొత్త విషయాలు నేర్చుకోవడానికి మీ సమయంతోపాటు శక్తిని కూడా వెచ్చించాల్సి వస్తుంది. దానివల్ల మీకు అసౌకర్యంగా అనిపించినా అది తాత్కాలికమే. మీరు సాధించే నైపుణ్యాలు గౌరవంగా జీవించడానికి, నలుగురి ముందు సగర్వంగా నిలబడటానికి దోహదం చేస్తాయి. నేర్చుకొనే అవకాశాలను వదులుకొంటే మీరు శాశ్వతంగా మూర్ఖత్వంలో ఉండిపోయే ప్రమాదముంది.

– ఎ.వేలుమణి, వ్యాపారవేత్త

విద్యార్థులు.. చైతన్య వారధులు!

వ్యవసాయం, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్న బడి పిల్లలు



రోడ్డు ప్రమాదాల నియంత్రణపై శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిశ్ సాంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ

రోడ్డు ప్రమాదాల నివారణపై..

కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఎస్పీ సింధుశర్మ చేపట్టారు. జిల్లాలో 61 పాఠశాల సముదాయాలుండగా.. ఒక్కోదాని నుంచి ఉన్నత తరగతులకు చెందిన ఇద్దరు చొప్పున విద్యార్థుల్ని ఎంపిక చేశారు. రోడ్డు ప్రమాదాలకు కారణాలు, నియంత్రణ విధానాలపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో పీపీటీల ద్వారా అవగాహన కల్పించారు. ఇలా శిక్షణ పొందినవారు తోటి విద్యార్థులు, ఇతరులకు అవగాహన కల్పిస్తున్నారు.

వ్యవసాయానికి అండగా..

నల్గొండ జిల్లాలో రెండు, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కో పాఠశాలను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. భూసార పరీక్షలు, ఇతర వ్యవసాయ సంబంధిత అంశాలపై వ్యవసాయశాఖ విద్యార్థులకు అవగాహన కల్పిస్తోంది. విద్యార్థులే స్వయంగా భూముల నుంచి మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తూ వాటి ఫలితాలను రైతులకు అందజేస్తున్నారు. నేల ఆరోగ్యం, పంటల సాగు, రసాయన ఎరువుల వినియోగంపై నేర్చుకున్న అంశాల ఆధారంగా క్షేత్రస్థాయిలో వివరిస్తున్నారు. రైతులు స్వయంగా భూసార పరీక్షలు నిర్వహించుకునేలా చైతన్యపరుస్తున్నారు.



నల్గొండలో ఓ రైతు పొలంలో మట్టి నమూనాల సేకరణ

ఈనాడు, కామారెడ్డి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికార యంత్రాంగం బడి పిల్లల్ని చైతన్య వారధులుగా ఎంపిక చేసుకుంటోంది. విద్యార్థుల ద్వారా అయితే మరింతగా నిర్దేశిత వర్గాలను చేరగలమనే భావనతో అధికారులు ముందుకెళ్తున్నారు. పలు జిల్లాల్లో వ్యవసాయాభివృద్ధి, రోడ్డు ప్రమాదాల నివారణ, ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపు వంటి కార్యక్రమాలపై ఎంపిక చేసిన విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి.. తల్లిదండ్రులతోపాటు స్థానికులు, తోటి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎలక్షన్ లిటరసీ క్లబ్‌లు

లోక్‌సభ, అసెంబ్లీ, స్థానికసంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎలక్షన్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సంబంధిత జిల్లా నోడల్ అధికారులు 8 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల్లో కొంతమందిని క్లబ్‌లోకి తీసుకొని వారికి ఎన్నికల నిర్వహణ, ఓటరు నమోదు, ఓటుహక్కు వినియోగంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులతో పాటు ఇతరులకు అవగాహన కల్పించే బాధ్యతలను అప్పగించనున్నారు.

కోటి మంది మహిళలను

కోటీశ్వరులను చేసేలా కొత్త పథకం

- త్వరలో ప్రజల్లోకి 'ఇందిరా మహిళా శక్తి'
- ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో రమాదేవి, మస్లూర్, సుఖ్‌గీత్‌కౌర్, సంజయ్‌కుమార్ ఝా, నజీర్ జమల్

నిజాంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో త్వరలో 'ఇందిరా మహిళా శక్తి' పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్ ప్రగతినగర్‌లోని ఎలీప్ మహిళా పారిశ్రామికవాడ ఎస్టేట్‌లో 'ఎంఎస్‌ఎంఈ డిఫెన్స్ కాన్‌క్లేవ్' అంశంపై శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 'ఇందిరా మహిళా శక్తి పథకానికి ఇప్పటికే రూపకల్పన పూర్తయింది. తొందరలోనే ప్రజల్లోకి తీసుకొస్తాం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో రక్షణశాఖకు అవసరమైన ఉత్పత్తులను తయారు చేయించి వారికి ప్రోత్సాహం అందిస్తాం. సుదీర్ఘకాలంగా మహిళాభ్యున్నతికి ఎలీప్ చేస్తున్న కృషి అభినందనీయం' అని పేర్కొన్నారు. అంతకుముందు అంకుర సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించి, నూతనంగా ఏర్పాటు చేసిన 'డిజిటల్ స్టూడియో'ను ప్రారంభించారు. ఎలీప్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కన్నెగంటి రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ మంత్రిత్వశాఖ సలహాదారు సుఖ్‌గీత్‌కౌర్, పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ డైరెక్టర్ డాక్టర్ నజీర్ జమల్, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలశాఖ డైరెక్టర్ డాక్టర్ మస్లూర్, రాష్ట్ర ప్రభుత్వ ఏరో స్పేస్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్, మిధాని ఛైర్మన్, ఎండీ డాక్టర్ సంజయ్‌కుమార్ ఝా, ఎలీప్ కార్యదర్శి పద్మజా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఏకీకృత పింఛన్ పెంపునకు 'చలో దిల్లీ'

- ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్



బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: దివ్యాంగులకు దేశవ్యాప్తంగా ఏకీకృత పింఛన్ విధానం అమలుతో పాటు సంబంధిత మొత్తాన్ని రూ.10 వేలకు పెంచాలని కోరుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 10న 'చలో దిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో.. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర నాలుగో మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ.. 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు సామాజిక పింఛన్, 50 శాతం వినికిడిలోపం ఉన్నవారికి ల్యాప్‌టాప్‌లను అందజేయాలన్నారు. దివ్యాంగుల సమగ్రాభివృద్ధికి పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణ వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.వీరయ్య మాట్లాడుతూ.. దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లను సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య, కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త టీచర్లలో 47 శాతం మహిళలు

- గతంతో పోల్చుకుంటే భారీగా తగ్గుదల
- సమాంతర రిజర్వేషన్ విధానం అమలే కారణం
- డీఎస్సీ-2024 విజేతల్లో 54 శాతం మంది 30 ఏళ్ల లోపు వారే



వయసుల వారీగా టీచర్లుగా ఎంపికైన వారు

25 ఏళ్లలోపు	1,239
26-30	4,172
31-40	3,619
40 దాటిన	976
మొత్తం	10,006

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల్లో మహిళలు 47 శాతం మంది ఉన్నారు. ఇప్పటికే ప్రభుత్వ టీచర్లలో 50 శాతానికిపైగా మహిళలున్నారు. మహిళలకు ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు అవుతుండటం.. బోధనా వృత్తిపై వారు అధికంగా ఆసక్తి చూపుతుండడం.. మరికొన్ని ఇతర కారణాల వల్ల ఉపాధ్యాయుల్లో వారి శాతం గణనీయంగా పెరుగుతోంది. 2017 డీఎస్సీలో సైతం 55-60 శాతం మంది వరకు మహిళలే ఎంపికయ్యారు. ఈసారి డీఎస్సీలో అది 47 శాతానికి పడిపోవడం గమనార్హం. మొత్తం 10,006 ఉద్యోగుల్లో 4,706 మంది మహిళలు, 5,300 మంది పురుషులు ఉన్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

తగ్గుదల ఎందుకు?

ఇప్పటివరకు మహిళలకు ప్రత్యేకంగా రోస్టర్ పాయింట్లు అమలు చేస్తూ వచ్చారు. 33 శాతం రిజర్వేషన్‌తోపాటు మెరిట్‌లో ఇంకా ఎక్కువ మంది ఉద్యోగాలకు ఎంపికయ్యేవారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాంతర రిజర్వేషన్(హారిజంటల్) విధానాన్ని అమలు చేశారు. అందులో మహిళలకు ప్రత్యేకంగా రోస్టర్ పాయింట్లు ఉండవు. దాంతో గత డీఎస్సీల కంటే కనీసం 8-15 శాతం మహిళలు తగ్గారని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఎవరి వేతనం ఎంతంటే..

ఈసారి ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన వారిలో ఎక్కువ మంది 30 ఏళ్ల లోపు వారే. ఆ వయసు వారిలో 5,411మంది(54 శాతం) ఉన్నారు. ఆ తర్వాత 31-40 మధ్య వయసు వారిలో 3,619 మంది ఉన్నారు. ఎస్జీటీలకు మొత్తం వేతనం నెలకు రూ.43,068(మూల వేతనం రూ.31,040), స్కూల్ అసిస్టెంట్లకు రూ.58,691(మూల వేతనం రూ.42,300) అందనుంది. ఎంపికైన 10,006 మందిలో ఎస్జీటీలు 7,388, ఎస్ఏలు 2,618 ఉంది ఉన్నారు.

317 జీఓలో లోపాలను సవరించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో తెలంగాణ ఉద్యోగుల ఐకాస చర్చ



సీఎస్ శాంతికుమారికి వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ ఉద్యోగుల ఐకాస నేతలు

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగులు, ఉపాధ్యాయులను కొత్త జిల్లాల వారీగా కేటాయించేందుకు గత ప్రభుత్వం తెచ్చిన 317 జీఓలోని లోపాలన్నిటినీ సవరించాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి తెలంగాణ ఉద్యోగుల ఐకాస విజ్ఞప్తిచేసింది. రాష్ట్రంలో 317 జీఓ కింద మొత్తం 940 వరకు ఉపాధ్యాయులు స్పౌజ్ కేటగిరీలో మాత్రమే బదిలీ అయ్యేందుకు అర్హులుగా ఉన్నట్లు పాఠశాల విద్యాశాఖ వర్గాల ద్వారా తెలిసింది. అనారోగ్య కారణాలతో చాలా తక్కువ మందికి బదిలీ అవకాశం ఉందని సమాచారం. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనమేరకు సంఘం ఛైర్మన్ మారం జగదేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో ఐకాస నేతలు సచివాలయంలో శుక్రవారం ఉదయం సీఎస్‌తో సమావేశమై కొద్దిసేపు చర్చించారు. అనంతరం సచివాలయంలో విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడారు. 317 జీఓ వల్ల నష్టపోయిన ఉద్యోగుల ప్రతి దరఖాస్తును పరిశీలించి న్యాయం చేయాలని, అవసరమైతే సూపర్ న్యూమరరీ పోస్టులను ఏర్పాటుచేసి సర్దుబాటు చేయాలని కోరామన్నారు. ఆ జీఓ లోపభూయిష్ఠంగా ఉందని గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఆనాటి సర్కారు నిరంకుశంగా వ్యవహరించిందని, స్థానికతకు అవకాశం లేకుండా కేవలం సీనియారిటీ ప్రాతిపదికన ఆప్షన్లు ఇచ్చి బలవంతంగా స్థానికేతర ప్రాంతాల్లోకి పంపించారని వివరించినట్లు తెలిపారు. మంత్రివర్గ ఉప సంఘం అందజేసిన నివేదికను బహిర్గతం చేసి ఉద్యోగుల వ్యతిరేక అంశాలను పరిశీలించిన తర్వాతే దాన్ని ఆమోదించాలని కోరామన్నారు. సీఎస్‌ను కలిసిన వారిలో ఐకాస నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, చావ రవి, సదానందంగౌడ్, వంగా రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కటకం రమేష్, కృష్ణుడు, అబ్దుల్లా, జ్ఞానేశ్వర్, ముజీబ్, సత్యనారాయణ, కస్తూరి వెంకటేశ్వర్లు, శ్యామ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మరో ఉద్యోగుల ఐకాస నేతలు కూడా సీఎస్‌ను కలిసి 317 జీఓపై చర్చించారు.

నలుగురు మోడల్ టీచర్ల సస్పెన్షన్

ఇటీవల బదిలీల సందర్భంగా స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారని ఫిర్యాదులు అందడంతో పాఠశాల విద్యాశాఖ అధికారులు నలుగురు మోడల్ స్కూల్ టీచర్లను సస్పెండ్‌చేశారు. వారిలో ఇద్దరు హనుమకొండలో ఉండగా వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో ఒక్కొక్కరు ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

'స్పెషలిస్టు బోధనా వైద్యుల నియామకాన్ని ఖండిస్తున్నాం'

ఈనాడు, హైదరాబాద్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టు బోధనా వైద్యులను నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం (టీటీజీడీఏ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ సిస్టమ్ రూపంలో వైద్య కళాశాల వైద్యులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని, దీనికి అదనంగా వైద్య కళాశాల ఫ్యాకల్టీని గ్రామీణ ప్రాంతాల్లో నేరుగా నియమించడంతో వైద్యుల కొరత మరింత తీవ్రమవుతుందని సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాల వైద్యనిపుణులతో టెలీమెడిసిన్ సేవలు వినియోగించుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల వారికి వైద్యసేవలను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు.

సినీనటుడు అల్లు అర్జున్‌కు ఏపీ హైకోర్టులో ఊరట

నవంబరు 6 వరకు తదుపరి చర్యలు నిలుపుదల

ఈనాడు, అమరావతి: సినీనటుడు అల్లు అర్జున్, వైకాపా మాజీ ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్‌రెడ్డికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారంటూ వారిపై నంద్యాల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలను నవంబరు 6వరకు నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా ముందుకెళ్లొద్దని పోలీసులకు స్పష్టంచేసింది. నవంబరు 6న పూర్తిస్థాయిలో తగిన ఉత్తర్వులిస్తామని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు.

◆ నంద్యాలలోని రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఇంటికి సినీనటుడు అల్లు అర్జున్ వచ్చారని, ఆయనను చూడటానికి అధిక సంఖ్యలో ప్రజలు చేరారని, ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడమేనంటూ నంద్యాల గ్రామీణం డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రరావు ఈ ఏడాది మే 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోడ్ అమల్లో ఉన్నప్పుడు నంద్యాల వచ్చిన అర్జున్..రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదని పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా అల్లు అర్జున్, రవిచంద్ర కిశోర్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. తమపై నమోదుచేసిన కేసును కొట్టేయాలని వారు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. వారు కుటుంబ స్నేహితులని, అల్లు అర్జున్ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమని పేర్కొన్నారు. వాస్తవానికి ఈ వ్యవహారంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగలేదని, డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసు చెల్లుబాటు కాదని అన్నారు. ఈ కేసులో తదుపరి చర్యలన్నింటిని నిలువరించాలని కోరారు. అనంతరం న్యాయమూర్తి.. నవంబరు 6వరకు పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలన్నింటిని నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.



ధ్వజస్తంభం వద్ద గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో ఎంపీ బలరాంనాయక్, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఈఓ రమాదేవి, ఎమ్మెల్యే వెంకట్రావు, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, పీఓ రాహుల్, వైదిక సిబ్బంది

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం సీతారామచంద్రస్వామి వారిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి చేరుకొని రాత్రి బస చేసిన ఆయన శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చారు. ఆయనకు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, రామాలయం ఈఓ రమాదేవి, ఆర్డీఓ దామోదర్‌రావు స్వాగతం పలికారు. రాజగోపురం వద్ద ప్రధాన అర్చకుడు విజయరాఘవన్ గవర్నర్‌కు సంప్రదాయబద్ధంగా పరివట్టం కట్టి, నుదుట రామనామం అలంకరించారు. గవర్నర్ స్వామివారిని దర్శించుకున్న తరువాత లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో పండితులు వేదాశీర్వచనం పలికారు. గవర్నర్‌తో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఉన్నారు. అనంతరం భద్రాచలం మార్కెట్ కూడలిలో ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

'జీవన్‌రెడ్డి సేవలు కాంగ్రెస్‌కు అవసరం'



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో చర్చిస్తున్న మధుయాస్కీ గౌడ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సేవలు పార్టీకి అవసరమని పీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీ గౌడ్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిణామాలు, ప్రభుత్వ పాలన విషయంలో ఆయన తెలిపిన అభ్యంతరాలను ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్తానన్నారు. తన అనుచరుడు గంగారెడ్డి హత్యోదంతం నేపథ్యంలో పార్టీపైనా, పార్టీ ఫిరాయింపులపైనా జీవన్‌రెడ్డి అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్ బేగంపేటలోని ఆయన నివాసానికి వెళ్లి జీవన్‌రెడ్డిని మధుయాస్కీగౌడ్ కలిశారు. గంగారెడ్డి హత్యకు కారణాలు, స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుయాస్కీ గౌడ్ మాట్లాడుతూ.. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌కు ఎనలేని సేవలు చేశారన్నారు. పార్టీకి కష్టపడి పనిచేసిన జీవన్‌రెడ్డి లాంటి నాయకులను, కార్యకర్తలను కాంగ్రెస్ ఎప్పటికీ కాపాడుకుంటుందన్నారు. కాగా ఎల్బీనగర్‌లో అధికారులు ఇంకా ఎమ్మెల్యే, భారాస నాయకుల మాటలే వింటున్నారని ఆ పార్టీ నాయకులతో కలిసి పర్యటనలు, సమీక్షల్లో పాల్గొంటున్నారని మధుయాస్కీగౌడ్ పేర్కొన్నారు. భారాస నాయకులతో అంటకాగుతున్న అధికారులపై సీఎం, జిల్లా మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

జీవన్‌రెడ్డికి అండగా ఉంటా: జగ్గారెడ్డి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి తాను అండగా ఉంటానని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి తెలిపారు. జీవన్‌రెడ్డి ఆవేదన చూసి బాధ కలిగిందని, ఏం జరుగుతుందో తనకు అర్థం కాలేదని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "ఎప్పుడూ జనాల్లో ఉండే జీవన్‌రెడ్డిని ప్రజలు ఎందుకు ఓడించారో అర్థం కాలేదు. సంగారెడ్డిలో ఎన్నో అభివృద్ధి పనులు చేసిన నన్ను కూడా ఎందుకు ఓడించారో అర్థం కావడం లేదు" అని జగ్గారెడ్డి అన్నారు.

మూసీకి పూర్వవైభవంతో మారనున్న హైదరాబాద్ రూపురేఖలు

సియోల్ పర్యటన ముగించుకొని వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు



విమానాశ్రయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చిత్రపటం అందజేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

శంషాబాద్, న్యూస్‌టుడే: మూసీ నది పునరుజ్జీవంపై అధ్యయనం చేయడానికి దక్షిణ కొరియాకు వెళ్లిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. వారికి స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో శంషాబాద్ విమానాశ్రయానికి తరలివచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. మూసీకి పూర్వవైభవం వస్తే హైదరాబాద్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. సియోల్ పర్యటన విశేషాలపై మంత్రి వర్గంలో చర్చించి మూసీ అభివృద్ధిపై కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో హత్యా రాజకీయాలు పెరుగుతున్నాయి

భారాస ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో హత్యా రాజకీయాలు పెరుగుతున్నాయని భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఇక్కడ శాంతిభద్రతలు ఉన్నాయా? అంటూ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి కోసమే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్.. గంగారెడ్డిని తన అనుచరుడితో హత్య చేయించినట్టు జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్వయంగా చెప్పారన్నారు. అయినా సంజయ్‌పై హత్య కేసు ఎస్పీ ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి హోంమంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నాయని ఆక్షేపించిన కౌశిక్ రెడ్డి.. తాము అధికారంలోకి రాగానే వాటి గుట్టు విప్పుతామన్నారు.

నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోంది: ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని భారాస నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గ్రూప్-1 అభ్యర్థులు జీవో 29కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారని, వారికి మద్దతుగా భారాస సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో బ్యాక్‌లాగ్ పోస్టులు ఉండవని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇందుకోసం జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ..రైతు రుణమాఫీ ఇప్పటికీ పూర్తి కాలేదని ఆక్షేపించారు.

మరణించిన కార్యకర్తల కుటుంబాలకు పరిహారం పంపిణీ

భారాస బీమా విభాగం ఆధ్వర్యంలో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెల్లించే మంజూరు పత్రాలను శుక్రవారం అందించారు. నామినీగా ఉన్న 44 మందికి పత్రాలను అందజేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సోమ భరత్‌కుమార్, రావుల చంద్రశేఖర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




అదుపు తప్పితే జీవితాలే మలుపు

హైదరాబాద్ - బీజాపూర్ రోడ్డును 2016లో జాతీయ రహదారి (ఎన్‌హెచ్163)గా ప్రకటించారు. పోలీస్ అకాడమీ నుంచి చిలుకూరు కూడలి వరకు 11, జేబీఐటీ నుంచి మన్నెగూడ వరకు 38 మలుపులు ఉన్నాయి. రహదారి పనులు మధ్యలోనే ఆగిపోవడంతో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

గడువు పొడిగిద్దామా...!

ఓటీఎస్‌కు సెలవులు, పండగల దెబ్బ ● మరో అవకాశంపై జలమండలి దృష్టి

ఈనాడు, హైదరాబాద్: జలమండలికి మొండి బకాయిల వసూలుకు ఉద్దేశించిన ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్)పై పండగలు, సెలవుల దెబ్బపడింది. మరో ఆరు రోజుల్లో గడువు ముగుస్తున్న నేపథ్యంలో పొడిగించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా చెల్లించకుండా ఉన్న నీటి బిల్లుల బకాయిలు వడ్డీ మాఫీతో చెల్లించేందుకు జలమండలి ఈ నెల ఒకటో తేదీనుంచి అవకాశం కల్పిస్తూ ఓటీఎస్‌ను తీసుకొచ్చింది. ఇలా సుమారు రూ.705 కోట్లు మాఫీ కానుంది. 25 రోజులుగా ఈ పథకం అమల్లో ఉన్నా దసరా, బతుకమ్మ పండగలతోపాటు ఆరంభంలో తలెత్తిన ఇబ్బందులతో వినియోగదారుల నుంచి ఆశించిన మేర స్పందన రాలేదు. దీంతో గడువు పొడిగింపుపై సమీక్షిస్తున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. అత్యధికంగా గృహ వినియోగదారులు, బల్క్‌గా నీటిని కొనుగోలు చేస్తున్నవారే బకాయిలు చెల్లిస్తున్నారు. దీంతో పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ జలమండలి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గడువు ముగిసిన తరువాత బకాయిలుంటే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

విభాగాల వారీగా ఇలా.. (ఆగస్టు 31 నాటికి)

కేటగిరి	వినియోగదారులు	అసలు	వడ్డీ	మొత్తం (రూ.కోట్లలో)
డొమెస్టిక్	557165	511	172	683
మురికివాడల్లో డొమెస్టిక్	130338	51	37	88
వాణిజ్య	23219	129	62	190
పరిశ్రమలు	481	91	111	202
బహుళఅంతస్తులు	7049	17	4	21
బల్క్ సరఫరా	9	392	271	663
కాలనీలు	179	64	49	113
మొత్తం	718440	1255	706	1961



బకాయిదారులు	డొమెస్టిక్ కేటగిరీ	వసూలు కావాల్సింది
7.18 లక్షల మంది	5.57 లక్షల మంది	రూ.1961 కోట్లు
అసలు	**వడ్డీ రూపంలో రావాల్సింది**	**వసూలు లక్ష్యం**
రూ.1255 కోట్లు	రూ.706 కోట్లు	రూ.1000 కోట్లు

ఆహా అనిపించేలా మార్చేద్దాం

● పర్యాటక కేంద్రాలుగా వంద చెరువులు
● పురపాలక శాఖకు హైడ్రా జాబితా

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మహానగరంలో కీలకమైన వంద చెరువుల్లో ఆక్రమణలు తొలగించి, సుందరీకరణ చేసి పర్యాటక ప్రదేశాలుగా మార్చాలని హైడ్రా నిర్ణయించింది. వీటి జాబితాను రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్‌కు అప్పగించారు. దీనికి అనుగుణంగా కొన్ని చెరువులను హెచ్ఎండీఏ సొంత నిధులతో, మరికొన్ని సీఎస్ఆర్ పథకం కింద సుందరీకరణకు కార్యాచరణ రూపొందించారు. ఆక్రమణలు, పూడిక తొలగించిన తరువాత వచ్చే మట్టి, శిథిలాలు ఎక్కడ వేయాలనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికోసం చెరువుల వారీగా డ్రోన్ సర్వే చేపట్టారు. సమీపంలో ఎక్కడ క్వారీ గుంతలు, పల్లపు ప్రాంతాలున్నాయి, శిథిలాలు వేయడానికి ఎక్కడ అనువుగా ఉంటుందో డ్రోన్‌తో గుర్తిస్తున్నారు.



బెంగళూరు తరహాలో..

మహానగరంలో బల్దియా ఆధ్వర్యంలో 185, హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో 3500 చెరువులున్నాయి. చాలాఏళ్లు వీటిని పట్టించుకోకపోవడంతో చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో హైడ్రా రంగప్రవేశం చేసి మొత్తం చెరువులను ఇటీవల సర్వే చేసింది. కీలకమైన వంద చెరువులను గుర్తించింది. వాటిలో ఆక్రమణలు పూర్తిగా తొలగించడంతో పాటు సుందీకరణ చేస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని భావిస్తున్నారు. వీటికి సమీపంలోని వరద నాలాలను అనుసంధానం చేయాలని నిర్ణయించింది. ముందుగా వేటిని బాగు చేయాలో చెప్పాలని ముఖ్యకార్యదర్శి దానికిశోర్ కోరడంతో ఆయనకు హైడ్రా అధికారులు జాబితాను ఇచ్చారు. పూడికతీతతోపాటు చుట్టూ పచ్చదనం పెంచి పర్యాటక ప్రాంతాలుగా మార్చాలని హైడ్రా కోరింది. బెంగళూరు తరహాలో చెరువులకు పునరుజ్జీవం పోయాలని చూస్తున్నారు. అక్కడ ఎలా చేశారో అధ్యయనం చేయడానికి దీపావళి తరువాత హైడ్రా, ఇతర శాఖల ఆధ్వర్యంలో అధికారుల బృందం బెంగళూరు వెళ్లనుంది. కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా అక్కడికి వెళ్లి ఆ రాష్ట్రంలోని నిపుణులతో చర్చించాలని నిర్ణయించారు.

రియల్ సంస్థలకు వద్దు...

సీఎస్ఆర్ కింద కొన్ని చెరువులను అభివృద్ధి చేయడానికి కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయి. గతంలో 20 చెరువులను రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించగా.. కొందరు ఏకంగా ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చేసినట్లు హైడ్రా పరిశీలనలో తెలింది. మరికొందరు ఏకంగా చెరువులోనే నిర్మాణాలు చేశారు. దీంతో ఈసారి రియల్ సంస్థలకు కాకుండా జాతీయ బ్యాంకులు, ఇతర నిర్మాణేతర సంస్థలకు మాత్రమే చెరువుల అభివృద్ధి పనులను అప్పగించాలని హైడ్రా హెచ్ఎండీఏ, బల్దియా ఉన్నతాధికారులకు సూచించింది.

రూ.600 కోట్ల ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్

● నకిలీ పత్రాలతో భూ ఆక్రమణకు సహకారం
● జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌తో సహా ఆరుగురి అరెస్టు



ఈనాడు, హైదరాబాద్: కమీషన్ల కక్కుర్తితో భూములను కాపాడాల్సిన అధికారే భూ కబ్జాలకు సహకరించాడు. నకిలీపత్రాలు సృష్టించి, రికార్డులు తారుమారు చేసి అక్రమార్కులకు తోడ్పాటును అందించాడు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను దర్జాగా రిజిస్ట్రేషన్ చేశాడు. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం గ్రామపరిధిలో రూ.600 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి అన్యాక్రాంతమయ్యేందుకు సహకరించిన రంగారెడ్డి జిల్లా బాలానగర్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్, ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ జె.గురుసాయిరాజ్‌తో సహా మహ్మద్ అబ్దుల్ రజాక్, నవీన్‌కుమార్ గోయల్(గ్రీక్ బిల్డర్ ఎల్ఎల్‌పీ భాగస్వామి), బోరబండకు చెందిన మహ్మద్ అబ్దుల్ అదిల్, సయేదా కౌజర్, అఫ్షా సారాలను అరెస్ట్ చేసినట్టు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలే ఇలా ఉన్నాయి..

రాయదుర్గం గ్రామ పరిధిలోని రూ.600 కోట్ల విలువైన 12.09 ఎకరాల్లో గృహ, వాణిజ్య సముదాయ నిర్మాణం చేపట్టేందుకు గ్రీక్ బిల్డర్స్ ఎల్ఎల్‌పీ నవీన్‌కుమార్ గోయల్‌తో మహ్మద్ అబ్దుల్ రజాక్, మహ్మద్ అబ్దుల్ అదిల్, సయేదా కౌజర్, అఫ్షా సారా సిద్ధమయ్యారు. 19 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 39 బహుళ అంతస్తుల నిర్మాణం అభివృద్ధి చేసేందుకు 30:70 నిష్పత్తి చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారు. నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న ఈ భూములను కొట్టేసేందుకు పెద్ద పథకమే వేశారు. ఈ భూమి యజమాని ఫైజుల్లాదిగా పేర్కొంటూ నకిలీ పత్రాలు సృష్టించారు. ఫైజుల్లా వారసులుగా మహ్మద్ అబ్దుల్ అదిల్, సయేదా కౌజర్, అఫ్షా సారా పేరిట ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ రికార్డులను తారుమారు చేశారు. నిందితుల వ్యూహంలో భాగంగా ఈ నెల 11న తమ వద్ద ఉన్న ఆ నకిలీ పత్రాలను ఉపయోగించి ఫైజుల్లా వారసులు, గ్రీక్ బిల్డర్స్ ఎల్ఎల్‌పీ మధ్య 'డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కమ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(డీజీపీఏ)' రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ గురుసాయిరాజ్ సహకరించాడు. నిందితులు దాఖలు చేసిన పత్రాలు నకిలీవిగా గుర్తించినా అడ్డుకోకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశాడు. ప్రభుత్వ భూమి అని తెలిసిన కాపాడాల్సిన అధికారి తప్పటడుగు వేశాడు.

ఎలా బయటపడిందంటే

రాయదుర్గం 1,4,5,20 సర్వే నంబర్లలోని ఈ ప్రభుత్వ భూములు ఎంతోకాలంగా తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఎల్ఐపీసీవో) ఆధీనంలో ఉన్నట్టు రికార్డులున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం 12 ఎకరాల 9 గుంటల స్థలం ఖరీదైన ప్రాంతంలో ఉంది. ఇక్కడి 5.16 ఎకరాల్లో యూనిటీ మాల్ నిర్మాణం చేపట్టేందుకు టీఎస్ఎల్ఐపీసీవోతో తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ లీజు అగ్రిమెంట్ చేసుకుంది. ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసిన విషయం గుర్తించిన శేరిలింగంపల్లి తహసీల్దార్ కె.వెంకారెడ్డి సైబరాబాద్ ఈవోడబ్ల్యూలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఈవోడబ్ల్యూ ఏసీపీ ఎస్.రవీందర్ దర్యాప్తు చేపట్టారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

లంచం తీసుకుంటూ దొరికిన పుర ఏఈ

గూగుల్ పే ద్వారా తీసుకున్న వర్క్‌ఇన్‌స్పెక్టర్



ఏఈ రాజశేఖర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ సన్నీ

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: ఘట్‌కేసర్ పుర ఏఈ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ శుక్రవారం దొరికారు. రంగారెడ్డి జిల్లా అనిశా డీఎస్పీ ఆనంద్‌కుమార్ వివరాల ప్రకారం.. ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా ఘట్‌కేసర్‌కు చెందిన గుత్తేదారు మూడు క్రేన్లు ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించి జీఎస్టీ రూ.2 లక్షలు పోను రూ.8 లక్షల బిల్లు రావాల్సి ఉంది. బిల్లు మంజూరుకు వర్క్‌ఇన్‌స్పెక్టర్ సన్నీ రూ.30వేలు లంచం డిమాండ్ చేశాడు. ఆ మొత్తాన్ని గూగుల్‌పేతో గుత్తేదారు చెల్లించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి ఏఈ(బోడుప్పల్ ఏఈ) ఎం.రాజశేఖర్ కూడా రూ.1.50 లక్షలు డిమాండ్ చేయగా.. చివరకు రూ.70వేలు తీసుకునేందుకు ఒప్పుకున్నాడు. తొలుత రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని గుత్తేదారు అనిశా అధికారులను ఫిర్యాదు చేశాడు. గురువారం రూ.50 వేలు బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఇవ్వబోతే తీసుకోలేదు. శుక్రవారం ఇంటి వద్ద లంచం తీసుకుంటున్న సమయంలో అనిశా అధికారులు పట్టుకున్నారు. అతని నుంచి డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ చెప్పారు.

పర్మిషన్లా... గవెట్లుంటయ్...?

● బఫర్‌జోన్‌కు సమీపంలో బహుళ అంతస్తుల భవనం
● మున్సిపాలిటీ అనుమతుల్లేకుండా రాత్రింబవళ్లు నిర్మాణం



రాళ్లగూడ: జోషికుంట చెరువు సమీపంలో నిర్మాణంలో బహుళ అంతస్తుల భవనం

ఈనాడు, హైదరాబాద్, శంషాబాద్, న్యూస్‌టుడే: మనం ఇల్లు కట్టుకోవాలన్నా.. అపార్ట్‌మెంట్ నిర్మించాలన్నా జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ అధికారులు అనుమతులివ్వాలి. మన స్థలంలో మనం ఇల్లు కట్టుకుంటే పర్మిషన్లు ఎందుకు? అయినా.. గవెట్లుంటయ్ అని శంషాబాద్ మున్సిపాలిటీ రాళ్లగూడ సమీపంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణం ప్రారంభించారు. దీనికి సమీపంలో ని జోషికుంట చెరువు బఫర్‌జోన్ లో ప్రహరీ నిర్మించారు. ఇటీవల హైడ్రా కూల్చివేతలు చేపడుతుండటంతో తాత్కాలికంగా పనులు నిలిపేశారు.

విమానాశ్రయం సమీపంలో.. శంషాబాద్ విమానాశ్రయం, బాహ్యవలయ రహదారి సర్వీస్ రోడ్డుకు సమీపంలో ఈ భవనం నిర్మిస్తున్నారు. మూడు, నాలుగేళ్ల క్రితమే ప్లాన్ సిద్ధం చేసుకున్నారు. అధికారుల నుంచి అనుమతులు తీసుకోలేదు. రెండేళ్ల క్రితం రాళ్లగూడ గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. జోషికుంట చెరువులో కొంతభాగాన్ని అక్రమించారని అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి భవన నిర్మాణదారులకు తాఖీదులు జారీ చేశారు. కొద్దిరోజులు పనులు నిలిపి.. మళ్లీ మొదలుపెట్టారు.

జీవో 111 పరిధిలో ఉన్నా...

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ గ్రామం సహా శంషాబాద్ మున్సిపాలిటీలోని కొన్ని గ్రామాలు జీవో 111 పరిధిలోకి వస్తాయి. భవన నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధనలున్నా... చాలామంది ప్రైవేటు వ్యక్తులు ఇళ్లు, భవనాలు నిర్మిస్తున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వేలంకని నగర్, గొల్లపల్లి, కొత్వాల్‌గూడ గ్రామాల్లో ఇప్పటికీ ఇళ్లు, భవనాలు నిర్మిస్తున్నారు. వీటిలో కొన్నింటికి అనుమతులు రద్దు చేస్తూ పురపాలక శాఖ అధికారులు కొద్దినెలల క్రితం చర్యలు చేపట్టారు. రాళ్లగూడలో నిర్మాణంలో ఉన్న భవనానికి అనుముతులున్నాయా? అని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావును ప్రశ్నించగా... తాము ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని తెలిపారు. చెరువు నీళ్లలోనే ప్రహరీ నిర్మిస్తున్నారని ఇరిగేషన్ శాఖ అధికారి మౌనిక దృష్టికి తీసుకెళ్లగా... ఆ భవనం ప్రహరీ బఫర్‌జోన్‌లో లేదని, ఎఫ్‌టీఎల్‌లో నిర్మించలేదని తెలిపారు. గతంలో అలుగును పగులగొట్టగా... ఇప్పుడు మళ్లీ నిర్మించామని వివరించారు.

నకిలీ యాపిల్ ఫోన్లు విక్రయిస్తున్న ముఠా అరెస్టు

రూ.2.42 కోట్ల విలువైన పరికరాలు స్వాధీనం



అబిడ్స్ జగదీశ్ మార్కెట్‌లో నకిలీ యాపిల్ ఫోన్ల పరికరాలతో నిందితులు

అబిడ్స్, న్యూస్‌టుడే: నకిలీ యాపిల్ ఫోన్లు విక్రయిస్తున్న ముఠాను నగర పోలీస్ టాస్క్‌ఫోర్స్, అబిడ్స్ పోలీసులు కలిసి అరెస్టు చేశారు. రూ.2.42 కోట్ల విలువచేసే యాపిల్ ఫోన్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు.. పోలీసులు హైదరాబాద్ అబిడ్స్‌లోని జగదీశ్ మార్కెట్‌లో పేరొందిన నాలుగు మొబైల్ దుకాణాలపై దాడి చేశారు. ఈ సందర్భంగా టార్గెట్ మొబైల్ షాప్ నిర్వాహకుడు నింబ్‌సింగ్, పటేల్ మొబైల్‌షాప్ నిర్వాహకుడు హీరారామ్, ఔషపుర మొబైల్ షాప్ నిర్వాహకుడు గోవిందాల్ చౌహాన్, నంది మొబైల్స్ నిర్వాహకుడు ముకేష్ జైన్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి యాపిల్ బ్రాండ్ ప్రింటింగ్ లోగోలు, ఫొటోలు ఇతర పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఎయిర్ పాడ్స్ 579, యుఎస్‌బీ అడాప్టర్స్ 351, యుఎస్‌బీ పవర్ కేబుల్ 747, బ్యాటరీలు 62, పవర్ బ్యాంక్ 17, బ్యాక్ పౌచ్ 1401 స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ మార్కెట్లో 2.4255 కోట్లు ఉంటుందని డీసీపీ వెల్లడించారు. తదుపరి విచారణకు నలుగురిని అబిడ్స్ పోలీసులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొమ్మలు కోస్తుండగా.. విద్యుదాఘాతం

యువకుడి మృతి



వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కార్మికనగర్‌కు చెందిన **ఇలియాజ్**(20) ప్రైవేటు ఉద్యోగి. తమ ఇంట్లో పెంచుకుంటున్న మేకకు మేత తేవడానికి సమీపంలోని పోచమ్మ ఆలయం వద్ద నున్న రావిచెట్టు ఎక్కి కొమ్మలు కోస్తున్నప్పుడు చెట్టుకు ఆనుకొని ఉన్న విద్యుత్తు తీగలకు తగిలి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి శవపరీక్షకు గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ వీరశేఖర్ తెలిపారు.

20ఏళ్ల సమస్యకు.. వారంలో పరిష్కారం

లక్డీకాపూల్ చౌరస్తాలోని వరద నాలాలకు చికిత్స

ఇలాంటి 30 ప్రాంతాలను చక్కదిద్దడంపై దృష్టి

ఈనాడు, హైదరాబాద్: చిన్న వర్షమొస్తే చాలు.. లక్డీకాపూల్ చౌరస్తాలో మోకాల్లోతు నీరు నిలుస్తుంది. కార్లు, ద్విచక్ర వాహనాలు వరదలో చిక్కుకుపోతుంటాయి. నాలుగు వైపులా రోడ్లన్నీ స్తంభించిపోయి.. కూడలి నుంచి మెహిదీపట్నం, ఖైరతాబాద్, టెలిఫోన్‌భవన్, అసెంబ్లీ వైపు వాహనాలు అరగంట నుంచి గంట సమయం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. దాదాపు 20 ఏళ్లుగా లక్డీకాపూల్ చౌరస్తాలో ఎదురవుతోన్న ఈ సమస్యపై హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ వారం రోజుల కిందట దృష్టిపెట్టారు. మొదట తన కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమావేశమై సమస్యపై చర్చించారు. క్షేత్రస్థాయికి పరిశీలించారు.



క్షేత్రస్థాయిలో సమస్య తెలుసుకుంటున్న రంగనాథ్

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు

వరద నాలా పొడవునా ఉండే ప్రతి మ్యాన్‌హోల్‌ను తెరిపించి చూశారు. 90శాతం మ్యాన్‌హోళ్లు మట్టితో నిండిపోయి, లోపలి భాగం శిథిలమై కనిపించాయి. దాంతో.. ప్రధాన రహదారులపై కిలోమీటర్ల పొడవున ఉన్న నాలాల పరిస్థితిపై హైడ్రా ఓ అంచనాకు వచ్చింది. సత్వర పరిష్కారంలో భాగంగా.. మెట్రో పిల్లరు 1211 నుంచి 100 మీటర్ల దూరంలో, రోడ్డుకు 20 అడుగుల కిందనున్న లక్డీకాపూల్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ మార్గంలోకి వరదను మళ్లించేలా కాలువను తవ్వాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. అదే సమయంలో.. ఒక్క రోజు గడువుతో నాలా పునరుద్ధరణ పనులను చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. ప్రక్రియను ముగించి.. శుక్రవారం జలమండలి, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. ప్రధాన రహదారిపై శిథిలమైన నాలాను తవ్వి, కొత్త పైపులైను నిర్మాణ పనులు ప్రారంభించారు. జలమండలి ఎయిర్‌టెక్ యంత్రాలు పూడికతీతలో నిమగ్నమయ్యాయి. ఈ మొత్తం ప్రక్రియ వారంలోనే పూర్తవడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. చిన్న వర్షానికే తమ హోటల్‌లోకి వరద చేరుతోందని కూడలిలోని ఓ హోటల్ యాజమాన్యం ఈ సందర్భంగా హైడ్రాకు మొరపెట్టుకుంది. తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. వరద నాలాపై అధికారులు దృష్టి పెట్టలేదని, వర్షం తగ్గితే నీరు దానంతట అదే పోతుందనే ధోరణిలో సమాధానం చెబుతూ వచ్చారని వాపోయారు.

30 ప్రాంతాలను చక్కదిద్దాలని..

లక్డీకపూల్ కూడలిలో చేపట్టినట్లే.. మొత్తం 30 సమస్యాత్మక ప్రాంతాలను చక్కదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హైడ్రా తెలిపింది. అందుకు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ నుంచి వివరాలను సేకరిస్తున్నామని, అనంతరం వేర్వేరు విభాగాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, సత్వర పరిష్కార చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

అనుమతుల్లేని ఔషధ దుకాణాల దందా

● విచ్చలవిడిగా మందుల విక్రయం.. ప్రజారోగ్యంతో చెలగాటం
● ఔషధ నియంత్రణ శాఖ దాడులు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో మందుల దుకాణాల పేరుతో పెద్ద దందా నడుస్తోంది. ఎలాంటి డ్రగ్ లైసెన్సులు లేకుండానే కొందరు ఏకంగా షాపులు పెట్టి విచ్చలవిడిగా మందులు విక్రయిస్తున్నారు. ఎక్కువగా శివార్లు, పేదలు ఉండే బస్తీలే కేంద్రాలుగా ఈ దందా కొనసాగుతోంది. గ్రేటర్‌లో తరచూ ఈ తరహా దందాలను ఔషధ నియంత్రణ శాఖ బట్టబయలు చేస్తోంది. తాజాగా శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్, పుప్పాలగూడ పరిధిలోని లంబాడిగడ్డలో డీసీఏ అధికారులు దాడులు చేసి పెద్ద మొత్తంలో ఔషధాలను సీజ్ చేశారు. ఔషధ దుకాణాల్లో కొన్ని నెలలపాటు పనిచేసి ఆ అనుభవంతో ఏకంగా మందుల దుకాణాలను తెరుస్తున్నారు. ఆ పరిధిలోని ఆర్ఎంపీలు లేదా ఇతర నకిలీ వైద్యులతో అవగాహన కుదుర్చుకొని వారి ద్వారా రోగులు తమ షాపులకు వచ్చేలా చేసుకుంటున్నారు. తాజాగా దిల్‌సుఖ్‌నగర్‌లోని పిఅండ్‌టి కాలనీ మహాలక్ష్మి గణపతి కాంప్లెక్స్‌లో నీరకంటి నగేష్ ఎలాంటి లైసెన్సు లేకుండా కొంతకాలంగా మెడికల్ షాపు తెరిచి రోగులకు ఔషధాలు విక్రయిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేయడంతో అసలు విషయం తెలిసింది. మరోవైపు పుప్పాలగూడ పరిధిలోని లంబాడిగడ్డలో ఓ వ్యక్తి ఏకంగా ఎలాంటి అనుమతులు లేకుండానే క్లినిక్‌తోపాటు మందుల షాపు తెరిచాడు. అతనే చికిత్సలు చేస్తూ రోగులకు మందులు అంటగడుతున్నారు. అధికారులు తనిఖీలు చేసి 34 రకాల రూ.1.85 లక్షల మందులను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు నిబంధనలు తుంగలో తొక్కి డీలర్లు సైతం ఈ దందాలో భాగస్వామ్యం అవుతున్నారు. కొందరు డీలర్లు ఇలాంటి షాపులనే లక్ష్యంగా చేసుకొని నకిలీ మందులను అంటగడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.



సీజ్ చేసిన ఔషధాలు

యాంటీబయోటిక్స్.. స్టెరాయిడ్లు.. తాజాగా ఈ దుకాణాల్లో యాంటీబయోటిక్స్, యాంటీ అల్సర్, స్టెరాయిడ్లు, మానసిక సమస్యలకు వాడే వివిధ రకాల మందులను డీసీఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ల అనుమతులు లేకున్నా సరే.. ఓవర్ ది కౌంటర్ మందులను విక్రయిస్తున్నారు. వైరల్ వ్యాధులకు సైతం యాంటీబయోటిక్స్ ఇవ్వడం వల్ల చాలామందిలో యాంటీమైక్రోబయిల్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం ఉంది.

మొదటి పటాలం వద్ద కుటుంబ సభ్యుల నిరసన

యూసుఫ్‌గూడ: అన్ని విభాగాల పోలీసులకు కల్పించిన వసతులు తమ కుటుంబ సభ్యులకు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు మొదటి పటాలం కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని, ఏఆర్, సివిల్ పోలీసుల విధులు మాదిరిగా, తమ భర్తలకు విధులు కేటాయించాలన్నారు. ఫాటిక్స్ పేరుతో చేయించే వెట్టిచాకిరి నిర్మూలించాలని డిమాండ్ చేశారు. బెటాలియన్ అదనపు కమాండెంట్ నరేందర్‌సింగ్ ఇతర పోలీసు అధికారులు ధర్నా చేస్తున్న వారిని సముదాయించి పంపించారు.


సముదాయిస్తున్న బెటాలియన్ అదనపు కమాండెంట్ నరేందర్‌సింగ్

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

గ్యాలరీస్పేస్‌లో కళారూపాల ప్రదర్శన

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: వివిధ కోణాల మానవ స్వభావాన్ని, సమాజంలోని విభిన్న దృక్కోణాలు, సృజనాత్మకతలను ఆవిష్కరిస్తూ కళాకారులు రూపొందించిన 'స్కల్ప్టింగ్ ఇన్ టైమ్' (సమయంలో శిల్పం) కళారూపాల ప్రదర్శన శుక్రవారం రాత్రి బంజారాహిల్స్‌లోని గ్యాలరీ స్పేస్ ఆర్ట్ గ్యాలరీలో ప్రారంభమైంది. కళాకారులు హరిప్రసాద్, శ్రీకాంత్ కుర్వ, అరుణ్ పండిట్, జనార్దన్, కొత్తూరు లక్ష్మణ్‌రావు, సురకాల అప్పలరాజు, రాజేష్ రూపొందించిన కళారూపాలు ఈ ప్రదర్శనలో కొలువుదీరాయి. మాజీమంత్రి మైసూరారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శన ప్రారంభించి, చిత్రాలను తిలకించారు. నవంబరు 24 వరకు ప్రదర్శన కొనసాగుతుందని గ్యాలరీ నిర్వాహకుడు హనుమంతరావు తెలిపారు.


కళారూపాలను తిలకిస్తున్న మాజీమంత్రి మైసూరారెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా.. (ఉ.10 నుంచి మ.1 గంట మధ్య)

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

షేక్‌పేట, న్యూస్‌టుడే:

? వినోబా నగర్ ఫేజ్-2, షేక్‌పేట బస్తీ, ఓయూ కాలనీ ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో వీధుల్లో అంధకారం నెలకొంటోంది.
– పి.నర్సింగ్ రావు, నాగరాజ్, షేక్‌పేట

✓ పరిశీలించి వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – ఇంద్రదీప్, ఈఈ, జీహెచ్ఎంసీ, విద్యుత్ విభాగం.

అపసవ్య ప్రయాణం.. తప్పదు మూల్యం


అవగాహన కల్పిస్తున్న అదనపు సీపీ విశ్వప్రసాద్

● ట్రాఫిక్ విభాగం ప్రత్యేక డ్రైవ్

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు కారణమవుతున్న వాహనాదారులపై ట్రాఫిక్ సిబ్బంది దృష్టి సారిస్తున్నారు. దగ్గరి దారిలో తొందరగా గమ్యం చేరుకోవడానికి రాంగ్‌రూట్‌లను ఎంచుకునే వాహనాదారులు ఇకమీదట అలాంటి తప్పు చేయొద్దని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇలా ప్రయాణించే వాహనాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. అపసవ్య దిశలో వచ్చే వారిని పట్టుకొనేందుకు నగర పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మొదటిసారి పట్టుబడితే కౌన్సిలింగ్ ఇచ్చి జరిమానా విధించి వదిలేస్తున్నారు. మరోమారు పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనుకాడటం లేదు. రహదారులపై ప్రమాదాలు జరగడానికి ముఖ్యకారణం అతివేగం మొదటిది అయితే, అపసవ్య దిశలో ప్రయాణం రెండు స్థానంలో ఉందని అధికారులు చెబుతున్నారు. ఇటీవల పంజాగుట్ట డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ డివిజన్ పరిధిలోని నాలుగు ఠాణాల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, రాంగ్‌రూట్‌లో పట్టుపడిన వారికి నగర అదనపు కమిషనర్ (ట్రాఫిక్) పి.విశ్వప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ డివిజన్ పరిధిలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్సార్‌నగర్, పంజాగుట్ట ట్రాఫిక్ ఠాణాలున్నాయి. గత నాలుగు నెలల కాలంలో ఆయా ఠాణాల పరిధిలో 20327 కేసులు నమోదయ్యాయి.

పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ పరిధిలో...

సంఖ్య	ట్రాఫిక్ ఠాణాపేరు	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబరు	మొత్తం
1	ఎస్సార్‌నగర్	736	928	1577	1569	4810
2	జూబ్లీహిల్స్	533	1122	1711	1636	5002
3	బంజారాహిల్స్	331	796	1122	1464	3713
4	పంజాగుట్ట	1033	1977	2053	1739	6802

క్రిమినల్ కేసులు తప్పవు



– కట్టా హరిప్రసాద్, ఏసీపీ పంజాగుట్ట డివిజన్ ట్రాఫిక్

అపసవ్య దిశలో ప్రయాణించి, అమాయకుల ప్రాణాలకు హాని కలిగితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సిందే. మోటరు వెహికిల్ (ఎంవీ)యాక్టుతో పాటు కొత్తగా వచ్చిన బీఎన్ఎస్ చట్టం ప్రకారం 125, 281 సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం.

అంబేడ్కర్ వర్సిటీలో కొనసాగుతున్న నిరసన

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: అంబేడ్కర్ వర్సిటీ స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించాలనే ఆలోచనను నిరసిస్తూ ఆ వర్సిటీ ఐక్య కార్యచరణ సమితి సభ్యులు శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసనను కొనసాగించారు. అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జేఏసీ ఛైర్‌పర్సన్ ఆచార్య పల్లవి కాబ్డే, కన్వీనర్ ఆచార్య వడ్డాణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలున్నా ఇళ్లు కూల్చడం అన్యాయం


నీలమ్మ ఇంటి పత్రాలను పరిశీలిస్తున్న భవానీశంకర్

బోరబండ, న్యూస్‌టుడే: ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలు ఉన్నప్పటికీ పేదలు కట్టుకున్న ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బి.భవానీ శంకర్ అన్నారు. ఎస్పీఆర్ హిల్స్ ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీలో నీలమ్మ అనే మహిళ కట్టికున్న ఇంటిని ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది జేసీబీతో గత మంగళవారం కూల్చివేశారు. కాంగ్రెస్ పార్టీ రహ్మత్‌నగర్ డివిజన్ ప్రధానకార్యదర్శి గ్యార నాగరాజు, పార్టీ కార్యకర్తలతో కలిసి బాధితురాలి ఇంటిని శుక్రవారం సందర్శించిన ఆయన ఇంటిస్థలం పత్రాలను పరిశీలించారు. తహసీల్దార్‌తో మాట్లాడి బాధితులు ఇళ్లు కట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు. మేఘన పద్మ, సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

నారాయణగూడ: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం కింగ్ కోఠి జిల్లా దవాఖానాలో హిమాయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు దిలీప్‌రెడ్డి, కమల, జావిద్, తాజ్, శివ, కిరణ్, అరుణ్, ముజఫర్ మూస్ తదితరులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు ఎర్రమంజిల్ ఫీడర్‌లోని ఎర్రమంజిల్ ప్రాంతం, రోడ్డు నంబరు 1 నుంచి బాలపురబస్తీ ఏరియా, ఎర్రమంజిల్ చమాన్ పీటీ, పంచాయతీరాజ్ కార్యాలయం, శ్రీ కాపూరి సాంబశివరావు నివాసం, పోస్టాఫీస్ ప్రాంతం, జీవీకే మాల్ కింది భాగం తదితర ప్రాంతాలు.

బంజారాహిల్స్: ఉ.10.30-11: అశ్విని లేఔట్, హుడా ఎన్‌క్లేవ్, బీఎన్ఆర్ హిల్స్, నంది హిల్స్, జూబ్లీహిల్స్ రోడ్డు నం.45, 46, 47, 48, 49, 50, 51, 52. 53, 92, జర్నలిస్టు కాలనీ, నందగిరి హిల్స్, ప్రశాసన్ నగర్ ప్రాంతాలు. ఉ.11-11.30: బంజారాహిల్స్ రోడ్డు నం.12, బోలా నగర్, పింఛను కార్యాలయం, ప్రగతి నగర్, కౌన్సిలర్ వీధి, వీడియో గల్లీ, రహ్మత్‌నగర్ చర్చ్, రహ్మత్ నగర్ మసీదు, రహ్మత్‌నగర్, రహ్మత్‌నగర్ నార్త్, సౌత్, బర్రెల పీటీ, ఎస్కే నగర్, సంతోష్‌గిరి, తాహెర్ విల్లా ప్రాంతాలు. ● ఉ.11.30-మ.12: జూబ్లీహిల్స్ రోడ్డు నం.78, 79, 80, 81, 82, బాల్‌రెడ్డి నగర్, ఎమ్మెల్యే కాలనీ, ఎంఆర్ఎన్‌సీ, భగత్ సింగ్ నగర్, గౌతమ్ నగర్, ప్రశాసన్ నగర్, హరిజన బస్తీ, సాయి నగర్, అరుణోదయ కాలనీ, జైహింద్ ఎన్‌క్లేవ్, కావూరి హిల్స్, ఇమేజ్ గార్డెన్, డీమార్ట్, అమర్ కో-ఆపరేటివ్ సొసైటీ, కుమ్మరి బస్తీ, నెక్టార్ గార్డెన్, మాదాపూర్ బస్తీ, మెగా హిల్స్, వడ్డెర బస్తీ, శ్రీరామ్‌నగర్ ట్యాంక్, విఠల్‌రావు నగర్, గఫూర్ నగర్, సైబర్ టవర్స్, గుట్టల బేగంపేట, కాకతీయ హిల్స్ ప్రాంతాలు ● మ.12-12.30: జ్ఞానీ జైల్‌సింగ్ నగర్, జర్నలిస్టు కాలనీ ఏఅండ్‌బీ, నందగిరి హిల్స్, జూబ్లీహిల్స్ రోడ్డు నం. 46, 54, 55, 56, 57, 58, 59, 60, 92, మస్తాన్ నగర్, ఎమ్మెల్యే కాలనీ, ఎంఎన్ఆర్‌సీ, భగత్‌సింగ్ నగర్, గౌతమ్ నగర్, బంజారాహిల్స్ రోడ్డు నం.12 నుంచి తెలంగాణ భవన్ కూడలి వరకు, తెలంగాణ భవన్ నుంచి మంత్రుల నివాససముదాయం వరకు, మెగా హిల్స్, వడ్డెర బస్తీ, శ్రీరామ్‌నగర్ ట్యాంక్, విఠల్‌రావు నగర్, గఫూర్‌నగర్ ప్రాంతాలు. ● మ.12-1: ఎస్కే నగర్ ఏ, ఎఫ్ బ్లాక్స్, జవహర్ నగర్, సాయిబాబా దేవాలయం, మధురానగర్ బీ, డీ, ఈ, ఎఫ్, జీ, హెచ్ బ్లాక్స్, మారుతి నగర్, పోలీస్ క్వార్టర్స్, రహ్మత్ నగర్ చర్చ్, రహ్మత్ నగర్ సౌత్, ఎస్కే నగర్, బర్రెల పీటీ, సిద్దార్థ నగర్, శ్రీకృష్ణదేవరాయ నగర్, శ్రీకృష్ణానగర్ ఏ బ్లాక్, తాహెర్ విల్లా, యాదగిరి నగర్, యూసుఫ్‌గూడ బస్తీ ప్రాంతాలు ● మ.1- 1.30: బంజారాహిల్స్ రోడ్డు నం.2 ప్రధానరహదారి, షౌకత్‌నగర్, కేబీఆర్ పార్కు లేన్, జూబ్లీహిల్స్ రోడ్డు నం. 45, 46, 47, 48, 49, 50, 51, 52, 53, 54, 55, 56, 57, 58, 59, 60, మస్తాన్ నగర్ ప్రాంతాలు. మ.1.30-2: బంజారాహిల్స్ రోడ్డు నం.2 ప్రధానరహదారి, రోడ్డు నం. 5, 6, 8, 9, 10, 10బీ, 11, ఉదయనగర్, ఇబ్రహీం నగర్, గురుబ్రహ్మ నగర్, గౌరీశంకర్ నగర్, జర్నలిస్టు కాలనీ, నవోదయా కాలనీ, యూబీఐ కాలనీ, నాయుడు నగర్, జహీరా నగర్, సింగాడికుంట, దేవరకొండ బస్తీ మసీదు ప్రాంతం, ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్స్, మాజీ సీఎం కేసీఆర్ నివాసప్రాంతం, నందినగర్, కేబీఆర్ పార్కు లేన్ ప్రాంతాలు

మూసీ బాధితుల పక్షాన నిలబడతాం: ఆప్


బాధితులను పరామర్శిస్తున్న సుధాకర్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: మూసీ ప్రక్షాళన, అభివృద్ధి పేరిట పేదల ఇళ్లు కూల్చొద్దని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ డిమాండ్ చేసారు. శుక్రవారం చాదర్‌ఘాట్ వద్ద మూసీ ఒడ్డున కూల్చివేసిన పేదల ఇళ్లను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ. . దశాబ్దాలుగా ఉంటున్న పేద ప్రజలు ఆక్రమణదారులు కాదని, మున్సిపల్ పన్నులు, విద్యుత్ బిల్లులు కడుతూ జీవిస్తున్నారని, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు ఎలా కూల్చుతారని నిలదీశారు. పేద ప్రజలకు ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ 28న హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, మజీద్, సోలోమన్‌రాజ్, అధికార ప్రతినిధులు జావీద్ షరీఫ్, అఫ్సా సలాం, కలీంబాబా, నేతలు శివాజీ, కొడంగల్ శ్రీనివాస్, ఇస్మాయిల్, రాకేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు, నిర్వాహకులు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్ పోటీల్లో శ్రీకృష్ణానగర్‌లోని సాయి సరస్వతీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలికల విభాగంలో 7వ తరగతి విద్యార్థినిలు యశస్వీ బంగారు, యుతిక రజత పతకాలు గెలుచుకున్నారు. 6వ తరగతి విద్యార్థిని సిరిశ్రీ కాంస్య పతకాన్ని, బాలుర విభాగంలో 7వ తరగతి విద్యార్థి పునిత్‌రాజ్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు. పాఠశాల ఛైర్మన్ శిరీషా శంకర్, ప్రిన్సిపల్ ఉషా మీనాక్షిలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి


శానిటేషన్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేదీప్య.

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే : వెంగళరావునగర్ డివిజన్ జీటీఎస్‌కాలనీ కూడలి నుంచి రహ్మత్‌నగర్ వెళ్లే రహదారిలో విద్యుత్తు సబ్‌స్టేషన్ సమీప ప్రాంతాన్ని కార్పొరేటర్ దేదీప్య, శానిటేషన్ విభాగం ఏఎంహెచ్ఓ సాలొమాన్, సూపర్‌వైజర్ విజయ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. రహదారి పక్కన చెత్త, వ్యర్థాలు పేరుకుపోతుండటంతో అపరిశుభ్రతతో పాటు, దుర్వాసనకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ అన్నారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఆయుధాల ప్రదర్శన

యూసుఫ్‌గూడ: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యూసుఫ్‌గూడలోని మొదటిపటాలం ప్రాంగణంలోని శుక్రవారం ఆయుధాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆయుధాలను తిలకించారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

బోరబండ: అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు తొలి గురువు బాధ్యత వహిస్తున్నారని రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి అన్నారు. సంజయ్‌నగర్‌లో సదుపాయాలు పెంచి రంగులువేసి సుందరీకరించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

ఖైరతాబాద్: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. జీహెచ్ఎంసీ యాప్, ఇతర సామాజిక మాధ్యమాలకు వచ్చే ఖైరతాబాద్‌కు జోన్ సమస్యలు సేకరించి సంబంధిత విభాగానికి చేరవేసేందుకు జోనల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. ఇక్కడ రోజుకో ఉద్యోగి అందుబాటులో ఉండేలా ఆరుగురికి బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో జోన్‌లోని ఐదు సర్కిళ్ల ఉప కమిషనర్లు, పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ఆస్తి పన్ను, యూసీడీ, యూబీడీ, వీధి దీపాల విభాగాధిపతులకు అవగాహన కల్పించారు.

శ్మశాన వాటికలను శుభ్రం చేయండి


బంజారాహిల్స్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు తమ పితృదేవతలకు సంతర్పణ చేసేందుకు శ్మశాన వాటికలకు రానున్న తరుణంలో, బంజారాహిల్స్‌లోని పంజాగుట్ట హిందూ శ్మశాన వాటికను శుభ్రం చేయాలని అందుకు నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవిత రెడ్డి కోరారు. శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

పల్లెల్లో నాటకాలకు ఆదరణ ఎక్కువ


కళాకారులను సత్కరిస్తున్న రాము, నాగమారుతిశర్మ తదితరులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: పౌరాణిక, పద్య నాటకాలకు పట్టణాల్లో కంటే పల్లెల్లో ఆదరణ ఎక్కువ అని కవి, రసమయి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డా.ఎం.కె.రాము అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో కల్పన కళానికేతన్ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'గురుపంచక వందన పౌరాణిక పద్య నాటకోత్సవం' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మికవేత్త, విశ్రాంత జడ్జి నాగమారుతీశర్మ, చేరువేల భార్గవశర్మ, కర్నాటి నాగభూషణం, గాయకుడు గడ్డం లాలయ్య చౌదరి, వ్యాపారవేత్త అయోధ్య రామయ్య, గాయనీమణి రమాదేవి, గాయకులు భీంరావ్, మాన్‌సింగ్, కళాకారులు ఎం.భాస్కర్‌రావు, బి.పరమేశ్, ఎం.రమణాచారి పాల్గొన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

చాగంటి ప్రవచనం



శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో మూడు రోజుల పాటు నిర్వహించే 'నాద రామాయణం' ఆధ్యాత్మిక కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ధర్మ వర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తొలిరోజు డా.చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం నిర్వహించారు.
– న్యూస్‌టుడే, యూసుఫ్‌గూడ


అక్రమ నిర్మాణాల కూల్చివేతలు



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని పలుచోట్ల అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికరులు శుక్రవారం కూల్చివేశారు. లక్ష్మీనరసింహనగర్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన ఇంటిని, కృష్ణనగర్ ఏ బ్లాక్‌లోని ఓ నిర్మాణాన్ని అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు.

గోడలపై బొమ్మలు.. పర్యాటకానికి సొబగులు

నగర సుందరీకరణలో భాగంగా పర్యాటకులను ఆకర్షించేలా పైవంతెనలతోపాటు ప్రభుత్వ కార్యాలయాల గోడలపై పెయింటింగ్ వేస్తున్నారు. అందులో భాగంగా ఖైరతాబాద్ చౌరస్తాలోని పోలీస్ ప్రోటో కాల్ కార్యాలయం గోడలను ఇలా తీర్చిదిద్దుతున్నారు.



విద్యుదాఘాతంతో యువకుడి మృతి

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కార్మికనగర్‌కు చెందిన ఇలియాజ్(20) ప్రైవేటు ఉద్యోగి. తమ ఇంట్లో పెంచుకుంటున్న మేకకు మేత తేవడానికి సమీపంలోని పోచమ్మ ఆలయం వద్దనున్న రావిచెట్టు ఎక్కి కొమ్మలు కోస్తున్నప్పుడు చెట్టుకు ఆనుకొని ఉన్న విద్యుత్తు తీగలకు తగిలి కిందపడి తీవ్రగాలయపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి శవపరీక్షకు గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ వీరశేఖర్ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ: ఆర్థిక ఇబ్బందులతో ఓ వృద్ధురాలు ఉరేసుకొని బలవర్మణానికి పాల్పడింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌లో నివాసముంటున్న లక్ష్మీప్రసన్న ప్రైవేట్ ఉద్యోగిని. ఆమె తల్లిదండ్రులు మారం సత్యవాణి, కామేశ్వర్‌రావులు లక్ష్మీప్రసన్నతో పాటే ఉంటున్నారు. సివిల్ కాంట్రాక్టర్ అయిన కామేశ్వర్‌రావు నష్టాల్లో ఉండటంతో అప్పులు చేశాడు. అప్పులు తీర్చడానికి ఏపీలోని కృష్ణా జిల్లా నందిగామలో గల ఆస్తి అమ్ముకొని వస్తానని వెళ్లాడు. లక్ష్మీప్రసన్న గురువారం విధులకు వెళ్లింది. తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి తల్లీ మారం సత్యవాణి (58) ఫ్యానుకు ఉరివేసుకుని ఉంది. 108కు ఫోన్ చేయడంతో వచ్చిన సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.5 లక్షల విలువైన బాణసంచా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న టపాసులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: నివాస ప్రాంతంలోని బాణసంచా నిలువ ఉంచిన గోదాంపై మధ్య మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మెహిదీపట్నం మురాద్‌నగర్‌కు చెందిన జి.శ్రీరామ్‌ని అదుపులో తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైఫాబాద్ ఠాణా పరిధిలోని చింతల్‌బస్తీ రోడ్డులోని మొఘల్స్ ఇమామీ మ్యాన్షన్‌లో అక్రమంగా రూ.5లక్షల విలువైన బాణసంచా నిలువ ఉంచారని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈమేరకు దాడులు చేయగా, ప్రైవేటు ఉద్యోగి శ్రీరామ్ వచ్చే దీపావళి పండగకు విక్రయించేందుకు వీటిని నిలువ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఓ అపార్ట్‌మెంట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా జాగ్రత్తలు పాటించకుండానే ఓ ఫ్లాట్‌ను గోడౌన్‌గా మార్చారని తెలిపారు. కేసు తదుపరి విచారణ నిమిత్తం సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు.

చరవాణి చోరీ.. నిందితుడి పట్టివేత

యూసుఫ్‌గూడ: మెట్రో స్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీకి యత్నించిన బాలుడిని(17) పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ముసలయ్య అనే వ్యక్తి నుంచి ఓ బాలుడు సెల్‌ఫోన్ చోరీచేయడానికి ప్రయత్నించడంతో చాకచక్యంగా పట్టుకొని మెట్రో సిబ్బందికి అప్పగించాడు. సిబ్బంది మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసి నిందితుడిని అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ కార్డు బిల్లు పేరిట మోసం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: క్రెడిట్ కార్డు డబ్బులు తీసుకొని మోసం చేసిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన వినోద్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 22న క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలని బ్యాంకు నుంచి అంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. 23న అమీర్‌పేట్‌లోని మెట్రో స్టేషన్ వద్ద తాను బ్యాంకుకు సంబంధించిన వ్యక్తిగా పరిచయం చేసుకున్న వెంకటేష్ అలియాస్ గణేష్ వినోద్‌కుమార్ రూ.లక్ష తీసుకున్నాడు. 24న వినోద్ బ్యాంకుకు వెళ్లి తాను కట్టిన డబ్బులకు సంబంధించిన వివరాలు అడగడంతో డబ్బు కాలేదని చెప్పారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు మధురానగర్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు నిందితుడికి ఫోన్ చేయగానే రూ.90 వేలు ఫోన్‌పే ద్వారా తిరిగి చెల్లించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చిరు వ్యాపారి అదృశ్యం

వెంగళ్‌రావునగర్: చిరు వ్యాపారి అదృశ్యమైన ఘటన ఇది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బీదర్‌కు చెందిన అమృత్ కుటుంబంతో బోరబండ స్వరాజ్‌నగర్ నివసిస్తూ.. చిరువ్యాపారం చేసుకొని జీవిస్తున్నారు. గురువారం రాత్రి వ్యాపారం ముగించుకొని ఇంటికి వెళ్లిన తరువాత దంపతుల మధ్య గొడవ జరిగింది. అనంతరం ఇంటి నుంచి వెళ్లిన అమృత్ శుక్రవారం సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో భార్య కల్పన బోరబండ ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు అద్దం పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోండి

జూబ్లీహిల్స్: కారు అద్దాలు పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐఆర్‌పీఎస్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సాలార్జంగ్ మ్యూజియం విశ్రాంత సంచాలకులు నాగేందర్‌రెడ్డి ఈ నెల 11న తన కొత్త కారును బంజారాహిల్స్ లేక్ గేట్ ముందు నిలిపారు. కొద్ది సమయం తరువాత తిరిగి వచ్చి చూడగా కారు అద్దం పగిలి ఉంది. దీంతో చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించండి



చెత్త సేకరించి రిక్షాలను అందజేసిన మహాలక్ష్మి, డా.హేమలత

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: తడి, పొడి వేర్వేరుగా సేకరించాలని పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ మహాలక్ష్మి సూచించారు. శుక్రవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం సహాయ వైద్యాధికారి హేమలతతో కలిసి కార్మికులకు చెత్త సేకరణ రిక్షాలు అందజేశారు. ప్రజలు నగరాన్ని శుభ్రంగా పచ్చదనంతో ఉంచేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీబీఎన్ ఆధ్వర్యంలో సాంస్కృతికోత్సవం


లక్ష్మీదేవి ప్రతిమలతో మహిళలు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం బ్రాహ్మిణ్ బిజినెస్ నెట్‌వర్క్ (బీబీఎన్) ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న బ్రాహ్మణ మహిళా ఎంటర్‌ప్రెన్యూనర్స్ కోసం 'బీబీఎన్ ఝూన్సీ నెట్‌వర్కింగ్ ఫియస్టా' పేరిట ప్రత్యేక సాంస్కృతికోత్సవాన్ని నిర్వహించారు. నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి కొందరు మహిళలు తమ వ్యాపారాలు, సేవల గురించి వివరించారు. సంప్రదాయ కట్టుబొట్టులో ర్యాంప్‌పై అడుగులు వేసి ఆకట్టుకున్నారు. ఉమెన్ ఎన్విజన్ కౌన్సిల్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, గోమయ పుష్పం వ్యవస్థాపక డైరెక్టర్ ప్రవీణ నాయుడు తోట ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొటారు కామేశ్వరి, ప్రభ కస్తూరి, రుక్మిణి, సరోజ, బి.విజయలక్ష్మీ పర్యవేక్షించారు.

రంజని 'దసరా - దీపావళి' సంచిక ఆవిష్కరణ


లక్ష్మికి జీవన సాఫల్య పురస్కారం అందజేసిన కార్యవర్గం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: చరిత్ర పునర్నిర్మాణంలో అధికారిక సమాచారం ఇచ్చే సంస్థ ఏజీ కార్యాలయం అని, ఆ సమాచారం తన పరిశోధనకు ఎంతో ఉపయుక్తమైందని కాళోజీ తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. ఏజీ కార్యాలయం, రంజని తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 'రంజని దసరా-దీపావళి' సంచిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏజీ కార్యాలయ పూర్వ ఉద్యోగులు, సాహితీవేత్తలు పాలకోడేటి సత్యనారాయణరావు, పీఎస్ఎం లక్ష్మీలను జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరించారు. ముఖ్య అతిథి నిత్యానందరావు వారిని సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అకౌంటెంట్ జనరల్ మాధవి, పూర్వ ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్లు ఎన్.సుధీర్ కుమార్, మల్లాది సుబ్రహ్మణ్యం, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్లు సంజయ్ కామినేని, నరేష్‌లతో పాటు రంజని అధ్యక్షురాలు నందిరాజు పద్మలత జయరాం, ఉపాధ్యక్షుడు అద్దేపల్లి రాధాకృష్ణ, పూర్వ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

మాటలే పెట్టుబడి.. గుట్టు బయటపడి..


ఈనాడు, హైదరాబాద్

ఎదుటివారిని బురిడీ కొట్టించడంలో ఆరితేరిన నైపుణ్యం. నేరం బయటపడి పోలీసులు ప్రశ్నించినా తొణకని నైజం. ఇంత చాకచక్యంగా వ్యవహరించే వీరంతా దోపిడీ దొంగలు.. సుపారీ ముఠాల్లో ఉండే కరడుగట్టిన నేరస్థులు అనుకుంటే పొరపాటే. మాటలే పెట్టుబడిగా అందినంత కొట్టేస్తారు. ఉపాధి కల్పించిన సంస్థనే మోసం చేస్తారు. గుట్టు బయటపడితే జైలుకెళ్లేందుకు సిద్ధపడతారు. కాజేసిన సొత్తులో పైసా చెల్లించరు.

ఎన్ని ముచ్చట్లో..: బ్యాంకు ఉద్యోగుల్లో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బంధువులు, మిత్రుల ఖాతాల్లోకి సొత్తు మళ్లిస్తున్నారు. తమ వద్ద పైసా లేదని, తిరిగి చెల్లించలేమంటూ చేతులెత్తేస్తున్నారు. కొందరైతే తమ మానసిక స్థితి సరిగా లేదని.. ఆ

కొత్త ఎత్తులతో రూ.కోట్లు కొల్లగొడుతున్న ఆర్థిక నేరస్థులు

డబ్బంతా ఏమైందో గుర్తులేదంటూ మానసిక వైద్యుల నుంచి సర్టిఫికెట్ చూపిస్తున్నారు. సీసీఎస్‌లో ఈ ఏడాది 10-12 కేసులు నమోదయ్యాయి. రైల్వే ఉద్యోగాల పేరుతో ఓ వ్యక్తి రూ.20 లక్షలు వసూలు చేశాడు. డబ్బంతా ఖర్చయిందని, కొంత సమయమిస్తే చెల్లిస్తానన్నాడు.

మచ్చుకు కొన్ని..

● ముషీరాబాద్ నియోజకవర్గంలో ఉంటున్న ఒంటరి వృద్ధుడి బాగోగులు చూసేందుకు ఒక వ్యక్తి పనిలో కుదిరాడు. అయిదారు నెలలు బుద్ధిగా ఉండి వృద్ధుని నమ్మకం పొందాడు. దీంతో అతను తన బ్యాంకు లావాదేవీల బాధ్యతను ఆ వ్యక్తికి అప్పగించారు. దీంతో అతను ఏటీఎం కార్డుతో సుమారు రూ.25 లక్షలు కాజేశాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సొమ్మంతా ఆన్‌లైన్ గేమింగ్‌లో నష్టపోయానని నిందితుడు చెప్పినా ఆ సొమ్ముతో తల్లికి ఆభరణాలు చేయించాడు. ● నాంపల్లిలోని ఓ బ్యాంకులో క్యాషియర్ సహ ఉద్యోగితో కలిసి ఖాతాదారుల గృహ, విద్యా రుణాల సొమ్ము రూ.1.22 కోట్లు సొంత ఖాతాల్లో వేసుకున్నారు. బ్యాంకు మేనేజర్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు సొత్తును ఆన్‌లైన్ గేమింగ్‌లో ఖర్చు చేసినట్లు తేలింది.


లొకేషన్ పంపితే.. గమ్యానికి డ్రగ్స్

- డెడ్‌డ్రాప్ పద్ధతిలో మత్తు ముఠాల దందా
- సూడాన్ దేశస్థుడు సహా ముగ్గురి అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: పోలీసులకు చిక్కకుండా.. తమ ఆనవాళ్లు గుర్తించకుండా డెడ్‌డ్రాప్ పద్ధతిలో సింథటిక్ డ్రగ్స్ చేరవేస్తున్న అంతర్జాతీయ ముఠాలోని ఒక విదేశీయుడు సహా ముగ్గురిని రెండు వేర్వేరు కేసుల్లో హెచ్‌న్యూ, హుమాయున్‌నగర్ పోలీసులు అరెస్టుచేశారు. రూ.20.75 లక్షల మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో శుక్రవారం హెచ్‌న్యూ డీసీపీ సుధీంద్ర, ఇన్‌స్పెక్టర్లు డానియేల్, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటరాములుతో కలసి సీపీ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు.

బీసీఏ పూర్తిచేసి అడ్డదారులు

సూడాన్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్ ఉస్మాన్ అలియాస్ హనిన్(24) 2016లో విద్యార్థి వీసాపై భారత్‌కు వచ్చాడు. మెహిదీపట్నంలోని ఆప్టిక్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏడాదిపాటు ఇంగ్లిషు కోర్సు నేర్చుకొని 2017లో స్వదేశానికి వెళ్లాడు. నాలుగేళ్ల విద్యార్థి వీసాపై మరోసారి వచ్చాడు. యూపీలోని ఓ యూనివర్సిటీలో మూడేళ్ల బీసీఏ కోర్సులో చేరాడు. 2020 కరోనా సమయంలో స్వదేశానికి వెళ్లాడు. రెండేళ్ల తరువాత మూడోసారి యూపీ చేరి బీసీఏ పూర్తిచేశాడు. ఈ ఏడాది జులైలో టోలిచౌకికి మకాం మార్చాడు. డ్రగ్స్ స్మగ్లింగ్ వృత్తిగా మలచుకున్నాడు. నైజీరియన్లు, టాంజానియన్లు, సూడాన్, పాలస్తీనియన్లతో పరిచయాలు పెంచుకున్నాడు. అంతర్జాతీయ డ్రగ్ రాకెట్‌తో సంబంధాలున్న రోమియో, గడాఫీ, జోపాల్, జాకబ్ నుంచి తక్కువ ధరకు సింథటిక్ డ్రగ్స్ కొని సరఫరా ప్రారంభించాడు. డార్క్‌వెబ్, సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా లావాదేవీలు నిర్వహించేవాడు. కొనుగోలుదారుల నుంచి నగదు ఖాతాలో పడగానే వారికి డ్రగ్స్ ఉంచిన ప్రాంతం ఫొటో, లొకేషన్ పంపి డెడ్‌డ్రాప్ పద్ధతిలో సరకు చేరవేసేవాడు.


సీపీ సీవీ ఆనంద్

చదువు అబ్బక మత్తుకు బానిస

బంజారాహిల్స్ నివాసి ఇమ్రాన్ అలియాస్ షకూర్(29) ఇక్కడే పుట్టిపెరిగాడు. ఐదో తరగతిలోనే గంజాయికి అలవాటై చదువు మానేశాడు. పలుచోట్ల పనికి కుదిర్చినా మత్తుకు బానిసై ఉండలేకపోయాడు. తల్లిదండ్రులు ఇతడిని ఆర్‌కే పురంలోని పునరావాస కేంద్రంలో ఉంచి 3 నెలల చికిత్స అందించారు. లాక్‌డౌన్ వేళ కారు డ్రైవింగ్ నేర్పించి పంజాగుట్టలోని ప్రైవేటు కంపెనీలో డ్రైవర్‌గా పని కుదిర్చారు. బెంగళూరులోని నైజీరియన్ చుక్వా ఒబెయ, కేరళకు చెందిన నందకుమార్(25) ద్వారా సింథటిక్ డ్రగ్స్ కొని నగరంలో విక్రయించసాగాడు. చందానగర్‌కు చెందిన కె.నవీన్(24)ను ఏజెంట్‌గా ఏర్పాటుచేసుకొని డెడ్‌డ్రాప్ పద్ధతిలో సరకు తరలిస్తున్నాడు. గత ఫిబ్రవరిలో ఇమ్రాన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్ట్‌చేశారు. అతని ఫోన్‌లో 11 మంది కొనుగోలుదారులను గుర్తించారు. వీరిలో ఒకరు గుంటూరు వ్యక్తి ఉన్నట్టు నిర్ధారించారు.


నేడు, రేపు క్రైస్తవ వధూవరుల ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక 'ఈనాడు పెళ్లి పందిరి' క్రైస్తవ అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తోంది. ఈనెల 26, 27వ తేదీల్లో సోమాజిగూడలోని 'ఈనాడు కార్యాలయం'లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్నవారు, సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 వరకు ప్రొఫైల్‌ను ఉచితంగా నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్.. 9154992572, 8008001686. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ వాట్సాప్ ద్వారానూ చేసుకోవచ్చు. అందుకు వధూవరులు బయోడేటా, ఫొటోలుపైన తెలిపిన ఫోన్ నంబర్లకు పంపవచ్చని తెలిపారు.

చండీగఢ్ విమాన సర్వీస్‌కు బాంబు బెదిరింపు

శంషాబాద్: శంషాబాద్ నుంచి చండీగఢ్‌కు బయల్దేరుతున్న విమాన సర్వీస్‌లో బాంబు ఉందని గుర్తు తెలియని వ్యక్తులు సందేశం పంపించగా తనిఖీ చేసిన భద్రతాధికారులు ఉత్తిదే అని తేల్చారు. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం శుక్రవారం 130 మందితో చండీగఢ్‌కు వెళ్లడానికి సిద్ధమైంది. మధ్యాహ్నం 12.25కు అపరిచిత వ్యక్తి మెయిల్ నుంచి ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, విస్తారా విమాన సర్వీసుల్లో బాంబులు పెట్టామని విమానాశ్రయానికి మెయిల్ ద్వారా సందేశం వచ్చింది. భద్రతాధికారులు ఆ సర్వీసుల్లో బాంబు డిటెక్టివ్ స్క్వాడ్, జాగిలాలతో తనిఖీలు చేపట్టగా పేలుడు పదార్థాలేవీ లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వేటకు వచ్చి.. మాటు వేసి..


ఉప్పల్ నల్లచెరువు, గుండ్లపోచంపల్లి సుమర్‌చెరువులు శుక్రవారం పక్షి జాతులతో కళకళలాడింది. నీటిలో మునిగి తేలుతూ.. ఒకదానితో ఒకటి పోటీ పడుతూ.. కిలకిలారావాలతో సందడి చేశాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి వలస వచ్చిన కొంగలు, వివిధ రకాల పక్షులు చేపల వేట కోసం మాటు వేసి కనిపించాయి.

నరదిష్టి అంటారు.. నిలువునా దోచేస్తారు

నమ్మించి మోసం చేస్తున్న ఇద్దరు కి'లేడీ'లు అరెస్టు


నిందితురాళ్లు మాధవి, కవిత

జూబ్లీహిల్స్: నుదుట పెద్దబొట్టు పెట్టుకొని దైవత్వం అంతా ముఖంలో, వస్త్రాధరణలో కనిపించేలా నటిస్తూ ఇంటింటికి తిరిగి నరదిష్టి ఉంది.. తొలగిస్తామని.. నమ్మించి ఇంట్లో ఉండే సామగ్రి, నగదును తెప్పించి మూట కట్టిస్తారు. పూజ చేస్తున్నట్లు నటిస్తూనే సొమ్ము దోచేస్తున్న ఇద్దరు మహిళలను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ డీఐ బషీర్ అహ్మద్ కథనం ప్రకారం.. మాదాపూర్‌లో ప్రీస్కూల్ నిర్వహిస్తున్న చిట్టినేని కరుణ బంజారాహిల్స్ రోడ్ నం.7లో నివసిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 9న ఇద్దరు మహిళలు ఆమె ఇంటికి వచ్చారు. నరదిష్టి ఉందని నమ్మించి పూజ చేయాలంటూ నిమ్మకాయ, మిర్చి, ఉప్పు, బియ్యం, చీరతోపాటు రూ.లక్ష తీసుకొని రమ్మన్నారు. ఉపాధ్యాయురాలు వారికి రూ.70 వేలు ఇవ్వగా వాటిని సంచిలో మూటగట్టినట్టు ఆమెకు చూపారు. పూజలు చేస్తున్నట్లు నటిస్తూ రూ.70వేలను కాజేశారు. అరగంట పూజ చేసి తాము వెళ్లిన తరువాత చీర ధరించాలని, డబ్బులు తీసుకోవాలని నమ్మించి అక్కడి నుంచి జారుకున్నారు. వారు వెళ్లిన తరువాత చూడగా డబ్బు కనిపించలేదు. శ్రీనగర్‌కాలనీలో నివసించే పద్మ కొండల వద్ద రూ.51వేలు, జూబ్లీహిల్స్ డాక్టర్ ఆర్.ఎన్.సుబ్బారెడ్డి నివాసంలో రూ.లక్ష, సుజీత్ నారాయణ్ ఇంట్లో రూ.లక్ష, పంజాగుట్టలో ఉపాధ్యాయురాలైన రమా గుప్తా వద్ద రూ.లక్ష కాజేశారు. నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు.

నిలిపి ఉంచిన విమాన ఇంజిన్ భాగాలు ధ్వంసం

పోలీసులకు అపోలో యాజమాన్యం ఫిర్యాదు

బేగంపేట, న్యూస్‌టుడే: అపోలో యాజమాన్యానికి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ భాగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు స్వల్పంగా ధ్వంసం చేశారు. అపోలో ఆసుపత్రుల ముఖ్య సెక్యూరిటీ అధికారి జగ్జీత్‌సింగ్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎయిర్‌క్రాఫ్ట్ వీటీ-పీసీఆర్‌ను బేగంపేట విమానాశ్రయంలో పార్క్ చేస్తుంటారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 5 ముందు రెండు వారాల పాటు విమానాశ్రయంలోనే నిలిపి ఉంది. ఏప్రిల్ 5న బయల్దేరి చెన్నై వెళ్లి అక్కడ ల్యాండ్ అయ్యాక పరిశీలిస్తే ఇంజిన్ భాగంలో మరికొన్ని పరికరాలు ధ్వంసమై కనిపించాయి. ఎవరో కావాలనే నష్టం కలిగించారని తేలింది. నెలలు గడిచిపోతున్నా బాధ్యులు ఎవరో తేలలేదు. సీసీ ఫుటేజీ అందితే దీనిపై స్పష్టత వస్తుందని ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.

దుస్తులూడదీసి.. బాలురపై దాడి

బోడుప్పల్, న్యూస్‌టుడే: నగల దుకాణానికి కాపలాగా ఉన్న బాలురు డబ్బు అడగడంతో వారిపై దాడి జరిగింది. దాడి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. బోడుప్పల్ హనుమాన్‌నగర్‌లో ముకేష్ సింగ్ చౌదరి నగల దుకాణం నిర్వహిస్తున్నారు. నేపాల్‌కు చెందిన బీస్తా పీరం(16), పారోజ్(14) నగల దుకాణం పైఅంతస్తులో అద్దెకు ఉంటూ రాత్రి కాపలాదారులుగా ఉంటున్నారు. ఇంటి యజమాని సూచనతో దుకాణ యజమాని ముకేష్‌సింగ్ చౌదరిని డబ్బులు అడగడంతో అతను వారిపై చేయి చేసుకున్నాడు. బాలురు ఎదురు తిరగడంతో అర్జున్, మనీష్, చెన్నారాం, గణేష్, రామేష్, రాకేష్.. బాలల దుస్తులు ఊడదీసి రబ్బర్ ట్యూబ్‌తో కొటారు. మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాలురను ఆసుపత్రికి తరలించారు.

నొప్పులకు ఆధునిక పద్ధతుల్లో చికిత్స


శిక్షణ ఇస్తున్న డాక్టర్ నాగలక్ష్మి

రెజిమెంటల్‌బజార్: కిమ్స్ ఆసుపత్రిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెయిన్ మెడిసిన్ అండ్ ఎనస్థీషియాలజీ ఆధ్వర్యంలో 3 రోజుల వర్క్‌షాపును ఆసుపత్రి సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు ప్రారంభించారు. అనుభవజ్ఞులైన నిపుణులతో ఈ వర్క్‌షాప్‌ను ఎనస్థీషియాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేష్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో కన్సల్టెంట్ పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ నాగలక్ష్మి పట్నాల, ఉస్మానియా మెడికల్ కాలేజ్ అనస్థీషియాలజీ విభాగం నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నొప్పి నివారణ క్లినిక్‌లలో నొప్పిని సమర్థంగా తొలగించడానికి అల్ట్రాసౌండ్, ఫ్లూరోస్కోపీల విస్తృత వాడకంపై ప్రధానంగా దృష్టిపెట్టామన్నారు. వెన్ను నొప్పి, కేన్సర్ నొప్పి లాంటి దీర్ఘకాల సమస్యలు సంప్రదాయ వైద్యంతో తగ్గవని, వాటిని పెర్క్యుటేనియస్ చికిత్సలతో నయం చేయవచ్చన్నారు.

డిజిడల్ సూచిక


ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కలిగించే డిజిటల్ సూచికలు ఇలా మూలన పడ్డాయి. దీంతో వీటి కొనుగోలుకు ఖర్చు చేసిన ప్రజాధనం వృథా అయింది. అల్కాపురి చౌరస్తాలో కనిపించింది

బల్దియాలో శ్రమదోపిడీ

రికార్డుల్లో ఉన్నది **210 మంది**

ప్రస్తుతం పనిచేస్తున్నది.. **202 మంది**

వారికిచ్చే జీతం.. **రూ.10 వేలు మాత్రమే**

అదనపు కార్మికులకు అన్యాయం

ఈనాడు, హైదరాబాద్, చందానగర్, న్యూస్‌టుడే: జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న అదనపు కార్మికులు నాలుగేళ్లుగా శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కోవిడ్ వ్యాప్తి తీవ్రంగా ఉన్న సమయంలో బల్దియా ఆరోగ్య విభాగం 200 మందికిపైగా కార్మికులను అత్యవసర సేవలకు తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకుంది. వారంతా కరోనా వ్యాప్తి నివారణ చర్యల్లో ప్రాణాలకు తెగించి పనిచేశారు. సోడియం హైపో క్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేయడం, ఇంటింటి సర్వే, బాధితుల తరలింపు వంటి చర్యల్లో కీలకంగా పనిచేశారు. కరోనా అనంతరం వారి సేవలను జీహెచ్‌ఎంసీ అలాగే కొనసాగిస్తోంది. ప్రైవేటు గుత్తేదారుకు కాంట్రాక్టు ఇచ్చి ఆయన ద్వారా వారికి వేతనాలు అందేట్లు అప్పటి అధికారులు ఏర్పాట్లు చేశారు. వారికి నెల జీతం రూ.10 వేలు మాత్రమే అందడం.. అదీ సమయానికి రాకపోవడంతో కుటుంబ పోషణ, ఇంటి అద్దె, పిల్లల చదువు, వైద్యం వంటి అవసరాలను తీర్చుకోలేక కార్మికులు తీవ్ర అవస్థ పడుతున్నారు. తమ ఇబ్బందులను మొరపెట్టుకోగా గత కమిషనర్ ఆమ్రపాలి వారి కష్టాన్ని గుర్తించారు. వెంటనే ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయాలను వర్తింపజేస్తూ కార్మికులుగా నియమించుకోవాలని ఎంటమాలజీ విభాగాన్ని ఆదేశించారు. తాజాగా ఆమె ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లడం, ఆ స్థానంలో కొత్త కమిషనర్ రావడంతో వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

జోన్ల వారీగా సిబ్బంది

జోన్	సిబ్బంది
ఖైరతాబాద్	44
కూకట్‌పల్లి	30
శేరిలింగంపల్లి	30
చార్మినార్	34
సికింద్రాబాద్	34
ఎల్బీనగర్	30



'నిరుద్యోగులే కాంగ్రెస్‌ను గెలిపించారన్న విషయాన్ని సీఎం మర్చిపోతున్నారు'


సంజీవయ్య సంక్షేమ భవన్ ఎదుట ధర్నాలో ఆర్.కృష్ణయ్య

మెహిదీపట్నం: విద్యార్థులు, నిరుద్యోగులే కాంగ్రెస్‌ను గెలిపించారన్న సంగతి సీఎం రేవంత్‌రెడ్డి మర్చిపోతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. విద్యార్థుల డిమాండ్ల సాధనకు మాసబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ ఎదుట శుక్రవారం ధర్నాలో ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.4వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ 20 లక్షల పేద విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు పై చదువులు, ఇంటర్వ్యూలకు వెళ్లడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి విద్యార్థులు రోడ్డెక్కుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఫీజు బకాయిల విడుదల, ఉపకార వేతనాలు, మెస్ ఛార్జీలు పెంచకుంటే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం, విద్యార్థి సంఘాల నేతలు ధర్నాలో పాల్గొన్నారు.

చంచల్‌గూడ జైలు నుంచి జానీ మాస్టర్ విడుదల

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: సహాయ నృత్య దర్శకురాలు ఇచ్చిన ఫిర్యాదుతో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో విచారణ ఖైదీగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ శుక్రవారం సాయంత్రం బెయిల్‌పై విడుదలయ్యారు. లైంగిక వేధింపుల ఫిర్యాదుతో ఆయనపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. గత నెల 19న జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మొదట రంగారెడ్డి పోక్సో న్యాయస్థానంలో బెయిల్ కోసం ఆయన ప్రయత్నించగా అనుమతి లభించలేదు. తాజాగా వేసిన పిటిషన్‌తో ఆయనకు గురువారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం జైలు అధికారులు జానీ మాస్టర్‌ను విడుదల చేశారు.

గ్రీజు వంటి నూనె.. కుళ్లిన ఆహార పదార్థాలు

- హోటళ్లు, మిఠాయి దుకాణాల్లో దారుణాలు
- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో వెలుగులోకి


యూసుఫ్‌గూడలోని అల్ మతమ్ అల్ హింద్ అరేబియన్ మండీలో.

ఈనాడు, హైదరాబాద్: నగరంలోని పలు హోటళ్లు, మిఠాయి దుకాణాల్లో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలను కొనసాగిస్తోంది. గడిచిన మూడ్రోజుల్లో గుర్తించిన లోపాలను అధికారులు శుక్రవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. చైతన్యపురి, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లోని హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్, బేకరీలు, మండీ హౌజ్‌లు, షవర్మ తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టగా.. దారుణమైన పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. తినడానికి ఏమాత్రం పనికిరాని కూరగాయలు, మాంసం, క్యాన్సర్ కారక రంగులు, ఉపయోగిస్తుండటంతోపాటుగా గ్రీజులా మారిన వంట నూనె, ఇతరత్రా లోపాలు బయటపడ్డాయి.

యూసుఫ్‌గూడలో.. ● ఏజీ కాలనీలోని మహమ్మదీయ షవర్మ కేంద్రంలో.. గ్రీజులా మారిన నూనె, షవర్మ తయారీలో తుప్పు పట్టిన పాత్రల వినియోగం, ఫ్రిడ్జిలో కుళ్లిన ఆహార పదార్థాలు, ఫుడ్ లైసెన్సు లేకపోవడం తదితర లోపాలు. ● రాజీవ్‌నగర్‌లోని అల్ ఖాసీం ది మండీ హౌజ్‌లో.. అపరిశుభ్రంగా ఉన్న వంట గదిలో నేలపైనే వంట సామగ్రిని ఉంచడం, ఫ్రిడ్జిలో మురుగువంటి నీరు, జిగటగా మారిన పైకప్పు, ఎగ్జాస్ట్ ఫ్యాన్, పొయ్యి తదితరాలు.. ● అల్ మతమ్ మదీనా మండీలో.. ఇరుకు గదిలో అపరిశుభ్రంగా ఉన్న వంటగది, సింథటిక్ రంగుల వినియోగం, నేలపై చెత్త, ఇతరత్రా.. ● అల్ మతమ్ అల్ హింద్ అరేబియన్ మండీలో.. అపరిశుభ్ర వంటగది, చిమ్ని, వ్యర్థాలు, బొద్దింకలు..

అమీర్‌పేటలో.. ● వాసిరెడ్డి హోమ్ ఫుడ్స్‌లో.. (లైసెన్సు లేదు) వంట మనుషుల వస్త్రధారణ సరిగా లేకపోవడం, బొద్దింకలు, తయారీదారుల వివరాల్లేని 'రెడీ టూ ఈట్' తినుబండారాల విక్రయం. ● వినూత్న ఫుడ్స్ .. (లైసెన్సు లేదు) లేబుల్స్ లేకుండా ఆహార పదార్థాల అమ్మకం, అపరిశుభ్రత ● ఆగ్రాస్వీట్స్‌లో.. (లైసెన్సు లేదు) గడువు ముగిసిన చుడవ, బేల్, ఇతర వస్తువుల అమ్మకం. ● దిల్లీ మిఠాయివాలాలో.. ఎలుకలు, బొద్దింకలు, తెరచి ఉంచిన చెత్త డబ్బాలు, సవ్యంగా భద్రపరచని సరకులు.

చైతన్యపురిలో.. ● శిల్పి ఎలైట్ రెస్టారెంట్ అండ్ బార్‌లో.. వంట మనుషుల వైద్య పరీక్షల రికార్డులు లేకపోవడం, వంటగది ఫ్లోర్, పైకప్పు జిగటగా ఉండటం, మూతల్లేని చెత్త డబ్బాలు, మురుగు, ప్రమాణాల ప్రకారం లేని ఫ్రిడ్జిలు, కుళ్లిన కూరగాయలు, బొద్దింకలు, సింథటిక్ రంగుల లభ్యత..● బాహర్ బిర్యానీ కేఫ్‌లో.. వంట గది తలుపులు అపరిశుభ్రంగా ఉండటం, నిలిచిన మురుగు, తుప్పు పట్టిన వంట సామగ్రి, ఫ్రిడ్జిలో అపరిశుభ్రత, గడువు తీరిన హాట్ పెప్పర్ సాస్, చాక్‌లెట్ ఫ్లేవర్ సిరప్, కోడి మాంసాన్ని నేరుగా ఫ్రిడ్జిలో ఉంచడం వంటి లోపాలు.

ఎన్నేళ్లైనా బాగుచేసే మార్గం లేనట్లేనా?



నేరేడ్‌మెట్ ఆర్‌కె పురం పైవంతెన రహదారి ఇది. కంకర తేలి, గుంతలు, పడి వాహనదారులకు నరకప్రాయంగా మారింది. పాదబాట ధ్వంసమైంది. రాత్రుళ్లు ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

బీసీ బిల్లుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి


రాజాకు వినతిపత్రమిస్తున్న వి.హనుమంతరావు, గుజ్జ కృష్ణ. చిత్రంలో నందగోపాల్, రాఘవేంద్ర, విజయ్‌కుమార్

కాచిగూడ, న్యూస్‌టుడే: పార్లమెంటులో బీసీ బిల్లు, ఓబీసీ కులగణన, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రధాన కార్యదర్శులు నందగోపాల్, రాఘవేంద్ర, కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులతో.. దిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయంలో రాజాను కలిసి వినతిపత్రాన్ని అందజేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వీహెచ్ పేర్కొన్నారు. దేశవ్యాప్త కులగణనకు సీపీఐ మద్దతు తెలుపుతుందని, ఈ విషయమై జాతీయ సమావేశాల్లో ఇప్పటికే తీర్మానం చేసిన విషయాన్ని రాజా గుర్తు చేశారన్నారు.

'విగ్రహం ధ్వంసంలో కుట్రకోణం లేదు'

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన విగ్రహం విధ్వంసం కేసులో కుట్రకోణం లేదని శుక్రవారం నగర సీపీ సీవీ ఆనంద్ స్పష్టంచేశారు. బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో విలేకర్ల ప్రశ్నకు సమాధానమిచ్చారు. ముంబయికి చెందిన నిందితుడు గతంలోనూ అక్కడ ఆలయాల్లోకి ప్రవేశించి గొడవలకు పాల్పడినట్టు పోలీసు కేసులు నమోదయ్యాయన్నారు. తల్లిదండ్రులు అతడిలో మార్పు తెచ్చేందుకు నగరంలోని వ్యక్తిత్వ వికాస నిపుణుడి వద్దకు నెలకు రూ.30వేల ఫీజు చెల్లించి పంపినట్టు చెప్పారు. అనంతరం అతడు ప్రార్థన మందిరంలోకి ప్రవేశించి విగ్రహం ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరుగుతుందని.. కుట్రదాగినట్టు ఆధారాలు లభించలేదన్నారు. ఈ 14న నిందితుడిని స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన నిందితుడికి నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. ఇతడిని చూసేందుకు కుటుంబసభ్యులు రాకపోవటం గమనార్హం. ఈ ఘటనపై ఎన్ఐఏ, ఏటీఎస్ అధికారులు ఆరా తీశారు. నగర పోలీసుల నుంచి వివరాలు సేకరించినట్టు సమాచారం.

శునకాలకు శస్త్రచికిత్సలు, స్టెరిలైజేషన్ పెంచాలి

బండ్లగూడ: ఫతుల్లాగూడలోని జంతు సంరక్షణ కేంద్రాన్ని శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తనిఖీ చేశారు. శునకాలకు శస్త్రచికిత్సలు, స్టెరిలైజేషన్ వంటివి పరిశీలించారు. శస్త్రచికిత్సల సంఖ్య పెంచాలని, స్టెరిలైజేషన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కుక్కల బెడదను సర్కిళ్లవారీగా సమీక్షించుకోవాలని, వీలైనన్ని ఎక్కువ శునకాలను పట్టుకొని స్టెరిలైజేషన్ చేయాలని చీఫ్ వెటర్నరీ అధికారి డా.అబ్దుల్ వకీల్‌ను ఆదేశించారు. భవన వ్యర్థాలు, శిథిలాల రీసైక్లింగ్ ప్లాంటును ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఆరోగ్య శాఖ అదనపు కమిషనర్ పంకజ, హయత్‌నగర్ డీసీ యాదగిరి ఉన్నారు.

మైనర్లతో ద్విచక్ర వాహన చోరీలు

బేగంబజార్: బాలలతో ద్విచక్రవాహనాల దొంగతనాలు చేయిస్తున్న దొంగ అలి అబ్బాస్(21)ను సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ అరెస్ట్ చేసినట్టు డీసీపీ శ్వేత తెలిపారు. నిందితుడి నుంచి రూ.4లక్షల విలువైన 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు మైనర్లను జువెనైల్ హోమ్‌కు తరలించారు. డీసీపీ వివరాల ప్రకారం.. మిర్‌చౌక్ జెహ్రానగర్‌కు చెందిన అలిఅబ్బాస్ యాకుత్‌పుర, దారుల్‌షిఫాలకు చెందిన మైనర్లకు తినుబండారాలు, సొమ్ములు ఆశచూపి బైక్‌లు దొంగతనం చేయటం నేర్పిస్తున్నాడు. వారు బయట నిలిపిన వాహనాల తాళం తీసి క్షణాల్లో మాయం చేస్తారు. కొట్టేసిన వాహనాలను తుక్కు చేసి తక్కువ ధరకు అమ్మేస్తున్నారు. సీసీఎస్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ భిక్షపతి బృందం నిందితుడిని అరెస్ట్ చేసి అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.



పురాతన బండరాళ్ల పరిరక్షణకు హైడ్రా కృషి


చిత్రాలను తిలకిస్తున్న రంగనాథ్

మాదాపూర్, న్యూస్‌టుడే: పర్యావరణంలో చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులతో పాటు సహజసిద్ధమైన రాళ్లు, గుట్టలు అంతే కీలకమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. నగరం చుట్టూ ఉన్న పురాతనమైన బండరాళ్లను పరిరక్షించేందుకు హైడ్రా తరఫున కృషి చేస్తామన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన చూపరులను ఆలోచింపజేస్తోంది. సొసైటీ టూ సేవ్ రాక్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఇంటర్నేషనల్ జియోడైవర్సిటీ వారోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ నివేదిక ప్రకారం 45 ఏళ్లలో నగరంలోని 61శాతం చెరువులు ఆక్రమణకు గురయ్యాయన్నారు. జలవనరుల పరిరక్షణకు హైడ్రా చేపట్టిన కఠినమైన చర్యల కారణంగా ప్రజలకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల మీద అవగాహన వచ్చిందన్నారు. ఇప్పుడు చెరువుల వద్ద నిర్మాణాల్లో ప్లాట్లను, స్థలాలను కొనుగోలుచేసేందుకు ప్రజలు ముందుకురావడం లేదన్నారు. హైడ్రా చర్యలు ఆగలేదు, మరింత యాక్టివ్‌గా పనిచేసేందుకు సిద్ధమవుతుందన్నారు. చట్టప్రకారం మరింత అధికారాన్ని బలాన్ని సమకూర్చుకొని బలమైన శక్తిగా అన్ని అధికారాలతో మళ్లీ రంగంలోకి దిగుతుందని చెప్పారు.

కృత్రిమ మేధతో భారత్ జెన్ పోర్టల్

'ఈ-విక్రయ్' రూపకల్పనలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ భాగస్వామ్యం



ఈనాడు, హైదరాబాద్: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ సంస్థల తరహాలో కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా కృత్రిమ మేధతో కూడిన 'భారత్ జెన్' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పోర్టల్‌లో ఈ-విక్రయ్ ద్వారా దేశవ్యాప్తంగా ఎవరైనా సరే.. వస్తువులను కొనుగోలు చేయవచ్చు. కార్పొరేటు కంపెనీలు, వాణిజ్య సంస్థలు తమ ఉత్పత్తులను 'ఈ-విక్రయ్' ద్వారా విక్రయించవచ్చు. ప్రస్తుతం ఈ-కామర్స్ సంస్థల్లో ఆంగ్లంతోపాటు కొన్ని ప్రాంతీయ భాషలు మాత్రమే అందుబాటులో ఉండగా భారత్ జెన్ పోర్టల్‌లో ఇంగ్లిష్, హిందీ సహా అన్ని ప్రాంతీయ భాషలు అందుబాటులో ఉన్నాయి. భారత్ జెన్ పోర్టల్‌లోని అంశాలు, సైబర్ టెక్నాలజీ, కృత్రిమ మేధ వంటివాటి సమ్మిళితంగా ఈ పోర్టల్ ఉండాలన్న లక్ష్యంతో ఐఐటీ బాంబే అధికారులు.. ఐఐటీ మద్రాస్, ఐఐటీ కాన్పూర్, ఐఐటీ మండి, ఐఐటీ హైదరాబాద్‌తోపాటు ఐఐఎం ఇండోర్, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌ను భాగస్వాములను చేశారు. ప్రాంతీయ భాషల్లో పదాలను టైప్ చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ రవికిరణ్ సర్వదేవ భట్ల రూపొందించారు. ఒక వస్తువును వివిధ రాష్ట్రాల్లో ఎలా వ్యవహరిస్తారో అలాగే దాని పేరుంటుందని రవికిరణ్ తెలిపారు. ఉదాహరణకు రోకలి, రోలు వంటివాటిని ఆంగ్లంలో ఏమంటారో మనలో కొంతమందికి తెలియదు. మనం తెలుగులో చీర అంటే హిందీలో సాడీ, ఇంగ్లిష్‌లో శారీ అంటారు. ఈ పోర్టల్‌లో ఇలాంటివన్నీ వేర్వేరుగా అందుబాటులో ఉంటాయని వివరించారు.

30 సెకన్లలో వస్తువుల వివరాలు

భారత్‌జెన్ పోర్టల్‌లోని ఈ-విక్రయ్ ద్వారా వస్తువులను విక్రయించేవారికి చాలా సమయం ఆదా అవుతుందని రవికిరణ్ పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీలు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు ఆ వస్తువు ఫొటో, విశేషాలు వివరంగా టైప్ చేయాలి. ఇందుకోసం వారికి కనీసం 6 నిమిషాలు పడుతుంది. ఇందుకు భిన్నంగా భారత్ జెన్ పోర్టల్‌తో 30 సెకన్లలో వారి వస్తువు వివరాలను అప్‌లోడ్ చేసేందుకు వీలుంది. వస్తువు ఫొటో, మోడల్‌ను నమోదు చేయగానే కృత్రిమమేధ ఆ వస్తువు వివరాలను సెకన్ల వ్యవధిలో వెల్లడిస్తుందని రవికిరణ్ వివరించారు.

ధర్మరాజు విజ్ఞత నేటికీ అనుసరణీయం


గరికిపాటి దంపతులతో నాగ్యా దంపతులు, కుటుంబ సభ్యులు


సికింద్రాబాద్, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఆంధ్ర లలితకళాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సికింద్రాబాద్ రైల్‌నిలయం ఆడిటోరియంలో జరిగిన 'మహాభారతంలో ధర్మరాజు పాత్ర' అనే అంశంపై ప్రముఖ విద్వాంసుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నర్సింహారావు చేసిన ప్రసంగం ఆహూతులను ఆకట్టుకుంది. దక్షిణ మధ్య రైల్వే అకౌంట్స్ ప్రిన్సిపల్, ఆపరేటింగ్ మేనేజర్ బి.నాగ్యా పదవీ విరమణ సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మహాభారతంలో ధర్మరాజు జన్మించినప్పటి నుంచి స్వర్గానికి చేరుకునే వరకు ఆయన ప్రదర్శించిన ధర్మవిజ్ఞతను గరికిపాటి విపులంగా చెప్పారు. లలితకళా సమితి అధ్యక్షురాలు కె.పద్మజ, ఉపాధ్యక్షులు రవి పి.పాడి, సంయుక్త కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా, మంత్రి భుజంగరావు, రవూఫ్ పాల్గొన్నారు.

టీజీ జాక్‌లో 'ట్రెటా' భాగస్వామ్యం


జగదీశ్వర్‌ను సత్కరిస్తున్న వినోద్‌కుమార్, వెంకటయ్య తదితరులు

బషీర్‌బాగ్ న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ ఐకాసలో భాగస్వామి అయినట్లు తెలంగాణ విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం(ట్రెటా) రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పూరి వెంకటయ్యలు తెలిపారు. ఈ మేరకు ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ఇతర నేతలను నాంపల్లిలోని టీఎన్‌జీవో భవన్‌లో కలిసి ఈ విషయం స్పష్టం చేసినట్లు వెల్లడించారు. సంఘం నేతలు ప్రభాకర్‌రావు, నర్సింగ్‌రావు, ఆనందమూర్తి పాల్గొన్నారు.

సాంస్కృతిక, నైపుణ్యాల వేడుక స్వదేశీ మేళా


మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: స్వదేశీ జాగరణ్ మంచ్ నిర్వహిస్తున్న స్వదేశీ మేళా మన సాంస్కృతిక వారసత్వం, నైపుణ్యాల వేడుక అని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజాలో కొనసాగుతున్న స్వదేశీ మేళాలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొ.వెంకటేశ్వర్‌రావు, స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ హరీశ్ బాబు, గంగోత్రి డెవలపర్స్ ఛైర్మన్ మధురాంరెడ్డి, స్వావలంబి భారత్ అభియాన్ ప్రాంత కన్వీనర్ జి.రమేష్‌గౌడ్, కన్వీనర్ ఇంద్రసేన్‌రెడ్డి, కో-కన్వీనర్లు సిద్దుల అశోక్, ఈశ్వర్ పాల్గొన్నారు.



చూసేందుకు చిన్నసైజు ఎలుగుబంటిలా, సింహం పిల్లలా కనిపిస్తున్నాయి కదూ.. చైనాకు చెందిన చౌచౌ బ్రీడ్ శునకాలను పెంచుకొనేందుకు నగరవాసులు ఇష్టపడుతున్నారు. అంబర్‌పేట డీడీ కాలనీ, దిల్‌సుఖ్‌నగర్‌లో వాటి యజమానులతో కలిసి కనిపించాయి.

పార్లమెంటులో గోసంరక్షణ బిల్లు ప్రవేశపెట్టాలి



కిషన్‌రెడ్డితో జస్మత్‌పటేల్, సౌరబ్ బోరా, గోసంరక్షణ సంస్థల ప్రతినిధులు

కాచిగూడ, న్యూస్‌టుడే: పార్లమెంటులో గోసంరక్షణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ గోసంరక్షణ సంస్థలు కోరాయి. శుక్రవారం యూపీలోని లఖ్‌నవూ ఎమ్మెల్యే డా.నీరజ్‌బోరా సహా తెలంగాణ లౌఫర్‌కా ఫౌండేషన్ ఛైర్మన్ జస్మత్‌పటేల్, ప్రతినిధులు రితీష్ జాగిర్దార్, సతీష్‌జాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, సౌరబ్‌పాండే, పింటూ కచ్‌వా తదితరులు కిషన్‌రెడ్డిని కలిసి కోరారు.

ప్రశాంతంగా హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికలు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల పోలింగ్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 28 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా విద్యార్థులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాదాపూర్ డీసీపీ వినీత్, ఏసీపీ శ్రీకాంత్‌లు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం ఉదయం ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఓయూ ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు వినతి


వీసీ కుమార్‌ను సత్కరిస్తున్న సుదర్శన్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయం(ఓయూ)లో పనిచేస్తున్న సుమారు 2500 మంది ఒప్పంద ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ కోరారు. సంబంధిత ఉద్యోగుల సమస్యలను సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరించాలని అభ్యర్థించారు. శుక్రవారం శివసేన రాష్ట్ర అధికార ప్రతినిధి గణేష్‌తో కలిసి ఓయూ ఉపకులపతి కుమార్ మొలుగరంను కలిసి విజ్ఞప్తి చేశారు. ఓయూలో ఒప్పంద ఉద్యోగులు ఏళ్ల తరబడి పని చేస్తున్నా.. వారి సేవలను క్రమబద్ధీకరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు జనవరిలో


కార్యక్రమంలో ఇందిరాదత్ తదితరులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు సమాఖ్య 12 ద్వైవార్షిక అంతర్జాతీయ మహా సభలు జనవరి 3-5 వరకు మాదాపూర్ హెచ్‌ఐసీసీలో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ఛైర్‌పర్సన్ వీఎల్ ఇందిరాదత్ తెలిపారు. శుక్రవారం మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ 45 దేశాల్లోని 150 ప్రపంచ తెలుగు సమాఖ్య అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. కార్యక్రమాల్లో భాగంగా సినీ, పారిశ్రామిక తదితర రంగాల తెలుగు ప్రముఖులను సత్కరించనున్నట్లు వెల్లడించారు. నిర్వహణ కమిటీ ప్రతినిధులు సాయి, విజయలక్ష్మి, హరీష్‌చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. సమాఖ్య అనుబంధ సంఘాల ప్రతినిధులతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 2వేల మంది వరకు హాజరుకానున్నట్లు తెలిపారు. అనుబంధ సంఘాల ప్రతినిధుల సమావేశాలు, వ్యాపార, పారిశ్రామికవేత్తల సదస్సులు ఉంటాయని, వారితో యువతకు ముఖాముఖి కార్యక్రమాలూ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ వైస్ ఛైర్‌పర్సన్ కవిత దత్ పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా మరమ్మతులు


ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వద్ద పనులు పరిశీలిస్తున్న అశోక్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: గండిపేట జలాశయం నుంచి నగరానికి నీటిని సరఫరా చేసే కాండూట్ (కాలువ)కు అంతరాయం లేకుండా జలమండలి మరమ్మతులను చేపట్టింది. గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్‌బెడ్‌ల మధ్య కాండూట్‌కి 14.5 కిలోమీటర్లలో సుమారు 45 చోట్ల లీకేజీలు ఉన్నాయి. గండిపేట్ కాండూట్‌కి పదేళ్లుగా కోకాపేట్, మణికొండ, పుప్పాలగూడ, జానకీనగర్, కౌసర్‌కాలనీ, ఎంఈఎస్ క్యాంపస్ తదితర ప్రాంతాల్లో తీవ్ర లీకేజీలు ఏర్పడ్డాయి. వాటిని అరికట్టడానికి మరమ్మతులు చేయాలంటే నీటి సరఫరాను నెల రోజుల పాటు నిలిపివేయాలి. తాజాగా నీటి సరఫరాను నిలిపివేయకుండానే జర్మన్ టెక్నాలజీతో లీకేజీలను అరికట్టేందుకు చెన్నైకి చెందిన ఓ సంస్థ ముందుకురాగా ఆసిఫ్‌నగర్ ఫిల్టర్‌బెడ్ వద్ద కాండూట్‌కి 10 మీటర్ల మేరకు గ్రౌటింగ్ చేసి పనులు చేపట్టారు. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో ఇతర ప్రాంతాల్లోనూ ఈదే తరహా పనులు చేపట్టాలని జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి ఆదేశించారు. గండిపేట నుంచి 26 ఎంజీడీల నీటిని నగరానికి సరఫరా చేసే సామర్థ్యంతో కాండూట్ ఉండగా ప్రస్తుతం 20 ఎంజీడీల నీటిని మాత్రం సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎండీ శుక్రవారం పనులను పరిశీలించారు. సీజీఎం రవీందర్‌రెడ్డి, ట్రాన్స్‌మిషన్ అధికారులు పాల్గొన్నారు.

28న 'జన గణనలో బీసీ కుల గణన' సదస్సు


మాట్లాడుతున్న బాల మల్లేష్ చిత్రంలో సీపీఐ, బీసీ సంఘాల నాయకులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: దామాషా ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగాల్లోనే కాకుండా చట్టసభల్లో రిజర్వేషన్లను కల్పించడం ద్వారా బీసీలకు కొంతైనా సామాజిక న్యాయం దక్కుతుందని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. హక్కుల సాధనే లక్ష్యంగా సమితి ఆధ్వర్యంలో ఈనెల 28న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'జన గణనలో బీసీ కుల గణన' రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం సీసీపై రాష్ట్ర కార్యాలయంలో బీసీ హక్కుల సాధన కమిటీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ దశరథ అధ్యక్షతన బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వరరావు, ఆర్.కృష్ణమూర్తి, కె.ప్రమీల, జిల్లా కాసోజు మహాలక్ష్మి, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో స్టార్టప్, ఇన్వెస్టర్ల సదస్సు

సంగారెడ్డి టౌన్, కంది, న్యూస్‌టుడే: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ఉత్పత్తిదారులకు చేయూతే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ హెచ్‌లో శుక్రవారం స్టార్టప్, ఇన్వెస్టర్ల సదస్సు నిర్వహించారు. వీసీ సర్కిల్-ప్యూర్ ఈవీ అంకుర సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 60 అంకుర సంస్థలు, 130 మంది యువ పారిశ్రామికవేత్తలు, దేశ విదేశాలకు చెందిన 30 మంది పెట్టుబడిదారులు ఇందులో భాగస్వాములయ్యారు. ఆధునిక సాంకేతికత ఆలోచనతో రూపొందించిన ప్రాజెక్టులతో ముందుకు వచ్చే అంకుర సంస్థల్లో పెట్టుబడులకు పలువురు ఆసక్తి చూపారు. అంతకు ముందు 'భారత దేశంలో ఎలక్ట్రిక్ వాహన విప్లవం-భవిష్యత్తు' అనే అంశంపై రూపొందించిన శ్వేతపత్రాన్ని ఐఐటీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్యూర్ ఈవీ(ఎలక్ట్రికల్ వెహికిల్) వ్యవస్థాపక ఛైర్మన్ డా.నిశాంత్ దొంగరి ఆవిష్కరించారు.

గీత కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న రాజేందర్‌పటేల్‌గౌడ్

గోల్నాక, న్యూస్‌టుడే: కల్లుగీత కార్మికులను ఆదుకోవడానికి వీలుగా గీత కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నింబోలిఅడ్డాలో ఏర్పాటుచేసిన సమావేశంలో.. నేతలు ప్రదీప్‌గౌడ్, డా.ప్రశాంత్ నిమికర్, భూషణ్‌భాస్కర్, ధరణీధర్‌యాదవ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. కల్లు గీత కార్మిక సొసైటీలకు తాటి, ఈత వనాల పెంపు కోసం ఐదెకరాల చొప్పున స్థలం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నగరంలో ఈనాడు

● హైటెక్‌సిటీలోని హోటల్ ఆవాసలో ఉ. 8.30గంటలకు ఐఏసీఏ ఆధ్వర్యంలో సింపోజియం కార్యక్రమం ● హెచ్‌ఐసీసీ నోవాటెల్‌లో ఉ. 10.30గంటలకు ఐకేఎంసీ-2024 కార్యక్రమం.. ●హిమాయత్‌నగర్‌లోని వీజేఐటీ కళాశాలలో ఉ. 10.30గంటలకు టెడెక్స్ వీజేఐటీ కార్యక్రమం ● హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లోని హాల్ నంబరు 4లో నరెడ్కో ప్రాపర్టీ షో ● నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్ ఆడిటోరియంలో సాయంత్రం 4.30గంటలకు మెన్ ఫర్ ఉమెన్ కార్యక్రమం. హాజరవుతున్న సినీ నటుడు శ్రీకాంత్.

డీఆర్డీవో సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నీ విజేత ఏఎస్ఎల్ జట్టు


ఏఎస్ఎల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జేవీఆర్ సాగర్

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: డీఆర్డీవో సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నీ విజేతగా నగరంలోని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ(ఏఎస్ఎల్) జట్టు నిలిచింది. శుక్రవారం జరిగిన తుది పోరులో ఒడిశాకు చెందిన పీఎక్స్ఈ జట్టు 6 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. డీఆర్డీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి కంచన్‌బాగ్‌లోని డీఆర్డీవో టౌన్‌షిప్ మైదానంలో పోటీలు జరుగుతున్నాయి. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా కన్నన్(ఏఎస్ఎల్), బ్యాట్స్‌మెన్ ఆఫ్ ది సిరీస్‌గా భరత్(ఆర్సీఐ), బౌలర్ ఆఫ్ ది సిరీస్‌గా కమ్లేశ్‌కుమార్ సాహు(ఏఎస్ఎల్), మ్యాన్ ఆఫ్ ది ఫైనల్ మ్యాచ్‌గా ప్రణయ్ నరేందర్‌కుమార్ (ఏఎస్ఎల్)లు ఎంపికయ్యారు. డీఆర్డీఎల్ అఫిషియేటింగ్ డైరెక్టర్ జేవీఆర్ సాగర్, మేనేజ్‌మెంట్ సర్వీసెస్ డైరెక్టర్ ఎంఎన్ నారాయణ(కమోడోర్ రిటైర్డ్), ఏఎస్ఎల్ డీవోఎంఎస్ గౌరీశంకర్, డీఆర్డీఎల్ వర్క్స్ కమిటీ వైస్ ఛైర్మన్ బి.ప్రభాకర్, డీఆర్డీవో ఛైర్మన్ డాక్టర్ ఓం ప్రకాశ్ పరిదా, డీఆర్డీవో సెంట్రల్ జోన్ సెక్రటరీ అండ్ వర్క్స్ కమిటీ సెక్రెటరీ నర్పాల్ సింగ్, డీఆర్డీవో కౌన్సిల్ జేసీఎం-3 మెంబర్ రాధే శ్యామ్, డీఆర్డీఎల్ స్పోర్ట్స్ సెక్రెటరీ, జేసీఎం-4 మెంబర్ ఆలం అన్సారీ పాల్గొన్నారు.

ఈనాడు సినిమా


రష్మిక
మీనాక్షి చౌదరి
రుక్మిణీ వసంత్

కథానాయికల సినీ ప్రయాణం ఎప్పుడూ టీ20 శైలిలో జెట్‌స్పీడ్‌తో పరుగులు పెడుతుంటుంది. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా చేతిలో అవకాశాలు ఉన్నప్పుడు ఎడాపెడా సినిమాలు చేస్తూ జోరు చూపించే ప్రయత్నం చేస్తుంటారు. ప్రస్తుతం చిత్ర సీమలో కొందరు నాయికలు రోజుల వ్యవధిలోనే ఒకటికి రెండు చిత్రాలతో బాక్సాఫీస్ ముందు జోరు చూపించనుండటం సినీప్రియుల్ని ఆకర్షిస్తోంది. మరి ఇప్పుడలా వరుస సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించనున్న ఆ నాయికలెవరు? ఆ చిత్ర విశేషాలేంటో తెలుసుకుందాం.

రెండేసి.. మూడేసి..
వినోదాల్లో ముంచేసి!
వరుస సినిమాలతో నాయికల జోరు

విజయవంతమైన కన్నడ సినిమా 'సప్తసాగరాలు దాటి'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది రుక్మిణీ వసంత్. ఇప్పుడామె 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'తో తెలుగు తెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. నిఖిల్ హీరోగా సుధీర్ వర్మ తెరకెక్కించిన చిత్రమిది. 'స్వామిరారా', 'కేశవ' సినిమాల తర్వాత వీళ్ల కాంబోలో వస్తున్న మూడో ప్రాజెక్ట్. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైన ఈ చిత్రంలో నిఖిల్‌కు జోడీగా అలరించనుంది రుక్మిణి. ఇది నవంబరు 8న తెరపైకి రానుండగా.. దానికి ఓ వారం ముందే ఈ దీపావళికి 'బఘీరా'తో పాన్ ఇండియా ప్రేక్షకుల్ని పలకరించనుంది ఈ కన్నడ కస్తూరి. శ్రీమురళి హీరోగా డాక్టర్ సూరి రూపొందించిన చిత్రమిది. దర్శకుడు ప్రశాంత్ నీల్ కథతో ముస్తాబైన ఈ యాక్షన్ థ్రిల్లర్ ఈ నెల 31న విడుదల కానుంది. మరి ఈ రెండు చిత్రాలతో రుక్మిణి హిట్టు మాట వినిపిస్తుందా? లేదా? అన్నది ఇంకొన్ని రోజుల్లో తేలిపోనుంది.

మీనాక్షి.. ముచ్చటగా మూడు

ఈ ఏడాది ప్రతి పండగ నాదే అన్నట్లుగా వరుస సినిమాలతో సినీప్రియుల్ని మురిపించే ప్రయత్నం చేస్తోంది నటి మీనాక్షి చౌదరి. సంక్రాంతి బరిలో 'గుంటూరు కారం'తో సందడి చేసిన ఈ భామ.. వినాయక చవితికి 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్'తో వినోదాలు పంచిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడీ దీపావళికి 'లక్కీ భాస్కర్'తో మరోసారి సొగసుల పటాకా పేల్చేందుకు సిద్ధమవుతోంది. దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన చిత్రమిది. డబ్బుతో ముడిపడిన ఆసక్తికర కథాంశంతో ముస్తాబైన ఈ పీరియాడిక్ డ్రామాలో దుల్కర్ భార్యగా సుమతి పాత్రలో కనువిందు చేయనుంది మీనాక్షి. ఇది ఈనెల 31న తెరపైకి రానుండగా.. మరో రెండు వారాల వ్యవధిలోనే 'మట్కా'తో.. ఆ తర్వాత మళ్లీ రెండు వారాలకు 'మెకానిక్ రాకీ'తో తెరపై వినోదాలు పంచనుంది. కథానాయకుడు వరుణ్ తేజ్.. దర్శకుడు కరుణ కుమార్ కలయికలో ముస్తాబైన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'మట్కా' సైతం డబ్బుతో ముడిపడిన కథాంశంగానే ఉండనుంది. అంతేకాదు దీంట్లోనూ మీనాక్షి గృహిణి పాత్రలోనే కనువిందు చేయనుంది. ఇది నవంబరు 14న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. ఇదే నెల 22న 'మెకానిక్ రాకీ'తో అలరించనుంది. విష్వక్ సేన్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని రవితేజ ముళ్లపూడి తెరకెక్కించారు. ఇందులో మీనాక్షి మోడ్రన్ అమ్మాయిగా స్టైలిష్ పాత్రలో సందడి చేయనుంది. మరి ఈ మూడు చిత్రాలతో మీనాక్షి హ్యాట్రిక్ విజయాలు అందుకుంటుందా? లేదా? చూడాలి.

వీళ్లూ డబుల్ ట్రీట్ ఇస్తారా?

గతేడాది డిసెంబరులో 'యానిమల్'తో విజయాన్ని అందుకుంది కథానాయిక రష్మిక. ఇప్పుడీ డిసెంబరులో ఓవైపు 'పుష్ప 2: ది రూల్'తోనూ.. మరోవైపు 'ఛావా'తోనూ జోరు చూపేందుకు సిద్ధమవుతోంది. నిజానికి ఈ రెండూ డిసెంబరు 6నే రానున్నట్లు ఇది వరకు ప్రకటించినా.. ఇప్పుడు 'పుష్ప 2' ఒకరోజు ముందుకు జరిగింది. అయితే మరోవైపు 'ఛావా' నుంచి ప్రస్తుతం ఎలాంటి ప్రచార హంగామా కనిపించడం లేదు. మరి 'పుష్ప' క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని దీని విడుదలను వాయిదా వేయనున్నారా? లేక అదే నెలలో మరో తేదీకి తీసుకొస్తున్నారా? అన్నది తేలలేదు. త్వరలోనే దీనిపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. ఇక ఇదే నెలలో 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి తొలి అడుగు వేయనుంది కథానాయిక కీర్తి సురేశ్. వరుణ్ ధావన్ హీరోగా నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను కాలీస్ తెరకెక్కించారు. విజయవంతమైన తమిళ సినిమా 'తేరి'కి రీమేక్‌గా రూపొందిన ఈ చిత్రం డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుండటం ఇప్పటికే ఖాయమైంది. అయితే మరోవైపు ఇదే నెలలో కీర్తి నుంచి 'రివాల్వర్ రీటా' కూడా విడుదలయ్యే అవకాశమున్నట్లు వార్తలు ఊపందుకున్నాయి. కె.చంద్రు తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

కొత్త జానర్.. సరికొత్త ప్రపంచం


అల్లు అర్జున్

'పుష్ప 2'తో డిసెంబరు బరిలో ప్రేక్షకులకు వినోదాలు పంచనున్నారు కథానాయకుడు అల్లు అర్జున్. దీని తర్వాత ఆయన దర్శకుడు త్రివిక్రమ్‌తో ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ ప్రాజెక్ట్‌కు సంబంధించి నిర్మాత సూర్యదేవర నాగవంశీ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ముగింపుకొచ్చాయని.. జనవరిలో ఓ ప్రత్యేక ప్రోమోతో సినిమాని ప్రకటిస్తామని.. మార్చి నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తామని వెల్లడించారు. ఇప్పటి వరకు రాజమౌళి ఎన్నో గొప్ప చిత్రాలు చేశారని.. ఆయన కూడా ముట్టుకోని ఓ కొత్త జానర్‌లో ఈ చిత్రముంటుందని.. దీనికోసం ఇంత వరకు ఎవరూ చూడని ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు నాగవంశీ. 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల.. వైకుంఠపురములో' విజయాల తర్వాత అల్లు అర్జున్ - త్రివిక్రమ్‌ల కాంబో నుంచి వస్తున్న నాలుగో సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి.

మరపురాని వేడుకగా


చిరంజీవి, నాగార్జున

దిగ్గజ నటులు ఏఎన్నార్ ఎంతో ఇష్టంగా ఏర్పాటు చేసిన పురస్కారం... అక్కినేని నాగేశ్వరరావు నేషనల్ అవార్డ్. ఇందుకోసం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేసి, ఏటా చిత్ర పరిశ్రమకి చెందిన ఒకరికి ఈ పురస్కారాన్ని అందజేస్తూ వచ్చారు. ఆయన తదనంతరం కుటుంబ సభ్యులు ఆ బాధ్యతని భుజాన వేసుకుని పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. దేవానంద్ మొదలుకొని రేఖ వరకూ ఎంతోమంది ప్రముఖులు ఈ గౌరవాన్ని పొందారు. 2024కిగానూ ప్రముఖ కథానాయకుడు, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత చిరంజీవికి అందజేయాలని నిర్ణయించారు. ఈనెల 28న హైదరాబాద్‌లో ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు చిరంజీవి. ఈ సందర్భంగా చిరంజీవిని స్వయంగా కలిసి వేడుకకి ఆహ్వానించారు అక్కినేని నాగార్జున. ఆ విషయాన్ని పంచుకుంటూ ''మా నాన్న శతజయంతి వేడుకలు చేసుకుంటున్న ఈ సంవత్సరం ఎంతో ప్రత్యేకమైనది. ఈ మైలురాయికి గుర్తుగా ఏఎన్నార్ అవార్డ్స్ 2024కి అమితాబ్ బచ్చన్, చిరంజీవిని ఆహ్వానించడం ఆనందంగా ఉంది. ఈ వేడుకని మరపురానిదిగా చేద్దాం'' అంటూ ఎక్స్ ద్వారా పిలుపు నిచ్చారు. పలువురు సినీ ప్రముఖులు ఈ వేడుకకి హాజరు కానున్నారు.

నిజాన్ని భయపెట్టొచ్చు ఓడించలేము


రాశీ ఖన్నా

గోద్రా రైలు దుర్ఘటన అనుకోకుండా జరిగింది కాదని, దాని వెనక ప్రపంచానికి తెలియని ఎన్నో రహస్యాలున్నాయని అంటున్నాడు బాలీవుడ్ కథానాయకుడు విక్రాంత్ మాస్సే. మరి ఆ రహస్యాలేంటో తెలుసుకోవాలంటే 'ది సబర్మతీ రిపోర్ట్' చూడాల్సిందే. ఆయన, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. రంజన్ చందేల్ తెరకెక్కిస్తున్నారు. రిధి డోగ్రా కీలక పాత్ర పోషిస్తుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ''దేశ చరిత్రను మార్చిన సంఘటన.. భవిష్యత్తును మార్చిన పరిణామాలు. సత్యాన్ని గగ్గోలు పెట్టిస్తూ భయపెట్టొచ్చు. కానీ.. ఓడించలేము'' అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో నిజాల్ని బయటపెట్టేందుకు ప్రయత్నిస్తున్న పాత్రికేయులుగా రాశి, విక్రాంత్ కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. 2002 ఫిబ్రవరి 27న జరిగిన ఈ ఘటనలో 59 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దహన కాండ ఆధారంగానే దీన్ని తీర్చిదిద్దుతున్నారు. శోభా కపూర్, ఏక్తా కపూర్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే నెల 15న విడుదల కానుంది.

చెప్పడానికి చాలా ఉంది కానీ..!


అభిషేక్ బచ్చన్

బాలీవుడ్ కథానాయకుడు అభిషేక్ బచ్చన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఐ వాంట్ టు టాక్'. దీనిని సుజిత్ సర్కార్ తెరకెక్కిస్తున్నారు. కామెడీ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. ఇటీవలే ఈ సినిమాను పరిచయం చేస్తూ చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని ఫస్ట్‌లుక్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ఈ పోస్టర్‌లో అభిషేక్ శస్త్ర చికిత్స జరిగిన వ్యక్తిగా సరికొత్త అవతారంలో కనిపిస్తూ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. 'చెప్పడానికి చాలా ఉంది. కానీ.. ఒక ఫొటో వెయ్యి మాటలు మాట్లాడుతుంది' అనే వ్యాఖ్యను జోడించింది చిత్రబృందం. ఇందులో జానీ లీవర్, అహల్య బమ్రూ, జయంత్ కృపలాని, నికోలస్ వాగ్నర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం నవంబరు 22న విడుదల కానుంది.

కిశోర్ కుమార్ బయోపిక్‌లో ఆమిర్?


ఆమిర్ ఖాన్

'లాల్‌సింగ్ చద్దా' పరాజయం తర్వాత సినిమాల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తున్నారు బాలీవుడ్ అగ్రకథానాయకుడు ఆమిర్ ఖాన్. ప్రస్తుతం 'సితారే జమీన్ పర్'తో బిజీగా ఉన్న ఆయన ఇప్పుడు మరో ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. దివంగత గాయకుడు, నటుడు కిశోర్ కుమార్ బయోపిక్ రానున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రంలో ఆమిర్ నటిస్తున్నట్లు సమాచారం. ''కిశోర్ కుమార్ బయోపిక్‌గా రాబోతున్న ఈ ప్రాజెక్టు దర్శకుడు అనురాగ్ బసు, నిర్మాత భూషణ్ కుమార్‌లకు చాలా ప్రత్యేకం. కొన్ని రోజులుగా వీరిద్దరితో ఈ చిత్రం గురించి ఆమిర్ ఖాన్ చర్చలు జరుపుతున్నారు. ఆమిర్ సైతం ఇందులో నటించడానికి ఉత్సాహంగా ఉన్నారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటించనున్నార''ని ఆమిర్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.


ప్రతినాయకుడిగా సిద్ధిఖీ?


నవాజుద్దీన్ సిద్ధిఖీ

బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక 'తంబా' అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. హారర్ కామెడీ నేపథ్యంలో ఆదిత్య సర్పోత్దార్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. దినేశ్ విజన్, అమర్ కౌశిక్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రెండు కాలాల మధ్య కథతో రూపొందుతున్న చిత్రమిది. తాజాగా ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో ప్రముఖ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ నటించనున్నట్లు సమాచారం. ఇందులో ఆయన పాత్ర ప్రతీకారం తీర్చుకుంటూనే నవ్వులు పంచేలా ఉంటుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. స్క్రిప్ట్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబరు మొదటి వారంలో చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలుస్తోంది.

నవ్వులు పంచే ఓ ప్రేమకథ


ఫాతిమా


ఆర్.మాధవన్

కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా భిన్నమైన పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తుంటారు విలక్షణ నటుడు ఆర్. మాధవన్. ఇప్పుడాయన ఓ ప్రేమకథా చిత్రంలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఫాతిమా సనా షేక్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ''ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న చిత్రమిది. ఓ యువకుడు, వృద్ధుడి మధ్య జరిగే చమత్కారమైన ప్రేమకథగా దీన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకూ తెరపైకి రాని ఈ కథలో మాధవన్ సరసన ఫాతిమా నటిస్తోంది. ఇందులో వీరిద్దరి ప్రేమప్రయాణం నవ్వులు పంచేలా ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణను వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభించనున్నారు. త్వరలో ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నార''ని మాధవన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

చిత్తూరు నేపథ్యంలో జాతర


సతీశ్‌బాబు, దియా

సతీశ్‌బాబు రాటకొండ కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'జాతర'. దియా రాజ్ కథానాయిక. రాధాకృష్ణారెడ్డి, శివ శంకర్ రెడ్డి నిర్మాతలు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని నవంబరు 8న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ''చిత్తూరు నేపథ్యంలో సాగే కథ ఇది. ఇప్పటివరకూ ఎవ్వరూ స్పృశించని అంశం, గాఢత నిండిన డ్రామాతో చిత్రాన్ని రూపొందించాం. యువతరం కలిసి చేసిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంద''ని సినీ వర్గాలు తెలిపాయి. ఆర్.కె. పిన్నపాల, గోపాల్‌రెడ్డి, మహబూబ్ బాషా, సాయివిక్రాంత్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీజిత్, ఛాయాగ్రహణం: కె.వి.ప్రసాద్.

EENADU Vol: 51, Iss: 76 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



రాహుల్ గడ్డం ట్రిమ్ చేస్తున్న అజిత్

పేదల ఆదాయాలు తగ్గి కలలు కల్లలు

- దిల్లీలో క్షురకుడితో రాహుల్ మాటామంతీ

దిల్లీ: దేశంలో నానాటికీ పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో కష్టపడి పనిచేసే పేదల ఆదాయాలు తగ్గిపోయి, వారి కలలు కల్లలు అవుతున్నాయని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. శుక్రవారం దిల్లీలోని ఉత్తమ్‌నగర్‌ ప్రజాపత్‌ కాలనీలో గల సెలూన్‌కు వెళ్లిన ఆయన తనకు క్షవరం చేసిన అజిత్ అనే వ్యక్తితో మాట్లాడి ఆ వ్యక్తిలోని కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియోను 'ఎక్స్‌' ద్వారా పంచుకున్న రాహుల్ "ఏమీ మిగలట్లేదు" అంటూ అజిత్ భాయ్ తనతో చెప్పిన మాటలు, చెమ్మగిల్లిన ఆతడి కళ్లు నేటి భారతంలోని పేదలు, మధ్యతరగతి వర్గాల కథను చెబుతున్నట్లుగా పేర్కొన్నారు. క్షురకుల నుంచి చెప్పులు కుట్టేవారి వరకు, కుమ్మరుల నుంచి వడ్రంగుల వరకు సొంత దుకాణాలు, ఇళ్లు ఉండాలని.. ఆత్మగౌరవంతో బతకాలని కంటున్న కలలు దోపిడీకి గురవుతున్నాయన్నారు. ప్రతిభను గుర్తించి, శ్రామికులను అందలం ఎక్కించే సమాజం రావాలని రాహుల్ అభిలషించారు. పేదల జీవితాలు బాగుపడాలంటే ఆదాయాలు పెరిగి, పొదుపు చేసిన సొమ్మును ఇళ్లకు తీసుకువెళ్లే కొత్త పథకాలు, ఆధునిక పరిష్కారాల అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సైతం తన 'ఎక్స్' హ్యాండిల్‌లో ఈ వీడియోను పోస్టు చేసింది.

మహారాష్ట్ర అభ్యర్థులపై కాంగ్రెస్ సమాలోచనలు

మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను నిర్ణయించేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు శుక్రవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధినేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కె.సి.వేణుగోపాల్ తదితరులు కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో పాల్గొన్నారు.

గుల్‌మార్గ్ ఘటనలో అమరులకు ఎల్జీ నివాళి

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌లోని గుల్‌మార్గ్ సమీపంలో ఆర్మీ వాహనంపై గురువారం జరిగిన ఉగ్రదాడిలో మరణించిన ఇద్దరు సైనికులు, ఇద్దరు కూలీలకు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన శ్రీనగర్‌లో ఆర్మీకి చెందిన 15 కోర్ యూనిట్ (చినార్ కోర్)ను శుక్రవారం సందర్శించారు. దేశం కోసం వారు చేసిన నిస్వార్థమైన సేవ, ప్రాణత్యాగాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటామన్నారు.

ఎన్డీయే విధానాలు విఫలం: రాహుల్

ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు, కూలీలకు కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ 'ఎక్స్' వేదికగా నివాళులర్పించారు. కశ్మీర్‌లో భద్రత, శాంతిని నెలకొల్పడంలో ఎన్డీయే ప్రభుత్వ విధానాలు పూర్తిగా విఫలమయ్యాయని రాహుల్ మండిపడ్డారు.

మధ్యప్రదేశ్‌లో మహిళపై సామూహిక అత్యాచారం

- ఏడుగురు అదుపులోకి

రీవా: మధ్యప్రదేశ్‌లోని రీవా జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కొత్తగా పెళ్లైన మహిళపై ఐదుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. సోమవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల కొత్తగా పెళ్లైన ఓ జంట గుర్ తహసీల్ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లింది. ఈ క్రమంలో ఓ జలపాతం వద్ద దంపతులిద్దరూ గొడవపడ్డారు. ఈ సమయంలోనే గుర్తుతెలియని వ్యక్తులు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించింది. మంగళవారం మధ్యాహ్నం దంపతులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఏడుగురుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమెరికాలో కుటుంబాన్ని కాల్చిచంపిన 15 ఏళ్ల బాలుడు

సియాటిల్: అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 15ఏళ్ల బాలుడు సొంత కుటుంబంపైనే కాల్పులకు తెగబడ్డాడు. తల్లిదండ్రులు, ముగ్గురు తోబుట్టువులను కడతేర్చాడు. అనంతరం తన 13 ఏళ్ల సోదరుడు కుటుంబంలోని అందరిపై దాడికి పాల్పడి తనను తాను కాల్చుకున్నాడంటూ అధికారులను నమ్మించేందుకు యత్నించాడు. కాల్పుల్లో ప్రాణాలతో బయటపడిన 11 ఏళ్ల చిన్నారి దర్యాప్తు అధికారులకు జరిగిన సంగతిని వివరించడంతో అసలు విషయం వెలుగుచూసింది. దీంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఉజ్బెకిస్థాన్‌తో కేంద్ర ఎన్నికల సంఘం సహకార ఒప్పందం

దిల్లీ: భారత్, ఉజ్బెకిస్థాన్ ఎన్నికల సంఘాలు శుక్రవారం ఎన్నికల సహకార ఒప్పందంపై సంతకాలు చేశాయి. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఉజ్బెక్ రాజధాని తాష్కెంట్‌ను సందర్శించిన సందర్భంగా ఈ ఒప్పందం కుదిరింది. అక్టోబరు 27న ఉజ్బెకిస్థాన్‌లో ఎన్నికలు జరగనున్నాయి. వాటికి రాజీవ్ కుమార్ అంతర్జాతీయ పరిశీలకుడిగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సహకార ఒప్పందం ప్రజాస్వామ్య దేశాలైన భారత్, ఉజ్బెకిస్థాన్‌లకు పరస్పరం ప్రయోజనకరం అవనుంది. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు ఉజ్బెకిస్థాన్ ఎన్నికల సంఘ ప్రతినిధులు భారత్‌కు వచ్చి ఎన్నికల ప్రక్రియను వీక్షించారు. ప్రపంచం అంతటా 30 దేశాల ఎన్నికల సంఘాలతో భారత్‌కు సహకార ఒప్పందం ఉంది.

ట్రంప్ ప్రచారానికి కోట్లు కుమ్మరిస్తున్న మస్క్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ప్రచారానికి టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతివ్వడమే కాకుండా పెద్ద మొత్తంలో విరాళాలు అందజేస్తున్నారు. ట్రంప్ తరఫున ప్రచార కార్యక్రమాల నిర్వహణ కోసం తాజాగా మస్క్ మరో రూ.470 కోట్లు అందజేసినట్లుగా ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ట్రంప్ కోసం ఇప్పటివరకు ఆయన రూ.1,109 కోట్లు ఖర్చు చేసినట్లుగా తెలిపింది. విరాళాలు ఇవ్వడమే కాకుండా ట్రంప్ కోసం మస్క్ ముమ్మర ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఫిలడెల్ఫియాలో ట్రంప్‌నకు మద్దతుగా సోలో క్యాంపెయిన్ నిర్వహించారు. ట్రంప్ ప్రచార కార్యక్రమాల కోసం పొలిటికల్ యాక్షన్ కమిటీని ఏర్పాటుచేసి 75 మిలియన్ డాలర్ల విరాళాన్ని ఇచ్చారు. ముఖ్యంగా అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసే స్వింగ్ స్టేట్స్‌లో ట్రంప్‌నకు మద్దతుగా భారీగా ఖర్చు పెడుతున్నారు. ఓటర్లను ట్రంప్‌నకు అనుకూలంగా మార్చేందుకు మస్క్ తాయిలాలు ఇస్తున్నట్లుగా, వాక్ స్వాతంత్ర్యం, తుపాకీ హక్కులపై తాము రూపొందించిన పిటిషన్‌పై సంతకాలు చేసిన ఓటర్లకు ఆయన డబ్బులు పంచుతున్నట్లు సమాచారం.

మస్క్ పీఏసీపై మొదలైన దర్యాప్తు

ఇదిలా ఉంటే.. తాను అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే టెస్లా సీఈవో ఎలాన్ మస్క్‌కు కేబినెట్‌లో చోటిస్తానని.. అలా కానిపక్షంలో సలహాదారుడిగానైనా నియమించుకుంటానని ట్రంప్ ఇటీవల జరిగిన ఓ ర్యాలీలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై మస్క్ సానుకూలంగా స్పందిస్తూ 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ'కి నేతృత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. మరోవైపు మస్క్ తానే స్థాపించినట్లుగా చెబుతున్న పొలిటికల్ యాక్షన్ కమిటీ(పీఏసీ)పై మిషిగన్, నార్త్ కరోలినా ఎన్నికల బోర్డు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కమిటీ ఓటర్ల సమాచారాన్ని దుర్వినియోగం చేస్తోందని.. అనే కమిటీపై నిఘా వేస్తోందని ఆరోపణలున్నాయి.

హారిస్‌ను జిన్‌పింగ్ చిన్న పిల్లలా చూస్తారు: ట్రంప్

రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రచారంలో భాగంగా గురువారం ఓ రేడియో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోస్ట్ మాట్లాడుతూ.. "ఒకవేళ కమలా హారిస్ విజయం సాధిస్తే ఆమె చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో చర్చలు జరపాల్సి ఉంటుంది. అప్పుడు ఆమెతో జిన్‌పింగ్ ఎలా వ్యవహరిస్తారు" అని ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి మాజీ అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఓ చిన్న పిల్ల మాదిరిగా ఆమెను చూస్తాడు' అంటూ వ్యాఖ్యానించారు. "ఆమెను చిన్న పిల్లను చేసి చాక్లెట్లు లాగేసినట్లు మనందరం దోచుకుంటారు. ఏం జరుగుతుందో కూడా ఆమెకు అర్థం కాదు. చెస్‌ను అప్పుడే మొదలు పెట్టిన ఆటగాడితో గ్రాండ్ మాస్టర్ ఆడితే ఎలా ఉంటుందో.. వారిద్దరి (కమలా హారిస్-జిన్‌పింగ్) చర్చలు కూడా అలాగే ఉంటాయి" అంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. ఆమెకు మరో నాలుగేళ్ల అధికారమిస్తే ప్రజల జేబులన్నీ ఖాళీ చేస్తారంటూ దుయ్యబట్టారు.

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ ఎలాన్ మస్క్ సాన్నిహిత్యం!



ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ 2022 చివరి నుంచి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సంబంధాలు కొనసాగిస్తున్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. వీరిద్దరి మధ్య అంతర్జాతీయ పరిస్థితులు చర్చకు వచ్చినట్లు పేర్కొంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అనుకూలంగా మాట్లాడిన పుతిన్ తైవాన్ మీదుగా స్టార్‌లింక్ శాటిలైట్లను యాక్టివేట్ చేయొద్దని మస్క్‌ను కోరినట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ.. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు మస్క్ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో పుతిన్‌తో మస్క్ సంబంధాలు వెలుగులోకి రావడం గమనార్హం. ఉక్రెయిన్ - రష్యా యుద్ధంలో స్టార్‌లింక్ టర్మినల్స్‌ను మస్క్ రష్యాకు విక్రయించినట్లు విమర్శలు వచ్చాయి. అవన్నీ తప్పుడు ఆరోపణలని మస్క్ తోసిపుచ్చారు. మస్క్‌కు చెందిన 'స్పేస్ ఎక్స్' సహా పలు సంస్థలు అమెరికా మిలటరీ, ప్రభుత్వ ఏజెన్సీలతో విస్తృతమైన వ్యాపార లావాదేవీలు కలిగి ఉన్నాయి. రష్యా అధ్యక్షుడితో మస్క్ సంబంధాలు దేశ భద్రతాపరమైన సమస్యలు లేవనెత్తవచ్చని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, 2021లో ట్రంప్ అధ్యక్ష పదవి నుంచి దిగిపోయాక.. ట్రంప్ - పుతిన్‌లు కనీసం ఏడుసార్లు రహస్యంగా ఫోనులో మాట్లాడుకొన్నట్లు జర్నలిస్ట్ బాబ్ వుడ్‌వర్డ్ తన పుస్తకంలో పేర్కొన్నారు. ఈ వార్తలను ట్రంప్ ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చారు.



అట్లాంటా ఎన్నికల సభలో అభివాదం చేస్తున్న అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా

షోల్జ్ వద్ద అరిహా షా అంశాన్ని ప్రస్తావించిన మోదీ

దిల్లీ: జర్మనీలో దాదాపు 36 నెలలుగా సంరక్షణ కేంద్రంలో ఉంటున్న భారతీయ చిన్నారి అరిహా షా కేసు విషయాన్ని ఆ దేశ ఛాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ వద్ద ప్రధాని మోదీ శుక్రవారం చర్చల్లో ప్రస్తావించారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. అరిహా అంశాన్ని తాను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నట్లు మోదీకి షోల్జ్ చెప్పారన్నారు. ఇక ముందు కూడా ఆ పాప కేసుపై పలు మార్గాల్లో ఇరు దేశాలు చర్చలు కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. అరిహా తల్లిదండ్రులు భారతీయులు. జర్మనీలో సుమారు 7 నెలల వయసులో పాప గాయాలపాలు కావడంతో తన సంరక్షణ బాధ్యతను అధికారులు తీసుకున్న సంగతి గమనార్హం. అరిహాను తిరిగి తల్లిదండ్రులకు అప్పగించాలని భారత్ చాన్నాళ్లుగా జర్మనీని కోరుతోంది.

ఉక్రెయిన్‌పై దాడి

అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే

- పుతిన్‌తో యూఎన్ చీఫ్

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్‌పై రష్యా దాడి ఐక్యరాజ్యసమితి (యూఎన్ చార్టర్) నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. రష్యాలోని కజన్ వేదికగా బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న గుటెరస్.. పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యుద్ధం అక్రమమని పుతిన్‌తో గుటెరస్ స్వయంగా పేర్కొన్నారని యూఎన్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. శాంతి స్థాపన చర్చలకు ఆయన మద్దతు ప్రకటించారని తెలిపారు.

ట్రంప్ చిత్తశుద్ధి కలిగిన వ్యక్తి: పుతిన్

రష్యా అధ్యక్షుడు పుతిన్ బ్రిక్స్ సదస్సులో అమెరికాతో సంబంధాలపై స్పందించారు. 'అమెరికాలో ఎన్నికల తర్వాత రష్యా- అమెరికా సంబంధాలు ఎలా అభివృద్ధి చెందుతాయి అనేది ఆ దేశంపై ఆధారపడి ఉటుంది. అవి బహిరంగంగా ఉంటే మేము అలానే ఉంటాం. వారు అలా కోరుకోకపోయినా మంచిదే. ట్రంప్ ఉక్రెయిన్‌తో వివాదానికి ముగింపు పలకాలనే వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం. ఆయన చిత్తశుద్ధితో ఉన్నట్లు నేను భావిస్తున్నా. ఇలాంటి ప్రకటనలు ఎవరి నుంచి వచ్చినా స్వాగతిస్తా' అని పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధం నేపథ్యంలో అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థికసాయం అందించడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. తాను ఎన్నికైతే కొన్ని గంటల్లోనే పోరాటాన్ని ముగిస్తానని వ్యాఖ్యానించారు.

బాల్టిమోర్ వంతెన విధ్వంసానికి నష్టపరిహారం రూ.850 కోట్లు



ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలోని బాల్టిమోర్‌లో ఈ ఏడాది మార్చి నెలలో నౌక ఢీకొనడంతో భారీవంతెన కూలిపోయిన ఘటనలో కార్గోషిప్ యజమాని రూ.850 కోట్ల నష్టపరిహారం చెల్లించేలా ఒప్పందం జరిగినట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. "ఆరుగురి ప్రాణాలు బలిగొనడంతోపాటు భారీనష్టాన్ని కలిగించిన ఈ ఘోరమైన ఘటనకు దాదాపు ఏడు నెలల తర్వాత పరిష్కారం లభించింది. గ్రేస్ ఓషన్ ప్రైవేట్ లిమిటెడ్, సినర్జీ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా 101.1 మిలియన్ డాలర్లు (రూ.850 కోట్లు) చెల్లించేందుకు అంగీకరించాయి" అని న్యాయశాఖ అధికారి బెంజమిన్ మిజర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వంతెన పునర్నిర్మాణాన్ని ఈ ఒప్పందంలో చేర్చలేదని న్యాయశాఖ వెల్లడించింది. అది మేరీల్యాండ్ రాష్ట్రానికి చెందిన ప్రత్యేక దావా అంశమని పేర్కొంది. అమెరికా కాలమానం ప్రకారం.. మార్చి 25 అర్ధరాత్రి దాటాక పటాప్‌స్కో నదిపై ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెనను నౌక ఢీకొనడంతో అది కుప్పకూలిన విషయం తెలిసిందే. ప్రమాదానికి కారణమైన నౌకలో భారత సిబ్బంది సైతం ఉన్నా.. వారికి ముప్పు తప్పింది.

ఈ వారాంతంలోనే మాపై ఉ.కొరియా సైనికుల దాడి

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

కీవ్: రష్యా తరఫున ఉత్తర కొరియా సైనికులు తమపై ఈ వారాంతంలోనే దాడికి దిగవచ్చని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్ స్కీ శుక్రవారం పేర్కొన్నారు. దీని ప్రభావం ఇండో-పసిఫిక్ ప్రాంతంలోనూ ఉంటుందని అమెరికా, నాటోలు హెచ్చరించాయి. యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున కీవ్‌కు రావద్దని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్‌కు జెలెన్ స్కీ సలహా ఇచ్చారు. రష్యాలోని కజన్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సభలో పాల్గొన్న గుటెరెజ్ తిరుగు ప్రయాణంలో కీవ్‌కు రావలసి ఉంది. కజన్ సభలో రష్యా అధినేత పుతిన్‌తో గుటెరెస్ కరచాలనం ఉక్రెయిన్‌లో నిరసన రేపింది. ఉత్తర కొరియా మొత్తం 12,000 మంది సైనికులు, అధికారులను రష్యాకు పంపిందని ఉక్రెయిన్ గూఢచారి శాఖ తెలిపింది.

వాయు కాలుష్యంపై జాగ్రత్త!

- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచనలు

దిల్లీ: రానున్న శీతాకాలం, పండగ సమయంలో పెరగనున్న వాయు కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం పలు సూచనలు జారీ చేసింది. వాయు కాలుష్యం మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉండడంతో ఎక్కువగా బయటకు వెళ్లొద్దని ప్రజలను కోరింది. కాలుష్య ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ప్రజా రవాణాను వినియోగించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది. కాలుష్యాన్ని తగ్గించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంసిద్ధంగా ఉండాలంటూ శుక్రవారం కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ (డీజీహెచ్ఎస్) డా.అతుల్ గోయల్ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాశారు. కాలుష్యాన్ని నివారించేందుకు వ్యర్థాలను, పండుగ సమయంలో టపాసులను కాల్చకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజారవాణాను ప్రోత్సహించాలని, డీజిల్ జనరేటర్ల వినియోగంపై ఆధారపడడాన్ని తగ్గించాలని, ధూమపానాన్ని అరికట్టాలని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ మొబైల్ యాప్ ద్వారా ఆయా ప్రాంతాల్లోని వాయు నాణ్యతను తెలుసుకుని వ్యక్తులు బయటకు వెళ్లాలని కోరారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, శ్వాస, హృదయ సంబంధిత రోగాలతో బాధపడుతున్న వారిపై కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతుందని, ఆటలు, వ్యాయామాల కోసం వీరు బయటకు వెళ్లకూడదని సూచించారు. కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) మధ్యస్థ స్థాయి నుంచి తీవ్రస్థాయికి పడిపోతోందని, రానున్న శీతాకాలంలో ఇది మరింత క్షీణించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పాక్‌లో ఉగ్రదాడి.. 10 మంది భద్రతా సిబ్బంది హతం

పెషావర్: ఏ ఉగ్రవాదాన్నైతే పెంచి పోషించిందో.. అదే ఉగ్రవాదం ఇప్పుడు పాకిస్థాన్‌ను కాటేస్తోంది. ఆ దేశ భద్రతా సిబ్బందిపై ఇటీవల కాలంలో భారీస్థాయిలో ఉగ్రవాదులు దాడులు చేస్తున్నారు. ఈ పరంపరలో భాగంగానే శుక్రవారం ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని డేరా ఇస్మాయిల్ జిల్లాలో పోలీసు చెక్‌పోస్టుపై దాడి జరిగింది. ఈ ఘటనలో 10 మంది పోలీసులు హతమయ్యారు. ముగ్గురికి గాయాలయ్యాయి. ఇటీవల కాలంలో అఫ్గానిస్థాన్ సరిహద్దు వెంబడి పాక్ దళాలపై పదే పదే దాడులు జరగడం సర్వసాధారణమైపోయింది. వీటిని పాక్ దళాలు తిప్పికొట్టలేకపోతున్నాయి. ఈ ప్రాంతంలో ఉగ్రవాద సంస్థ.. తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) క్రియాశీలకంగా ఉంది. ప్రస్తుత దాడి కూడా ఆ సంస్థే చేసి ఉండొచ్చని పాక్ అధికారులు భావిస్తున్నారు.

హింసను ఆపి, భారత్‌తో స్నేహం చేయండి : ఫరూక్ అబ్దుల్లా

ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా స్పందించారు. ఈ తరహా ఘటనలకు పాకిస్థాన్ వీలైనంత త్వరగా ముగింపు పలకాలని, ఇరుదేశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మండేలా మనవడికి బ్రిటన్ వీసా నిరాకరణ

- హమాస్‌ను సమర్థించినందుకేనని వెల్లడి

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా తొలి అధ్యక్షుడు నెల్సన్ మండేలా మనుమడికి బ్రిటన్.. వీసా నిరాకరించింది. పాలస్తీనా అనుకూల వాదులు బ్రిటన్‌లోని మాంచెస్టర్, ఎడిన్‌బరో, గ్లాస్గోలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రసంగించడం కోసం ఈ నెలలో మండ్ల మండేలా ఆ దేశానికి వెళ్లాల్సి ఉంది. ఇదే విషయాన్ని బ్రిటన్ ప్రభుత్వానికి తెలుపుతూ వీసా ఇవ్వాలన్న అభ్యర్థనను పంపించారు. అయితే, హమాస్‌ను సమర్థిస్తున్నందున ఆయన వీసా అభ్యర్థనను నిరాకరిస్తున్నట్లు ఈ నెల 21న యూకే హోమ్ ఆఫీస్ నుంచి లేఖ అందిందని మండ్ల మండేలా తెలిపారు.



హరియాణా శాసనసభలో జులానా ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్న వినేశ్ ఫొగాట్

మురికి జైల్లో ఉంచి

స్నానానికి చన్నీళ్లు ఇస్తున్నారు

- నిర్బంధంలో ఉన్న బిలియనీర్ కుమార్తెపై కుటుంబం ఆందోళన

ఇంటర్నెట్ డెస్క్: ఉగాండాలోని జైలు నిర్బంధంలో ఉన్న వసుంధరా ఓస్వాల్ పరిస్థితిపై భారత సంతతికి చెందిన బిలియనీర్ పంకజ్ ఓస్వాల్ కుటుంబం ఆందోళన వ్యక్తం చేసింది. మురికిగా ఉన్న జైల్లో ఆమెను ఉంచారని, స్నానానికి చల్లటి నీళ్లే ఏర్పాటు చేస్తున్నారంటూ తాజాగా వసుంధర సోదరి రిధి మీడియాకు తెలిపారు. కిడ్నాప్, హత్య అభియోగాలను కారణంగా చూపి, ఆమెను అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఎలాంటి నోటీసు లేకుండా ఆమెను ఒక జైలు నుంచి మరో జైలుకు మారుస్తున్నారని, తన సోదరిని సంప్రదించడానికి వీలులేకుండా ఇలా చేస్తున్నారని ఆరోపించారు. గతంలో తమ సంస్థలో పనిచేసిన ముకేశ్ మేనరియాను కిడ్నాప్ చేసి, హత్య చేయడానికి యత్నించారన్న ఆరోపణలతోనే వసుంధరను నిర్బంధించారన్నారు. ముకేశ్ సజీవంగా, టాంజానియాలో ఉన్నాడని పేర్కొన్నారు. కాగా ఈ నెల ప్రారంభంలో వసుంధరా ఓస్వాల్ ఉగాండాలో నిర్బంధానికి గురైన విషయం తెలిసిందే. "ఆ రోజు మా కంపెనీలోకి కొందరు సాయుధ పోలీసు అధికారులు ఎలాంటి వారెంట్ లేకుండా దూసుకొచ్చారు. సోదాలు చేయడంతో పాటు వసుంధరను ఉద్దేశించి అభ్యంతరకరంగా మాట్లాడారు. ఆ తర్వాత ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించి తీసుకెళ్లారు" అని రిధి వెల్లడించారు.

యూట్యూబ్ కొత్త ఫీచర్.. కంటెంట్ క్రియేటర్లకు మరింత ఆదాయం

ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్. కంటెంట్ క్రియేటర్ల కోసం కొత్త సదుపాయాన్ని తీసుకొచ్చింది. వారి ఆదాయాన్ని పెంచే దిశగా షాపింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. దీని సాయంతో అర్హులైన కంటెంట్ క్రియేటర్లు తమ వీడియోల్లో ఉత్పత్తులను ట్యాగ్ చేసి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చని తెలిపింది. దక్షిణ కొరియా, అమెరికా లాంటి దేశాల్లో యూట్యూబ్ ఈ అనుబంధ షాపింగ్ ప్రోగ్రామ్‌ను ఇదివరకే అందుబాటులోకి తెచ్చింది. ఈ సేవల్ని ఇప్పుడు మరిన్ని దేశాలకు విస్తృతం చేసింది. తాజాగా భారత్‌లో ఈ సదుపాయాల్ని లాంచ్ చేసింది. దీనికోసం మింత్రా, ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు యూట్యూబ్ తెలిపింది. అర్హులైన కంటెంట్ క్రియేటర్లందరికీ ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ప్రమోట్ చేసిన ఉత్పత్తులను యూజర్లు కొనుగోలు చేస్తే క్రియేటర్లకు కమీషన్ అందుతుందని వివరించింది. ఒక వీడియోకు దాదాపు 30 ఉత్పత్తులను ట్యాగ్ చేయవచ్చు.

అజిత్ పవార్ గూటికి బాబా సిద్దీఖి తనయుడు



ఇంటర్నెట్ డెస్క్: ముంబయిలోని వాంద్రే ఈస్ట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే జీషాన్ సిద్దీఖి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీలో చేరారు. జీషాన్ తండ్రి అయిన మాజీ మంత్రి బాబా సిద్దీఖి ఇటీవల లారెన్స్ బిష్ణోయ్ ముఠా చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. కౌన్సిల్ ఎన్నికల్లో క్రాస్ ఓటింగుకు పాల్పడ్డారన్న ఆరోపణలతో గత ఆగస్టు నెలలో కాంగ్రెస్ జీషాన్‌ను పార్టీ నుంచి బహిష్కరించింది. ఈ కారణంగా ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి ఆయనకు మళ్లీ టికెటు దక్కలేదు. దీంతో ఎన్సీపీ (అజిత్)లో చేరారు. బాంద్రా ఈస్ట్ నుంచి జీషాన్‌ను బరిలోకి దింపుతున్నట్లు అజిత్ పవార్ వర్గం ప్రకటించింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగు నవంబరు 20న జరగనుంది.

బాబా సిద్దీఖి హత్యలో పాక్ తుపాకుల వాడకం

ముంబయి: మహారాష్ట్రకు చెందిన మాజీమంత్రి బాబా సిద్దీఖి హత్యకేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ హత్యకు మూడు తుపాకులు ఉపయోగించినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు.. నాలుగో తుపాకీ కూడా వాడినట్లు తాజాగా గుర్తించారు. ఈ తుపాకులను పాకిస్థాన్ నుంచి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. డ్రోన్ సాయంతో సరిహద్దుల్ని దాటించి.. నిందితులు తుపాకులను చేజిక్కించుకున్నట్లు మహారాష్ట్ర పోలీసులు శుక్రవారం వెల్లడించారు. తూర్పు బాంద్రాలో అక్టోబరు 12 జరిగిన బాబా సిద్దీఖి హత్యకు తామే బాధ్యులమని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేయగా. . ముగ్గురు పరారీలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. హరియాణాకు చెందిన గుర్మైల్ బల్జీత్‌సింగ్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ధర్మరాజ్ కశ్యప్‌తోపాటు శివ్‌కుమార్ గౌతమ్ అనే నిందితులు సిద్దీఖీని కాల్చి చంపారు. శివ్‌కుమార్ గౌతమ్‌ను ఈ కేసులో ప్రధాన షూటర్‌గా భావిస్తున్నారు. మిగతా ఇద్దరికీ ఇతడే శిక్షణ ఇచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



బాబా సిద్దీఖి

దిల్లీ అల్లర్ల నిందితుడు ఇమామ్ బెయిల్ పిటిషన్‌పై విచారణకు సుప్రీం నిరాకరణ

దిల్లీ: దిల్లీ అల్లర్ల నిందితుడు షర్జీల్ ఇమామ్ ఉగ్రవాద కేసులో దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌ను స్వీకరించేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం బెయిల్ కోరుతూ దాఖలైన ఈ పిటిషన్‌ను స్వీకరించేందుకు ఇష్టపడడం లేదని జస్టిస్ బేల ఎం త్రివేది, జస్టిస్ ఎస్సీ శర్మలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇమామ్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ బెయిల్ పిటిషన్ 2022 నుంచి పెండింగ్‌లో ఉందని, ప్రస్తుతం తాము బెయిల్ కోసం ఒత్తిడి చేయడం లేదని స్పష్టం చేశారు. ఇది ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్ కాబట్టి దాన్ని స్వీకరించడానికి తాము ఇష్టపడబోమని పేర్కొన్న సుప్రీంకోర్టు నవంబరు 25న దిల్లీ హైకోర్టులో ఈ కేసు విచారణ ఉన్న నేపథ్యంలో వీలైనంత త్వరగా విచారించాలని హైకోర్టుకు తెలిపింది.

దిల్లీ మద్యం కేసులో అమన్‌దీప్ సింగ్‌కు బెయిలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీకి సంబంధించిన మద్యం కుంభకోణం కేసులో మరో నిందితునికి సుప్రీంకోర్టు శుక్రవారం బెయిలు మంజూరు చేసింది. ఈ కేసులో సీబీఐ ఇంకా 300 మంది సాక్షులను ప్రశ్నించాల్సి ఉండటం, కోర్టు విచారణ ప్రారంభం కాకపోవడం వల్ల అమన్‌దీప్ సింగ్‌కు కొన్ని షరతులతో బెయిలిస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం తెలిపింది. తాను ఏడాదికి పైగా జైలులోనే ఉంటున్నానని, ఇప్పట్లో దర్యాప్తు ముగిసే సూచనలు లేనందున బెయిలు ఇవ్వాలంటూ అమన్ దీప్ సింగ్ చేసుకున్న అభ్యర్థనను ధర్మాసనం ఆమోదించింది. అరెస్టులు చేస్తూ పోవడంకన్నా నేరనిర్ధారణ ముఖ్యమని సీబీఐకి తెలిపింది.

జ్ఞానవాపి ప్రాంగణాన్ని తవ్వి సర్వే చేయాలన్న పిటిషన్ తిరస్కరణ

వారణాసి: కాశీ విశ్వనాథ్ ఆలయ సమీపంలోని జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో తవ్వకాలు జరిపి సర్వే చేయాలంటూ హిందువుల తరఫున దాఖలైన పిటిషన్‌ను వారణాసి కోర్టు శుక్రవారం కొట్టివేసింది. పిటిషనర్లు ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని సివిల్ జడ్జి యుఘుల్ శంభు తెలిపారని హిందువుల తరఫు న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ వెల్లడించారు. జ్ఞానవాపి ప్రాంగణంలో ఎటువంటి తవ్వకాలు, కూల్చివేతలు చేపట్టరాదని అలహాబాద్ హైకోర్టు, సుప్రీంకోర్టు ఇదివరకే ఆదేశించాయని సివిల్ జడ్జి పేర్కొన్నారు. అందువల్ల పిటిషనర్ అభ్యర్థనను అనుమతించబోమని స్పష్టం చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్లు

- ఉత్తర్‌ప్రదేశ్‌లో 30 కిలోమీటర్ల మేర నిర్మాణం

అమేఠీ: పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి రోడ్లు నిర్మిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేఠీ జిల్లాలో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద శుద్ధి చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి 30 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు వేశారు. దాంతో రూ.45 లక్షలు ఆదా అయినట్లు ఆ జిల్లా అధికారులు గురువారం తెలిపారు. శుద్ధిచేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర నిర్మాణ ముడిపదార్థాలలో కలిపితే పర్యావరణాన్ని రక్షించవచ్చని వారు పేర్కొంటున్నారు. జిల్లా ముఖ్య అభివృద్ధి అధికారి (సీడీవో) సూరజ్ పటేల్ మాట్లాడుతూ.. "అమేఠీలో నాలుగు చోట్ల వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను నిర్వహిస్తున్నాం. ఇందులో ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లు వేయడానికి ఉపయోగించేందుకు శుద్ధి చేసి, తారులో కలుపుతున్నాం. అందులో దాదాపు 8 శాతం ప్లాస్టిక్ ఉంటుంది. ఇది రోడ్ల నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తుంది. ఇలా జిల్లాలో 30 కిలోమీటర్ల మేర రోడ్లు వేశాం. కిలోమీటరుకు రూ.1.5 లక్షల చొప్పున మొత్తంగా రూ.45 లక్షలు ఆదా అయ్యాయి" అని వెల్లడించారు.



ఇజ్రాయెల్ వైమానిక దాడులతో లెబనాన్ రాజధాని బీరుట్‌లో అలముకున్న పొగ

ఈనాడు బిజినెస్

72% తగ్గిన బీపీసీఎల్ లాభం

దిల్లీ: ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ దిగ్గజ సంస్థ బీపీసీఎల్, జులై- సెప్టెంబరులో ఏకీకృత ప్రాతిపదికన రూ.2,297.23 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. 2023-24 ఇదే త్రైమాసికంలో కంపెనీ లాభం రూ.8,243.55 కోట్లతో పోలిస్తే ఇది 72% తక్కువ. రిఫైనరీ మార్జిన్, మార్కెటింగ్ మార్జిన్లు తగ్గడం ఇందుకు కారణమయ్యాయి. జూన్ త్రైమాసికంలోనూ కంపెనీ నికర లాభం రూ.2,841.55 కోట్లుగా ఉంది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1.16 లక్షల కోట్ల నుంచి రూ.1.17 లక్షల కోట్లకు చేరింది. సాధారణ ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలపై లీటరుకు రూ.2 చొప్పున తగ్గించడం, తదుపరి ముడి చమురు ధరలు స్థిరంగా ఉండటంతో కంపెనీ లాభాలు తగ్గాయి.

ఐడీబీఐ బ్యాంక్ లాభంలో 39% వృద్ధి

దిల్లీ: ఐడీబీఐ బ్యాంక్ నికర లాభం సెప్టెంబరు త్రైమాసికంలో 39% పెరిగి రూ.1,836 కోట్లుగా నమోదైంది. వడ్డీ ఆదాయం పెరగడం ఇందుకు కారణమైంది. 2023-24 ఇదే సమయంలో నికర లాభం రూ.1,323 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.6,924 కోట్ల నుంచి రూ.8,754 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.3,066 కోట్ల నుంచి 26% పెరిగి రూ.3,875 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 4.33% నుంచి 4.87 శాతానికి పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు 4.9% నుంచి 3.68 శాతానికి; నికర నిరర్థక ఆస్తులు 0.39% నుంచి 0.2 శాతానికి తగ్గాయి. 2023 సెప్టెంబరు చివరినాటికి కనీస మూలధన నిష్పత్తి 21.26% నుంచి 21.98 శాతానికి పెరిగింది.

బీఓబీ లాభం రూ.5,238 కోట్లు

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), సెప్టెంబరు త్రైమాసికంలో రూ.5,238 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసిక లాభం రూ.4,253 కోట్లతో పోలిస్తే ఇది 23% ఎక్కువ. మొత్తం ఆదాయం రూ.32,033 కోట్ల నుంచి రూ.35,445 కోట్లకు వృద్ధి చెందింది. వడ్డీ ఆదాయం రూ.27,862 కోట్ల నుంచి రూ.30,263 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏలు) 3.32% నుంచి 2.50 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.76% నుంచి 0.60 శాతానికి మెరుగయ్యాయి. మూలధన లభ్యత నిష్పత్తి 15.30% నుంచి 16.26 శాతానికి పెరిగింది.

బిగ్ సి దీపావళి ధమాకా ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్ విక్రయాల రిటైల్ సంస్థ బిగ్ సి, దీపావళి పండగ సందర్భంగా డబుల్ ధమాకా ఆఫర్లను ప్రకటించింది. ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10,000 వరకు విలువైన మొబైల్ ప్రొటెక్షన్, రూ.12000 వరకు తక్షణ క్యాష్‌బ్యాక్, రూ.5,999 వరకు విలువైన కచ్చిత బహుమతి పొందొచ్చని సంస్థ సీఎండీ బాలు చౌదరి తెలిపారు. వీటికి అదనంగా వివో, ఒప్పో, ఎంఐ, రియల్‌మీ ఫోన్ల కొనుగోలుపై నిర్వహించే లక్కీ డ్రాలో కార్లు, బైక్‌లు, మొబైల్స్, ఇతర బహుమతులు గెలుచుకోవచ్చున్నారు. కచ్చితమైన బైబ్యాక్ ఆఫర్, జోడి ఆఫర్, స్మార్ట్ టీవీ ఆఫర్, బ్రాండెడ్ యాక్సెసరీలపై 51% వరకు రాయితీ వంటివి పొందొచ్చు. డెబిట్ కార్డుపై వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలను కొనుగోలు చేసే సౌలభ్యాన్ని సంస్థ అందిస్తోంది.

పదోవంతు ధరకే జియోహాట్‌స్టార్ డొమైన్ ఇచ్చేస్తా!

- రిలయన్స్ ఇంకా స్పందించలేదు
- గుర్తు తెలియని టెకీ తాజా ప్రతిపాదన

దిల్లీ: జియోహాట్‌స్టార్ డొమైన్‌ను తన పేరిట రిజిస్టర్ చేసుకున్న ఒక గుర్తుతెలియని సాంకేతిక నిపుణుడు మరోసారి వార్తల్లోకొచ్చారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదవడానికయ్యే ఖర్చు చెల్లిస్తే, ఈ డొమైన్ ఇచ్చేస్తానంటూ తొలుత రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు లేఖ రాసిన ఆ వ్యక్తి, అందులో పదో వంతైనా చెల్లించమని తాజాగా కోరాడు. దిల్లీకి చెందిన ఈ యాప్ డెవలపర్ గురించి సామాజిక మాధ్యమాల్లో అమితాసక్తి కనిపిస్తోంది. రిలయన్స్, వాల్ట్ డిస్నీ భారత వ్యాపారాల విలీనం నేపథ్యంలో.. ముందుగానే జియోహాట్‌స్టార్ అనే డొమైన్‌ను ఇతను కొనుగోలు చేసి.. ఈ బేరానికి వచ్చాడు. 'రిలయన్స్ నుంచి ఎటువంటి ప్రతిపాదనా నాకు రాలేదు. కనీసం నేను అడిగిన దాంట్లో పదో వంతుకైనా కొనుగోలు చేస్తుందని ఆశించా. ఇపుడు ఎవరికైనా సరే ఈ డొమైన్‌ను విక్రయిస్తా' అంటూ తాజాగా రాసుకొచ్చాడు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్‌లకు రాసిన లేఖలో 'ఐటీ పరీక్షల్లో విజయవంతం కాలేకపోయాను. రెండో శ్రేణి కళాశాల నుంచి వచ్చిన నేను, అత్యుత్తమ నైపుణ్యాలు నేర్చుకోవాలనుకుంటున్నా. కేంబ్రిడ్జ్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో ఫుల్ డిగ్రీ ప్రోగ్రామ్ చదవాలనుకుంటున్నా. అందుకు చాలా ఫీజులు అవుతాయి. అందుకే హాట్‌స్టార్, జియో విలీన వార్తలకు ముందు డొమైన్‌లను పరిశీలిస్తే జియోహాట్‌స్టార్‌ను ఎవరూ తీసుకోలేదు. అందుకే కొన్నా. దీనిని నా కేంబ్రిడ్జ్ కలకు ఉపయోగించుకుందామనుకున్నా' అని పేర్కొన్నాడు. 'రిలయన్స్ వంటి కంపెనీకి ఈ ఖర్చు లెక్కలోనిదే కాదు. నాకు మాత్రం ఈ డొమైన్ విక్రయంతో, జీవితం దశ మారే అంశం' అని తెలిపాడు. సుప్రీం కోర్టు, హైకోర్టుతో పాటు కేంబ్రిడ్జ్, కాలిఫోర్నియా, టెక్సాస్, బెర్లిన్ నుంచి న్యాయ నిపుణులు నాకు మద్దతునిస్తుండడం సంతోషంగా ఉందని ఒక పోస్టులో తెలిపాడు. తన తల్లిదండ్రులు మాత్రం ఈ వార్తలపై 'చాలా ఆందోళన'గా ఉన్నట్లు వివరించాడు.



26న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	515
వరంగల్	517
విజయవాడ	540
గోదావరి	535
విశాఖపట్నం	540
చిత్తూరు	578

జులై- సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2024-25	నికర లాభం/(నష్టం) 2023-24	మొత్తం ఆదాయం 2024-25	మొత్తం ఆదాయం 2023-24
శ్రీరామ్ ఫైనాన్స్ 1	2,153	1,792	10,097	8,564
కోల్ ఇండియా 2	6,274.80	8,048.64	32,177.92	29,978.01
డీఎల్ఎఫ్	1,381.08	622.78	2,180.83	1,476.42
జమ్ము అండ్ కశ్మీర్ బ్యాంక్	551	381.07	3,420	2,954
టొరెంట్ ఫార్మా	453	386	2,889	2,660
ఐనాక్స్ విండ్	90.20	(26.84)	741.74	384.40
ఎన్ఎల్‌సీ ఇండియా	982.41	1,085.93	3,657.27	2,977.53
ఎరిస్ లైఫ్‌సైన్సెస్	97	122	741	505
బంధన్ బ్యాంక్	937	721	6,095	5,032
జేఎం ఫైనాన్షియల్	232	195	1,211	1,214
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	404	2,773	39,837	44,821
మహీంద్రా హాలిడేస్	11.48	21.43	670.75	655.27
ఎన్ఐఐటీ	11.83	10.64	90.71	81.40
జుబిలెంట్ ఫార్మోవా	102.50	62.10	1,752.30	1,680.30
ఇండిగ్రిడ్ ట్రస్ట్	98.73	38.89	839.75	720.18
మాక్రోటెక్ డెవలపర్స్	423.10	202.80	2,684	1,755
యూటీఐ ఏఎంసీ	239.00	183.00	538.00	404.00
జీ మీడియా	(49.86)	(30.70)	130.70	151.59

1) మధ్యంతర డివిడెండు రూ.22; రూ.10 ముఖ విలువ కలిగిన షేరును రూ.2 ముఖ విలువ కలిగిన 5 షేర్లుగా విభజన
2) మొదటి మధ్యంతర డివిడెండ్ రూ.15.75

నిలువుగా ఎగిరే మానవ రహిత విమానం



ఆవిష్కరించిన బ్లూజే ఏరో

ఈనాడు, హైదరాబాద్: నిట్ట నిలువుగా టేకాఫ్ తీసుకోవడంతో పాటు, భూమి మీదకు దిగే సామర్థ్యం (వీటీఓఎల్) ఉన్న మానవ రహిత సరకు రవాణా విమానాన్ని బ్లూజే ఏరోస్పేస్ ఆవిష్కరించింది. దీని పనితీరును హైదరాబాద్ సమీపంలోని నాదర్‌గుల్ ఎయిర్‌ఫీల్డ్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షించింది. వాణిజ్య స్థాయిలో పూర్తి విమానాన్ని 2026 నాటికి సిద్ధం చేయనున్నట్లు బ్లూజే ఏరో సహ వ్యవస్థాపకులు అమర్‌దీప్ శ్రీ వత్సవాయ, ఉత్తమ్ కుమార్ తెలిపారు. 100 కిలోల బరువును 300 కిలోమీటర్ల దూరం మోసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉందని పేర్కొన్నారు. సరకు రవాణాలో ఇది ఎంతో కీలకంగా మారుతుందన్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు 30 నిమిషాల వ్యవధిలో చేరగలదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు సేవలు అందించేందుకు ఇది తోడ్పడుతుందని పేర్కొన్నారు. 2026 నాటికి హైడ్రోజన్-విద్యుత్ ప్రొపెల్షన్‌తో ఆటానమస్ ఫ్లైట్ టెస్ట్ కన్నున్నామని పేర్కొన్నారు. అప్పుడే మనుషులను తీసుకెళ్లే వీటీఓఎల్ విమానాన్నీ ఆవిష్కరించబోతున్నట్లు వివరించారు. దీనివల్ల విమానాశ్రయాలు లేని ప్రాంతాలకూ, విమాన సేవలను అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ కేంద్రంగా 2022లో ప్రారంభించిన ఈ అంకురం ఇప్పటి వరకు రూ.18 కోట్ల పెట్టుబడులను సమీకరించింది. ఎండియా క్యాపిటల్, ఐడియాస్ప్రింగ్ క్యాపిటల్, రెయిన్‌మ్యాటర్ క్యాపిటల్, జెరోధా ఈ మొత్తాన్ని సమకూర్చాయి. రెండు,మూడేళ్లలో సిరీస్ ఏ ఫండింగ్ లో భాగంగా రూ.250 కోట్ల పెట్టుబడులను సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వారు వివరించారు. రక్షణ అవసరాల కోసం ఎత్తుగా ఉన్న ప్రాంతాల్లోనూ బహుళ ఉపయోగాల కోసం బ్లూజే ఒక విమానాన్ని రూపొందిస్తోందని తెలిపారు. సమస్యాత్మక, మారుమూల ప్రాంతాల్లోని సైనికులకు నిత్యావసరాలను దీనితో అందించవచ్చని పేర్కొన్నారు.

ఇండిగో నష్టం రూ.986 కోట్లు



దిల్లీ: కొన్ని విమానాల నిలిపివేత, అధిక ఇంధన వ్యయాలు కలిసి ఇండిగోపై ప్రభావం చూపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ రూ.986.7 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. విదేశీ మారక ప్రభావాన్ని మినహాయిస్తే కంపెనీ నష్టం రూ.746.1 కోట్లకు పరిమితమవుతుంది. 2023 సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ రూ.188.9 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయడం విశేషం. సెప్టెంబరు చివరకు కంపెనీ వద్ద 410 విమానాలున్నాయి. కంపెనీ వృద్ధి, విస్తరణ కొనసాగిందని, ఆదాయం 14.6% వృద్ధితో రూ.17,800 కోట్లకు చేరిందని ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. 'నిలిపిన విమానాల సంఖ్యను 70+ నుంచి ప్రస్తుతానికి 60+కు తీసుకొచ్చాం. ఏడాది చివరకు 60లోపలకు పరిమితం చేస్తాం. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి 40ల్లోకి తెస్తామ'ని కంపెనీ సీఎఫ్ఓ గౌరవ్ నేగి తెలిపారు.

దిల్లీ-ముంబయి మార్గంలో బిజినెస్ క్లాస్: దిల్లీ- ముంబయి మార్గంలో బిజినెస్ క్లాస్‌ను ప్రారంభించనున్నట్లు ఎల్బర్స్ పేర్కొన్నారు. భవిష్యత్తులో 40కి పైగా విమానాల్లో, 12 మెట్రో మార్గాల్లో ఈ సేవలను అందుబాటులోకి తెస్తామని వివరించారు.

సోనాలికా ట్రాక్టర్స్ రికార్డు విక్రయాలు

హైదరాబాద్: ట్రాక్టర్‌ల తయారీ సంస్థ సోనాలికా ట్రాక్టర్స్ రికార్డు విక్రయాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 63,136 ట్రాక్టర్లు విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. దేశీయ పరిశ్రమలో అధిక మార్కెట్ వాటా కలిగిన సంస్థగా కొనసాగుతున్నట్లు వెల్లడించింది. పరిశ్రమ పనితీరుతో పోలిస్తే, కంపెనీ విక్రయాల్లో వృద్ధి 7 రెట్లు అధికంగా ఉందని, మార్కెట్ వాటా స్థిరంగా పెరుగుతోందని వివరించింది. కొనుగోలుదార్ల అవసరాలకు అనుగుణమైన ట్రాక్టర్లను అందించడం, రైతుల సాగుకు అనువైన ఉత్పత్తులతో 17 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు చేరువయ్యామని సోనాలికా ట్రాక్టర్స్ పేర్కొంది. రైతుల కోసం సోనాలికా హెవీ డ్యూటీ ధమాకా ఆఫర్‌ను ప్రకటించింది. రైతులకు మరింత మెరుగైన ట్రాక్టర్లు అందించడానికి కట్టుబడి ఉన్నామని ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ సంయుక్త ఎండీ రమణ్ మిత్తల్ తెలిపారు.

ఇక్కడి వారికి విదేశాల నుంచీ ఆహార ఆర్డర్లు: స్విగ్గీ

దిల్లీ: భారత్‌లో ఉండే తమ సన్నిహితులకు అమెరికా, కెనడా, జర్మనీ, బ్రిటన్, కెనడా తదితర విదేశాల్లో నివసించే వారు కూడా ఆహారాన్ని ఆర్డరు చేసేందుకు వీలుగా 'ఇంటర్నేషనల్ లాగిన్' సదుపాయాన్ని స్విగ్గీ తీసుకొచ్చింది. స్విగ్గీ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టామార్ట్‌లో అందుబాటులో ఉండే ఉత్పత్తులను, ఇక్కడి తమ సన్నిహితుల కోసం ఆర్డర్ చేయొచ్చు. డైన్‌ఔట్ యాప్‌పై గుర్తించిన హోటళ్లలో టేబుల్ రిజర్వ్ చేయొచ్చు. అంతర్జాతీయ క్రెడిట్ కార్డులు లేదా యూపీఐ సదుపాయం ద్వారా, ఇందుకు సంబంధించిన చెల్లింపులు జరపొచ్చు. విదేశాల్లోని వారు తమ సన్నిహితులను ఆశ్చర్య పరచేందుకు వీలుగా ఈ సదుపాయాన్ని పండగల సమయంలో అందుబాటులోకి తెచ్చినట్లు స్విగ్గీ సహ వ్యవస్థాపకుడు ఫణి కిషన్ తెలిపారు. త్వరలో ఐపీఓకు వచ్చేందుకు స్విగ్గీ సన్నాహాలు చేస్తోంది. ఈ ఐపీఓ విలువ రూ.10,000 కోట్లుగా ఉండొచ్చని మార్కెట్ వర్గాల అంచనా.

బయో గ్రీన్ పేపర్స్‌లో స్ట్రింగ్ మెటావర్స్ విలీనం

ఈనాడు, హైదరాబాద్: వెబ్3 ఇన్నోవేటర్ అయిన స్ట్రింగ్ మెటావర్స్, బీఎస్ఈలో నమోదైన బయో గ్రీన్ పేపర్స్ లిమిటెడ్ అనే సంస్థలో విలీనమైంది. విలీన ప్రక్రియలో భాగంగా స్ట్రింగ్ మెటావర్స్ వాటాదార్లకు బయో గ్రీన్ పేపర్స్ షేర్లు జారీ అవుతాయి. బయో గ్రీన్ పేపర్స్ లిమిటెడ్ పేరు స్ట్రింగ్ మెటావర్స్ లిమిటెడ్‌గా మార్చాలని సంస్థ యాజమాన్యం నిర్ణయించింది. పేరు మార్పు కోసం కంపెనీల రిజిస్ట్రార్ (ఆర్వోసీ)కి దరఖాస్తు చేసినట్లు స్ట్రింగ్ మెటావర్స్ వెల్లడించింది. కృత్రిమ మేధ (ఏఐ)లో వినూత్న ప్రాజెక్టులు చేపడుతున్నామని, యూఏఈ ప్రభుత్వం నుంచి కీలక అనుమతులు సంపాదించినట్లు తెలిపింది. రస్ అల్ ఖేమా డిజిటల్ అసెట్స్ ఒయాసిస్ (రాక్‌డావ్) నుంచి ఏఐ లైసెన్సు లభించినట్లు, బ్లాక్‌చైన్ నోడ్ ఆపరేటర్ లైసెన్సు పొందినట్లు తెలియజేసింది. డీపిన్ లైసెన్సు వచ్చినట్లు పేర్కొంది. ఇందువల్ల యూఏఈలో ఏఐ- బ్లాక్‌చైన్ పరిశోధనలు నిర్వహించే అవకాశం లభిస్తుందని స్ట్రింగ్ మెటావర్స్ వ్యవస్థాపకుడు కృష్ణ మోహన్ వివరించారు. వెబ్3 టెక్నాలజీతో అటానమస్ ఏఐ ఏజెంట్లు, అవాంతరాలు లేకుండా మనుషులతో కలిసి పనిచేసే స్థితి వస్తుందని పేర్కొన్నారు.

రూ.20 లక్షలకు ముద్రా యోజన రుణ పరిమితి


రూ.10 లక్షల నుంచి రెట్టింపు

దిల్లీ: ప్రధాన్ మంత్రి ముద్రా యోజన(పీఎమ్ఎమ్‌వై) కింద ఇచ్చే రుణాల పరిమితిని రెట్టింపు చేసి రూ.20 లక్షలుగా కేంద్రం సవరించింది. దేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం ఇవ్వడం కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ముద్రా పథకం ప్రధాన లక్ష్యమైన 'పథకాల లబ్ధి అందని వారికి నిధులందించడా'న్ని మరింత ముందుకు తీసుకెళతామని ఆర్థిక శాఖ పేర్కొంది. ముద్రా రుణ పరిమితిని ప్రస్తుత రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర బడ్జెట్ 2024-25లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.

ఎవరికి ప్రయోజనం: అంతక్రితం 'తరుణ్' విభాగం కింద రుణాలు తీసుకుని, వాటిని తిరిగి చెల్లించిన వారికి ఈ రుణ పరిమితి పెంపు వర్తిస్తుందని సీతారామన్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ రుణాలకు హామీ కవరేజీని క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్(సీజీఎఫ్ఎమ్‌యూ) కింద అందజేస్తారు. కార్పొరేట్ యేతర, వ్యవసాయేతర సూక్ష్మ, చిన్న స్థాయి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం 2015లో పీఎమ్ఎమ్‌వైని ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టారు.

ఇదీ ప్రస్తుత పథకం

విభాగం	రుణ పరిమితి
శిశు	రూ.50,000
కిశోర్	రూ.50,000–5 లక్షలు
తరుణ్	రూ.10 లక్షలు



యూట్యూబ్‌లో షాపింగ్ ప్రోగ్రామ్

- ఫ్లిప్‌కార్ట్, మింత్రాలతో జట్టు
- క్రియేటర్ల ఆదాయం పెరిగే వీలు


దిల్లీ: యూట్యూబ్ తాజాగా మనదేశంలో యూట్యూబ్ షాపింగ్ అనుబంధ ప్రోగ్రామ్‌ను ఆవిష్కరించింది. దీని ద్వారా అర్హత గల క్రియేటర్లు తమ వీడియోల్లో ఉత్పత్తులను ట్యాగ్ చేయొచ్చు. తద్వారా వీక్షకులు సంబంధిత రిటైలర్ సైట్‌లో కొనుగోళ్లు చేస్తే.. క్రియేటర్లకు ఆదాయం లభిస్తుంది. ఇందుకోసం తొలుత ఫ్లిప్‌కార్ట్, మింత్రాలతో జట్టు కడుతున్నట్లు యూట్యూబ్ పేర్కొంది. 'అంతర్జాతీయంగా యూట్యూబ్ షాపింగ్ అనుబంధ ప్రోగ్రామ్ విజయవంతమైంది. 2023లోనే 3000 కోట్ల గంటల పాటు షాపింగ్ సంబంధిత కంటెంట్‌ను వీక్షించారు. ఇపుడు భారత్‌లో దీనిని తీసుకొచ్చాం. దీని ద్వారా క్రియేటర్లకు, వీక్షకులకు మధ్య మరింత బలమైన అనుబంధాన్ని పెంచుతామ'ని యూట్యూబ్ షాపింగ్ జనరల్ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్ ట్రావిజ్ కాజ్ పేర్కొన్నారు.

ఎవరికి ప్రయోజనం: ఈ ప్రోగ్రామ్ కింద ఉత్పత్తులను సిఫారసు చేస్తూ క్రియేటర్లు వీడియోలు, షార్ట్స్, లైవ్ స్ట్రీమ్స్ చేయాల్సి ఉంటుంది. తద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతారు. వీక్షకులు సులభంగా తమకు కావాల్సిన ఉత్పత్తుల గురించి తెలుసుకుని, మెరుగైనవిగా భావించిన వాటిని కొనుగోలు చేసుకుంటారు.

నెల రోజుల్లో రూ. 41 లక్షల కోట్ల నష్టం

స్టాక్‌మార్కెట్లు రాణించడంతో, ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు మదుపర్ల సంపద విలువ రూ.110 లక్షల కోట్ల మేరకు పెరిగింది. సెప్టెంబరు 27న సెన్సెక్స్ జీవనకాల గరిష్ఠస్థాయికి చేరగా, అదేరోజు మదుపర్ల సంపద విలువా రికార్డు గరిష్ఠస్థాయికి చేరి రూ.477.93 లక్షల కోట్లకు చేరింది. తదుపరి మధ్యప్రాచ్య యుద్ధభయాలతో అంతర్జాతీయంగా పతనమవుతూ వచ్చింది. ఈనెల మొదటివారంలోనే మదుపర్ల సంపద విలువ రూ.16 లక్షల కోట్ల మేర తగ్గింది. హరియాణా ఎన్నికల ఫలితాల్లో భాజపా విజయంతో ఒక్కరోజే రూ.7.50 లక్షల కోట్లకు పైగా సంపద విలువ పెరిగినా మళ్లీ.. ఈనెలలో ఎక్కువ నష్టమే మిగిలింది. సెప్టెంబరు 27 నుంచి ఇప్పటివరకు నెలరోజుల్లోనే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.40.95 లక్షల కోట్ల మేర క్షీణించడం సామాన్య మదుపర్లను కలవరపెడుతోంది.

- ఈనాడు వాణిజ్యవిభాగం



హెచ్‌పీసీఎల్ లాభంలో 98% క్షీణత

దిల్లీ: హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), సెప్టెంబరు త్రైమాసికంలో రూ.142.67 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.5,826.96 కోట్లతో పోలిస్తే, 97.8% తక్కువ. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్ లాభం రూ.633.94 కోట్లతో పోల్చినా, తగ్గడం గమనార్హం. రిఫైనింగ్ మార్జిన్లు పతనం కావడం, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడంతో, ముందస్తుగా కొనుగోలు చేసిన నిల్వలపై నష్టం రావడం వల్లే.. సమీక్షా త్రైమాసికంలో నికర లాభం గణనీయంగా క్షీణించినట్లు కంపెనీ తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో బ్యారెల్ ముడి చమురును ఇంధనంగా మార్చడం (స్థూల రిఫైనింగ్ మార్జిన్/ జీఆర్ఎం) ద్వారా 3.12 డాలర్లను హెచ్‌పీసీఎల్ ఆర్జించింది. ఏడాది క్రితం ఇది 13.33 డాలర్లుగా ఉంది. ప్రభుత్వ నియంత్రణ ధరల వద్ద దేశీయంగా వంట గ్యాస్‌ను విక్రయించడం వల్ల రూ.2,057 కోట్ల నష్టాన్ని చవిచూసింది. అంతర్జాతీయ చమురు ధరలు బ్యారెల్‌కు 5% తగ్గడంతో, నిల్వలపై రూ.1,400 కోట్ల నష్టాన్ని నమోదు చేసినట్లు హెచ్‌పీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరుగా తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తున్న రజనీశ్ నారంగ్ తెలిపారు. 2023 జులై- సెప్టెంబరులో నిల్వలపై రూ.900 కోట్ల లాభాన్ని సంస్థ ఆర్జించింది.

జీఎంఆర్ పవర్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రాకు రూ.249 కోట్ల లాభం

ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ పవర్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.249 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో రూ.123 కోట్ల నష్టాన్ని సంస్థ నమోదు చేసింది. ఇదే సమయంలో ఆదాయం రూ.678 కోట్ల నుంచి రెట్టింపునకు మించి రూ.1,507 కోట్లకు చేరింది. అన్ని వ్యాపార విభాగాల్లో మెరుగైన పనితీరు ప్రదర్శించినందునే అధిక ఆదాయాలు నమోదు చేసినట్లు కంపెనీ వివరించింది.

మరో 2,204 హోండా కార్లు వెనక్కి

దిల్లీ: లోపాలున్న ఇంధన పంప్‌లను సరిచేసేందుకు ఎంపిక చేసిన 2,204 కార్లను వెనక్కి పిలిపిస్తున్నట్లు హోండా కార్స్ ఇండియా తెలిపింది. ఇంతకు ముందు వెనక్కి పిలిపించిన 90,468 కార్లతో కలిపి, మొత్తం రీకాల్ చేస్తున్న కార్ల సంఖ్య 92,672కు చేరింది. వీటిలో అమర్చిన ఇంధన పంప్‌ల లోపాల వల్ల ఇంజిన్ స్టాపింగ్, స్టార్టింగ్‌పై ప్రభావం పడే అవకాశం ఉంటుందని కంపెనీ తెలిపింది. నవంబరు 5 నుంచి, దశల వారీగా ఈ లోపాలను సరిచేస్తారు. ఇందుకు ఎటువంటి ఛార్జీ ఉండదు. వెనక్కి పిలిపిస్తున్న కార్లలో అకార్డ్, అమేజ్, బ్రియో, బీఆర్-వీ, సిటీ, సివిక్, జాజ్, డబ్ల్యూఆర్-వీ మోడళ్లు ఉన్నాయి.

600 మెగాహెర్ట్జ్‌తో మరిన్ని టెలికాం సేవలు

దిల్లీ: 600 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో మరిన్ని టెలికాం సేవలకు తోడ్పాటు ఇచ్చేందుకు వీలుగా మొబైల్‌ఫోన్ వ్యవస్థ ఉందని క్వాల్‌కామ్ టెక్నాలజీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ (టెక్నాలజీ ప్లానింగ్, ఎడ్జ్ సొల్యూషన్స్) దుర్గ మల్లాది తెలిపారు. ఈ రేడియో తరంగాలు అందుబాటులోకి వచ్చేసరికి భారత్‌లో మరిన్ని ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌లు వ్యవస్థలోకి వస్తాయని అంచనా వేశారు. 600 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌తో 65 కిలోమీటర్ల పరిధిలో టెలికాం సేవలు అందించొచ్చు. ఇది బీఎస్ఎన్ఎల్, జియో వద్ద ఉన్న 700 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌తో ఈ పరిధి 25 కిలోమీటర్లు మాత్రమే. 2జీతో ప్రారంభించి, తదుపరి 4జీ సేవలకు వినియోగిస్తున్న 1800 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌తో 2.5 కిలోమీటర్ల పరిధిలోనే సేవలు అందించే వీలుంది. 600 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌తో, భవనాల లోపలకూ సిగ్నల్స్ స్పష్టంగా వస్తాయని తెలిపారు.

80,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్

సెన్సెక్స్ ▼663 79402 | నిఫ్టీ ▼219 24181

ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.3,036.75 కోట్లు | డీఐఐల కొనుగోళ్లు: రూ.4,159.29 కోట్లు

రూ.6.80 లక్షల కోట్లు తగ్గిన సంపద

సమీక్ష

విదేశీ మదుపర్ల అమ్మకాలు స్థిరంగా కొనసాగడంతో వరుసగా అయిదో రోజూ సూచీలకు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ కీలకమైన 80,000 పాయింట్ల దిగువకు చేరింది. కంపెనీల నిరుత్సాహకర త్రైమాసిక ఫలితాలూ ప్రభావం చూపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి పైసా తగ్గి 84.08 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.42% లాభంతో 74.69 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో టోక్యో మినహా మిగతావి లాభపడ్డాయి. ఐరోపా సూచీలు రాణించాయి.

- సూచీల నష్టాల నేపథ్యంలో మదుపర్ల సంపదగా భావించే, బీఎస్ఈలో నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.6.80 లక్షల కోట్లు తగ్గి రూ.436.98 లక్షల కోట్ల (5.20 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
- సెన్సెక్స్ ఉదయం 122 పాయింట్ల (క్రితం ముగింపు 80,065.16) లాభంతో 80,187.34 వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 80,253.19 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, అనంతరం నష్టాల్లోకి జారుకుంది. ఒకదశలో 927.18 పాయింట్లు కుదేలై 79,137.98కు పడిపోయిన సెన్సెక్స్, చివరకు 662.87 పాయింట్ల నష్టంతో 79,402.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 218.60 పాయింట్లు కోల్పోయి 24,180.80 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,073.90- 24,440.25 పాయింట్ల మధ్య కదలాడింది. వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 1822.46 పాయింట్లు, నిఫ్టీ 673.25 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.



నేటి బోర్డు సమావేశాలు: ఐసీఐసీఐ బ్యాంక్, ఆర్ఈసీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌బ్యాంక్, జేకే సిమెంట్, గోదావరి పవర్, యెస్ బ్యాంక్


- సెన్సెక్స్ 30 షేర్లలో 21 కుదేలయ్యాయి. ఎం అండ్ ఎం 3.93%, ఎల్ అండ్ టీ 3.35%, ఎన్‌టీపీసీ 3.13%, అదానీ పోర్ట్స్ 2.79%, టాటా స్టీల్ 2.15%, మారుతీ 2.14%, టైటన్ 2%, బజాజ్ ఫైనాన్స్ 1.89%, ఎస్‌బీఐ 1.77%, టాటా మోటార్స్ 1.75% నష్టపోయాయి. ఐటీసీ 2.17%, యాక్సిస్ బ్యాంక్ 1.69%, హెచ్‌యూఎల్ 0.98%, సన్‌ఫార్మా 0.53% లాభపడ్డాయి.
- **తగ్గిన ఫారెక్స్ నిల్వలు:** అక్టోబరు 18తో ముగిసిన వారానికి మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు 2.163 బి.డాలర్లు (దాదాపు రూ.18,000 కోట్లు) తగ్గి 688.267 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.57.81 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 690.43 బి.డాలర్లుగా ఉన్నాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 3.865 బి.డాలర్లు కోల్పోయి 598.236 బి.డాలర్లుగా నమోదయ్యాయి. పసిడి నిల్వలు 1.786 మి.డాలర్లు పెరిగి 67.444 బిలియన్ డాలర్లకు చేరాయి. దేశ ప్రత్యేక ఉపసంహరణ హక్కులు (ఎస్‌డీఆర్‌లు) 68 మిలియన్ డాలర్లు తగ్గి 18.271 బిలియన్ డాలర్లకు చేరగా, ఐఎంఎఫ్ వద్ద దేశ నిల్వల స్థానం 16 మిలియన్ డాలర్లు తగ్గి 4.316 బిలియన్ డాలర్లుగా నమోదైనట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి.
- మ్యూచువల్ ఫండ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు **ఎడెల్‌వైజ్ అసెట్ మేనేజ్‌మెంట్**, సంస్థ సీఈఓ రాధికా గుప్తా, ఫండ్ మేనేజర్ త్రిదీప్ భట్టాచార్యలపై సెబీ రూ.16 లక్షల జరిమానా విధించింది. 45 రోజుల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించింది.
- నియంత్రణపరమైన నిబంధనలను అమలు చేయడంతో **యూఏఈ ఎక్స్ఛేంజ్ సెంటర్‌**కు ధ్రువీకరణ పత్రాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పునరుద్ధరించింది.
- షానన్ ఇంజిన్ సపోర్ట్ లిమిటెడ్‌తో 4.5 మిలియన్ డాలర్ల వివాదాన్ని 2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.16.6 కోట్ల)కు పరిష్కరించుకున్నట్లు **స్పైస్‌జెట్** వెల్లడించింది.
- ఫ్రాన్స్‌లో అణు ప్రాజెక్ట్ కోసం ఐటీఈఆర్ సంఘం నుంచి 'గణనీయ' ఆర్డరును **ఎల్ అండ్ టీ** దక్కించుకుంది. కంపెనీ రూ.1000- 2500 కోట్ల ఆర్డర్లను గణనీయ ఆర్డర్లుగా సంస్థ పరిగణిస్తుంది.

త్రైమాసిక ఫలితాల ప్రభావంతో..

- **ఐటీసీ** షేరు ఇంట్రాడేలో 4.58% పెరిగి రూ.493.50 వద్ద గరిష్ఠాన్ని తాకి, చివరకు 2.17% లాభంతో రూ.482.10 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.12,820.29 కోట్లు అధికమై రూ.6.02 లక్షల కోట్లుగా నమోదైంది.
- **ఇండస్‌ఇండ్ బ్యాంక్** షేరు ఒకదశలో 19.88% క్షీణించి రూ.1,025.30 వద్ద 52 వారాల కనిష్ఠానికి చేరింది. చివరకు 18.56% కోల్పోయి రూ.1041.55 దగ్గర స్థిరపడింది. సంస్థ మార్కెట్ విలువ రూ.18,489.39 కోట్లు తగ్గి రూ.81,136.03 కోట్లకు పరిమితమైంది.

‘బీటెక్ చేసేద్దాం.. కోడింగ్‌లో పట్టు సాధిద్దాం.. మంచి ప్యాకేజీతో కొలువు కొట్టేద్దాం’... ఇదీ చాలామంది కుర్రాళ్ల వరస! ఇంకొందరేమో భిన్నం.. ‘చదివిన చదువు సమాజానికి ఉపయోగ పడాలి, నేర్చుకున్న విజ్ఞానం సరికొత్త ఆవిష్కరణలకు దారి తీయాలి’ అనుకుంటారు. అలాంటివాళ్లే చుక్క నవనీత్‌కృష్ణ, కొట్టక్కి శ్రీకర్‌వంశీలు. మరో ఇద్దరితో కలిసి వాళ్లు తయారు చేసిన ప్రాజెక్టు ప్రపంచ వేదికపై అవార్డు గెల్చుకుంది. వాళ్లతో ‘ఈతరం’ మాట కలిపింది.

కాలేజీ కుర్రాళ్లు.. హార్వర్డ్ మొనగాళ్లు!



శ్రీకర్

నవనీత్

ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ‘హ్యాక్ హార్వర్డ్ 2024’ పోటీ. 22 దేశాల్లోని 284 విశ్వవిద్యాలయాల విద్యార్థులు బరిలో నిలిచారు. వాటన్నింట్లో మేటిగా నిలిచింది మనవాళ్ల ప్రాజెక్టే. స్మార్ట్‌సిటీ కాన్సెప్ట్, చెత్త నిర్వహణ, హెల్త్‌కేర్.. ఈ మూడింటినీ మిళితం చేసి వీళ్లు రూపొందించిన యాప్ ప్రాజెక్టు ‘సస్టైనిఫై’ వీరిని విశ్వవేదికపై విజేతలుగా నిలిపింది. నవనీత్, శ్రీకర్‌లది విజయనగరం జిల్లా. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ప్రస్తుతం తమిళనాడు, కోయంబత్తూర్‌లోని అమృత విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మూడో ఏడాది చదువుతున్నారు. ఈ కాలానికి అనుగుణంగా, ఏఐతో ప్రయోగాలు చేస్తూ సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలనేది వీళ్ల తపన. వారి ఆలోచనలకు సాంకేతిక రూపమిస్తూ.. ఇంటెల్ సహా అనేక హ్యాకథాన్‌లలో పాల్గొని విజేతలుగా నిలిచారు. తాజాగా అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయ హ్యాకథాన్‌లో సత్తా చాటారు. స్నేహితులు అమృత్ సుబ్రమణియన్, సూర్య సంతోష్‌కుమార్‌తో కలిసి ‘సస్టైనిఫై’ పేరుతో వీళ్లు తయారు చేసిన యాప్ ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన ప్రాజెక్టులన్నింటినీ వెనక్కి నెట్టి, మొదటి స్థానంలో నిలిచింది. ఈ అవార్డు కింద నగదు, ప్రశంసాపత్రం, ఖరీదైన లాప్‌టాప్ అందుకున్నారు. దీంతోపాటు ఇప్పటికే పలు దిగ్గజ సంస్థల నుంచి కొలువుల ఆహ్వానాలూ అందుకున్నారు.

ఏంటీ ప్రాజెక్టు?

ప్రకృతి వనరుల్ని యథేచ్ఛగా వాడటం, ప్లాస్టిక్ విపరీత వినియోగం.. ధరిత్రికి పెనుశాపంగా మారుతున్నాయి. వీటి కారణంగా భవిష్యత్ తరాలకు ముప్పుపొంచి ఉంది. అది తప్పాలంటే.. ప్రతీ ఇంటి నుంచి మార్పు మొదలు కావాలి అన్నది మిత్రుల ఆలోచన. అదీ మనం కొనుగోలు చేసే వస్తువుల నుంచే ప్రారంభం కావాలంటున్నారు. దానికి సాంకేతిక రూపమిస్తూ.. పైథాన్, ఫాస్ట్‌ఏపీఐ, ఫ్లట్టర్, స్ట్రీమ్‌లిట్, ఫైర్‌బేస్, జెమినిఫ్లాష్‌ను ఉపయోగించి ‘సస్టైనిఫై’ యాప్‌ను రూపొందించారు. ఇందులో మన ఆరోగ్యానికి సంబంధించిన అన్ని వివరాలు, మెడికల్ రిపోర్టులు అప్‌లోడ్ చేయాలి. మనం తినే, తాగే ఆహారానికి సంబంధించిన కవర్, బాటిల్, టిన్.. ఏది కొన్నా, యాప్ ఓపెన్ చేసి వాటిని స్కాన్ చేస్తే చాలు. అవి ఏ మెటీరియల్‌తో తయారు చేశారు, రీసైక్లింగ్‌కి అవకాశం ఉందా, లేదా చెబుతుంది. పునర్వినియోగ సలహాలిస్తుంది. అలాగే పదార్థాల్లోని కొవ్వు, పిండి పదార్థాలు, షుగర్ లెవెల్స్, సోడియం.. ఎంతెంత ఉన్నాయో చూపిస్తుంది. అందులో అప్‌లోడ్ చేసిన హెల్త్‌డేటాతో విశ్లేషించి, ఆ ఆహారం తినొచ్చా, పానీయం తాగొచ్చా అనేదీ తెలియజేస్తుంది. చెత్తను ఆరంభంలోనే అరికట్టడం, ఎకోఫ్రెండ్లీ షాపింగ్, భూమితో పాటు మన ఆరోగ్యాన్ని రక్షించుకోవడం... ఇవన్నీ ఒకే సారి చేసేలా ఈ యాప్ దిశానిర్దేశం చేస్తుంది.

ఆఖరి నిమిషంలో..


పోటీకి వచ్చిన అన్ని ప్రాజెక్టులను పరిశీలించి ముందుగా 150 వరకు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వారందరినీ హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి ఆహ్వానించారు. అక్టోబరు 11 నుంచి 13వరకు జరిగే ప్రపంచస్థాయి హ్యాక్‌థాన్‌లో మీ ప్రాజెక్టు గురించి వివరించాలన్నారు. కానీ.. అప్పటికి నలుగురిలో ఒక్కరికీ వీసాల్లేవు. ప్రాజెక్టు ఎంపికైందని తెలిశాకే ప్రయత్నాలు ఆరంభించారు. ఎన్నో ప్రయాసలు పడ్డాకే చివరి నిమిషంలో ఈమెయిల్ ద్వారా వీసాలు అందాయి. ఈ స్థితి నుంచి వచ్చి ‘ఓవరాల్ బెస్ట్ హ్యాక్ విన్నర్ అవార్డ్ 2024’, ‘బెస్ట్ ప్రాజెక్ట్ ఆఫ్ హ్యాక్ హార్వర్డ్’గా ఎంపికయ్యారు. ‘ప్రతి నగరం ప్లాస్టిక్ మయంగా మారుతోంది. వ్యర్థాల నిర్వహణ కష్టమవుతోంది. విచ్చలవిడి వాడకంతో అటు పర్యావరణానికి హాని కలిగిస్తూ, ఇటు రోగాల బారిన పడుతున్నారు జనం. ఈ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ఓ అంకుర సంస్థను ప్రారంభించడమే మా భవిష్యత్తు లక్ష్యం’ అంటున్నారిద్దరూ.

అబ్బ..ఛా!

‘మిగతా దేశాలతో పోలిస్తే మనదగ్గర విడాకుల శాతం తక్కువ. ఎందుకో తెలుసా..?’

▲ మన దగ్గర పెళ్లి ఖర్చులు ఎక్కువ కదా.. అలా ఒక్కసారి పెళ్లి చేసుకున్నాక, విడాకులు తీసుకుని రెండోపెళ్లి చేసుకునేంత డబ్బుంటుందా?

మనలో మనం



నేనో ఐటీ కంపెనీలో ఉద్యోగిని. తెలిసినవాళ్ల ద్వారా ఒకరి రూమ్మేట్‌గా చేరాను. గది బాగుంది.. ఆఫీసుకి దగ్గర. అద్దె కూడా తక్కువే. సమస్య ఏంటంటే.. నా రూమ్మేట్ బోయ్‌ఫ్రెండ్ అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటాడు. వాళ్లు పార్టీలు చేసుకుంటుంటారు. నన్ను కలవమని బలవంతం చేస్తారు. అది నాకు నచ్చదు. అప్పుడు బయటికి ఎక్కడికైనా వెళ్లిపోతుంటాను. ‘ఇలా చేయడం బాగా లేదు’ అని చెప్పినా తను వినడం లేదు. ‘ఈరోజుల్లో ఇవన్నీ కామన్’ అంటోంది. అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న రూం నుంచి వెళ్లాలని లేదు. తననెలా మార్చేది?

– ఆశ్రిత ఆర్, ఈమెయిల్

అమ్మాయిల గదికి.. అతగాడు రావడమేంటి?

మనం సలహాలు ఇవ్వడమే తప్ప ఎవర్నీ మార్చలేం. మనల్ని మనమే మార్చుకోవాలి లేదా వాళ్లంతట వాళ్లే మారాలి. మీరు చెబుతున్న విషయాల్ని బట్టి మీరు నగర, కార్పొరేట్ వాతావరణానికి కొత్త అని అర్థమవుతోంది. రోమ్‌లో ఉన్నప్పుడు రోమన్‌లా ఉండాలంటారు. అలా ఉంటేనే జీవితం సాఫీగా సాగుతుంది. కార్పొరేట్ ప్రపంచంలో అమ్మాయి, అబ్బాయి కలిసి తిరగడం, పార్టీలు చేసుకోవడం సాధారణం. ఆ అబ్బాయి మీ గదికి వచ్చి గడిపినంత మాత్రాన తప్పేమీ కాదు. అదీగాక వాళ్లతో కలవడం ఇష్టంలేక బయటికి వెళ్లిపోతూనే ఉన్నారు కదా! వాళ్ల ప్రవర్తన శృతి మించినప్పుడు మాత్రమే అభ్యంతరం చెప్పాలి. ఫ్రెండ్లీగా ఉన్నప్పుడు వాళ్లను అనుమానించలేం. ఆ మాత్రం కూడా మీకు నచ్చకపోతే మీరు పెరిగిన వాతావరణం, పాటించే పద్ధతుల గురించి తనతో చెప్పండి. అబ్బాయిలు గదికి రావడం పద్ధతి కాదని సున్నితంగానే వివరించండి. తను తప్పకుండా అర్థం చేసుకుంటుంది. అన్నిరకాలుగా అనుకూలంగా ఉన్న గది మారి, ఇబ్బందుల్లో పడొద్దు. ఒకవేళ మీరు అక్కడినుంచి వేరేచోటికి వెళ్లిపోయినా.. అక్కడా ఇలాంటివి జరగవనే నమ్మకం లేదు. అలాగని మరీ అభ్యంతరకరంగా ఉంటే మథన పడుతూ అక్కడే ఉండటమూ సబబు కాదు. మీరు సర్దుకుపోవడమా.. అలా చేయలేనప్పుడు గది ఖాళీ చేసి వెళ్లిపోవడమా.. మీ చేతుల్లోనే ఉంది. ఆల్ ది బెస్ట్.



– అర్చన నండూరి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

పంచుకుందాం



◆ కలలో కనిపిస్తావు...
జీవితంపై ఆశ కలిగిస్తావు...
అందుకుందామనేలోపే అందనంత
దూరంలో ఉంటావు!

◆ నిన్ను కలిసినప్పుడు
ఏదో చెప్పాలని చూస్తా...
నిన్ను చూశాక...
చెప్పాలన్న విషయం మరుస్తా!

◆ నీపై కవిత
రాద్దామని
కలం పడితే..
అందులోని సిరా
కన్నీరై ఒలికింది!

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

‘పెళ్లి చెడగొడతాం.. విడగొడతాం’

వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చేయాలనడం పాత ముచ్చట. లక్షలు ఖర్చైనా ఫర్వాలేదు కుదిరిన పెళ్లి రద్దు చేయించాలనుకోవడం కొత్త ట్రెండ్. ఇది స్పెయిన్, ఇంగ్లండ్‌లాంటి దేశాల్లో జోరు మీదుంది. వివాహాన్ని చక్కగా జరిపించేందుకు వెడ్డింగ్ ప్లానర్లు ఉన్నట్టే, కుదిరిన పెళ్లి చెడగొట్టేందుకు కొత్తగా ‘వెడ్డింగ్ డిస్ట్రాయర్స్’ పుట్టుకొచ్చారు అక్కడ. స్పెయిన్‌కు చెందిన వారియో అనే ఓ వెడ్డింగ్ డిస్ట్రాయర్‌కు అయితే ఈ ఏడాది చివరి వరకూ అసలు ఖాళీయే లేదట. అలాగని అతగాడు చేసేదేదో అల్లాటప్పాగా కాదండోయ్! ఒక్కో డీల్‌కి రూ.50 వేల నుంచి రూ.రెండు, మూడు లక్షల వరకు తీసుకుంటాడు. వివాహం తేదీ, సమయం, ప్రాంతం చెబితే చాలు.. మిగతాదంతా తనే చూసుకుంటాడు. ఒక్కో పెళ్లికి ఒక్కో ప్లాన్ అమలు చేస్తాడు. ఈ క్రమంలో వధూవరుల బంధువులెవరైనా దాడి చేస్తే.. ఒక్కో దెబ్బకు అదనంగా ఇంకొంత చెల్లించాలని ముందే ఒప్పందం కుదుర్చుకుంటాడు. ప్రేమించో, పెద్దలు కుదర్చడం వల్లో పెళ్లిదాకా వెళ్లిన జంట.. తర్వాత ఏదైనా కారణంతో మనసు మార్చుకొని ‘మాకా సంబంధం అక్కర్లేదు’ అనుకుంటే డిస్ట్రాయర్లను ఆశ్రయిస్తున్నారు. ‘పెళ్లి చేసుకోవాలని లేదా? కుదిరిన పెళ్లిని ఎలా చెడగొట్టాలో అర్థం కావడం లేదా? ఇక ఆ కష్టాలను చెక్ చెప్పేయండి.. ఆ బాధ్యతను నాకు అప్పగించండి’ అంటూ వారియో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టడంతో ఈ ధోరణి నెట్టింట్లో వైరల్‌గా మారింది.



ట్రిప్‌టిప్

జపాన్ రైల్లో వింత అనుభవం



నేను జపాన్‌కి వెళ్లిన కొత్తలో జరిగిందిది. ఒక పార్టీకి హాజరై, ఇంటికి తిరిగి వెళ్లడానికి ట్రెయిన్ ఎక్కాను. లోపల ప్రయాణికులు ఎవరూ లేక కంపార్ట్‌మెంట్ మొత్తం ఖాళీగా ఉంది. అదేసమయంలో నా దగ్గరి స్నేహితురాలు ఫోన్ చేసింది. అలవాటుగా ఎప్పట్లాగే గట్టిగా నవ్వుతూ మాట్లాడసాగాను. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఇబ్బందేమీ ఉండదని అనుకున్నాను. కానీ మూడు నిమిషాలయ్యాక ఎక్కడి నుంచో ఒక గార్డ్ వచ్చారు. వచ్చి రెండు చేతుల్ని క్రాస్ ఆకారంలో పెట్టి ‘డమే డమే’ అన్నారు. అంటే జపనీస్ భాషలో ‘అలా చేయడం పద్ధతి కాదు’ అని అర్థం. ఆమె మాటలు వినగానే నాకు కొంచెం సిగ్గుగా అనిపించింది. జపాన్‌లో జనం ఉన్న ప్రదేశాల్లో బిగ్గరగా మాట్లాడేవాళ్లు, పదేపదే బండి హారన్ కొట్టేవాళ్లని నాగరికత లేని వ్యక్తులుగా పరిగణిస్తారు. చట్టప్రకారం అది నేరం కాకపోయినా అక్కడ ఎవరూ అలా చేయరని తర్వాత తెలిసింది. భారత్ నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం జపాన్ వచ్చేవాళ్లు చాలామందే ఉంటారు. వాళ్లు ఇక్కడికి వచ్చేముందే పద్ధతులు, అలవాట్లు ఓసారి తెలుసుకుంటే ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల నుంచి తప్పించుకోవచ్చు.

– రుత్విక, క్యోటో

ఇండియాలో సినిమా స్టార్ల లెక్క తీస్తే జాబితా చేంతాడంత ఉంటుంది. టీవీ స్టార్‌ల గురించి చెబితే మాత్రం కపిల్ శర్మ ఒక్కడే గుర్తొస్తాడు! తను అంతగా పాపులర్. ఈమధ్యే అత్యధిక సంపాదనపరుడిగా రికార్డులకెక్కాడు.

నవ్వుల కపిల్.. నంబర్ 1



◆ భారత్‌లో టీవీ షోలకు వ్యాఖ్యాతగా, న్యాయనిర్ణేతగా అత్యధిక పారితోషికం తీసుకునేది కపిలే. తను ఒక్కో ఎపిసోడ్‌కి అక్షరాలా రూ.5కోట్లు అందుకుంటాడు.

◆ కొన్ని మీడియా సంస్థల కథనం ప్రకారం కపిల్ శర్మ సంపాదన రూ.300 కోట్లు. ముంబయిలో అతగాడు ఉండే ఫ్లాటు ఖరీదే రూ.15 కోట్లు. గతేడాది అతడు ముందస్తుగా చెల్లించిన ఆదాయపు పన్ను రూ.26కోట్లు.

◆ రేంజ్‌రోవర్ ఎవోక్, మెర్సిడెస్ బెంజ్ ఎస్350, వోల్వో ఎక్స్‌సీ 90 లాంటి ఎన్నో కార్లు అతడి సొంతం. రూ.ఐదున్నర కోట్లు పెట్టి ఒక వ్యానిటీ వ్యాన్ కూడా ప్రత్యేకంగా తయారు చేయించుకున్నాడు.

◆ కపిల్ వ్యాఖ్యాతగా వ్యవహరించే ‘ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో’ కొన్నేళ్లుగా నెంబర్‌వన్ కామెడీ షోగా కొనసాగుతోంది. ఇండియాలోని సినిమా తారలంతా ఇందులో పాల్గొనడానికి ఆసక్తి చూపిస్తుంటారు. తమ చిత్రాల ప్రచారం కోసం ఓ వేదికలా ఉపయోగించుకుంటారు.

పడతుల పాదాలు తాకి..

రీల్.. ఫీల్



‘అమ్మాయి కనిపిస్తే వంకర చూపులు చూసే వాళ్లే కాదు.. నాలాగ బుద్ధిమంతులూ ఉంటారు’ అంటున్నాడు బాదల్ కుష్వా. ప్రయోగాలు, సృజనాత్మక రీల్స్‌తో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తుంటాడీ గ్వాలియర్ కుర్రాడు. ఈసారి ఏం చేశాడంటే.. పడుచు అమ్మాయి నుంచి పండు ముసలి మహిళలందరికీ పాదాభివందనం చేయడం మొదలుపెట్టాడు. అదీ గుడి ఆవరణలో. అప్పుడే దేవుడి దర్శనం చేసుకొని బయటికొస్తున్న అమ్మాయిల పాదాలు తాకడం ప్రారంభించాడు. ఎవరో అపరిచితుడు ఉన్నపళంగా తమ కాళ్లపై పడుతుంటే అందరూ ఒకేలా స్పందిస్తారా? కొందరు ఆశీర్వదిస్తే.. ఇంకొందరు వింతగా చూశారు. మరికొందరైతే జంకుతో వెనక్కి జరిగారు. ఈ పిచ్చిచేష్టలేంటి అని చాలామంది వెటకరించినా ‘మా కుర్రాళ్లకు అసలే బ్యాడ్ ఇమేజ్ ఉంది.. దాన్ని కొంచెం మార్చడానికి, ఆడవాళ్లను గౌరవించడం మన సంప్రదాయం అని తెలియజెప్పడానికీ ఈ ప్రయోగం చేశా’ అంటున్నాడు బాదల్. ఈ రీల్ అంతర్జాలంలో చక్కర్లు కొడుతోంది. కామెంట్ల వాన కురుస్తోంది.

ఈ దీపావళికి జీవితం వెలగాలి!

ఉదయాన్నే ఆఫీసుకెళ్లడం.. సాయంత్రానికి గూటికి చేరడం. వారాంతంలో ఇంటి పని.. చూస్తుండగానే ఇలా వారం కరిగిపోతుంది. ‘జీవితం అంటే ఇంతేనా?’ అని ఉసూరుమంటాం ఒక్కోసారి. ఆ రొటీన్‌కి విరామం ఇచ్చి, జీవితం వెలిగిపోయేలా ఈ దీపావళి నుంచి ప్రయత్నించి చూడండి.



నడక-ఆస్వాదన

ఉత్సాహంగా ఓ పది నిమిషాలు నడిస్తే.. మనసుకూ ఉత్తేజమే. అందులోనూ పరుగు లాంటి నడకతో వ్యాయామం ముగిస్తే, శరీరంలో అత్యధికంగా ఎండార్ఫిన్లు విడుదలవుతాయట. రోజులో 15 నిమిషాలైనా ఎండ తగిలితే డిప్రెషన్‌లోకి వెళ్లే ముప్పు తగ్గడంతోపాటు విటమిన్-డి అందుతుందంటున్నారు క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ పరిశోధకులు.

ఊహించని టూరు

ప్రణాళిక వేసుకొని మరీ చేసే పనుల కంటే.. కొన్నిసార్లు అనుకోకుండా చేసే పనులే మజానిస్తాయి. మూడ్ బాగోలేనప్పుడు అప్పటికప్పుడే మూట సర్దేసుకొని ఏదైనా ట్రిప్ లేదా డిన్నర్‌కో ప్లాన్ వేశామనుకోండి.. అవి మనలో సరికొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తాయి.

భాగస్వామికో ముద్దు

ప్రేమ మనసులో ఉంటే సరిపోదు. అది బయటికి వ్యక్తమయినప్పుడే ఆనందం. భాగస్వామికి ఆప్యాయతతో పెట్టే ముద్దు, ఓ కౌగిలి.. మనసుని సంతోషంలో ముంచేస్తుంది. అలా చేస్తే ఫీల్‌గుడ్ హార్మోనులు విడుదలై, చెడు భావోద్వేగాల నుంచి బయట పడేస్తాయి.

చిన్న చాక్లెట్

ఆందోళనగా ఉన్నప్పుడు చాక్లెట్ తినమని సలహా ఇస్తారు చాలామంది. కొకోవాలో ఉండే ఓ సహజసిద్ధ రసాయనం ఆనందాన్ని కలిగిస్తుంది. అందుకే చాక్లెట్ తింటేనే కాదు, ఆ పేరు విన్నా ఓ మధురానుభూతి.

రాస్తే సరి..

అవసరం ఉన్నా, లేకపోయినా రాయడం అనేది ఓ మంచి అలవాటు. అది ఒత్తిడికి మందులా పని చేస్తుంది. మీకు తెలిసిన సంఘటనో, విన్న కవితనో కాగితంపై పెట్టండి. లేదంటే మీరోజు ఎలా గడిచిందో నోట్ చేయండి.. ఒత్తిడి హుష్‌కాకి.

చెలరేగిపోవడం

ఎప్పుడో మర్చిపోయిన బంధుమిత్రులతో మాట కలపండి. చిన్న బహుమతిని తీసుకెళ్లి వాళ్లని ఆశ్చర్యానికి గురి చేయండి. గట్టిగా నవ్వడం, నచ్చిన డ్రెస్ వేసుకోవడం, ఇష్టమైన పాటలు వినడం, ఎవరూ లేరన్నట్టుగా గెంతులేయడం.. ఇవన్నీ మీ పెదాలపై నవ్వు పూయించకపోతే అడగండి.

సెల్ఫీ మాయ

సెల్ఫీకీ చాలా సీనుందంటున్నారు కాలిఫోర్నియా యూనివర్సిటీ పరిశోధకులు. కొందరు విద్యార్థులను నాలుగు వారాలపాటు రోజూ నవ్వుతూ సెల్ఫీ దిగమని చెప్పారు. ఆ తర్వాత మాట్లాడితే.. వారిలో కొత్త ఉత్సాహంతోపాటు, అందరితో కలిసిపోయే ధైర్యం కూడా పెరిగిందట.

కొంటె కొటేషన్



☛ కోడితో దొంగ పరుగు..
దొరికితే నడ్డి విరుగు..
– జి.సాయిరాం, నెల్లూరు

☛ కోడిని పట్టావా పండూ..
జనం వాయిస్తారులే నీ గుండు..!
– ఎ.లక్ష్మి, దూసి

☛ దొంగతనం
తప్పు.. కోడి
నీకెందుకు చెప్పు..
– జయదేవ్, ఈమెయిల్

☛ కోడి పుంజుతో
పరారు..
చిక్కితే నీ చెడ్డీని లాగేస్తారు!
– రంకిరెడ్డి రాజు, అమలాపురం

☛ పందేనికి పుంజుతో నేను రెడీ..
పరుగెత్తండి నా వెంబడి..!
– తంగి సన్యాసిరావు, శ్రీకాకుళం

☛ వయసుకు మించిన భారం..
సంక్రాంతికి చేస్తావా బేరం?
– కె.సుమన్ కుమార్, ఈమెయిల్

☛ డాడీ.. పట్టాను పుంజు..
పద.. చేసుకుందాం విందు!
– వసీం, ఆదిలాబాద్



ఈ ఫొటోకి మీ సరదా వ్యాఖ్యలు రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

భారత స్వాతంత్య్రోద్యమం

బెంగాల్ విభజన



భారత్‌లోని బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ కర్జన్ 1905లో పరిపాలనా సౌలభ్యం పేరుతో బెంగాల్‌ను విభజించారు. గతంలోనే బెంగాల్‌ను విభజించాలని చూసినా వీలుపడలేదు. అయితే కర్జన్ హయాంలో 1905 జులై 19న విభజనను పూర్తిచేశారు. ఇది 1905 అక్టోబరు 16 నుంచి అమల్లోకి వచ్చింది. బ్రిటిష్ వారి 'విభజించు - పాలించు' అనే ధోరణికి ఇది అద్దం పడుతుంది.

విభజనకు పూర్వం బెంగాల్ రాష్ట్రం:

బెంగాల్, బిహార్, ఒరిస్సా, అస్సాంలు కలిసి ఒక పెద్ద రాష్ట్రంగా ఉండేవి. పరిపాలనా సౌలభ్యం కోసం 1874లో అస్సాంను వేరుచేసి చీఫ్ కమిషనర్ పాలనలో ఉంచారు.

✧ 1896లో అస్సాం చీఫ్ కమిషనర్ విలియం వార్డ్ ఢాకా, చిట్టగాంగ్, మైమెన్‌సింగ్‌లోని కొన్ని ప్రాంతాలను అస్సాం ప్రాంతంలో కలపాలని సూచించాడు. కానీ చిట్టగాంగ్ ప్రాంత ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత, అధికారుల్లో ఏకాభిప్రాయం లేకపోవడంతో ఈ ప్రతిపాదన తేలిపోయింది.

✧ 1903లో బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆండ్రూ ఫ్రేజర్ విలియం వార్డ్ ప్రతిపాదనకు ఒక రూపు కల్పించాడు. దీంతో లార్డ్ కర్జన్ 1903లో బెంగాల్ విభజనను తిరిగి తెరపైకి తెచ్చాడు.

✧ నాటి బెంగాల్ జనాభా 78 మిలియన్లుగా ఉండేది. పెద్ద ప్రావిన్సుల కారణంగా పరిపాలన కష్టంగా ఉందనే నెపంతో బెంగాల్ విభజనకు పూనుకున్నాడు. 'పరిపాలనా సౌలభ్యం' కోసమే బెంగాల్ విభజన చేస్తున్నట్లు ప్రకటించారు.

వందేమాతర ఉద్యమం

భారత జాతీయోద్యమంలో చారిత్రకంగా పేరొందిన తొలి ఘట్టం వందేమాతర ఉద్యమం. దీనికి కారణం నాటి భారత బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ కర్జన్ చేసిన బెంగాల్ విభజన.

✦ 1905లో జులైలో అధికారిక ప్రకటన వెలువరించారు.

✦ దీనిలో భాగంగా రెండు ప్రావిన్సులను ఏర్పాటు చేశారు.

✦ తూర్పు బెంగాల్, అస్సాంలతో కూడిన నూతన ప్రావిన్స్‌లో చిట్టగాంగ్, ఢాకా, రాజ్‌షాహీ ప్రాంతం, తిప్పెరా పర్వత ప్రాంతాలను కలిపారు. దీనికి ప్రధాన కేంద్రంగా ఢాకాను ఏర్పాటు చేశారు.

✦ పశ్చిమ బెంగాల్, బిహార్, ఒరిస్సాలతో కూడిన మిగిలిన ప్రాంతాన్ని మరో ప్రావిన్స్‌గా ఏర్పాటు చేశారు.

✦ బెంగాల్‌లో హిందూ జనాభా ఎక్కువగా ఉంటే, తూర్పు బెంగాల్‌లో ముస్లిం జనాభా ఎక్కువగా ఉండేది.

✦ హిందూ, ముస్లింలను విడగొట్టేందుకే ఈ విభజన అని, భారతీయుల్లో బలపడుతున్న జాతీయతా భావాన్ని దూరం చేసేందుకే ఈ కుట్ర అని బలంగా నమ్మారు. భారతీయుల్లోని ఐకమత్యాన్ని రూపుమాపేందుకే బెంగాల్ విభజన చేపట్టారని పలువురు చరిత్రకారులు పేర్కొన్నారు.

దేశంలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న జాతీయతా భావాన్ని నిలువరించేందుకు, ప్రజల మధ్య ఐక్యతను చెడగొట్టేందుకు బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ విభజనను చేపట్టింది. పరిపాలన సౌలభ్యం కోసమే ఈ విభజన అని ఆంగ్లేయులు పేర్కొన్నా.. ఇది మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే అని భారతీయులు నమ్మారు. హిందూ - ముస్లింల మధ్య దూరం పెంచేందుకే ఈ విభజన చేశారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. వందేమాతర నినాదంతో పోరు జరిపారు. బ్రిటిష్ అధికారులకు ముచ్చెమటలు పట్టించారు. ఫలితంగా రాజే దిగివచ్చి విభజనను రద్దు చేశారు. ఈ పరిణామాలే జాతీయోద్యమ చరిత్రలో చరిత్రాత్మకంగా నిలిచిపోయాయి.

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర


విభజనను ఎదిరించి.. విజయం సాధించి!

బ్రిటిష్ ప్రభుత్వ చర్యలు

ఉద్యమాన్ని అణచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం బహిరంగ సభల చట్టం, శిక్షాస్మృతి సవరణ చట్టం, మందుగుండు సామాగ్రి చట్టం, పత్రికల అణచివేతకు ఉద్దేశించిన చట్టాలను చేసింది.

● సభలు, సమావేశాలపై ఆంక్షలు విధించారు.

● వందేమాతర గీతాన్ని ఆలపించడాన్ని, ఆ పదం పలకడాన్ని నిషేధించారు.


అజిత్ సింగ్

● తిలక్‌కు ఆరు సంవత్సరాల జైలు శిక్ష, లాలా లజపత్‌రాయ్, అజిత్ సింగ్‌ల నిర్బంధం, అరవిందో ఘోష్‌పై క్రిమినల్ కేసులు పెట్టారు.

● యుగాంతర్, సంధ్య, వందేమాతరం పత్రికలను మూసివేయించారు.

● బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక వ్యూహాలు ముస్లిం సమాజాన్ని కొంతవరకు ఉద్యమం నుంచి వేరుచేయగలిగాయి.

● ఇదేకాలంలో అఖిల భారత ముస్లింలీగ్ అవతరించింది. ఉద్యమ వ్యతిరేక వైఖరికి ఢాకా నవాబ్ సలీముల్లా కేంద్ర బిందువయ్యాడు.

● కాంగ్రెస్‌లో సమర్థులైన నాయకులు నిర్బంధానికి గురికావడంతో కొంతకాలం ఉద్యమం బలహీనపడింది.



రచయిత
డాక్టర్ వి. రాజ్‌మహ్మద్
అసిస్టెంట్ ప్రొఫెసర్

బెంగాల్ విభజన రద్దు


లార్డ్ హార్డింజ్

బెంగాల్‌లో ప్రభుత్వం విధించిన అనేక ఆంక్షలు, అణచివేత విధానాలు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపాయి.

◆ ఉద్యమం నీరుగారిపోకుండా దేశంలోని యువకులు సాయుధ పంథాను ఎంచుకున్నారు.

◆ 1911లో బ్రిటిష్ రాజు జార్జ్ తన భార్య మేరీతో భారతదేశ సందర్శనార్థం వచ్చారు. ఈ కాలంలో భారత బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ హార్డింజ్. రాజు గౌరవార్థం దర్బారు ఏర్పాటు చేశారు.

◆ ఉద్యమ పరిస్థితులను గమనించిన బ్రిటిష్ వారు బెంగాల్ విభజనను రద్దు చేస్తున్నటు దర్బారులో ప్రకటన చేశారు. దీనితో పాటుగా రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చుతున్నట్లు ప్రకటించారు.

◆ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిపిన ఉద్యమాల్లో భారతీయులు తొలిసారిగా విజయం సాధించింది వందేమాతరం ఉద్యమం.

◆ భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఉద్యమంగా పేరుగాంచింది. రాజకీయ చైతన్యాన్ని, జాతీయతా భావాలను ఇనుమడింపజేసింది.

ఉద్యమం తీరుతెన్నులు

1903లో బెంగాల్ విభజన తిరిగి తెరపైకి వచ్చినప్పుడు కాంగ్రెస్ మహాసభలు జరిపి 'బెంగాల్ విభజన రద్దు' తీర్మానాలను ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన అర్జీలు బ్రిటిష్ వారికి అందించారు.

❖ ఫరీద్‌పూర్, జెస్సోర్, ఢాకా, బారిసాల్ పట్టణాల్లో నిరసన సభలు జరిగాయి.

❖ బెంగాల్ విభజనపై ప్రజలు నిరసనల వెల్లువ సృష్టించారు.

❖ సురేంద్రనాథ్, పృథ్వీశ్ చంద్రరాయ్, కృష్ణకుమార్ మిత్రాలు విభజనపై విమర్శనా వ్యాసాలు రాశారు. హితవాది, సంజీవని పత్రికలు విభజనను దుయ్యబట్టాయి.

❖ 'బ్రిటిష్ పాలన మొదలైన నాటి నుంచి ఎప్పుడూ లేని విధంగా కుల, మత విచక్షణ లేకుండా ప్రజలు ఏకలక్ష్యంతో సంఘటితంగా ప్రతిఘటించడం ఒక అపూర్వ పరిణామం' అని గోఖలే ప్రస్తుతించారు.

❖ కలకత్తా టౌన్ హాల్‌లో 1905, ఆగస్టు 7న జరిగిన ఒక ప్రజాసమావేశంతో ఉద్యమం ఆరంభమైంది.

❖ మాంచెస్టర్ వస్త్రాలను, లివర్‌పూల్ ఉప్పును బహిష్కరించాల్సిందిగా నాయకులు పిలుపునిచ్చారు.

❖ 1905, అక్టోబర్ 16ను బెంగాల్ రాష్ట్రానికి దుర్దినంగా వ్యాఖ్యానించారు. ఈ రోజును బ్లాక్ డే గా జరుపుకున్నారు.

❖ లాల్ - బాల్ - పాల్, అజిత్ సింగ్, అరవిందో ఘోష్‌లు ఉద్యమాన్ని వ్యాప్తి చేశారు.



❖ ప్రజలు ఊరేగింపుగా సాగి, గంగానదిలో స్నానాలు చేసి వందేమాతర గీతం ఆలపిస్తూ - ఒకరికొకరు రాఖీలు కట్టుకొని సంఘీభావం ప్రకటించారు.

❖ 1905లో బనారస్ కాంగ్రెస్ సమావేశంలో విదేశీ వస్తు, వస్త్ర బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగంపై తీర్మానాలు చేశారు.

❖ బహిరంగ సభలు, సమావేశాలే కాకుండా స్వచ్ఛంద కార్యకర్తల సంఘాలు ఉద్యమ ప్రచారాన్ని, ఉద్యమం అమలును చేపట్టాయి. వీటిని సమితులుగా వ్యవహరించారు

❖ వీటిలో బారిసాల్‌లో అశ్వనీకుమార్ నెలకొల్పిన 'స్వదేశ బోధన సమితి' ప్రసిద్ధమైంది. ఇది స్వదేశీ సందేశాన్ని బెంగాల్ మారుమూలలకు తీసుకువెళ్లింది.

❖ అనుశీలన సమితి సభ్యులు బ్రిటిష్ వారిపై దాడులు జరిపారు. ఈ సమితి పంథాలోనే ఆత్మోన్నతి సమితి, బ్రతి సమితి, సుహృద్ సమితులు ఏర్పడ్డాయి. ఆయా సమితుల కార్యకలాపాలు ప్రభుత్వానికి ఆందోళన కలిగించాయి. దీంతో ప్రభుత్వం వీటిని చట్ట వ్యతిరేక సంఘాలుగా ప్రకటించాయి.

❖ బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు భారతీయులు విదేశీ వస్తువులను బహిష్కరించాలని తలచారు. దీనిలో భాగంగా దేశంలో అనేక మంది స్వదేశీ సంస్థలను స్థాపించారు.

❖ దేశంలో బట్టల మిల్లులు, సబ్బులు, అగ్గిపెట్టెలు, జనపనార, తోళ్ల పరిశ్రమలను ప్రారంభించారు.

❖ పి.సి.రాయ్ (ప్రఫుల్ల చంద్రరాయ్) అనే ప్రసిద్ధ రసాయన శాస్త్రజ్ఞుడు బెంగాల్ కెమికల్స్ అనే కర్మాగారాన్ని ప్రారంభించారు.

❖ 1906లో జాతీయ విద్యామండలిని నెలకొల్పి అన్ని స్థాయుల్లో జాతీయ విద్యా విధానాన్ని అమలుపరిచేందుకు కృషి చేయాలని తీర్మానించారు.

❖ అరవిందో ఘోష్ ప్రధానాచార్యుడిగా బెంగాల్‌లో జాతీయ కళాశాలను స్థాపించారు.

❖ విద్యార్థులు ఆంగ్ల విద్యాసంస్థలను బహిష్కరించారు. విదేశీ వస్తువులు అమ్మే దుకాణాల ముందు పికెటింగ్ చేశారు.

❖ శిక్షణ కోసం యువకులను విదేశాలకు పంపేందుకు ఒక నిధిని ఏర్పాటు చేశారు. జోగేంద్ర చంద్రఘోష్, కాశీంబజార్‌కు చెందిన మనీంద్రనంది పరిశ్రమలు నెలకొల్పేవారికి ధన సహాయాన్ని అందించారు.


❖ సాంకేతిక పరిజ్ఞాన బోధన, శిక్షణకు ప్రాముఖ్యం ఇచ్చి, వినియోగ వస్తువుల తయారీలో శిక్షణ కోసం భారతీయ విద్యార్థులను జపాన్‌కు పంపించారు.

❖ ఆంధ్ర ప్రాంతంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, అయ్యదేవర కాళేశ్వరరావు స్వదేశీ ఉద్యమాన్ని ప్రచారం చేశారు.

❖ బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలో పర్యటించి వందేమాతర ఉద్యమాన్ని ప్రచారం చేశారు.

❖ రాజమండ్రిలో గున్నేశ్వరరావు ఇచ్చిన వెయ్యి రూపాయల విరాళంతో గోదావరి స్వదేశీ స్టోర్స్‌ను ప్రారంభించారు.

❖ జాతీయ పాఠశాల, కళాశాలలు స్థాపించారు.



❖ రవీంద్రనాథ్ ఠాగూర్, రజనీకాంత్ సేన్, ద్విజేంద్రలాల్‌రాయ్, ముకుందదాస్, సయ్యద్ అబూ మహమ్మద్ లాంటి కవులు రాసిన గేయాలు, కావ్యాలు ఉద్యమానికి ఉద్దీపనలయ్యాయి. రవీంద్రుడి అమర్ సోనార్ బంగ్లా గీతం (ప్రస్తుత బంగ్లాదేశ్ జాతీయ గీతం) బెంగాల్ ప్రజలను జాగృతపరిచింది.

❖ బంకించంద్ర ఛటర్జీ రాసిన ఆనంద్‌మఠ్ గ్రంథం నుంచి సేకరించిన 'వందేమాతరం' ఉద్యమ నినాదంగా మారింది.

❖ కార్మిక వర్గాలు బ్రిటిష్ ఇండియా రైల్వే, క్లైవ్ జూట్ మిల్స్ లాంటి పరిశ్రమల్లో, సంస్థల్లో సమ్మెకు పూనుకున్నాయి. (బారిసాల్ జిల్లాలో మినహాయిస్తే ఇతర బెంగాలీ కర్షక సమాజం ఉద్యమంలో అధికంగా పాల్గొనలేదని కొందరి చరిత్రకారుల అభిప్రాయం)

❖ ప్రజల్లో జాతీయతా భావాన్ని రేకెత్తించడానికి శివాజీ, గణేశ్ ఉత్సవాలు నిర్వహించారు.

❖ పూనాలో దసరా రోజు విదేశీ వస్తు, వస్త్ర దహనం చేసి, స్వదేశీ వస్తు ప్రదర్శనను చేపట్టారు.

❖ బిపిన్ చంద్రపాల్ పర్యటనతో మద్రాసు రాష్ట్రంలో ఉద్యమ అలజడులు తీవ్రతరం అయ్యాయి.

❖ పాల్‌ను మద్రాసు నుంచి తరలించడం తప్పనిసరి చర్య అని వైస్రాయ్ భారత వ్యవహారాల కార్యదర్శికి లేఖ రాశాడు.

451 Word of the Day

Erudition

Telugu meaning: జ్ఞానం, పాండిత్యం

English meaning: The word erudition is a noun that describes deep, extensive knowledge or learning.

Synonyms: Knowledge, Enlightenment

Antonyms: Ignorance, Illiteracy

Usage: 1. His erudition on the subject of history was evident as he discussed the finer details of ancient civilizations.

2. The professor's erudition made his lectures both informative and engaging.

నోటిఫికేషన్స్

అప్రెంటిస్ పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 25. ఆఫ్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 28 అక్టోబరు 2024.

పారా మెడికల్ కోర్సులు

విజయనగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల 2024-25 విద్యా సంవత్సరానికి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 29 అక్టోబరు 2024.

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐఐసీ) దేశవ్యాప్తంగా ఉన్న తమ కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 200. దరఖాస్తు ఫీజు రూ.1000 + జీఎస్టీ. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ 5 నవంబరు 2024.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (అక్టోబరు 26) ఆఖరు తేదీ

☛ డీఆర్‌డీవోలో 22 జూనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టులు. బీఈ/బీటెక్, ఎంటెక్/ఎంఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ అల్లూరి సీతారామరాజు జిల్లాలో 21 గెస్ట్ టీచర్ పోస్టులు. బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ, బీఈడీ, సీటెక్, ఎస్‌టెట్ ఉత్తీర్ణులు అర్హులు.

☛ అఫాక్ క్లినిక్స్‌లో కస్టమర్ సర్వీస్/ కస్టమర్ సపోర్ట్ పోస్టులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



అప్పుగా తీసుకున్న సొమ్ముకు వడ్డీ లెక్కించేటప్పుడు కొంత కాలానికి తీసుకున్న మొత్తంపై బారువడ్డీని లెక్కించి, అసలు - బారువడ్డీ మొత్తాన్ని తర్వాతి కాలానికి అసలుగా పరిగణించడాన్ని చక్రవడ్డీగా పేర్కొంటారు. సాధారణ వడ్డీ కంటే చక్రవడ్డీలో ఎక్కువ డబ్బు చెల్లించాలి.

☛ ఈ వీడియోలో చక్రవడ్డీ అంటే ఏమిటి, పోటీపరీక్షల్లో ఈ అంశంపై ఎలాంటి ప్రశ్నలు వస్తాయి, బేసిక్ ఫార్ములాలు, సంక్షిప్త పద్ధతిలో తక్కువ సమయంలో సమాధానం ఎలా రాబట్టాలి అనే విషయాలు వివరించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మేమందించే వీడియోలు ఎప్పటికప్పుడు మిస్ కాకుండా చూసేందుకు ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

కరెంట్ అఫైర్స్



దేశ సర్వోన్నత న్యాయస్థానం 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా 2024, అక్టోబరు 24న నియమితులయ్యారు. తన పదవీ కాలం నవంబరు 10న ముగియనున్న నేపథ్యంలో ప్రస్తుత సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఇటీవల సిఫార్సు చేశారు. ఇందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. నూతన సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నవంబరు 11న ప్రమాణం చేయనున్నట్లు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. 2025 మే 13 వరకు జస్టిస్ ఖన్నా సీజేఐగా కొనసాగుతారు.



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నూతన ఛైర్‌పర్సన్‌గా విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎ.ఆర్. అనురాధను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ 2024, అక్టోబరు 23న ఉత్తర్వులు జారీచేశారు. ఆమె 1987 బ్యాచ్‌కి చెందిన ఐపీఎస్ అధికారిణి.



భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత 2800 లైవ్ రేటింగ్ పాయింట్లకు చేరుకున్న రెండో భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. యూరోపియన్ క్లబ్ చెస్ టోర్నీలో 2024, అక్టోబరు 24న అయిదో రౌండ్లో ఆంద్రీకిన్ ద్మిత్రిపై గెలుపుతో అర్జున్ ఈ మైలురాయిని అందుకున్నాడు. లైవ్ రేటింగ్స్‌లో అతడు ప్రస్తుతం 2802.1 పాయింట్లతో ఉన్నాడు. చెస్ చరిత్రలో అర్జున్ కంటే ముందు 15 మంది మాత్రమే 2800 రేటింగ్ పాయింట్లు సాధించారు.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

SSC Exams
Quantitative Aptitude

Averages

1. The weights of five girls of a class are 42, 64, 57, 48, 39. What is the average weight (in kg) of these five girls?
A) 55 B) 48 C) 50 D) 52

2. The average of 12 numbers is 40, while the average of 10 of these numbers is 42. If the remaining two numbers are equal, then what is each of the two numbers?
A) 48 B) 30 C) 33 D) 42

3. The average of 16 numbers is 12. If each number is multiplied by 9, then what will be the new average be?
A) 100 B) 112 C) 96 D) 108

4. Average of 6 values is 42. If 6 is subtracted from each of the first 4 values and 3 is added in the each of the next five values, then what will be the new average?
A) 41 B) 57 C) 49 D) 38

5. In an examination of 5 subjects, Sakshith average score in first 3 subjects is 64 and in last three subjects average score is 72. If the marks in the third subject was 52, what was his average marks in all the 5 subjests?
A) 79.5 B) 71.2 C) 82.3 D) 84.6

6. The average of n numbers is 50. If 60% of the numbers are increased by 4 each and the remaining numbers are decreased by 6 each, then what is the average of the numbers so obtained?
A) 48 B) 55 C) 50 D) 52

7. Ranveer has an average score of 72 runs in 14 innings in cricket matches. Find out how many runs are to be scored by him in the 15th innings to raise the average score to 80.
A) 192 B) 173 C) 164 D) 155

8. The average of degree students of a class is 21 years. 12 new students with an average age of 28 years join the class, there by decreasing the average by 3 years. The original strength of the class was:
A) 16 B) 21 C) 28 D) 17

9. There are 50 students in a class. Their average weight is 22 kg. When one student leaves the class, the average weight is 21.5 kg. What is the weight of the student who left the class?
A) 43.2 B) 28.8 C) 27.7 D) 46.5

10. The average weight of 14 persons is increased by 4 kg when one of them whose weight is 32 kg is replaced by a new man. The weight of the new man is:
A) 72 B) 88 C) 78 D) 84

11. In a class of 40 students, 12 are boys. The average weight of girls in the class is 30 kg, while that of all the boys is 35 kg. What is the average weight of the entire class?
A) 37.3 B) 35.4 C) 33 D) 31.5

12. The average of 44 numbers was found to be 36. Later, it was detected that 42 was misread as 24. Find the correct average of the given numbers.
A) 44 B) 42 C) 36.4 D) 38

13. What is the average of all the natural number from 64 to 176?
A) 120 B) 144 C) 136 D) 150

14. Find the average of square of first 32 natural numbers?
A) 342.4 B) 357.5
C) 324.2 D) 376

15. The sum of 6 consecutive even numbers of set A is 324. What is the sum of different set of 4 consecutive whose lowest number is 12 more than the mean of set A?
A) 270 B) 373 C) 289 D) 294

16. The average age of a group of friends is 27 years. If 4 new friends whose average age is 25 years join them, the average age of the entire group becomes 26 years. How many people were there in the group initially?
(SSC CGL 2023)
A) 3 B) 4 C) 5 D) 6

17. The average weight of three men is incerased by 4 kg when one of them, whose weight is 100 kg, is replaced by another man. What is the weight of the new man? (in. kg)
(SSC CGL Tier II 2023)
A) 107 B) 103 C) 104 D) 112

18. The average of 36 numbers was found to be 45. Later, it was dectected that 84 was misread as 48. Find the correct average of the given numbers.
(SSC CGL 2023)
A) 58 B) 48 C) 46 D) 56

19. The average age of 5 children of a family is 15 years. Average age of children together with their father and mother is 25 years. If the father is oldre than the mother by 4 years then find the age of mother.
(SSC CHSL 2023)
A) 44 B) 48 C) 46 D) 52

20. The average of all prime numbers between 32 and 69 is:
(SSC CGL (Pre) 2023)
A) 52.5 B) 60
C) 51 D) 56.5

Scan the QR code for Key

These model questions were prepared by subject experts of QnA Academy, Hyderabad

ఈనాడు ప్రతిభ
హైదరాబాద్, శనివారం, అక్టోబరు 26, 2024
4 pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ప్రాక్టీస్ బిట్స్

డీఎస్సీ 2024 - చరిత్ర

1. కిందివాటిలో తప్పుగా ఉన్న వాక్యం–
   1) అనేక రకాల కులాలు, వర్గాలు ఉండే గ్రామాలు - భోజక గ్రామాలు.
   2) హస్తకళలు, చేతివృత్తులు ఉండే గ్రామాలు - పట్టణ గ్రామాలు.
   3) అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గ్రామాలు - సరిహద్దు గ్రామాలు.
   4) పాళీ గ్రంథాల ప్రకారం ప్రజలు వ్యవసాయ పంటలకు దూరంగా నివాసం ఉండేవారు.
   1) 1, 4 2) 3 3) 2 4) 4
2. అటవీ ప్రాంతాలను చదును చేసి వ్యవసాయ యోగ్యంగా మార్చినవారు?
   1) వైశ్యులు 2) సైనికులు
   3) శూద్రులు 4) క్షత్రియులు
3. జనపదాల కాలంలో ఎన్ని రకాల చేతివృత్తులు ఉండేవి?
   1) 4 2) 6 3) 64 4) 46
4. జనపదాల కాలంలో ముఖ్యమైన వర్తక శ్రేణులు ఎన్ని?
   1) 8 2) 18 3) 16 4) 46
5. క్రీ.పూ.6వ శతాబ్దంలో ఏ లోహంతో చేసిన నాణేలు అధిక సంఖ్యలో ఉండేవి?
   1) రాగి 2) బంగారం 3) వెండి 4) ఇనుము

సమాధానాలు: 1-4; 2-3; 3-3; 4-2; 5-3.

ప్రిపరేషన్ టెక్నిక్

వాయిదా వేయడాన్ని వదిలేయాలి. అన్ని పాఠాలను ముందుగానే చదువుకోవాలి. రివిజన్ చేసుకోవాలి. పరీక్షలప్పుడు చివరి నిమిషంలో హడావిడి పరిస్థితులను సృష్టించుకోవడం అంత మంచిది కాదు.

డీఎస్సీ - 2024
ఇంగ్లిష్ కంటెంట్

ఆంధ్రాలో అభ్రకం.. రాజస్థాన్‌లో రాగి!

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

ఒక ప్రాంత సహజ సంపదలో ఖనిజాలు అత్యంత విలువైనవి. నిర్మాణ సామగ్రి, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక వినియోగాలతోపాటు ఆభరణాల నుంచి అధునాతన ఆయుధాల వరకూ అన్నింటి తయారీకి అవే ముడిసరకులు. లోహ, అలోహ, ఇంధన రూపాల్లో ఆర్థిక అభివృద్ధి సాధనాలుగా విస్తృత ప్రయోజనాలను అందిస్తున్నాయి. పారిశ్రామిక అవసరాల్లో కీలకమైన వెండి, రాగి, మాంగనీస్, బాక్సైట్, సీసం, మైకా మొదలైన వాటితోపాటు విలువైన బంగారం, వజ్రాలూ భారత్‌లో దొరుకుతున్నాయి. దేశవ్యాప్తంగా వీటి డిమాండ్, లభ్యత, వెలికితీత, వినియోగం, ఎగుమతి-దిగుమతి తీరుతెన్నులపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఖనిజ సంపన్న రాష్ట్రాల విశేషాలను తెలుసుకోవాలి.

మరికొన్ని ఖనిజాలు

దేశంలో 2020-21 లెక్కల ప్రకారం 95% ఖనిజాలు ఉత్పత్తి అవుతున్నాయి. తక్కువ నిల్వలు ఉంటే దిగుమతి చేసుకుంటూ, ఎక్కువ నిల్వలు ఉన్న వాటిని ఎగుమతి చేస్తున్నారు. భారత్‌లో చోటానాగపుర్, ప్రపంచ వ్యాప్తంగా జర్మనీలోని రూర్‌లోయ ప్రాంతాల్లో అధిక ఖనిజ నిల్వలు ఉన్నాయి.

మాంగనీస్: ఇది లోహ ఖనిజం. దీన్ని ఇనుము-ఉక్కు, విద్యుత్తు పరిశ్రమల్లో; గ్లాస్, బ్లీచింగ్ పౌడర్, క్రిమిసంహారిణుల తయారీల్లో; ఇంకా పరిశ్రమల్లో ఆక్సీకరణ కోసం ఉపయోగిస్తారు. ప్రస్తుతం దేశంలో సరిపడా నిల్వలు లేకపోవడంతో దిగుమతి చేసుకుంటున్నారు.


మాంగనీస్

మాంగనీసు ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో 6వ స్థానంలో ఉంది. నిల్వల పరంగా చూస్తే ప్రపంచంలో 2వ స్థానంలో ఉంది. మొదటి స్థానం జింబాబ్వే. దేశంలో నిల్వల పరంగా ఒడిశా (44%), కర్ణాటక (22%), మధ్యప్రదేశ్ (12%), గోవా, మహారాష్ట్ర (7%); ఆంధ్రప్రదేశ్ (4%), ఝార్ఖండ్ (2%), రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ (2%) వరుస స్థానాల్లో ఉన్నాయి. ఉత్పత్తి పరంగా మధ్యప్రదేశ్ (32%), మహారాష్ట్ర (27%), ఒడిశా (19%), కర్ణాటక (14%), ఆంధ్రప్రదేశ్ (8%) ముందంజలో ఉన్నాయి. దేశంలో 2023లో 2.8 మిలియన్ మెట్రిక్ టన్నుల మాంగనీస్ ఉత్పత్తి జరిగింది. భారత్ ఎక్కువ నాణ్యత ఉన్న మాంగనీసును దిగుమతి చేసుకుంటూ, తక్కువ నాణ్యమైన దాన్ని ఎగుమతి చేస్తోంది. ఇక్కడ నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న దేశం జపాన్. దేశంలో అత్యంత పురాతన మాంగనీసు గని శ్రీకాకుళం (1892)లో ఉంది. తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఖనిజ నిల్వలు ఉన్నాయి.

రాగి (కాపర్): పారిశ్రామికంగా ఇనుము తర్వాత ముఖ్యమైన ఖనిజం రాగి. ఇది సాధారణంగా వెండి, సీసం, ఇనుము మొదలైన వాటితో కలిసి దొరుకుతుంది. ఈ లోహాన్ని ప్రధానంగా విద్యుత్తు పరికరాల తయారీకి, టెలిఫోన్, టెలిగ్రామ్ మొబైల్ ఫోన్‌ల తయారీలో మిశ్రమ లోహంగా వాడుతున్నారు. ఈ ఖనిజం సాధారణంగా సల్ఫైడ్, కార్బొనేట్‌గా దొరుకుతుంది. దేశంలో రాగి నిల్వలు 1,511 మిలియన్ టన్నులు ఉన్నట్లు అంచనా. ఎక్కువగా రాజస్థాన్‌లోని ఖేత్రీలో 813 మిలియన్ టన్నులు ఉండగా, ఝార్ఖండ్ (295 మి.ట.), మధ్యప్రదేశ్ (283 మి.ట.) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర, మేఘాలయ, నాగాలాండ్, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌ల్లోనూ కొద్ది మొత్తంలో నిల్వలు ఉన్నాయి. రాగి ఉత్పత్తిలో మధ్యప్రదేశ్ (62%), రాజస్థాన్ (29%), ఝార్ఖండ్ (8%)లు ముందున్నాయి. దేశీయ అవసరాలు, డిమాండ్ అధికంగా ఉండటంతో అమెరికా, కెనడా, జింబాబ్వే, జపాన్, మెక్సికో నుంచి ఎక్కువగా దిగుమతి అవుతోంది.


రాగి

క్రోమైట్: దీన్ని రసాయనాలు, స్టెయిన్‌లెస్ స్టీలు, ఖనిజ ఆధారిత పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. ఇది ముఖ్యంగా ఆక్సైడ్ రూపంలో లభిస్తుంది. దేశంలోని మొత్తం క్రోమైట్ నిల్వల్లో 90% ఒడిశాలో ఉన్నాయి. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కొద్ది నిల్వలు ఉన్నాయి. భారత్ నుంచి క్రోమైట్ ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న దేశాలు జపాన్, ఆస్ట్రేలియా.

వజ్రాలు: భూమిలో లభించే అత్యంత దృఢమైన పదార్థం వజ్రం. భారత్‌లో మధ్యప్రదేశ్‌లోని ‘పన్నా’ ప్రాంతం వజ్రాలకు ప్రసిద్ధి. వజ్రాల నిల్వలు, ఉత్పత్తిలో మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కోహినూర్ వజ్రం ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లూరు గనుల నుంచి వెలికితీశారు. 2023 లెక్కల ప్రకారం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వజ్రాల ఎగుమతిదారు.


వజ్రాలు

బాక్సైట్: దీన్ని అల్యూమినియం తయారీలో వాడతారు. దేశంలో బాక్సైట్ నిల్వల్లో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో; ఉత్పత్తిలో ఒడిశా, గుజరాత్ ముందంజలో ఉన్నాయి. ఇక్కడి ఖనిజం ఇటలీ (60%), యూకే (25%), జర్మనీ (9%), జపాన్ (9%)కు ఎగుమతి అవుతోంది.


బాక్సైట్

బంగారం: దీన్ని ‘నోబెల్ మెటల్’ అంటారు. దేశంలో ఉత్పత్తయ్యే బంగారం ప్రపంచ బంగారు ఉత్పత్తిలో 1% కంటే తక్కువ. ప్రపంచ వ్యాప్తంగా బంగారు నిల్వలు అధికంగా చైనా, ఆస్ట్రేలియా, రష్యా, అమెరికా (యూఎస్ఏ), కెనడాలో ఉండగా; వినియోగంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. దేశీయంగా బంగారు ఖనిజ నిల్వలు 527.96 మిలియన్ టన్నులు (2015 లెక్కల ప్రకారం). నిల్వల పరంగా బిహార్ (44%), రాజస్థాన్ (25%), కర్ణాటక (21%), పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ కలిపి (3%) ఉన్నాయి. బంగారు ఖనిజంలో బంగారు శాతం పరంగా కర్ణాటక తొలి స్థానంలో నిలిస్తే, రాజస్థాన్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్‌లు తర్వాత స్థానాల్లో ఉన్నాయి.


బంగారం

వెండి: బంగారం తర్వాత ఖరీదైన లోహం వెండి. భారత్‌లో బంగారం, రాగి ఖనిజాలతోపాటు వెండి దొరుకుతుంది. దీన్ని నాణేలు, నగలుగా వాడటంతో పాటు ఫొటోగ్రఫీ, రసాయన పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. ఈ లోహం అజెంటైన్, స్టెపనైట్, ప్రోస్టేట్ మూలకాల నుంచి దొరుకుతుంది. వెండి ఉత్పత్తిలో అగ్ర దేశం మెక్సికో. తర్వాతి స్థానం చైనా. భారత్ 12వ స్థానంలో ఉంది. ఇక్కడ వెండి నిల్వలు డిమాండ్‌కు సరిపడినంత లేవు. దేశంలోని వెండి నిల్వల్లో రాజస్థాన్ 86%, కర్ణాటక 5%, ఝార్ఖండ్ 4%, ఆంధ్రప్రదేశ్‌లో 3% ఉన్నాయి. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ జిల్లా జావర్ గనుల నుంచి ఎక్కువగా ఉత్పత్తి జరుగుతోంది. ఇంకా కర్ణాటక (కోలార్ గనులు), బిహార్‌లోని సింగ్‌బమ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని సట్లెజ్ లోయలో వెండి విరివిగా దొరుకుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూలు, గుంటూరు జిల్లాల్లోనూ లభ్యమవుతోంది.

సీసం, జింక్: వెండి, కాడ్మియం ఒకేచోట దొరికినట్లుగా సీసం, జింక్ ఒకేచోట లభిస్తాయి. దీన్ని సంగీత వాయిద్య పరికరాలు, ఆటోమొబైల్స్, విమానాలు, విద్యుత్తు పరికరాల తయారీల్లో ఉపయోగిస్తారు. దేశంలో ముఖ్యంగా రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ జిల్లా జావర్ గని నుంచి, ఉత్తర్‌ప్రదేశ్‌లోని దెహ్రాదూన్, హిమాచల్‌ప్రదేశ్‌లోని పార్వతీ లోయ, ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూలు, గుంటూరు; తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో లభిస్తుంది.


అభ్రకం (మైకా): ప్రపంచ మైకా ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా మైకా నిల్వల్లో 70-80% ఇక్కడే ఉంది. దేశంలో మైకా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలి స్థానంలో ఉండగా రాజస్థాన్, బిహార్, ఝార్ఖండ్ తర్వాత ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి జిల్లాలోని గూడూరు, నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, కావలి ప్రాంతాల్లో మైకా విరివిగా దొరుకుతోంది. తెలంగాణలోని వరంగల్ జిల్లా (బైసన్ పర్వత పంక్తి), ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లోనూ లభిస్తుంది.


అభ్రకం


రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

జూనియర్ ఇంటర్ - తెలుగు

సహజ పండితుడి సూక్తి వైచిత్రి!



3 మార్కులు **మిత్ర ధర్మం**

1) పోతన గురించి తెలపండి.

జ: భక్త కవిగా, సహజ పండితుడిగా ప్రసిద్ధి పొందిన బమ్మెర పోతన క్రీ.శ.1420-1480 మధ్యకాలంలో జీవించారు. వరంగల్ జిల్లా బమ్మెర గ్రామంలో జన్మించారు. కేసన, లక్కమాంబ ఇతడి తల్లిదండ్రులు. సంస్కృతంలో వ్యాసుడు రచించిన భాగవతం తెలుగులోకి పోతన అనువదించారు. ఇందులో భాగవత రచన, ప్రశస్తి, భక్తితత్వం, కవితా రీతులు, సూక్తి వైచిత్రి స్పష్టంగా కనిపిస్తాయి.

పోతన రచనలు: ఆంధ్ర మహాభాగవతంతో పాటు వీరభద్రవిజయం, భోగినీ దండకం, నారాయణ శతకం రచించారు. పోతన భాగవతాన్ని రామాంకితం చేశాడని కథ ప్రచారంలో ఉంది. ఇతర గ్రంథాలన్నింటి కంటే పోతన భాగవతం జన సామాన్యంలో విశేష ఆదరణ పొందింది.

ప్రశ్నలు జవాబులు

3 మార్కులు **శతక సుధ**

1) సజ్జనుడి మాట తీరుని తెలపండి.

జ: మేఘం చల్లబడి కురవడానికి వచ్చి ఒక్కోసారి వడగళ్లను రాల్చినా, అవి రాళ్లుగా కాకుండా త్వరగా చల్లని నీరుగానే మారతాయి. అలాగే సజ్జనుడు ఎప్పుడూ మంచి మాటలే మాట్లాడతాడు. కఠినమైన మాటలు మాట్లాడడు. ఎప్పుడైనా కఠినంగా మాట్లాడినా అవి కీడు చేయవు.

2) అధమ, మధ్యమ, ఉత్తములను కొలిచేవారి స్థితి ఎలా ఉంటుందని కవి వర్ణించాడు?

జ: నీరు కాలిన ఇనుముపై పడితే పేరు లేకుండా నశిస్తుంది. ఆ నీరు తామరాకుపై ఉంటే ముత్యంలా ప్రకాశిస్తుంది. ఆ నీరు ముత్యపు చిప్పలో పడి మంచి కాంతితో మణి రూపాన్ని పొందుతుంది. ఈ విధంగా అధమ, మధ్యమ, ఉత్తములను కొలిచేవారి స్థితి ఉంటుందని కవి అద్భుతంగా వర్ణించాడు.

ముఖ్యమైనవి మరికొన్ని..

మిత్ర ధర్మం

1) శ్రీకృష్ణుడు కుచేలుడిని ఏ విధంగా ఆదరించాడు? (3 మా.)

శతక సుధ

1) ఏనుగు లక్ష్మణ కవి గురించి తెలపండి. (3 మా.)

జవాబుల కోసం

- నారెళ్ల కిరణ్ ప్రసాద్

భారత్‌కు అమెరికా ప్రిడేటర్ డ్రోన్లు!

బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌తో అంధత్వానికి దారితీసే కంటి వ్యాధి అయిన ‘ట్రకోమా’ను నిర్మూలించిన దేశంగా ఇండియా ఘనత సాధించింది. కైమూర్ వన్యప్రాణి కేంద్రాన్ని టైగర్ రిజర్వ్‌గా మార్చేందుకు బిహార్ ప్రభుత్వం సిద్ధమైంది. సైబర్ నేరాలపై అవగాహన పెంచే కార్యక్రమాలకు జాతీయ అంబాసిడర్‌గా నటి రష్మికను కేంద్రం ఎంపిక చేసింది. హైదరాబాద్ సమీపంలోని వికారాబాద్ అటవీప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణం మొదలైంది. అమెరికా నుంచి ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు భారత్ ఒప్పందం చేసుకుంది. ఇలాంటి సమకాలీన వార్తలు, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, వార్తల్లో నిలిచిన అంశాల గురించి పోటీ పరీక్షార్థులు అవగాహనతో ఉండాలి. ఇటీవల ఎన్నికల ఫలితాలు వెలువడిన రాష్ట్రాల్లో పదవీబాధ్యతలు చేపట్టిన వారి వివరాలు, దేశంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులు, విశిష్ట అవార్డులు అందుకున్న వ్యక్తులు, వెలువడిన పుస్తకాలు, ముఖ్యమైన దినోత్సవాలను గుర్తుంచుకోవాలి.


ప్రిడేటర్ డ్రోన్

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. ‘వై నేషన్స్ ఫెయిల్ – ది ఆరిజిన్స్ ఆఫ్ పవర్, ప్రాస్పర్టీ అండ్ పావర్టీ’ పుస్తక రచయిత?
   1) రాబిన్సన్ 2) అసెమోగ్లు
   3) సైమన్ జాన్సన్ 4) 1, 2
2. ప్రపంచ ఆకలి సూచీ (జీహెచ్ఐ) 2024లో భారత్ స్థానం ఎంత?
   1) 127 2) 105 3) 109 4) 121

నోట్: 127 దేశాలకు జీహెచ్ఐ ర్యాంకులు ఇచ్చారు. ఈ నివేదికను కన్సర్న్ వరల్డ్‌వైడ్, వెల్త్‌హంగర్ హిల్ఫే ఇటీవల ప్రచురించాయి.

3. ‘The Vegetarian’, ‘I Do not bid farewell’ పుస్తకాల రచయిత?
   1) అమర్త్యసేన్ 2) హాన్‌కాంగ్
   3) విక్టర్ ఆంబ్రోస్ 4) జాన్ జె.హాఫ్‌ఫీల్డ్
4. ఏ సంవత్సరంలో ప్రపంచంలో చాలా నదుల ప్రవాహం పొడిగా ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ పేర్కొంది ?
   1) 2021 2) 2022 3) 2023 4) 2024
5. ఇటీవల పులుల రిజర్వ్‌ను ఏర్పాటు చేసేందుకు ‘కైమూర్ వన్యప్రాణి సంరక్షణ’ కు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. అయితే ఇది ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఉత్తర్‌ప్రదేశ్ 2) ఉత్తరాఖండ్
   3) మధ్యప్రదేశ్ 4) బిహార్
6. జీవవైవిధ్యం కోసం కృషి చేసే వాళ్లకు ఇచ్చే ‘మిడోరీ ప్రైజ్ 2024’ కి ఎవరికి వచ్చింది?
   1) వెరవారానోవా (కజకిస్థాన్)
   2) ఆగస్టినాకాల్టెరాన్ (పెరూ)
   3) కరోలినాకార్లెన్ (స్వీడన్)
   4) 1, 2
7. ‘హార్నెస్సింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఫర్ ఎ మోర్ పీస్‌ఫుల్ అండ్ సస్టెయినబుల్ ఫ్యూచర్’ థీమ్‌తో 149వ ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ (ఐపీయూ) సమావేశం అక్టోబరు 11 నుంచి 17 వరకు ఎక్కడ జరిగింది?
   1) పారిస్ 2) లండన్ 3) న్యూదిల్లీ 4) జెనీవా
8. "Unleashed" పుస్తక రచయిత ఎవరు?
   1) బోరిస్ జాన్సన్ 2) ఎలాన్ మస్క్
   3) విలియం ఎ.క్వింటన్ 4) డొనాల్డ్ ట్రంప్
9. కిందివాటిలో సరైంది?
   ఎ) ఇరానీ కప్ క్రికెట్‌కు సంబంధించింది.
   బి) 2024 ఇరానీ కప్ ముంబయి జట్టు నెగ్గింది.
   సి) ఇటీవల టెన్నిస్‌కు వీడ్కోలు పలికిన రఫెల్ నాదల్ స్పెయిన్ దేశానికి చెందినవారు.
   డి) రఫెల్ నాదల్ 14 ఫ్రెంచ్ ఓపెన్, 4 యూఎస్ ఓపెన్, 2 వింబుల్డన్, 2 ఆస్ట్రేలియన్ ఓపెన్ (మొత్తంగా 22 గ్రాండ్‌స్లామ్) టైటిల్స్ నెగ్గాడు.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి
10. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2024, అక్టోబరు 13 నుంచి 19 వరకు ఆఫ్రికా పర్యటనలో కింది ఏ దేశంలో పర్యటించలేదు?
    1) అల్జీరియా 2) మౌరిటానియా
    3) మలావి 4) ఈశ్వతిని
11. ఇటీవల ఏ వ్యాధిని నిర్మూలించిన దేశంగా ఇండియాను డబ్ల్యూహెచ్ఓ గుర్తించింది?
    1) ట్రాకోమా 2) కుష్ఠు 3) క్షయ 4) ఎయిడ్స్
12. ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసీజీ) నూతన చీఫ్‌గా ఇటీవల చెన్నైలో మరణించిన రాకేశ్ పాల్ స్థానంలో ఎవరు నియమితులయ్యారు?
    1) ఎస్.కిరణ్ 2) ఎస్.పరమేశ్
    3) ఎం.ఉదయ్ 4) కె.రాజీవ్
13. కేంద్ర హోంశాఖకు చెందిన ‘ఇండియన్ సైబర్‌క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఐయూసీ)’ సైబర్ సేఫ్టీ ఇనీషియేటివ్‌కు నేషనల్ అంబాసిడర్‌గా ఎవరిని నియమించింది?
    1) ఐశ్వర్యారాయ్ 2) రష్మిక మందాన
    3) మను భాకర్ 4) సీతల్ దేవి
14. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కి ఇటీవల మహారత్న హోదా ఇవ్వడంతో భారతదేశంలో మహారత్న కంపెనీల సంఖ్య ఎంతకు చేరింది?
    1) 15 2) 25 3) 14 4) 12

నోట్: నవరత్న కంపెనీలు - 24

15. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్‌కు ప్రతిష్ఠాత్మక ‘ఇంటర్నేషనల్ ఆస్ట్రోనాటికల్ ఫెడరేషన్ (ఐఏఎఫ్) వరల్డ్ స్పేస్ అవార్డు దక్కింది. ఈ పురస్కారాన్ని ఎక్కడ జరిగిన 75వ ఇంటర్నేషనల్ ఆస్ట్రోనాటికల్ కాంగ్రెస్ (ఐఏసీ) లో ఆయన అందుకున్నారు?
    1) జపాన్ 2) కెనడా 3) రష్యా 4) ఇటలీ
16. ‘వరల్డ్ ఫుడ్ డే’ ఎప్పుడు నిర్వహిస్తారు?
    1) అక్టోబరు 15 2) సెప్టెంబరు 16
    3) నవంబరు 16 4) అక్టోబరు 16

2024 థీమ్: ‘రైట్ టు ఫుడ్స్ ఫర్ ఏ బెటర్ లైఫ్ అండ్ ఏ బెటర్ ఫ్యూచర్’

17. కిందివాటిలో సరైనవి?
    ఎ) జమ్ము-కశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా 2024, అక్టోబరు 16న ప్రమాణ స్వీకారం చేశారు.
    బి) ఒమర్ అబ్దుల్లా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు.
    సి) జమ్ము-కశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ 42 సీట్లు నెగ్గింది.
    డి) జమ్ము-కశ్మీర్ నూతన ఉప ముఖ్యమంత్రిగా సురీందర్ కుమార్ చౌధరి ప్రమాణ స్వీకారం చేశారు.
    1) ఎ, బి, సి డి 2) ఎ, సి, డి
    3) బి, సి, డి 4) ఎ, బి, సి

నోట్: ఒమర్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి చెందినవారు.

18. కిందివాటిలో సరైంది?
    ఎ) భారత్‌లో తొలిసారిగా గుండె మార్పిడి చేసిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ పి.వేణుగోపాల్ ఇటీవల మరణించారు.
    బి) వేణుగోపాల్ 1994లో దేవిరామ్‌కు ఎయిమ్స్ - దిల్లీలో గుండె మార్పిడి చేశారు.
    సి) ప్రపంచంలో మొదటిసారిగా గుండె మార్పిడి శస్త్ర చికిత్సను క్రిస్టియాన్ బెర్నార్డ్ (దక్షిణాఫ్రికా) 1967లో వారెన్‌స్కీకి చేశారు.
    డి) జార్విక్-7 అనేది మొదటి కృత్రిమ గుండె పేరు.
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
    3) బి, సి, డి 4) ఎ, సి, డి
19. ఫెమినా మిస్ ఇండియా–2024గా ఎవరు నిలిచారు?
    1) నికిత పోర్వాల్ 2) రేఖా పాండే
    3) గౌతమీ నాయర్ 4) సావిత్రి రావు
20. కిందివాటిలో సరైంది?
    ఎ) 2వ అంతర్జాతీయ మిథనాల్ సెమినార్ అక్టోబరు 17 - 18 మధ్య న్యూదిల్లీలో జరిగింది.
    బి) 23వ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) కూటమి దేశాధినేతల సదస్సు 2024, అక్టోబరు15 -16 న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగింది.
    సి) గ్లోబల్ స్టాండర్డ్స్ సింపోజియం (జీఎస్ఎస్)-2024 సదస్సు అక్టోబరు 14-24 మధ్య న్యూదిల్లీలో జరిగింది.
    డి) ‘ఫ్యూచర్ ఈజ్ నౌ’ అనే థీమ్‌తో 8వ ఎడిషన్ ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సు న్యూదిల్లీలో జరిగింది.
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
    3) బి, సి, డి 4) ఎ, సి, డి
21. ఇటీవల భారతదేశంలో ఏ జాతీయ పార్కు రెండో సీతాకోకచిలుక వైవిధ్య కేంద్రంగా ఉద్భవించింది?
    1) మానస జాతీయ పార్కు
    2) గిర్ జాతీయ పార్కు
    3) కజిరంగా జాతీయ పార్కు
    4) సైలెంట్ వ్యాలీ
22. ఇండియన్ నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని ఇటీవల తెలంగాణలోని వికారాబాద్ అడవిలో ప్రారంభించారు. ఇది దేశంలో ఎన్నో రాడార్ స్టేషన్?
    1) 3 2) 1 3) 2 4) 4

నోట్: మొదటి నేవీ రాడార్ స్టేషన్ తమిళనాడులోని తిరునల్వేలి వద్ద ఏర్పాటు చేశారు.

23. 5వ జాతీయ నీటి అవార్డులు–2023లో ఉత్తమ రాష్ట్రంగా అవార్డు పొందింది?
    1) ఒడిశా 2) ఆంధ్రప్రదేశ్
    3) తెలంగాణ 3) గుజరాత్
24. 31 ప్రిడేటర్ డ్రోన్‌ల కొనుగోలు కోసం భారత దేశం రూ.32,000 కోట్ల ఒప్పందం ఏ దేశంతో చేసుకుంది?
    1) అమెరికా 2) కెనడా 3) రష్యా 4) జర్మనీ
25. 2024, నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరిగే మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో అసెంబ్లీ స్థానాలు వరుసగా..
    1) 292, 81 2) 289, 81
    3) 294, 81 4) 288, 81
26. 8,000 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రపంచంలోని 14 శిఖరాలను అధిరోహించి, కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పిన అతిపిన్న వయస్కుడు ఎవరు?
    1) కామిరీటా షెర్పా 2) నందన్ షెర్పా
    3) నిమా రింజీ షెర్పా 4) అయోనియా షెర్పా
27. ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ 2025 లో ఎక్కడ జరుగుతుంది?
    1) చైనా 2) అమెరికా 3) ఇండియా 4) కెనడా
28. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
    1) అక్టోబరు 12 2) అక్టోబరు 10
    3) అక్టోబరు 9 4) అక్టోబరు 18
29. 2024లో జరిగిన మహిళల 9వ టీ–20 వరల్డ్ కప్ విజేత?
    1) న్యూజిలాండ్ 2) ఆస్ట్రేలియా
    3) ఇండియా 4) పాకిస్థాన్

నోట్: 2026 మహిళల 10వ టీ-20 వరల్డ్ కప్ ఇంగ్లాండ్‌లో జరుగుతుంది.

30. 38వ జాతీయ క్రీడలు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 (2025) వరకు ఎక్కడ జరుగుతాయి?
    1) ఛత్తీస్‌గఢ్ 2) గోవా
    3) ఉత్తరాఖండ్ 4) అస్సాం
31. కిందివాటిలో సరైంది?
    ఎ) క్షయవ్యాధిని 2025 నాటికి పూర్తిగా నిర్మూలించేందుకు ‘ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్’ను ఇటీవల భారత రాష్ట్రపతి ప్రారంభించారు.
    బి) ‘నిక్షయ్ పోషణ యోజన కార్యక్రమం’ ద్వారా రోగులకు వైద్య ఖర్చులకు రూ.500 ఇస్తుండగా దాన్ని రూ.1000కి పెంచారు.
    సి) క్షయ ‘మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్’ వల్ల వస్తుంది.
    డి) Man toux test క్షయ నిర్ధారణ పరీక్ష.
    1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
    3) బి, సి, డి 4) ఎ, సి, డి
32. ఏ దేశానికి 8వ అధ్యక్షుడిగా ప్రబోవో సుబియాంటో ఇటీవల బాధ్యతలు స్వీకరించారు.
    1) సింగపూర్ 2) వియత్నాం
    3) ఇండొనేసియా 4) లావోస్
33. కిందివాటిలో సరైంది?
    ఎ) 2024లో జరిగిన 9వ మహిళల టీ-20 ప్రపంచ కప్ విజేత న్యూజిలాండ్.
    బి) 2024లో జరిగిన 9వ మహిళల టీ-20 ప్రపంచ కప్ రన్నర్ దక్షిణాఫ్రికా.
    సి) మహిళల టీ-20 ప్రపంచ కప్ నెగ్గడం న్యూజిలాండ్‌కు ఇది రెండోసారి.
    డి) 10వ మహిళల టీ-20 ప్రపంచ కప్ 2026లో ఇంగ్లాండ్‌లో జరగనుంది.
    1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, డి

నోట్: మహిళల టీ-20 ప్రపంచ కప్‌ను న్యూజిలాండ్ మొదటిసారి నెగ్గింది.


రచయిత: బి. ధనమోహన్ రెడ్డి


సమాధానాలు

1-4; 2-2; 3-2; 4-3; 5-4; 6-4; 7-4; 8-1; 9-3; 10-4, 11-1; 12-2; 13-2; 14-3; 15-4; 16-4; 17-2; 18-1; 19-1; 20-1; 21-3; 22-3; 23-1; 24-1; 25-4; 26-3; 27-3; 28-1; 29-1; 30-3; 31-2; 32-3; 33-4.

అర్హత, ప్రావీణ్యం లేని చికిత్సలను

వైద్యుడి నిర్లక్ష్యంగా పరిగణించొచ్చు

- సుప్రీంకోర్టు తీర్పు



దిల్లీ: తగిన అర్హతలు, నైపుణ్యాలు లేకుండా గానీ, శస్త్రచికిత్స సమయంలో ప్రావీణ్యాన్ని ఉపయోగించడంలో విఫలమైనా గానీ నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ వైద్యులను బాధ్యులను చేయగలమని సుప్రీంకోర్టు పేర్కొంది. రోగికి అవసరమైన అన్ని సంరక్షణలను పాటిస్తూ, వైద్యపరమైన అన్ని జాగ్రత్తలను తీసుకున్నట్లు నిరూపితమైతే నిర్లక్ష్యమనే అపవాదును మోపలేమని జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం తెలిపింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఓ వైద్యుడికి జరిమానా విధించిన జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్సీడీఆర్సీ) తీర్పును కొట్టివేసింది. చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్‌లో డాక్టర్ నీరజ్ సూద్ 1996లో ఓ కుర్రాడికి పుట్టుకతో వచ్చిన నేత్ర సంబంధ సమస్యకు సర్జరీ చేశారు. అనంతరం పరిస్థితి మెరుగుపడకపోగా మరింత క్షీణించింది. దీంతో ఆ కుర్రాడి తల్లిదండ్రులు రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించగా వారి పిటిషన్ 2005లో తిరస్కరణకు గురైంది. ఈ తీర్పును పిటిషనర్లు ఎన్సీడీఆర్సీలో సవాల్ చేయగా... వైద్యుడి తప్పిదంగా నిర్ధారిస్తూ నష్టపరిహారం కింద రూ.3లక్షలు, నిర్లక్ష్యపూరిత చికిత్సకు జరిమానాగా రూ.50వేలు చెల్లించాలనే ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో డాక్టర్ నీరజ్ సూద్...సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. సర్జరీ అనంతరం రోగి పరిస్థితి క్షీణిస్తే అది కచ్చితంగా వైద్యుడి నిర్లక్ష్య చర్య వల్లేనని భావించడం తగదని, ఆ వాదనకు తగిన ఆధారాలను తల్లిదండ్రులు చూపలేదని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఎన్సీడీఆర్సీ ఆదేశాలను రద్దు చేసింది.

మాజీ సీఎం మధు కోడాకు సుప్రీంలో ఎదురుదెబ్బ



దిల్లీ: బొగ్గు కుంభకోణం కేసులో తనకు విధించిన శిక్షపై స్టే విధించి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించాలని కోరుతూ ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడా దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఇదే అంశంపై అక్టోబరు 18న దిల్లీ హైకోర్టు స్టే తిరస్కరిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఝార్ఖండ్ అసెంబ్లీకి నవంబరులో ఎన్నికలు జరగనున్నాయి. కోల్‌కతాకు చెందిన వినీ ఐరన్ స్టీల్ ఉద్యోగ్ లిమిటెడ్ కంపెనీకి రాష్ట్రంలోని రాజహర ఉత్తర బొగ్గు బ్లాక్ కేటాయించడం వెనుక అవినీతికి పాల్పడ్డారన్న నేరారోపణలపై కోడాతో పాటు గనుల శాఖ మాజీ కార్యదర్శి హెచ్‌సీ గుప్తా, మాజీ సీఎస్ ఏకే బసు, విజయ్ జోషిలకు విచారణ న్యాయస్థానం 2017 డిసెంబరు 13న మూడేళ్ల జైలుశిక్ష విధించింది. యూపీఏ హయాంలో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి వినీ కంపెనీకి రూ.50 లక్షలు, కోడాకు రూ.25 లక్షలు, గుప్తాకు రూ.లక్ష జరిమానా విధించింది. నిందితుల అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్న సమయంలో వారికి బెయిల్ మంజూరైంది.

లారెన్స్ బిష్ణోయ్ సోదరుడిపై రూ.10 లక్షల రివార్డు

- ఎన్ఐఏ ప్రకటన

దిల్లీ: లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రూ.10 లక్షల రివార్డు ప్రకటించింది. అతడి ఆచూకీ తెలిపిన వారికి ఈ బహుమతి అందిస్తామని తెలిపింది. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ నివాసం బయట కాల్పుల ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటి నుంచి అన్మోల్‌పై నిఘాను పెంచిన ఎన్ఐఏ అతడిని మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. కెనడాలో నివసిస్తూ నిత్యం అమెరికాకు ప్రయాణిస్తున్న అన్మోల్ అలియాస్ భానుపై గత నెలలో రివార్డు ప్రకటించినట్లు శుక్రవారం అధికారులు వెల్లడించారు. మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్య వెనుక కూడా అతడి హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు.



దిల్లీలో పోలీసులు అరెస్టు చేసిన బిష్ణోయ్ ముఠా సభ్యులు

ముఠా సభ్యుల అరెస్టు

లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన మరో ఎనిమిది మంది సభ్యులను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వీరు లారెన్స్ బిష్ణోయ్‌కు అత్యంత సన్నిహితుడైన అరోజ్ బిష్ణోయ్ ఆదేశాల మేరకు రాజస్థాన్‌లో మరో వ్యక్తిని చంపేందుకు ప్రణాళికలు వేసుకున్నారని అనుమానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిందితుల నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

2 నెలల జాప్యం అనంతరం భూమికి తిరిగొచ్చిన వ్యోమగాములు



ఫ్లోరిడా తీరంలో దిగిన వ్యోమనౌక

కేప్ కెనావెరాల్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో దాదాపు 8 నెలలపాటు విధులు నిర్వహించిన నలుగురు వ్యోమగాములు శుక్రవారం భూమికి తిరిగొచ్చారు. స్పేస్ఎక్స్ సంస్థకు చెందిన వ్యోమనౌకలో వీరు అమెరికాలోని ఫ్లోరిడా తీరానికి చేరువలో దిగారు. పుడమికి తిరిగొచ్చిన వ్యోమగాముల్లో అమెరికాకు చెందిన మాథ్యూ డోమ్నిక్, మైఖేల్ బారట్, జీనట్ ఎప్స్, రష్యాకు చెందిన అలెగ్జాండర్ గ్రెబింకిన్ ఉన్నారు. వీరు మార్చిలో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. రెండు నెలల కిందటే భూమికి రావాల్సింది. అయితే బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌకలో తలెత్తిన ఇబ్బంది, అట్లాంటిక్ మహాసముద్రంలో వచ్చిన మిల్టన్ తుపాను కారణంగా వీరి తిరుగుప్రయాణం వాయిదాపడింది. ప్రస్తుతం ఐఎస్ఎస్‌లో భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ సహా ఏడుగురు వ్యోమగాములు ఉన్నారు.

21వ పశుగణన ప్రారంభం

ఫిబ్రవరి దాకా కొనసాగనున్న ప్రక్రియ

దిల్లీ: దేశవ్యాప్తంగా 21వ పశుగణన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రారంభించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఈ లెక్కింపు కొనసాగనుంది. ఇందుకోసం రూ.200 కోట్లు వ్యయం చేయనుంది. పశువులకు ఆరోగ్య భద్రత కల్పించే దిశగా విధానాల రూపకల్పన చేసేందుకు ఈ డేటా దోహదపడుతుందని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. పశు పోషణ రంగంలో అధిక వృద్ధిని సాధించేందుకూ అది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు లక్ష మంది క్షేత్రస్థాయి అధికారులు పశుగణన ప్రక్రియలో పాల్గొంటారని వెల్లడించారు.

రతన్ టాటా వీలునామాలో టిటో సంరక్షణకు నిధులు!



ఇంటర్నెట్ డెస్క్: ముంబయిలో ఇటీవల కన్నుమూసిన దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు జంతు ప్రేమికుడిగానూ గొప్ప పేరుంది. వీధి శునకాల సంరక్షణకు ఆసుపత్రులను నిర్మించిన ఆయనకు సంబంధించిన మరో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. రతన్ టాటా వీలునామాలో తన పెంపుడు శునకం 'టిటో' పేరును కూడా ప్రస్తావించినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. టిటో జీవితకాల సంరక్షణ ఖర్చుల కోసం కొంత మొత్తాన్ని అందులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ బాధ్యతలను ఆయన వద్ద ఎంతోకాలంగా పనిచేసిన వంటమనిషి రాజన్ షాకు అప్పగించినట్లు ఆ కథనాల సారాంశం. అలాగే గత మూడు దశాబ్దాలుగా తన వద్ద పనిచేస్తూ, తోడుగా ఉన్న వ్యక్తిగత సహాయకులు రాజన్ షా, సుబ్బయ్యల పేర్లను కూడా వీలునామాలో చేర్చినట్లు తెలిసింది. రతన్‌టాటా గతంలో ఓసారి తాజ్ హోటలు ప్రాంగణంలో వీధికుక్కలకు ఆశ్రయం కల్పించారు. చివరిసారిగా ఆయన పని చేసిన ప్రాజెక్టు కూడా శునకాల కోసమే కావడం గమనార్హం. ముంబయిలోని అయిదు అంతస్తుల భవనంలో 200 శునకాలు ఉండేందుకు అనువుగా 'పెట్ ప్రాజెక్ట్' పేరిట దీన్ని ప్రారంభించారు.

దీపావళికి

స్పెషల్ 'మోదీ లడ్డూ'!

పట్నా: బిహార్‌లోని భాగల్‌పుర్‌కు చెందిన మిఠాయి దుకాణం యజమాని సంజీవ్‌శర్మకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంటే ఎంతో అభిమానం. దీంతో మొదటిసారి మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టగానే 'మోదీ లడ్డూ' పేరుతో రాయల్ లడ్డూల విక్రయాన్ని ఆయన ప్రారంభించారు. గత పదేళ్లుగా ఆ దుకాణంలో ఈ లడ్డూల విక్రయాలు కొనసాగుతున్నాయి.



దీంతో సంజీవ్‌శర్మకు కూడా మంచిపేరు రావడంతో ఈ దీపావళికి మోదీ లడ్డూలను మరింత ప్రత్యేకంగా ఆయన తయారు చేయిస్తున్నారు. "మోదీ లడ్డూల తయారీలో స్థానికంగా తయారైన నెయ్యి, కుంకుమపువ్వు, బాదం, పిస్తాలను ఉపయోగిస్తాం. మోదీ వారణాసి ఎంపీ కాబట్టి, ఈ దీపావళికి పవిత్రమైన గంగాజలంతో మోదీ లడ్డూలను తయారుచేస్తున్నాం. ఈ లడ్డూలతో గంగా, యమున, సరస్వతి నదుల నాగరికతను వ్యాప్తి చేయాలనేది నా ఉద్దేశం" అని సంజీవ్‌శర్మ తెలిపారు.

బిన్‌లాడెన్ అడ్డాలో పాక్ ఉగ్ర కర్మాగారం!

ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచం ఆశ్చర్యపోయే రీతిలో పాకిస్థాన్ ఓ మెగా ఉగ్రవాద కర్మాగారాన్ని అబోటాబాద్‌లో నడుపుతోంది. ఈ విషయాన్ని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టాయి. ఈ ఉగ్ర శిబిరాన్ని సాక్షాత్తూ పాక్ సైన్యంలోని కీలక జనరల్ పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఎన్డీటీవీ కథనం దీన్ని వెల్లడించింది. నిషేధిత ఉగ్ర సంస్థలు లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్లు సంయుక్తంగా పాక్ సైనిక స్థావరం పక్కనే ఈ మెగా టెర్రర్ క్యాంపును ఏర్పాటుచేశాయి. ఇందులోకి బయటి వ్యక్తులు అడుగుపెట్టడం అసాధ్యం. ఇక్కడ యువకులు, యువతులకు ఆయుధ వినియోగం, ఇతర ఉగ్ర కార్యకలాపాల్లో శిక్షణ ఇస్తున్నారు. గతంలో అబోటాబాద్‌లోని ఓ సేఫ్ హౌస్‌లో అల్‌ఖైదా ఉగ్ర సంస్థ నాయకుడు దాక్కొన్నాడు. 2011 మే నెలలో అమెరికా కమాండోలు రహస్యంగా హెలికాప్టర్లలో ఇక్కడికి వచ్చి లాడెన్‌ను మట్టుబెట్టడంతో ప్రపంచం మొత్తం అవాక్కైంది. ఆ తర్వాత పాక్ ఆ ఇంటిని పూర్తిగా ధ్వంసం చేసింది. అదే స్థలంలో ఇప్పుడు అక్కడి సైన్యం కొత్తగా ఉగ్రవాద శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసినట్లు అనుమానిస్తున్నారు. ఉగ్రవాద సంస్థల చీఫ్‌లు హఫీజ్ సయీద్, మసూద్ అజర్, సయ్యద్ సలావుద్దీన్ ఈ క్యాంపును సందర్శించినట్లు తెలుస్తోంది. లష్కరే, జైషే, హిజ్బుల్ సంస్థలు ఇక్కడే నియామకాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌లో ఇటీవలి కాలంలో ఉగ్రదాడులు మళ్లీ తీవ్రమైన నేపథ్యంలో అబోటాబాద్‌లోని ఉగ్ర శిబిరం అంశం వెలుగులోకి రావడం గమనార్హం.



వైద్యరంగంలో అధునాతన సాంకేతికత అవసరం: ముర్ము



రాయ్‌పుర్: దేశంలోని మారుమూల ప్రాంతాల్లో నివసిస్తోన్న ప్రజల సంక్షేమం కోసం వైద్య రంగంలో అధునాతన సాంకేతికతను ఉపయోగించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయపడ్డారు. ఇలాంటి పురోగతి మానవ జీవితాలపై ప్రభావం చూపుతుందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్ ఎయిమ్స్ రెండో స్నాతకోత్సవంలో ముర్ము శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జీవితాలను రక్షించడంలో వైద్య నిపుణుల నిర్ణయాలు ముడిపడి ఉంటాయని, వారి మీద అపారమైన బాధ్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' కల సాకారమయ్యేందుకు వైద్య నిపుణులు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితులు సంభవించినప్పుడు మారుమూల ప్రాంతాల్లో వైద్య సాయం అందించేందుకు కృత్రిమ మేధ ఆధారిత క్లినికల్ డెసిషన్ సపోర్ట్ సిస్టమ్‌ను ఉపయోగించేలా ఎయిమ్స్ రాయ్‌పుర్ అడుగులు వేస్తున్నట్లు తెలిసి హర్షం వ్యక్తం చేశారు.

ఉప ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం పూర్తి

లఖ్‌నవూ; జైపుర్: దేశంలోని 13 రాష్ట్రాల్లో 47 శాసనసభ స్థానాలకు జరిగే ఉప ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం శుక్రవారం పూర్తయింది. నవంబరు 13న జరిగే ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు ప్రధానంగా భాజపాతో తలపడనున్నాయి. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 9, రాజస్థాన్‌లో 7, పశ్చిమబెంగాల్‌లో 6, అస్సాంలో 5, బిహార్, పంజాబ్‌ల్లో 4 సీట్ల చొప్పున, కర్ణాటకలో 3, కేరళ, మధ్యప్రదేశ్, సిక్కింల్లో 2 సీట్ల చొప్పున, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మేఘాలయల్లో ఒక్కో స్థానంలో ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు లోక్‌సభకు ఎన్నికవడంతో ఖాళీ అయిన స్థానాలు ఎక్కువగా ఉన్నాయి. వచ్చే నెల 13నే వయనాడ్ లోక్‌సభ స్థానానికి కూడా ఉప ఎన్నిక జరగనుంది. కాంగ్రెస్ వెనక్కు తగ్గడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లో అన్ని స్థానాల్లోనూ సమాజ్‌వాదీ పార్టీయే పోటీ చేస్తోంది.

65కు చేరిన 'ట్రామీ' తుపాను మృతుల సంఖ్య

మనీలా: ఫిలిప్పీన్స్‌లో ట్రామీ తుపాను బీభత్సం సృష్టిస్తోంది. వరదలు, కొండచరియలు విరిగిపడడంతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. తుపాను కారణంగా 33 మంది మృతిచెందారని పోలీసు అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. దీంతో మృతుల సంఖ్య 65కు చేరింది.

చెల్లి ప్రేమ ఉత్తదే.. ఉత్తరాలివిగో..!

- తమ మధ్య లేఖలను ఎన్సీఎల్టీకి అందజేసిన జగన్
- రికార్డుల్లోకి తీసుకున్న ట్రైబ్యునల్

ఈనాడు, హైదరాబాద్: సరస్వతి పవర్ కంపెనీ వాటాలను బోర్డు అక్రమంగా బదలాయించిందంటూ తల్లిని, చెల్లిని కోర్టుకు లాగిన వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్ అందులో ఎలాగైనా పైచేయి సాధించాలని అన్ని ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా చెల్లి షర్మిలతో జరిపిన పలు ఉత్తర ప్రత్యుత్తరాలను ట్రైబ్యునల్ ముందుంచారు. సరస్వతి కంపెనీలో తమ వాటాలను తల్లి విజయమ్మ పేరుతో సరస్వతి పవర్ బోర్డు అక్రమంగా బదలాయించిందని, వాటిని రద్దు చేయాలంటూ హైదరాబాద్ (జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్) వై.ఎస్.జగన్, భార్య భారతీరెడ్డిలు పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ పిటిషన్‌లో ప్రతివాదులైన షర్మిల, విజయమ్మ, చాగరి జనార్దన్‌రెడ్డి, ఆర్వోసీ, సరస్వతి పవర్ కంపెనీలకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. నోటీసులపై ప్రతివాదులు స్పందించకముందే చెల్లి షర్మిలతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను జగన్ ట్రైబ్యునల్‌కు సమర్పించారు. ఒప్పందం రద్దు చేయడంతోపాటు.. ఆస్తుల్లో వాటా ఇవ్వకపోతే తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుందని షర్మిల సెప్టెంబరు 12న లేఖ రాశారు. దీనికి స్పందిస్తూ 'తండ్రి ఉండగానే ఆస్తుల పంపకాలు పూర్తయ్యాయని, ఆయన చనిపోయి 10 ఏళ్లయిందని, పెళ్లయి 20 ఏళ్లయినప్పటికీ ప్రేమతో ఆస్తుల్లో వాటా ఇద్దామని ఒప్పందం కుదుర్చుకున్నానని, అయితే రాజకీయంగా, వ్యక్తిగతంగా షర్మిల చేసిన ఆరోపణలతో ప్రేమ లేదని తెలిసి ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నానంటూ' సెప్టెంబరు 17న జగన్ లేఖ రాశారు. ఈ ఉత్తరాలను రికార్డుల్లోకి పరిగణనలోకి తీసుకోవాలంటూ జగన్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఎన్సీఎల్టీ జ్యుడిషియల్ సభ్యులు రాజీవ్ భరద్వాజ్, సాంకేతిక సభ్యుడు సంజయ్ పూరిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. జగన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషన్‌కు అనుబంధంగా లేఖలను సమర్పించామని వాటిని రికార్డుల్లోకి తీసుకోవాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఈ లేఖలను రికార్డుల్లోకి తీసుకోవడం వల్ల ప్రతివాదులైన షర్మిల, విజయమ్మ తదితరులకు ఎలాంటి నష్టం లేనందున నోటీసులు జారీ చేయడంలేదని పేర్కొంది. లేఖలను రికార్డుల్లోకి తీసుకుంటూ విచారణను వాయిదా వేసింది.

ఒడిశాలో తీరం దాటిన దానా

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను దానా.. ఒడిశాలోని భిత్తర్‌కనిక సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున తీరం దాటింది. తర్వాత అది తుపానుగా, సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి, రెండు చోట్ల మాత్రమే తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం ముఖ్య అధికారి స్టెల్లా తెలిపారు.

హైవేపై యూట్యూబర్ ఢాం.. ఢాం..

- నకిలీ బంగారం ముఠాపై డమ్మీ తుపాకులతో కాల్పులు
- కలకలం సృష్టించిన కేసులో.. పదిమంది అరెస్టు
- నిందితుల్లో హైదరాబాద్ యూట్యూబ్ ఛానల్ బృందం

ధర్మవరం - న్యూస్‌టుడే

అదొక ముఠా.. అమాయకులకు నకిలీ బంగారం అంటగట్టి మోసగిస్తుంటుంది. ఈ విషయం తెలిసిన ఒక యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు వారి ఆటకట్టించి.. దానిని చిత్రీకరించి తమ ఛానల్‌లో పెడదామని భావించారు. ఇందుకోసం నకిలీ తుపాకీలు కొన్నారు.. ఆ ముఠా దగ్గరకెళ్లి తమ పథకం ప్రకారం తుపాకుల మోత మోగించగా వారు పరారయ్యారు. వీళ్లు ఇళ్లకు చేరుకున్నారు. అయితే నడిరోడ్డుపై జరిగిన హంగామా చూసి జనం బెంబేలెత్తగా, రంగంలోకి దిగిన పోలీసులు బంగారం ముఠా సభ్యులతో పాటు యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులనూ అరెస్టు చేశారు! శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 20న జరిగిన తుపాకీ కాల్పుల కేసు వెనుక కథ ఇది. ఈ కేసులో 10 మంది నిందితులను బత్తలపల్లి పోలీసులు అరెస్టు చేసినట్లు శుక్రవారం ఎస్పీ వి.రత్న వెల్లడించారు. అరెస్టయిన వారిలో పులిచెర్ల అరవింద్‌కుమార్, గుల్లా నాగరాజు, (హైదరాబాద్ జగద్గిరిగుట్టకు చెందినవారు), కీసరి నరేశ్ (జనగామ జిల్లా మన్‌సాన్‌పల్లి), జ్ఞానేశ్ (జోగులాంబ గద్వాల జిల్లా నౌరోజి క్యాంప్), సాయి నితీశ్‌రెడ్డి (రంగారెడ్డి జిల్లా మల్కాపుర్), సంతక సతీశ్ (తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు), షేక్ షంషేర్‌ఖాన్ (గుంటూరు జిల్లా కంకరకుంట), అజోజీ అరవింద్‌కుమార్ (నిజామాబాద్ జిల్లా జె.పి.కాలనీ), పోమర్ బంగారీ, రాణా హరీశ్ (అన్నమయ్య జిల్లా శికారీపాలెంకు చెందినవారు) ఉన్నారు. రాణా బాబురావు, పోమర్ విలాస్ అనేవారు పరారీలో ఉన్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డమ్మీ తుపాకులు, నకిలీ బంగారం గురించి వివరాలను వెల్లడిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న

కాల్పులు జరిగింది ఇలా..

అన్నమయ్య జిల్లా శికారీపాలెంకు చెందిన పోమర్ బంగారీ, రాణా హరీశ్, రాణా బాబురావు, పోమర్ విలాస్ అమాయకులకు నకిలీ బంగారాన్ని అంటగట్టి మోసగిస్తుంటారు. వీరు తెలంగాణలోని జనగామ జిల్లా మానసానపల్లి గ్రామానికి చెందిన నరేశ్‌కు ఇలాగే ఎరవేశారు. ఇదొక ముఠా నకిలీ బంగారం ముఠాగా గుర్తించిన అతను హైదరాబాద్‌కు చెందిన యూట్యూబర్ పులి అరవింద్ కుమార్‌కు తెలిపాడు. సైబర్ క్రైమ్‌లో ఎథికల్ హ్యాకర్ అయిన అరవింద్ తన సహాయకులతో కలిసి శికారీపాలెం ముఠాను పట్టుకునేందుకు పథకం వేశాడు. తమ ఛానల్‌లో అప్‌లోడ్ చేసేందుకు, ఆ ముఠాను పట్టుకునే దృశ్యాలను చిత్రీకరించాలని పథకం వేశారు. రెండు బొమ్మ తుపాకులను సమకూర్చుకుని రెండు కార్లలో అన్నమయ్య జిల్లా రామాపురం చేరుకున్నారు. శికారీపాలెం ముఠా నకిలీ బంగారంతో అక్కడకు వచ్చింది. అరవింద్ బృందంలోనివారు పోలీసుల మాదిరిగా సఫారీ దుస్తుల్లో కనిపించడం, కెమెరాలతో చిత్రీకరిస్తుండడంతో భయపడిన బంగారం ముఠా అక్కడి నుంచి పరారవడానికి ప్రయత్నించగా, అరవింద్ బృందం బొమ్మ తుపాకులతో కాల్పులు జరిపింది. తీవ్ర ఆందోళన చెందిన స్థానికులు రాణాకు సమాచారమివ్వగా, బత్తలపల్లి పోలీసులు అక్కడకు చేరుకున్నారు. టోల్‌గేట్ ద్వారా వాహనం నంబరు, ఫోన్ నంబరు సంపాదించి కాల్ చేయగా, తాము తెలంగాణ పోలీసులమని చెప్పిన అరవింద్ బృందం ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ చేసుకుంది. క్షుణ్ణంగా దర్యాప్తు జరిపిన పోలీసులు ఎట్టకేలకు నిందితులను అరెస్టు చేశారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ ఐకాస నాయకులు

క్యాబినెట్ భేటీలో ఆర్టీసీ విలీన అంశంపై చర్చించాలి

మంత్రి పొన్నంకు ఐకాస నేతల విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అంశంపై శనివారం జరిగే మంత్రి మండలి సమావేశంలో చర్చించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్టీసీ ఐకాస నేతలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సచివాలయంలో మంత్రిని కలిసి ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. అంతకుముందు ఇదే అంశాన్ని రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో ఐకాస నేతలు ఈదురు వెంకన్న, థామస్‌రెడ్డి, ఎండీ మౌలానా, యాదయ్య, సురేష్, యాదగిరి ఉన్నారు. అనంతరం టీఎన్జీవోల కార్యాలయంలో ఉద్యోగ ఐకాస నాయకులు జగదీశ్వర్, శ్రీనివాస్‌రావులతో ఆర్టీసీ ఐకాస నేతలు సమావేశమయ్యారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని ప్రభుత్వ ఉద్యోగుల ఐకాస నాయకులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఫిరాయింపులపై మాట్లాడేముందు తలసానిని మంత్రిగా ఎందుకు చేశారో చెప్పాలి

కేటీఆర్‌కు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: పార్టీ ఫిరాయింపుల గురించి నీతులు మాట్లాడే ముందు, గతంలో తెదేపా నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను భారాసలో చేర్చుకొని మంత్రిగా ఎందుకు చేశారో చెప్పాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ సభలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోసారి అలాంటి భాషను ఉపయోగిస్తే రోడ్లపై పరుగెత్తిస్తామని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వం ఈ పది నెలల్లో ప్రజలకు చేసిన దాని గురించి కేటీఆర్‌తో తాను బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఎవరి దగ్గర ఎన్ని రూ.లక్షలు తీసుకున్నారో, తీసుకున్న ప్రతి రూపాయి తిరిగి బాధితులకు ఇప్పిస్తామన్నారు. ఆయన చేసిన తప్పులపై ఆధారాలతో సహా కేసులు పెట్టిస్తామని వెంకట్ తెలిపారు.

కేంద్ర మంత్రిత్వశాఖల సంప్రదింపుల కమిటీల్లో తెలుగు రాష్ట్రాల ఎంపీలకు చోటు

ఈనాడు, దిల్లీ: కేంద్ర మంత్రిత్వ శాఖల సంప్రదింపుల(కన్సల్టేటివ్) కమిటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఎంపీలకు స్థానం లభించింది. కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాల గురించి పార్లమెంటు సభ్యులకు అవగాహన కల్పించడం ఈ కమిటీల ఉద్దేశం. వీటిని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఏర్పాటు చేసింది. ఆయా మంత్రులే కమిటీలకు ఛైర్మన్లుగా వ్యవహరిస్తారు. ఉభయ సభల్లో ఆయా పార్టీలకున్న ఎంపీల సంఖ్యాబలాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వం కమిటీలు కూర్పు చేస్తుంది. ఒక్కో దాంట్లో కనీసం 10 మంది, గరిష్ఠంగా 30 మంది సభ్యులు ఉండటానికి అవకాశం ఉంది. ఇందులో సభ్యులుగా చేరడం అన్నది సభ్యుల ఇష్టం. కేంద్ర హోంమంత్రి సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా నియామకమైన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

వివిధ కమిటీలు.. చోటు దక్కించుకున్న తెలుగు రాష్ట్రాల ఎంపీల వివరాలు

- హోం మంత్రి సంప్రదింపుల కమిటీ: సీఎం రమేష్ (భాజపా), లావు శ్రీకృష్ణదేవరాయలు (తెదేపా), పీవీ మిథున్‌రెడ్డి, పరిమల్ నత్వాని (వైకాపా),
- సమాచార, ప్రసారశాఖలు: వి.విజయసాయిరెడ్డి (వైకాపా), వి.విజయేంద్రప్రసాద్ (నామినేటెడ్)
- జలశక్తిశాఖ: పుట్టా మహేష్ కుమార్ (తెదేపా)
- కార్మిక, ఉపాధి కల్పన: పోరిక బలరాంనాయక్ (కాంగ్రెస్)
- న్యాయశాఖ: తెన్నేటి కృష్ణప్రసాద్ (తెదేపా), ఎం.రఘునందనరావు (భాజపా), ఎస్.నిరంజన్‌రెడ్డి (వైకాపా)
- ఎంఎస్ఎంఈ: మద్దిల గురుమూర్తి (వైకాపా)
- పెట్రోలియం, సహజ వాయువులు: వల్లభనేని బాలశౌరి (జనసేన, శాశ్వత ప్రత్యేక ఆహ్వానితుడు)
- విద్యుత్తు: గొల్ల బాబూరావు (వైకాపా)
- రైల్వే: మాగుంట శ్రీనివాసులురెడ్డి (తెదేపా)
- రహదారులు, రవాణా: వైఎస్ అవినాష్‌రెడ్డి (వైకాపా), గుమ్మ తనూజ రాణి (వైకాపా), డీకే అరుణ (భాజపా), బీకే పార్థసారథి (తెదేపా), పిల్లి సుభాష్ చంద్రబోస్ (వైకాపా)
- నైపుణ్యాభివృద్ధి: మల్లు రవి, కడియం కావ్య (కాంగ్రెస్), ఆళ్ల అయోధ్య రామిరెడ్డి (వైకాపా)
- సామాజిక న్యాయం, సాధికారత: దగ్గుమళ్ల ప్రసాదరావు (తెదేపా), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం)
- ఉక్కు: మతుకుమిల్లి శ్రీభరత్ (తెదేపా)
- జౌళి: చామల కిరణ్ కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), బస్తిపాటి నాగరాజు (తెదేపా)
- క్రీడలు, యువజన వ్యవహారాలు: గోడం నగేష్, కె.లక్ష్మణ్ (భాజపా)
- వ్యవసాయం: కొండా విశ్వేశ్వరరెడ్డి (భాజపా)
- ఎరువులు, రసాయనాలు: కుందూరు రఘువీర్ (కాంగ్రెస్), బి.పార్థసారథిరెడ్డి (భారాస)
- పౌర విమానయానం: కేశినేని శివనాథ్ (తెదేపా)
- బొగ్గు, గనులు: తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ (జనసేన), మేడా రఘునాథ్‌రెడ్డి (వైకాపా), వద్దిరాజు రవిచంద్ర (భారాస)
- వాణిజ్యం, పరిశ్రమలు: దీవకొండ దామోదర్‌రావు (భారాస)
- ఆహారం, వినియోగ వ్యవహారాలు, ప్రజా పంపిణీ: దగ్గుబాటి పురందేశ్వరి (భాజపా)
- సహకారం: సురేష్‌కుమార్ షెట్కర్ (కాంగ్రెస్)
- రక్షణ: వల్లభనేని బాలశౌరి (జనసేన)
- విద్య: బైరెడ్డి శబరి (తెదేపా), ఆర్.రఘురాంరెడ్డి (కాంగ్రెస్)
- ఐటీ, ఎలక్ట్రానిక్స్: కేఆర్ సురేష్‌రెడ్డి (భారాస)
- విదేశాంగ వ్యవహారాలు: వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(తెదేపా)
- ఆర్థికం: వైవీ సుబ్బారెడ్డి (వైకాపా)
- మత్స్య, పశుసంవర్ధకం: కలిశెట్టి అప్పలనాయుడు (తెదేపా), ఈటల రాజేందర్ (భాజపా)
- ఆహారశుద్ధి: జీఎం హరీష్ బాలయోగి (తెదేపా)
- వైద్య ఆరోగ్యం: రేణుకా చౌదరి (కాంగ్రెస్)
- భారీ పరిశ్రమలు: గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్)
- పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం: జి.లక్ష్మీనారాయణ (తెదేపా)

ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

సింగరేణి సంస్థ సీఎండీ బలరాం

ఈనాడు, హైదరాబాద్: రానున్న ఐదేళ్ల కాలంలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జరిగిన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక నాయకుల మూడు రోజుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలతో పాటు వ్యాపార విస్తరణకు కార్మిక సంఘాల సహకారం ఎంతో అవసరమన్నారు. ఉద్యోగులు ప్రతిరోజూ నిర్ణీత పని గంటల్లో పనిచేస్తూ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించేలా కార్మిక సంఘాలు తోడ్పాటు అందించాలన్నారు.